### తాత్పర్యము

ఓసీ పాపాత్ములారా! విషము దిని చచ్చెదననెదేల అది యాత్మహత్యగదా. ఆత్మహత్యచేసికొన్న వారి కంధతామిస్రనరకమనుట యెఱుంగవా ? యనెద వేమో. పదిసంవత్సరాలఁట- పైన మూఁడు సంవత్సరాలఁట. పైన నొక సంవత్సరమఁట. ఓయమ్మ యిన్నియేండ్లు వియోగమువలనఁ గలిగిన దుఃఖమను సముద్రములో బాధపడుచుందునా? అది నాకు సాధ్యమా. వెంటనే ప్రాణము బోవునట్లు విషము తీసికొనుట మేలుగాని యిన్ని సంవత్సరము లింతబాధనెట్లు సహింతును. సహింపలేను. అదేమన నల్పకాలము నీవు కనుమఱుఁగై కానరాక యున్నప్పుడే ప్రాణము నిలుపు ధైర్యములేక యిపుడే బాధపడుచున్నాను. అన్ని సంవత్సరములు నేనెట్లు ప్రాణము నిలుపఁగలను అని దుఃఖాతిశయముచే శ్రీరామునిఁగట్టుకొని హాయని గట్టిగ నేడ్చెను.

తే॥ అరణియదరులు విడుచు న॰ట్లామృగాక్షి,కార్చెదీర్ఘనిరుద్ధాశ్రు॰కణములపుడు
విసపుఁగోలలు నాటిన॰విహ్వలించు, కరణిఁబోలికఁ బతివచో॰ఘాతములను.

అరణి=యజ్ఞమున నగ్నికై చిలుకుకఱ్ఱ, అదరులు=మిణుఁగురులు, దీర్ఘనిరుద్ధాశ్రుకణములు=కన్నీరు కార్పరాదీయని ధైర్యముతో దీర్ఘకాలముగ లోపలనే మ్రింగి యణఁచుచుండిన కన్నీటిబిందువులు, విసపుఁగోలల=విషముపూసిన బాణములు, విహ్వలించు=విరవిరఁబోవు, కరిణిఁబోలికన్=ఆఁడేనుగువలె, పతి = భర్తయొక్క వచోఘాతములన్=మాటలనెడి దెబ్బలచే.

### తాత్పర్యము

విషముపూసిన బాణములు నాటిన విరవిరఁ బోవునాఁడేనుఁగువలెనై సీత భర్తయాడిన మాటలను దెబ్బలచే మథింపఁబడిన హృదయముగలదై చిలికినపుడు యరణివిడుచు నిప్పు మిణుఁగురులవలె నింతకాల మడ్డగించియుంచిన కన్నీళ్ళ బిందువులను విడిచెను.

అరణి=సీత హృదయము, మిణుఁగురులు=సీతకంటినుండి జాఱు వేఁడి నీళ్ళ బిందువులు, వచోఘాతములు=మాటలను దెబ్బలను.

కం॥ తమ్ములనీరము వలెఁ గం,దమ్ములలో నుండి జాఱెఁ॰ దద్దయుఁ గన్నీ
రమ్ముద్దియకును సంతా,పమ్ముభరమ్మునను గాంతి॰స్ఫటికాభం బై. ౧౭

తమ్ములనీరము=తామరయందలి నీళ్ళు, కందమ్ములు=కన్నులను కమలములు, ఆముద్దియకును=సీతకు,సంతాపము భరమ్మునను=దుఃఖాతిశయముచే, స్ఫటికాభంబై =స్ఫటికముతో సమానమై- తెల్లగా.

తాత్పర్యము

తామరపువ్వులనుండి నిర్మలమైన నీరు కాఱునట్లు దుఃఖాతిశయముచే సీత యేడువఁగా నా నీటిచేఁ గాటుకకరఁగిపోయి స్ఫటికమువలెఁ దెల్లనికాంతితో నామె నేత్రకమలములనుండి బాష్పములు కాఱెను.

తే॥ అమ్మహాభాగవిమల చం•ద్రాభ మైన, వదననీరజ మెంతయు•వాడు వాఱె
విడువక స్రవించుకన్నీటి•వేఁడిములకు,
నీటఁ బాపిననెత్తమ్మి•సాటి యగుచు ౨౫౨

మహాభాగ=గొప్ప పుణ్యముచేసిన సీతయొక్క, విమలచంద్రాభము=నిర్మలమైన చంద్రునితో సమానము, వదననీరజము=ముఖకమలము, నెత్తమ్మి=అందమైన కమలము, నెఱి+తమ్మి=నెత్తమ్మి.

తాత్పర్యము

శ్రీరాముని వెంటఁబోవు మహాపుణ్యముచేసిన సీతయొక్క నిర్మలమైన చంద్రబింబముతో సమానమైన ముఖకమలము వదలకకాఱుచున్న కన్నీటివేఁడిమిచే నీటినుండి వెలుపలవేయు సూర్యకాంతిచే వాడినకమలములవలె మిక్కిలి వాడిపోయెను.

సీతాదేవి వాక్యములన్నియుఁ బరమభక్తిగలవారి భావమును ఆచారమును దెలుపుచున్నవి. ఇంతటి భక్తి, విరక్తిగలిగి భగవద్విశ్లేషము కొంచెమైనసహింప లేక యది వచ్చునేనియేడ్పు, కన్నీరు, డగ్గుత్తిక కలవారై ప్రాణముపోవునంతటి స్థితికి వచ్చినఁగాని భగవదనుగ్రహము కలుగదు.

ఇవి పరమభక్తునియు నార్తప్రపన్నులయు లక్షణములు, పరమభక్తుఁడు భగవద్వియోగము సైఁపఁడు. ఆర్తప్రపన్నుఁడు శరీరమును సైఁపఁడు.

—• శ్రీరాముఁడు సీత వనంబునకు వచ్చుట కంగీకరించుట. •—

చం॥ పరవశయైన యట్లు వెత•పాటున నేడ్చుచు నున్న జానకిన్
గరమనురక్తిఁ గ్రుచ్చి తన•కౌఁగిట నూఱడఁ బల్కి, నమ్మికల్
పరఁగఁగఁ జెప్పి, యిట్టు లను•భామిని నీకు వ్యథాకరంబునై
జరగెడిస్వర్గ మైన నది•సమ్మత మెట్లగు నాకు నిల్వఁగన్? ౨౫౩

పరవశయైనయట్లు=దేహము తన స్వాధీనముతప్పినదానివలె- వెతపాటునన్=వ్యథపడుటచే, వ్యథాకరము=మనమునకుఁ దాపము కలిగించునది.

తాత్పర్యము

దేహము తన స్వాధీనముతప్పి పడిపోవుదానివలెనై వెతపడుచు నేడ్చుచునుండు జానకిని మిక్కిలి ప్రేమతోఁగ్రుచ్చి కవుంగిలించుకొని వ్యసనపడకుము. నాతోడఁ బిలుచుకొనిపోదును లెమ్ము అని సమాధానవాక్యములు చెప్పి సత్యముగాఁ బిలుచుకొనిపోదునని చేతిలోఁ జేయివైచి ప్రమాణముచేసి నమ్మిక

పుట్టించి భామినీ నీ వెంత కోపశీలవే. సీత చిలుకవంటిదే కాని రేఁగిన తేఁచుకుక్క యనుసామెత నిజము చేసితివి, నీ మనస్థితిఁ దెలియఁగోరి రావలదనఁగానే యెన్ని కఠోరవాక్యములాడితివి, నీకు దుఃఖము కలుగుచుండఁగా నాకు స్వర్గము లభించినను నందు నిల్వ నేను సమ్మతింతునా? ఈమాత్రమెఱుఁగ లేవై తివికదా

ఉ॥ ఇంచుకయైన నాకు భయ • మెందును లేదు స్వయంభునట్లు, లో
చంచలనేత్ర! నీమనసు • చంద మెఱుంగమిఁ జేసి, కావఁగా
నంచితశక్తి గల్గియు వ • నాంతరవీథుల నిన్ను, నేను దో
డ్కొంచుఁ జనంగ నడ్డములు • కొన్ని వచించితి సైఁపు మాత్మలోన్. ౨౨॥

ఇంచుక=కొంచెము, స్వయంభునట్లు=బ్రహ్మవలె, సర్వజీవులకు నాయువు భాగ్యము మొదలైనవి కల్పించువాఁడును దీసివేయువాఁడును గదా చతుర్ముఖుఁడు, అట్టివాని కెవరివలన నెట్టి భయములేదో యని తీర్థీయము.

(౨) స్వయంభునట్టులు=నారాయణునకువలె, అయనకుఁ గదా యెవరి వలనను భీతిలేనిది. బ్రహ్మకువలెననుట యుక్తముగాదు. బ్రహ్మకు మధుకైటభులచే నొకప్పుడు భీతికలిగెను. శివునిచే శిరస్సు నఱకఁబడెను.

చంచలనేత్ర=చలించు కన్నులుగలదానా, చంచలనేత్ర, నీ కన్నులవలె నీ మనస్సుకూడఁ జంచలముగా నుండునేమోయని తలంచితివని సూచన.

కావఁగాన్=రక్షింపఁగా, సైఁపుము=క్షమింపుము.

తాత్పర్యము

సీతా! నేను నిన్ను నడవులందుఁ గాపాడలేక భయపడి నీవు రావలదని చెప్పలేదు. బ్రహ్మమువలె నాకెవరివలనను భయములేదు. ఆ బ్రహ్మము నేనే కదా. భయము వదలుము. నీ కన్నులు చూడఁగానే నీ వెంత భయపడినది, నీ గుండె యెంత చెదిరినది తెలియవచ్చుచున్నది నీ వుపచారమునకే చెప్పుచున్నావో పరమార్థబుద్ధితోఁ జెప్పుచున్నావో నీ మనస్సు విధము నాకుఁ దెలియక నీ కన్నులవలె నీ మనస్సు చంచలమని తలఁచితిని. అది తెలిసికొనఁగోరి యడవులయందు నిన్ను రక్షింప శక్తి కావలసినంతగలిగియు నీ విరహము నోర్వ శక్తిలేకున్నను, ఎందును భయము లేకున్నను నిన్నుఁ బిలుచుకొని పోవుటకుఁ గొన్ని యడ్డమాటలు చెప్పితిని. క్షమింపుము. కోపగింపకుము.

కం॥ నాతో నరణ్యవాసముఁ, బ్రీతిం జేయుటకె నిన్ను • విధి సృష్టించెన్
ఖ్యాతునె నిను నాత్మజ్ఞుఁడు, ఖ్యాతివలెన్, నీకు నేల • కళవళపడఁగన్. ౨౩॥

విధి=బ్రహ్మ, సృష్టించెన్=ఇది లోకమువారి మాటఁబట్టి చెప్పినది. సీతారాములు బ్రహ్మసృష్టికి లోపడినవారుకారు. అవతారరహస్యము మఱవలేదని యామెకుమాత్రము సూచించుటకై యితరులకా రహస్యము బోధపడకుండుటకై యట్లుచెప్పెను. ఆత్మజ్ఞుఁడు=ఆత్మజ్ఞానముగలవాఁడు, ఖ్యాతి=కీర్తి, కళవళపడఁ

గన్=మనస్సు కలవరపాటుచెందఁగానేల, పర్వతమందు లక్ష్మీనారాయణులు బ్రహ్మాదిదేవతలు రావణవధార్థమై శరణుచేయఁగా వారి కభయమిచ్చి రావణవధార్థమై శ్రీరామావతారంబునఁ దాము చేయవలసిన కృత్యము లాలోచించియే యా నియమమనుసరించి యవతరించిరి, ఆ రహస్యము సూచించుటకే, విధిసృష్టించెన్=నీవు పుట్టినదీ వనవాసముకన్నప్పుడు నీ వీ యవతారమునఁ జేయ సంకల్పించిన నియమము స్మరింపుమనిభావము.

తాత్పర్యము

ప్రాణేశ్వరీ! నాతోడ నీవు వనవాసముచేయుటకే బ్రహ్మదేవుఁడు నిన్ను సృష్టించెను. ఆత్మజ్ఞానముగలవాఁ డెన్ని కష్టములువచ్చినను శాంతము నెడఁబాయనట్లు నిన్ను నెడఁబాయఁ గలుగుదునా. నీవేల నవ్వులమాటలకు విచారపడెదవు?

మ॥ కరినాసోరు! మహాత్ము లీకరణి ము౯గ్గావించి యున్నారు, దాఁ
దరుణిం దోడ్కొని కాన కేగుటయు స౯ద్ధర్మంబ, తద్ధర్మమా
సరణి న్నేను జరించువాఁడ, జలజా౯స్యా! రమ్ము నా వెంట భా
స్కరుని న్వెన్కొనునాసువర్చలగతిన్౯సంతోష మేపారఁగన్. ౮౨౬

కరినాస+ఊరు=ఏనుఁగు తొండము వంటి తొడలుగలదానా, మహాత్ములు=గొప్పమనస్సుగలవారు, సద్ధర్మము=ఉత్తమధర్మము, తద్ధర్మమాసరణిన్=ఆ ధర్మమున కనుకూలవిధమున, జలజాస్యా=కమలమువంటి ముఖముకలదానా అనుటచే దుఃఖము విడిచి ముఖము ప్రసన్నమాయెనని సూచన, భాస్కరుని=సూర్యుని, సువర్చల.

తాత్పర్యము

నేను నిన్ను నడవికిఁ బిలుచుకొనిపోవుట శిష్టాచారమే కాని నీమీఁది మోహముచేఁజేయు కార్యముగాదు, పూర్వము గృహస్థధర్మమందుండి గొప్పవారు తా మరణ్యమునకుఁ బోవునపుడు తమ భార్యలను దమ వెంటఁ బిలుచుకొని పోయియున్నారు. కావున భార్య చిన్నవయస్సుదైనను తరుణియైనను దనతోడఁ దోడుకొనిపోవుట యుత్తమధర్మమే. ఆ ధర్మమార్గమందే నేను సంచరించెదను జలజాస్యా! సూర్యునివెంట నాయన భార్య సువర్చల వచ్చినట్లు నీవును నావెంట సంతోషముతో రమ్ము.

―౯శ్రీరాముఁడు సీతతో నరునకుఁ బితృపూజ యవశ్యకర్తవ్య మని చెప్పుట ౯―

ఉ॥ పో నన రాదు నాకుఁ బువుఁ౯బోణీ! వనాంతరసీమ, కిప్పుడా
మానిని కార్యుచేసిన ప్ర౯మాణము లీడ్చెడి నన్నుఁ గావకున్
జానకి! తల్లిదండ్రులవ౯చస్స్థితి నిల్పి చరించు టెంతయున్
మానఁగ రానిధర్మ,మది౯మాని మనంగ సహింతు నేగతిన్. ౮౨౭

ఆర్యుచేసిన ప్రమాణము=తండ్రి చేసిన ప్రమాణము ఆర్యుఁడు చేసిన ప్రమాణము అనుదానిని సమానముగ వ్రాయుచో ప్రథమకు షష్ఠియగు- 'భీష్ము కొంపోయినదాని'కని తిక్కన-అమానినికి=కైకకు, మనంగన్=జీవింపఁగా.

## తాత్పర్యము

నీవేల యడవికిఁ బోయెదవని సీతాదేవి యడిగినదికాదు. కాకున్నను లక్ష్మణునకువలె నామె మనస్సులో నేమైన సందేహముండునేమో యని దానిని వారింపఁ గారణము తానే చెప్పుచున్నాఁడు.

(2) తల్లి దండ్రులు ప్రత్యక్ష దేవత లని కైకేయీ దశరథులయెదుట ముఖప్రీతికై చెప్పినమాటకాదు. హృద్గత వాస్తవార్థ మదియేయని తెలుపుటకై యిచ్చట మరలఁ దెలుపుచున్నాఁడు.

నావలన నీకుఁ గౌసల్యకు లక్ష్మణునకు మిగుల వ్యసనముకలుగుట నే నెఱుఁగుదును, పరులు దుఃఖించుకార్య మేలచేసెదవనెదవా? ఏమిచేయుదును. అడవికి నిప్పుడు పోను అని నేను జెప్పరాదు. ఏల చెప్పరాదందువా? మాతండ్రి కైకకుఁజేసిన ప్రమాణములు నన్నునడవికి నీడ్చుకొనిపోవుచున్నవి. నిలువ శక్యముగాదు. నిలిచితినా-మాతండ్రి సత్యవ్రతము నేను నాశముచేసినవాఁడ నగుదును అదియునుగాక పుత్రులకుఁ దల్లిదండ్రుల మాటప్రకారము వర్తించుట మానరానిధర్మము. దాని కపవాదములేదు. కావునఁ బుత్రునకుఁదగిన ధర్మమార్గమునువదలి నే నెట్లు జీవింపఁగలను. ఇందుండినా నాప్రాణము పోవును?

కం॥ స్వాధీనదేవతల బింబాధర! తనతల్లిఁ దండ్రి నాచార్యునరున్
దాఁ ధిక్కరించి నరుఁడ, స్వాధీనపుదైవ మెట్లు నను బూజింపన్? ౨౫౦

బింబాధర=దొండపండువంటి పెదవిగలదానా, అధరశబ్దమంగాదులలోఁ జేరమిచే జీప్పరాదు గానబింబాధరి యనరాదు. ఇట్టులే పద్మనేత్రియనుటయుఁ దప్పు. నాసికా, ఉదర, ఓష్ఠ, జంఘా, దంత, వర్ణ, శృంగ, అంగ, గాత్ర,కంఠ పృచ్ఛాయువియంగాదులు. వీని కుభయ రూపములు గలవు. నరుఁడు=ఈజాతి వాఁ డాజాతివాఁడనక యీ వయస్సువాఁడావయస్సువాఁడనక మనుష్యస్వరూపముగల యెవ్వఁడైనను. నరుఁడని యేకవచనమునఁ జెప్పుటచేఁ బ్రతిమనుష్యునకిది యనివార్యకార్యమని భావము.

అస్వాధీనపుదైవము=అర్చకుని స్వాధీనమునలేని దైవము, ఒండు=ఇది కాదని మఱియొకటి.

నరుఁడని పుంలింగమును బ్రయోగించుటచే వివాహితలైన స్త్రీలకు వీని కంటె భర్తృసేవయే శ్రేయస్కరమని యేర్పడుచున్నది.

తాత్పర్యము

తలిదండ్రులమాట మీఱిన నేమి-ఇంటనే యుండి దేవతార్చనాదులు చేయుచుండిన నాపాపముపోదాయందువేమో. పూజించువాని యెదుటనుండి యుక్తాయుక్తములుబోధించి, యతని యిష్టప్రకారముండెడి దేవతలు తల్లిదండ్రులు, ఆచార్యుఁడు, ఇట్లు తన స్వాధీనమందుండు దేవతలను దిరస్కరించి నరుఁడు కనులకుఁ గానరాక, తన స్వాధీనమందు లేక యుండుదైవమును బూజించుటెట్లు? ఎవరివలనఁ బ్రత్యక్షముగా మనము ఫలమనుభవించుచున్నామో వారియందే భక్తి లేకున్నఁ దనయధీనమునలేని యప్రత్యక్ష దేవతలయందు భక్తి యెట్లుకుదురును. పూజ యెట్లుచేయును. కావునఁ బరోక్షదేవతలఁ బూజించినను బూజింపకుండినను బ్రత్యక్షదేవతలఁ బూజింపకయుండరాదు. ఈవిధముగా సాకారధ్యానము అర్చాపూజయే ప్రశస్తమని యనివార్యమని శ్రీరాముఁడు సూచించెను.

కం॥ అమువ్వురఁ గొలచిన నరుఁ డామూఁడుజగంబు లైనఁ నగు సాధింపన్
వామాక్షి! తత్సమానం, బౌమహితపవిత్ర మెుండు నలవడ దవనిన్.౨౯

అమువ్వురను=తల్లిని దండ్రిని ఆచార్యుని, పవిత్రము=మనుష్యులను పావనముచేయునది, 'పవిర్వజ్రే మహాభయ'మ్మని యుండుటచే పవియనఁగా సంసారభయము దానినుండి రక్షించునది పవిత్రము. 'నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహవిద్యతే'॥భ.గీ. యని కలదుగదాయనిన పవిత్రులఁజేయు యోగములందది శ్రేష్ఠమనియు దానికంటె నిది సుకరము సర్వసామాన్యము, అధికారాపేక్షలేనిది కావున నిదియేశ్రేష్ఠమని యూహించునది. అలవడదు=లభింపదు.

తాత్పర్యము

తల్లిని దండ్రికిని నాచార్యుని సేవచేయు మనుష్యుడు స్వర్గమర్త్యపాతాళంబులను నా మూఁడు జగంబులనైనను సాధింపఁగలఁడు. అట్టి పితృసేవతో సమానమయినదై, మిగులఁ బవిత్రవంతునిఁ జేయునది, సంసారభయము మాపునది, యిది కాదని మఱియొకటి భూమియందులేదు.

శ్లో॥ తయోర్నిత్యం ప్రియం కుర్యా,దాచార్యస్యచ సర్వదా
తేష్వేవ త్రిషు తుష్టేషు,తప స్సర్వం సమాప్యతే॥

తల్లిదండ్రులకు నాచార్యునకు నెల్లవేళఁ బ్రీతిగలుగ వర్తింపవలయును వారు ముగ్గురు సంతోషించిరా సమస్తతపములు సమాప్తమునొందును. ఆవల వాఁడే తపస్సుచేయఁ బనిలేదు.

శ్లో॥ తేషాం త్రయాణాం శుశ్రూషా, పరమం తప ఉచ్యతే
నతైరభ్యనుజ్ఞాతో,ధర్మ మన్యం సమాచరేత్॥

తల్లిదండ్రుల యాచార్యుల శుశ్రూషయే పరమతపమని చెప్పఁబడుచున్నది. వారి యాజ్ఞలేక పురుషుఁ డితర ధర్మమేదియుఁ జేయరాదు.

శ్లో॥ త ఏవ హి త్రయో లోకా, ఏవ త్రయ ఆశ్రమాః
త ఏవ హి త్రయో వేదా, స్త ఏవోక్తా స్త్రయోఽగ్నయః॥

ఆ ముగ్వురు త్రిలోకప్రాప్తికి హేతువులు. వారే మూఁడాశ్రమములు. వారే మూఁడు వేదములు. వారే మూఁడగ్నులు. అనఁగా నా ముగ్గురశుశ్రూష చేయువారికి మూఁడాశ్రమములందుండి మూఁడు వేదములు చదివి మూఁడగ్నులఁ గొలిచిన ఫలముబ్బును.

పితా వై గార్హపత్యోఽగ్ని, ర్మాతాగ్ని ర్దక్షిణ స్స్మృతః
గురు రాహవనీయ స్తు,నాగ్ని త్రేతా గరీయసీ॥

తండ్రి గార్హపత్యాగ్ని, తల్లి దక్షిణాగ్ని, గురువాహవనీయాగ్ని, ఈ మాతాపితృ గురురూపమైన యగ్ని మిగుల శ్రేష్ఠమైనది. అనఁగా నాయగ్నులఁ గొలుచుటకంటె నీయగ్నులఁ గొలిచిన నెక్కువ ఫలముగలదు.

త్రి ష్వప్రమాద్య న్నే తేషు, త్రీన్ లోకాన్ విజయేద్గృహీ
దీప్యమానః స్వవపుషా, దేవవ ద్దివి మోదతే॥

ఈ ముగ్వురిసేవయందుఁ బొరపడని బ్రహ్మచారి గృహస్థుఁడు మూఁడు లోకములను జయించును. మఱియు దివ్యశరీరముగలవాఁడై దేవతలవలె స్వర్గమునఁ బ్రకాశించుచుండును. ౧౬౩౪ పద్యము చూడుము.

మాతా పితృ గురూణాంచ, కార్య మేవాను శాసనమ్
హితం వాప్యహితం వాపిన, విచార్యం నర్ష భ.

తల్లి తండ్రి గురు వాజ్ఞాపించినదానిని హితమా యహితమా యను విచారములేక చేయవలయును.

నాస్తి మాతృసమం దైవం, నాస్తి పితృ సమో గురుః
తల్లితో సమానమైన దైవములేఁడు. తండ్రితో సముఁడైన గురువు లేఁడు.

కం॥ దానము మానము సత్యము,మానసుదక్షిణము జన్నమోజానికిః యే
మానవున కైనఁ బితృసే,వానియతిఫలం బొసంగవశమె పరమునన్?

మీఁదఁజెప్పిన మాతా పితృాచార్యసేవ శ్రేష్ఠమనుట నహినిందా న్యాయముచేఁ గాదనియు నది వాస్తవార్థమనియుఁ దెలుపుచున్నాఁడు.

జన్నము=యజ్ఞము, నహినిందా న్యాయమనఁగా, నొకదానిని స్తుతించుట మఱియొకదానిని దూషించు తలఁపుచేఁగాదు చెప్పఁదలఁచినదానిని విశేషించి చెప్పుటయే యుద్దేశము.

## తాత్పర్యము

'తస్మాద్దానం పరమం వదంతి' యని శ్రుతియందుఁ గొనియాడఁబడిన దానముగాని, మానముగాని, యింత యేల యన్నిధర్మములు సత్యమందుఁ బ్రతిష్ఠితములని చెప్పఁబడిన సత్యముగాని, కొఱఁతలేని దక్షిణలతోఁ జేయఁ

బడిన యజ్ఞముగాని, యే మనుష్యునకైనఁ బితృసేవచేయునియమ మిచ్చు ఫల మును బరలోకమున నీయఁజాలదు.

కం॥ సురలోకము ధాన్యము ని,
ర్భరసుఖమో ధనము సుతులొ•భాగ్యమొచదువో
గురుశుశ్రూషాబలమునఁ, దరుణి! దుస్సాధ మగుప•దార్థము గలదే?౨౮౧

తాత్పర్యము

స్వర్గమో, ధాన్యమో అధిక సుఖమో ధనము, సుతులో, భాగ్యమోచదువో పినిలో నేదైనను గురువుల సేవలవలనఁగలుగు బలమున సాధింపఁ గష్టమైనది కలదా, లేదు.

కం॥ మాతాపితృ సుపరాయణు, లై తనరుమహానుభావు•లశ్రమమున గో బ్రా
పైతామహసురగంధ, ర్వాతతలోకములు గన స•మర్థులు చెలువా!౨౮౨

తాత్పర్యము

మాతపితృ సుపరాయణులు, తల్లిదండ్రులే పరమగతియని సేవించు వారు. (పాఠీని ౬-౩-౩౭) అశ్రమమున=శ్రమములేక సుఖముగా, గోలోకము గాని, బ్రహ్మలోకముగాని, దేవలోకముగాని, గంధర్వలోకముగాని, విస్తారము లైన యితరలోకములుగాని, బొందుటకు శక్తిగలవారై యుందురు.

కం॥ నాతండ్రి సత్యధర్మో, పేతమనస్కుండు చెప్పె•నెది యది సలుపన్
జేతమునఁ దలఁచినాఁడ, సనాతనధర్మైక పథము•నవలా! యిదియే.

సత్యధర్మోపేతమనస్కుండు = సత్యరూపకమైన ధర్మముతోఁగూడిన మనస్సు గలవాఁడు, సనాతన ధర్మైకపథము = ముఖ్యమైన సనాతనధర్మ మార్గము, నవలా=స్త్రీ, ఇచట సంబోధనము. దీనికి హ్రస్వాంతరూపము ప్రయో గంబులఁ గలదు.

తాత్పర్యము

సత్యమను ధర్మముతోఁగూడిన మనస్సుగల మా తండ్రిగా రెదిచెప్పెనో యావనవాసముచేయ నామనస్సున నిశ్చయించుకొన్నాఁడను. అది ముఖ్య మైన సనాతనధర్మము.

కం॥ నీమత మెఱుంగఁ జాలమి, నామెయి వలదంటి, నిశ్చ•యంబుగను వనీ
భూమి కరుదెంతు నంటివి, శ్యామా! ని న్నెట్లు విడిచి•చన శక్తుండన్.౨౮౪

తాత్పర్యము

నీ యభిప్రాయము దెలియని కారణముచే ముందు నేను జెప్పిన విధ ముగా నాతోడ రావలదంటిని. అట్లుగాదు, నిశ్చయముగా నే నడవికి వచ్చెద నని నీ దృఢాభిప్రాయముఁ దెలిపితివి. అట్టి యభిప్రాయము నీకుండెనేని నిన్ను విడిచి నే నెట్లు పోవఁగలవాఁడను, నీవు రానకదువేమో, నేనే పోదమని చూచితిని. శ్యామా యౌవనమధ్యస్థా యని శ్యామయనఁగా నడిమివయస్సు స్త్రీయైనను, సీతకిప్పటికి ౧౮ సంవత్సరములే గనుక బాలాత్వము పోయి

పోక యౌవనమువచ్చిరాక యున్నది. కావున సామాన్య స్త్రీ వాచకముగానే యిచ్చట గ్రహింపవలయును.

కం॥ అనవద్యగాత్రః నిన్నున్, వనవాసము చేయుకొఱకె • బ్రహ్మ సృజించెన్
వనజాక్షీః దీనికినై, వనరెద వేమిటికి రమ్ము • పయనింపు మిఁకన్. ౮౬౭

అనవద్యగాత్ర=దోషరహితమైన దేహముగలదానా, వనజాక్షీ=కమలము వంటి కన్నులుగలదానా. వనమందుఁ బుట్టినదానివంటి కన్నులుగల నీవు వనమును జూడఁగోరుట న్యాయ్యమే. వనరెదవు=దుఃఖించెదవు, పయనింపుము=ప్రయాణముచేయుము.

తాత్పర్యము

ఏ దోషముండిన వనవాసకష్టము లభించునో యట్టిదోషము నీయందు లేదు. అయినను వనవాసము చేయుకొఱకే నీవు పుట్టితివి. ఇది కర్మవశమున వచ్చినదిగాదు. స్వేచ్ఛాలబ్ధము కావున దీనికై యేల దుఃఖించెదవు, పోదము. రమ్ము. ప్రయాణము సేయుము.

ఉ॥ లెమ్ము మనంబునందుఁ బని • లే దిఁక సందియ మూన నీకు లే
శమ్మురుదెమ్ము, ధర్మసహ • చారిణి వై వెనువెంట నీదువం
శమ్మునకున్ మదన్వయయ • శంబునకుం గడుయోగ్య మైనశీ
లమ్మును నిశ్చయించితివి • శ్లాఘ్యము కా కిది యేమి దోసమే? ౮౬౮

లెమ్ము=ఇది సీత శ్రీరాముని పాదములు పట్టుకొనియున్నదని సూచించుచున్నది, పనిలేదు=అవశ్యకము లేదు, సందియము=సందేహము, ఊనన్=పొందన్, లేశమ్ము=కొంచెమైనను, ధర్మసహచారిణివై=ధర్మమునందుకూడఁ జరించి తోడుపడుదానవు. ఇట్లనుటచే నేను జేయఁబోవు రావణవధాదికార్యమందు నీ సాహాయ్యము కావలసియున్నదని భావము, మదన్వయ యశంబునకున్=మా వంశకీర్తికి, శీలమును=సదాచారమును, శ్లాఘ్యము=పొగడఁబడఁదగినది.

తాత్పర్యము

ఇఁక నీ విట్లుండవలసిన పనిలేదు. లేలెమ్ము. కొంచెమైన సందేహింపకుము. నావెంబడి సహధర్మచారిణివై నేను జేయు ధర్మమందుఁ దోడై రమ్ము, నీ వంశమునకు నావంశ కీర్తికిఁ దగినట్లు నీవు నిశ్చయించుకొంటివి. ఇది శ్లాఘింపఁదగినదే కాని యిది యేమి దోషమా.

—• శ్రీరాముఁడు సీతను దానము సేయ నియోగించుట •—

శా॥ ఆరంభింపు మరణ్యయాత్రకును యో • గ్యంబైన కార్యంబులన్,
దూరీభూతపరస్పరంబు నమృతాం • ధోలోకమున్ నే మదిం
గోరన్, విప్రులకున్ ధనంబు లిడు, భి • క్షువ్రాతము న్నిస్తులా
హారప్రీతముఁ జేయు, సిద్ధపడు జా • యాః యింక జాగేటికిన్. ౮౬౯

దూరీభూతపరస్పరంబు=మనలో నొకరి నొకరు నెడఁబాసి దూరముగ నుండఁజేయునది, అమృతాంధోలోకము=అమృతమాహారముగాఁగల దేవతల లోకము, స్వర్గము, భిక్షువ్రాతము=బిచ్చగాండ్ర సమూహము, ఇచ్చట భిక్షుశబ్దమునకు సన్న్యాసి యని యర్థముగాదు. బౌద్ధమతముతో మనదేశమున సన్న్యాసులు వెల్లివిరిసినారు. అంతకుముందు యోగ్యతగలవాఁడెవఁడోవాఁడే కోటికొక్కఁడు సన్న్యాసము గ్రహించు బ్రాహ్మణుఁడుండెను. ఇప్పుడది శిశ్నోదర పరాయణులకు నిరపాయము నిశ్చయమునైన జీవనోపాయమైనది. నిస్తులాహారప్రీతము=అసమానమైన యాహారముచే సంతోషపెట్టఁబడినది, జాయా=ఇల్లాలా, జాగు=అలస్యము.

తాత్పర్యము

జాయా! యిఁక నరణ్యయాత్రకు యోగ్యమైన కార్యములేవో యవి చేయుము, మనలో మన మొకరినొకరు విడిచియుండవలసివచ్చినా యట్టి వియోగముచే నాకు స్వర్గము లభించిన నే నంగీకరింపను. బ్రాహ్మణులకు ధనమిమ్ము బిచ్చగాండ్రకు నన్నము కడుపులు నిండఁబెట్టుము. ప్రయాణమునకు సిద్ధపడుము. ఇఁక నాలస్య మేలచేసెదవు.

తే॥ బ్రాహ్మణానంతరమున వ॰స్త్రములు నగలుఁ
బాన్పులును వాహనంబులుఁ॰బైఁడిబొమలు
వేడ్కవస్తువు లన్నియుఁ॰వెలఁది నావి
పరమమతి నిమ్ము యనుజీవి॰వర్గములకు. ౭౬౪

తాత్పర్యము

"నేను కట్టువస్త్రముతో మీవెంటవచ్చుటకు సిద్ధపడియేయున్నాను. నా యాలస్యములేదు. నేను జేయవలసిన దేమైనయుండినఁ జేసెదను అని చెప్పిన సీతకు శ్రీరాముఁ డిట్లు చెప్పుచున్నాఁడు.

బ్రాహ్మణులకు ధనము లిచ్చినతరువాత వస్త్రములు, ఆభరణములు, పానుపులు, వాహనములు, బంగారుబొమ్మలు ఇంకను నా వినోదపదార్థములు నన్నియు నిండుమనస్సుతో మనల నాశ్రయించి బ్రదుకు సేవకులకు నిమ్ము.

ఇచ్చట నొక సందేహము. "భార్యా పుత్రశ్చ దాసశ్చ త్రయ ఏవాధనాః" భార్యకుఁ బుత్రునకు దాసునకు ధనములేదు. అను న్యాయముండఁగా శ్రీరాముఁడెట్లు తండ్రి జీవించియుండఁ దండ్రి యాజ్ఞలేక ధనమును దానముచేసెను. ఇది యధర్మము కాదా. కాదు. ఈధర్మము కుటుంబసాధారణమైన సొత్తువిషయము. కొడుకునకు స్వతంత్రధనము లేకపోలేదు.

పితృభ్యాం యస్య యద్దత్తం, త త్తస్యైవ ధనంభవేత్, యాజ్ఞ
తల్లిదండ్రులు లెవని కేదియిత్తురో యది వాని ధనమే.

పితృద్రవ్యా విరోధేన, యదన్యస్స్వయ మార్జితమ్
మైత్రమౌద్వాహికం చైవ, మధుపార్కిక మేవచ
అనుపఘ్నన్పితృద్రవ్యం, శ్రమేణ యదుపార్జయేత్
స్వయంమే హితలబ్ధంతం, నాకామోదాతు మర్హతి॥

పితృద్రవ్యమునకు హానిలేక తాను గడ్పించి సంపాదించునదియు, మిత్రులిచ్చినదియు, వివాహమువలన వచ్చినదియు, మధుపర్కముగా లభించినదియు నివన్నియు వానివాని సొంత సొత్తులే. కావున రామచంద్రమూర్తి తన సొత్తు దానము చేసెనుగాని కుటుంబద్రవ్యమును దానముచేయలేదు. ౬౧౬వ పద్యముఁ జూడుఁడు. ధర్మవిక్రమ గుణార్జితవిత్తములు, దానముచేసెనని చెప్పఁబడెను.

కం॥ అని ప్రీతచిత్తమునఁ ద, న్ననుమతి సేయుటయుఁ బొంగి॥యవనీసుతరా
మునిపనిచినయట్టుల నిజ,
ధనవర్గము దాన మీయఁదటుకునఁ బూనెన్. ౮౬౯

ప్రీతచిత్తమునన్=సంతోషించిన మనస్సుతో, అనుమతి=అనుజ్ఞ, రాముని పనిచిన యట్టుల=శ్రీరాముఁ డాజ్ఞాపించిన విధముగానే, తటుకునన్=ఏయాలస్యము సేయక వెంటనే.

తాత్పర్యము

అని సంతోషముతోఁగూడిన మనస్సుతోఁ దనరాక సమ్మతించి కార్యములఁ జేయ నియోగించుటయు సందేహమువదలి సంతోషముతో నుప్పొంగి సీత శ్రీరాముఁ డాజ్ఞాపించినట్టులు తమ ధనసమూహమును వెంటనే దానమీయఁ బూనెను.

—•{ ౩౧-వ సర్గము. లక్ష్మణుఁడు తాను వనమునకు వచ్చెదనని శ్రీరాముం బ్రార్థించుట. }•—

ఉ॥ ఇన్నితయు నాలకించి మును•పే రఘురామునితోడ వచ్చి త
త్ప్రాంతమునందు నున్నపిన•తమ్ముఁడు లక్ష్మణుఁ డయ్యొ! సీతకే
యింతటికష్టసాధ్య మఁట•యేగతి నన్ను ననుగ్రహించు న
న్వంత సహింపలేక భృశ•బాష్పసమాకులితాస్యబింబుఁ డై. ౮౭౦

ఆలకించి=విని, తత్ప్రాంతమునందు=శ్రీరాముని సమీపమందు, వంత=శోకము, భృశ=అధికమైన, బాష్ప=కన్నీళ్ళచే, ఆకులిత=కలతపడిన, అస్యబింబుఁడై=ముఖబింబముగలవాడై.

తాత్పర్యము

శ్రీ సీతారాముల సంవాదమంతయు శ్రీరామునితోడవచ్చి వారి సమీపమందేయుండి వినుచుండిన లక్ష్మణుఁడు, అయ్యో, కట్టుకొన్న భార్య, అర్ధాంగలక్ష్మి, నిత్యానపాయిని, యయిన సీతకే వనవాసగమనమునకై యింతకష్టము మీఁదఁ గన్నీరుగార నేడువఁజేసి యనుమతియిచ్చెనే సవతితల్లి కొడుకైన

నన్నేవిధముగ ననుగ్రహించును? అనుగ్రహింపఁడేని నా గతియేమి? యను వ్యసనమునసహింపలేక మిక్కిలి కన్నీరుకాఱఁగా వ్యాకులపడిన ముఖముగల వాఁడై. ప్రాంతమనుటచేఁ గొంచెము దూరముగ నుండెనని భావము. భార్యాభర్తలు సంభాషించునపుడు మఱియొకరు వారి సమీపమునకుఁ బోరాదనిసూచన.

ఇచ్చటఁ గొందఱు 'పితృసమోజ్యేష్ఠ' యను న్యాయమునననుసరించి యన్న తండ్రితో సమానుఁడు కావున శ్రీరాముని వెంట లక్ష్మణుఁడు బోవ సమ్మతించెనందురు. అది సామాన్యధర్మము. అదియైనను దండ్రి మరణానంతర మన్వయించును గాని తండ్రి బ్రతికియుండఁగాఁ గాదు. కావున శ్రీరామకైంకర్యాభిలాషియయి యే లక్ష్మణుఁడు శ్రీరామచంద్రమూర్తి వెంటఁబోయెనని ప్రసన్నమతము, తల్లి తండ్రి జీవించియుండఁగా వారి సేవ వదలి వారి యాజ్ఞలేక యన్న వెంటఁబోవుట సందిగ్ధధర్మము. ఏలన:

తల్లిదండ్రులకు వెనుకటివాఁడన్నగాని వారికంటె శ్రేష్ఠుఁడుగాఁడు. 'జ్యేష్ఠభ్రాతా పితృసమో, మృతేపితరి భూసురః॥ కనిష్ఠాస్తం నమస్యేరన్, సర్వే ఛందానువర్తినః॥ తండ్రి మరణించిన వదపడి యన్న తండ్రితో సమానుఁడు. చిన్నవాండ్రాయనకు నమస్కరించుచు నతని యభిప్రాయప్రకారము నడవవలసినదని యుండుట సత్యమే. లక్ష్మణునకుఁ దల్లిదండ్రు లనుజ్ఞయిచ్చుటచే నన్న వెంటఁ బోవుట తప్పుగాదందరు లక్ష్మణుఁడు వారి యనుజ్ఞఁదీసికొని వయనింపలేదు. ప్రయాణమునకు సిద్ధపడి సర్వమువదలి సీతారాముల వెంటఁబోవునపుడు వారనుమతించిరి. ౭౩౧ పద్యము చూడుఁడు. కేవల కైంకర్యకతానునకు జనకాజ్ఞగౌణము.

ఉ॥ అన్నపదంబులం బడి మ॰హామతి గట్టిగఁ బట్టుకొంచు, నా
యన్నులమిన్న సీతఁ గని॰యామెను బ్రార్థనచేసి మున్నుగా,
నన్నకు నన్మహావ్రతున॰కార్తి ననున్ వనసీమ కేగ దీ
నిన్నినుఁ గొల్వ వత్తుఁ గరు॰ణింపుము నావయి దీనవత్సలా! ౮౩౧

మహామతి=గొప్ప మనస్సుగలవాఁడు, అన్నులమిన్నన్ = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, మహావ్రతునకున్=గొప్పవ్రతముగలవానికిన్, ఆర్తిన్=వ్యసనముచే దీనవత్సలా=దీనులందుఁ బ్రేమగలవాఁడా.

ఈ పద్యమున శరణాగతి యను ప్రపత్తియు దాని కుపదేశమునొందవలసిన ద్వయమంత్రార్థము చెప్పఁబడినది. అప్పుడీయర్థమును గ్రహింపవలెను. మున్నుగన్=మొదట, సీతనుజూచి యామెను బ్రార్థనచేసి యనుటచే ముందు పురుషకారము ప్రార్థింపబడుట చెప్పఁబడెను. పురుషకార పూర్వకముగానే శరణాగతి చేయవలయును.

ఇచ్చటఁ బురుషకారభూత సీత. తన సంకల్పము నెఱవేఱునట్లు దాని కనుకూలముగా భగవంతునితోఁ జెప్పి రక్షింపఁ జేయుట పురుషకార మనఁబడును

పూర్వపద్యములోని లక్ష్మణుఁడు అను దానిని గర్తృపదముగా గ్రహింపవలెను.

శ్రీరామశుశ్రూష యను ప్రయోజనము కోరి వేఱొండుపాయమునవలంబింపని లక్ష్మణుఁడు, మహామతి=తానుజేయుశరణాగతికిఁ బ్రతికూలమైనదాని వర్జించి యనుకూలమైనదానినే గ్రహించిన బుద్ధిమంతుఁడు. అన్న యనుటచే శ్రీరామలక్ష్మణులకు విడువరాని సంబంధము కావున లక్ష్మణునకు శ్రీరాముఁడు శరణ్యుఁడగుట యుక్తమని సూచితము. పదంబులంబడి యనుట శరణాగతిని దెలుపును. గట్టిగఁ బట్టుకొంచున్=అనుటచే శరణాగతికిఁగావలసిన మహావిశ్వాసము తెలుపఁబడెను. మున్నుగాఁగని ప్రార్థనచేసి యనుటచేఁ బురుషకారముగా నుండునట్లు వేఁడుట సూచింపఁ బడెను. అన్నుల మిన్న యనుటచేఁ బురుషకార భూతయగు నధికారము సీతయందుఁ గలదని భావము. సత్+మహత్+వ్రతునకున్=శ్రేష్ఠమైన గొప్పదగు వ్రతము కలవానికి 'సత్యజేయం కథంచన, ఏతద్వ్రతం మమ' యను మహావ్రతము గలవానికి, ఆర్తిన్=దీనిచే శరణాగతి చేయ నధికారము గలదని చెప్పఁబడెను.

శరణాగతి యైహికాముష్మికఫలములలోదేని నైనఁగోరి చేయవచ్చును మోక్షార్థమే చేయవలయునను నియమములేదు కావునఁ దనయభీష్టము చెప్పుచున్నాఁడు. ఇదియే గోప్తృత్వవరణము.

అన్న పదంబులంబడి మహామతి గట్టిగఁబట్టికొంచునను వఱకు ద్వయమంత్రములోని మొదటిభాగము నర్థము చెప్పఁబడెను. అన్నకు ననుటచే నామంత్రములోని రెండవ భాగము నర్థము చెప్పఁబడెను. అన్నుల మిన్నను బ్రార్థనచేసిమున్నుగాననుటచే శరణాగతిని ఫలప్రార్థనకును గావలసిన పురుషకార ప్రార్థన చెప్పఁబడెను ఏ ఫలముఁగోరి లక్ష్మణుఁడు శరణాగతి చేసెనో యావిషయమింకఁ జెప్పఁబడును, వనసీమ కేగుదేనిన్ = వనసీమకుఁ బోయెడి పక్షమున, అనుటచే నీ వరణ్యములకుఁ బోవుట నాకు సమ్మతి గాదని సూచించుచున్నాఁడు, కౌసల్యవలె సీతయుఁ బోవలదని చెప్పునేమోయని చూచెనుగాని యామె యావిషయమే ప్రస్తావించినదికాదు. ఏలపోయెద వనియైన నడుగలేదు అది తన పని కాదని యామెకుఁ దెలియును.

కావున గట్టిగాఁ బోవలదని చెప్పలేక లక్ష్మణుఁడు తన యభిప్రాయము సూచించెను. నినుఁగొల్చివత్తును=నీ సేవచేయవచ్చెదను, దీనవత్సలా=అహంకారము గలవారికి నీవు విముఖుఁడవేకాని దాసులయందు వాత్సల్యము కలవాఁడవే కదా నేను దీనుఁడను, నాయందుఁ గరుణింపుము.

ఉ॥ కేలను విల్లు పూని మృగ•కీర్ణ మహావనిఁ ద్రోవ దీయు చే
లీలగ మున్నుపోవ నవ•లీలఁ జరింపఁగ వచ్చు మీకు, న
త్యాళిమృగోత్క రాన్వితము•హావనసీమల నెన్ని యేని య
న్నా! లలి మీరు గ్రుమ్మరఁగ•నాఁ జుమి నే వెనువెంట వచ్చెదన్. ౭౩

తాను జేయఁబోవు కైంకర్యమును సాధనములను జెప్పుచున్నాఁడు.

కేలను=చేతియందు, విల్లుపూని=ధనువ్పు ధరించి, అది యేల యంటివా మృగకీర్ణమహావనిన్=మృగములచే నిండిన గొప్పయడవియందుఁ ద్రోవఁ దీయుచు, మున్నుపోవన్=ముందుగాఁబోఁగా, అవలీలన్=సుళువుగా మీకుఁ జరింపవచ్చును. అడవులలో మనమై దోవలు చేసికొనుచుఁ బోయినఁగాని త్రోవ యుండవు. ఆపని నేను జేయుచు ముందు పోయిన మీరు నా వెనుక సుఖముగా రావచ్చును. లేకయున్న మీరే యాపని చేయవలసియుండును. మీరాపని చేసెదరా సీతను రక్షించెదరా? సత్త్వ....సీమలన్ = వ్యాఘ్రములులోనగు నడవి జంతువుల సమూహము జింకలు మొదలయిన మృగముల సమూహములు వీనితోఁగూడిన గొప్ప యడవి ప్రదేశములందు, మీరు=అలుమగఁడు, ఇరువురు క్రుమ్మరఁగనౌన్=సంచరింపసాధ్యపడును, వెనువెంటన్ = వెంబడి, దీని వలన "నేను సమస్తదేశములకును సర్వావస్థలకును సర్వకాలంబులకు ననుకూల మయిన విధమున సర్వకైంకర్యములను జేయఁగలవాఁడ"నని ప్రార్థన చేసి నట్లేర్పడుచున్నది.

### తాత్పర్యము

చేతవిల్లుధరించి గొప్పమృగములతో నిండిన వనమందు నపాయములేని మార్గములుగాఁ జూచుచు నేను ముందుపోవుచుండఁగా నావెనుక మీరిరువురు ఏ ప్రయాసములేక వనవినోదము చూచుచు రావచ్చును. సంచరింపవచ్చును. నేను మీవెంటవచ్చితినా పెద్దపులులు లోనైన సత్త్వములు జింకలు లోనగు మృగములు గల పెద్దయడవు లెన్నింటియందైనను మీరు హాయిగా సంచారము చేయవచ్చును. నేను రాకున్న మీకు సుఖప్రయాణము సాగదు.

తే॥ దేవలోకాక్రమణ మైన•దేవ యల్ల,నిర్జరత్వంబ యైనను•నిఖిలలోక
ములయు నైశ్వర్యమైనను•వలచువాఁడఁ,గాను నీలేని చోటను•హానుభావ.

లక్ష్మణుఁడు ప్రకృతి ఫలమునకై యెట్లు వేఱొండుపాయమును బరిగ్రహింపక శ్రీరాముఁడే యుపాయమని గ్రహించెనో యట్లే, తనకు శ్రీరామకైంకర్యముతప్ప వేఱుఫలముకూడ నక్కఱలే దనుచున్నాఁడు. వేఱుదైవమును, వేఱుపాయమును వేఱుఫలమును నాశ్రయింపక నాశింపక యుండుటే యేకభక్తి యని యనన్యభక్తి యని అవ్యభిచారభక్తి యని చెప్పఁబడును.

దేవ=ప్రభూ! దేవలోక='దేవానాంపూరయోధ్యా' యన్నట్లు దేవలోక మనఁగా వైకుంఠము, ఆక్రమణము=దానిని బొందుట దేవలోకమనఁగా నింద్ర లోకమనుట సరిగాదు. నీలేనిచోటన్=నీవు నాతోడనుండి నాకైంకర్యము పరిగ్రహింపనపుడు, నిర్జరత్వంబయైనను=జరామరణమోక్షయ యన్నట్టి కైవల్యమ నెడి మోక్షమైనను, అఖిల....ఐశ్వర్యమైనను=సమస్తలోక ప్రభుత్వము,చతుర్ముఖ

పదవియైనను, వలచువాఁడఁగాను, నీపరిచర్యలేనప్పుడు వైకుంఠవాసమే, నాకుసమ్మతి లేకయుండఁగా నిఁకఁగైవల్యము బ్రహ్మలోకము వీనిమాటచెప్పనేల

తాత్పర్యము

దేవా! మహానుభావా! నీవు లేనిస్థలము వైకుంఠమైనను నాకు వలదు. వైకుంఠమె వలవనివాఁడను కైవల్యమును దానికంటె హీనమైన బ్రహ్మపదవిని నేను గోరుదునా? కేవలాత్మోపాసకుల గమ్యస్థానము కైవల్యము.

కం॥ సౌమిత్రి యిట్లు పలికిన, రాముఁడు వచియించి పెక్కు•ప్రత్యూహోక్తుల్
సామంబున నూరార్చనఁ, దా మరల సుమిత్రతపట్టి•దగ నిట్లనియెన్.

సౌమిత్రి=లక్ష్మణుఁడు, ప్రత్యూహోక్తుల్=విఘ్నపు మాటలు, సామంబునన్=మంచిమాటలచే, ఊరార్చనన్ = సమాధానపఱుపఁగా, సుమిత్రతపట్టి=సుమిత్రతపట్టిసుమిత్రకుమారుఁడు.

తాత్పర్యము.

లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగా శ్రీరాముఁడు విఘ్నకరములైన ప్రతికూలములైన మాట లనేకములు చెప్పి యూరడింపఁగా మరల లక్ష్మణుఁ డిట్లనియె.

కం॥ అంగీకరించి మున్నే,భంగిని వారించెదివుడు•ప్రతిషేధము సే
యం గత మెది చెప్పుము? నా,సంగతి వీడెదవు దీన•సందియమయ్యెన్. ౮౭౫

అంగీకరించిమున్ను=పూర్వమే నావనగమనము నొప్పుకున్న వాఁడవై, (౮౩౭-౮౩౮-౮౫౮-౨౨౭ పద్యములఁ జూమనది.) ఇప్పుడీవిధముగా వారించెదవు=అడ్డగించెదవు, ప్రతిషేధము=రావలదని నిషేధించుటకు, కతము = కారణము, సంగతి, సాంగత్యము, కూడియుండుటను, సందియము=సందేహము.

తాత్పర్యము

పూర్వము నీతోడ నారాకను సమ్మతించి మాటలాడితివి. ఇప్పుడీవిధముగా వలదని నిషేధించుచున్నావు. దీనికేమి కారణము చెప్పుము. ఏలనా సాంగత్యము విడువనెంచితివి. పుట్టినది మొదలు బాల్యాదపి సుస్నిగ్ధః రామస్య దక్షిణో బాహుఃవన్నట్లు నన్ను నాసేవ నింతకాలము గ్రహించి యిప్పుడు నాయందేదో దోషముండుటచే రావలదని నిషేధించుచున్నావని నాసందేహము. ఆ సవతికొడుకట్లుచేసెను. ఈ సవతి కొడుకేమి చేయునో యని సందేహమా. తెలియఁ జెప్పుము.

—• శ్రీరాముఁడు లక్ష్మణుని నయోధ్యయందుండు మని చెప్పుట.•—

ఉ॥ చేతులు మోడ్చి మున్నచన•సిద్ధుఁడునై తను వేఁడుచున్న వి
ఖ్యాతచరిత్రు లక్ష్మణునిఁ•గాంచి వచించును రామచంద్రుఁడున్
భ్రాతవు, ప్రాణతుల్యుఁడవు•వశ్యుఁడవున్, వరధర్మశాలివిన్,
బూతగుణుండవున్, సఖుఁడ•వున్, బలశాలివి, నీవు నెయ్యుఁడున్. ౮౭౮

### తాత్పర్యము

రెండుచేతులు జోడించి తనకంటె ముందు పోవఁ బ్రయాణ సన్నాహమునందుండి తన యనుమతి మాత్రమెదురుచూచుచు దాని నిమ్మని ప్రార్థించుచున్న కీర్తికరమైన దానిచేత నేద్రోహబుద్ధి లేని నడవడిగల లక్ష్మణునిఁగాంచి రామచంద్రుఁ డిట్లనియె. లక్ష్మణా నీవునాకుఁ బుట్టువు చేతనే తమ్ముఁడవు. అంతే కాదు. ప్రేమ యందు నా ప్రాణములతో సమానుఁడవు. నాకు వశవడి నేను చెప్పినది చెప్పినట్లు వినయమునఁ జేయువాఁడవు. గొప్పధర్మముచేఁ బ్రకాశించువాఁడవు. పవిత్రవంతములైన కల్యాణగుణములు గలవాఁడవు. చెలికాఁడవు. బలవంతుఁడవు. స్నేహితుఁడవు. వీనిలో నొక్కగుణమున్నను నీవు త్యాజ్యుఁడవుగావు. అట్టులుండ నిన్నిగుణములుగల నిన్ను నిష్కారణముగా వదలిపోదునా. నీయందు దోషముండుటచే నిన్ను వదలిపోవఁ దలఁపలేదు. నాయాలోచన విధముచెప్పెద వినుము. ఇదియును సీతాదేవి పరీక్షవంటిదే.

చం॥ వనులకు నీవు నాబడిని•వచ్చెద వేనియు నెవ్వ రయ్యనా
జననిని నీదుతల్లినిటఁ•జక్కఁ భరించెడివారు? భూమికిన్
ఘనతరవృష్టియట్టులు సు•ఖం బొడఁగూర్చెడియట్టినాథుఁ డా
జనకుఁడు కామపాశచయ•సంపరిబద్ధుఁడు నీ వెఱుంగవే. ౭౨౨

నాబడిని=నావెంట, చక్కన్=ఏలోపము లేకుండునట్లు, ఘనతర వృష్టి=గొప్పవర్షము, కామపాశచయ సంపరిబద్ధుఁడు=మన్మథుని త్రాళ్ళసమూహముచే బాగుగఁగట్టబడినవాఁడు.

### తాత్పర్యము

నావెంట నీవు వచ్చితివనుకో, తరువాత నీ తల్లిని నా తల్లిని లోపము లేకుండ వారిని భరించువారెవరు? అది యేమి మన తండ్రి రాజులేఁడా యందువా, ఉన్నాఁడు. ఏమి ప్రయోజనము. జడివాన దేశమందంతట గొప్ప గాఁగురిసినట్లు అందఱకు సుఖము గూర్పకలసిన మనతండ్రి వారి భర్తయగు వాఁడు కామపాశసమూహములచే బాగుగఁ గట్టఁబడి పడియుండుట నీ వెఱుఁగవా. భర్త యాగతి, కొడుకు లీగతి, యైన మన తల్లుల గతి యేమి?

ఉ॥ మే లొనరింపఁబోవదు సు•మీ సవతాండ్రకు దుస్సహవ్యథా
లోలల కల్లకైక యిల•లోఁగొనుటన్, భరతుండు తల్లిపె
న్గాలనఁ జేసి వారల మ•నంబున నైన స్మరింపఁబోఁడు, తం
డ్రీః లలి నీవయైన నిట•నిల్వుము వారలకుండు మాన్పఁగన్. ౭౨౩

### తాత్పర్యము

భరతుఁడు లేఁడా కైక లేదా వారామాత్రము విచారింపరా యనుదువేమో. కైక రాజ్యమంతయుఁ దన స్వాధీనమగుటచే మన కొకరివలనఁ గావల

సినదేమియని గర్వించి తన సవతులకు, నందు దుఃఖించుచుండువారికి, మేలు చేయదు. వారి కొడుకు లరణ్యమునకుఁబోయిన కారణముచే వా రేడ్చుచున్నా రని యామె తలఁపదు. తన కొడుకు రాజైనాఁడని యేడ్చుచున్నారని వారి మీఁదనింద మోపి యనాదరించును. ఇఁక భరతుఁ డందమాయునిన వాఁడు తల్లి లాలనలకు లోపడి కౌసల్యా సుమిత్రులను మనసునందైనఁ దలఁపఁడు. కావున నాయనా! నీవైన నిటనుండి వారల వ్యసనము మాన్పుచుండుము.

భరతునిపై లక్ష్మణునకుఁ గోపముగలదని శ్రీరాముఁ డెఱుఁగును. దాని ననుసరించి యాయనను బరీక్షింపఁజెప్పిన మాటయేగాని భరతుఁ డట్టివాఁడని నమ్మి చెప్పిన మాటగాదు.

కం॥ సౌమిత్రీ! స్వయముగనో, భూమిధవానుగ్రహంబు•బొఁదిమినో యిటన్
నామాతను భరియింపుము, నామాటనుబట్టి నిలుము•నయమతివగుచున్.

స్వయముగనో=రాజసహాయములేకయైనను, భూమిధవా నుగ్రహంబు బొఁదిమినో=రాజానుగ్రహము సంపాదించియైనను, సౌమిత్రీ=నీవె, సుమిత్ర కొడుకవుసుమా అది మఱువకుము. ఆమెయెంత సాత్త్వికురాలో యాలోచించి యట్టి సత్త్వగుణము కలవాఁడవేకమ్ము.

తాత్పర్యము

సుమిత్రానందనా! నీ వితరుల సహాయము గోరకయైనను సరియ. లేదా రాజానుగ్రహము సంపాదించుకొని యతఁడిచ్చు ధనాదులచేనైన సరియ నీవి చ్చటనేయుండి నాతల్లిని భరింపుము. నామాటయందు గౌరవముంచి నీతి శాలివై యన్నమాట మీఱరాదు గదాయని నిలువుము.

ఉ॥ న్నాదువియోగపాటున వ•నారిలుతల్లికి నీవు నిల్చిన
న్మోదము గల్గు, నాయెడ న•త్తమ మౌభవదీయభక్తి నిం
పొదిగఁ దోఁచెడిన్, గురుల•భక్తిభజించిన ధర్మ మూర్జితం
బౌ దురితంబు వాయు నన•ఘా!యటు సేయుము సమ్మతం బగున్.౮౦

వియోగపాటునన్=విడిచియుండుటచే. వనారిలు=శోకించు, మోదము= సంతోషము, అనుత్తమము=మిక్కిలి యుత్తమము, దేనికంటె నుత్తమైనది లేదోయది యనుత్తమము, ఇట్టిదే యఘోరము, నింపొదిగన్=బాగుగ, ఊర్జి తము=అభివృద్ధి, దురితంబు=పాపము.

తాత్పర్యము

నేను విడిచిపోవుటచే శోకించు నాతల్లి నీవు నిల్చితివేని నిన్నుఁజూచి నే నున్నట్లే భావించి సంతోషించును. అంతియగాదు. నాయందు నీకుఁగలయుత్త మోత్తమ భక్తియు సమృద్ధమై కానవచ్చెడిని నాకు సేవసేయుటకంటె నాకుఁబ్రియ మైనవారి సేవచేసిన నాకెక్కువ సంతోషముగదా. పెద్దవారిని భక్తితో సేవిం

చుటచేఁ బుణ్యము వృద్ధియగును. పాపము నశించును. దోషరహితుఁడా: నీ విటుసేయుట నాకు సమ్మతమైన కార్యము.

కం॥ నామాట వినఁగదయ్యా, సౌమిత్రీ: రఘుకులాబ్ధి•చంద్రమ నాకై,
యేమాడ్కి సుఖింతురు చెపు,మా మనమిరువురును లేమి•మనతల్లు లిటన్?

శ్రీరాముఁడు నయవాక్కులచే నిచ్చకములచే సౌమిత్రుని వశపఱుచుకొనఁ జూచుచున్నాఁడు.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! రఘువంశ మను పాలసముద్రమునకు నీవు పూర్ణచంద్రునివంటి వాఁడవు. నా నిమిత్తము నా మాట వినవయ్యా: నీవు నేనిరువురము లేనియెడల మన తల్లులీ శత్రుమధ్యంబుననుండి విచారించువారు లేక యెట్లు సుఖింతురు?

చం॥ అని రఘురాముఁ డిట్లు సన•యంబుగఁ జెప్పినతీవ్రవాక్యముల్
విని విని లక్ష్మణుం డను వి•వేకధనా: భరతుండు నీదుత
ల్లిని మఱి మత్పవిత్రి నమ•లీమసచిత్తమున న్భరించు, నీ
యనుపమ తేజము౦ దెలియఁ•డా? యటు లేటికిఁ జేయు నెన్నఁడేన్.

సనయంబుగఁ జెప్పిన తీవ్రవాక్యముల్=చక్కెరపూసిన విషపుటుండవలె పైకి సామముగాఁ గనిపించినను లోపల మర్మములు గోయుమాటలు, వివేకధనా=తప్పొప్పులుఁ దెలిసికొను జ్ఞానమే ధనముగాఁగలవాఁడా, మత్పవిత్రిన్=నాతల్లిని, అమలీమసచిత్తమునన్=మాలిన్యములేని మనస్సుతో-

తాత్పర్యము

అని శ్రీరాముఁడు మంచిగానే చెప్పిన కఠోరవాక్యములు వినివిని లక్ష్మణుఁడిట్లనియె వివేకసంపన్నా: భరతుండు నీ తల్లిని నిర్మలమనస్సుతోనే భరించును. స్త్రీలను నందుఁ దల్లులను నేల బాధించును? ఒకవేళ భక్తితోఁ బోషింపకున్నను వారి ననాదరణముచేసిన నీవు కోపింతువని నీ యసమానమైన తేజస్సు తెలియనివాఁడా? వారి విషయము నతఁ డెప్పటికి నట్లు చేయఁడు. భక్తి లేకున్న నీ భయముచేనైన వారి నాదరించును.

మ॥ ననుబోంట్లా భరియించువారు జనని•గ్గౌసల్య నార్యామణిన్
ననుబోంట్లన్ భరియించు వేల్కొలఁది నా•నాదానపూజాదులన్
దనసేవం జరియించువారి కతులౌ•దార్యంబునం గూర్మి ని
చ్చెను గ్రామంబులు వేయి, యేమిపని వ•చ్చెన్ వారితో వీంతోస్. ౭౭౩

ననుబోంట్లా=నావంటివారా: ఆర్యామణిన్=ఆర్యస్త్రీలయందు మణివంటి దానిని, అతులౌదార్యంబునన్=అసమానమైనదాన గుణముచే.

అన్నా నన్నుఁ బిలుచుకొనిపోరాదని తలఁచి యేవియో నెపములుచెప్పుచున్నావో, నన్నుఁ బరీక్షించుటకే యిట్లు చెప్పుచున్నావో, నే నెఱుఁగను. అటుగాకున్న నార్యస్త్రీరత్నమైన కౌసల్యాదేవిని నావంటివారా భరింపవలసినవారు. ఆమెయే నావంటివారిని వేలకొలఁదులను బహువిధములైన దానములచే గౌరవములచే భరింపఁగలది. ఎట్లనఁ దన సేవయందుండువారికే తన దానగుణము ప్రకాశింప వేయిగ్రామములిచ్చెను. వాస్తవమిట్లుండ నామె పోషణమునకై వారితో వీరితో నేమి పని వచ్చెను. ఆమెను నేను భరింపవలసిన పనిలేదు. (కౌసల్యా వివాహకాలమున దక్షిణకోసలయంతయు సరణముగ నామె పుట్టినింటివా రిచ్చిరి.)

తే॥ తనను గౌసల్య భరియించు•కొనెడిరీతి
నసఘః నా తల్లియు భరించు•కొనఁగఁ గలదు
గ్రామములు పెక్కులున్నవి•బ్రదుకుకొఱకుఁ
గాన నసుబోంట్ల రక్షింపఁ•గలదు దేవ. ౧౧౪

తాత్పర్యము

కౌసల్య తన్ను భరించుకొను విధముననే సుమిత్రయుఁ దన్ను భరించుకొనఁ గలదు. ఆమె జీవనార్థ మనేక గ్రామములున్నవి. కావున నామె నావంటివారిని రక్షింపఁగలదు. కావున వారిరువురు వానోగ్రాసముల కితరులపై నాధారపడియుండవలసిన పనిలేదు.

కం॥ అనుచరునిఁగాఁగ నన్నేలొ్కనుమీ వైధర్మ్యమిందుఁ•గొఱలదు నేనున్
మనఁ గలుగుఁ గృతార్థుఁడనై, విను నీకుఁ బ్రయోజనంబు•వెలసెడిదీనన్. ౧౧౫

అనుచరునిఁగాఁగన్=బంటుగా-వైధర్మము-ధర్మవిరుద్ధము-కృతార్థుఁడనై=జన్మసాఫల్యముగలవాఁడనై-మనఁగలుగున్=జీవింపవలను పడును.

తాత్పర్యము

అన్నా! నీవు నన్ను బంటుగా నేలుకొనుమీ. ఇందు ధర్మహానిలేదు. అన్నను దమ్ముఁడు బంటువలెఁ బరిచరించుట ధర్మవిరుద్ధమగు కార్యముగాదు. అన్న తండ్రితో సమానుఁడుగదా. అట్లు గ్రహించితివేని నేను నీ సేవచే జన్మసాఫల్యము గలిగించుకొందును. దీనివలన నీకును ప్రయోజనము కలదు. అడవులయందు నీకుఁ గావలసిన కందమూలాదులు లభింపఁజేయుదును.

నన్నున్=అందు నిందు నీ దాస్యమే నా స్వరూపముగా సత్యముగానుండు నన్ను, ఇంతకాలము నిన్నొకగడియయైన విడిచియుండని నన్ను, నీ కైంకర్యమే పరమపురుషార్థముగా నెంచియుండు నన్ను, అనుచరునిఁగాఁగన్ = నీతో

సమానుని గాఁగాదు, అడవిలో నిన్ను రక్షించుటకై వచ్చెదనని చెప్పలేదు. నేను సేవచేయుటకై నన్నుఁ బిలుచుకొనిపొమ్మని ప్రార్థించుచున్నాను.

ఏలుకొనుము=పాలించుకొనుము. ఏలుమనక యేలుకొనుమని యాత్మనే పదరూపము ప్రయోగించుటచే ఫలము కర్తనుబొందును గావున నన్నేలిన ఫలము నీదిగాని నాదిగాదు. దీనివలన లక్ష్మణుఁడు ఫలసమర్పణము గావించినవాఁడయ్యెను.

వైధర్మ్యము=స్వభావముగా నీవు నా స్వామిని. నేను నీసొత్తును. నీసొత్తును నీ వుపయోగించుకొనుటలో ధర్మహాని యేమున్నది? నీ సొత్తును నీవు కాపాడుకొనకుండుట. ధర్మహాని కాని కాపాడుకొనుట ధర్మహాని కాదుగదా.

కృతార్థుఁడనై మనఁగలుగును=నా సొత్తును నేనుపయోగించిన నీకురాఁగల లాభమేమి యందువా? ఒకస్వామి (సొత్తుకలవాఁడు) తనసొత్తును నానా విధముల వినియోగింపవచ్చును అటుగాక తాను స్వయముగాఁ దనకై యుపయోగించుకొనుటచే వాని విశేషానుగ్రహమునకుఁ బాల్పడిన యావస్తువుజన్మము సార్థకము. అటులే నీసొత్తైన నన్ను నీవు వేయివిధముల నుపయోగింపవచ్చును గాని నీకే యుపయోగపడుటవలన నా జన్మము సార్థకమగును.

మనఁ గలుగుదును అని చెప్పక మనఁగలుగును అని ప్రథమపురుషమునఁ జెప్పుట శరణాగతికంగమైన వినయము (కార్పణ్యము) సూచించుచున్నది.

నిన్నేలుకొనుటవలన నాకేమి లాభమందువా? నీకు వ్రతహానిలేకుండుటయు, నాశ్రితరక్షాదీక్ష సార్థకపడుటయు నీకు లాభములు. నీవు చేయవలసినది నీవు చేయకుండుట ధర్మహాని గదా.

ఆ॥ గంపగడ్డపాఱ•గైకొని యొకకేల, విల్లుబాణములును•వెలయ నొకట
నీకు ముందుపోయి•నెఱిగాఁగ మార్గంబుఁ,
జూపువాఁడ శ్రమనుఁ•బాపువాఁడ. ౮౮౬

తాత్పర్యము

నీవు నాతోడవచ్చి చేయఁగలకార్య మేమియందువా? ఒకచేత గంపగడ్డపాఱ, మఱియొకచేత విల్లుబాణములు గ్రహించి నీకు ముందుగానడచి మార్గము చక్కఁజేసి నీ కీ కష్టము లేకుండఁ జేసెదను. నేను లేనియెడల నివన్నియు నీవే కదా చేసి శ్రమింపవలయును. నీవలసినపుడు విసరుదును,పాదసేవచేయుదును

ఉ॥ పండులు గడ్డలున్ వననివానులు గ్రాసముగాఁగ మెక్కు వే
డొందు నెదైనఁ దెచ్చెదను•సుర్విజ నీవును గూడియాడుచున్
గొండలపేటల న్నిదురఁ•గూరియ యున్నను మేలుకొన్న కో
దండధరుండ నై మెలఁపుఁ•దాలిచి సర్వము నేన తీర్చెదన్. ౮౮౭

గ్రాసము=ఆహారము, మెక్కు=తిను.

తాత్పర్యము

ఇంతియేకాదు, పండ్లు, దుంపలు, ఇవిగాక యరణ్యమందుండువా రాహార ముగా భుజించు మఱివేనినైనఁ దెచ్చియిచ్చెదను. సీతయు నీవునుగూడి వినోద ముగా వర్తించుచుఁ గొండలశిఖరములయందు మీరు నిదురించుచున్నను మేలుకొన్నను నేను చేతవింటిని ధరించినవాఁడనై హెచ్చరికతో మీ సర్వకార్య ములు నేనే తీర్చెదను.

ఈ కారణముచేతనే పట్టాభిషేకసమయంబున తక్కినవా రొక్కొక్కటి ధరించిన లక్ష్మణుఁడు రెండుచేతుల రెండు, ఛత్రము చామరము, ధరించినట్లు ౪౩౪వ పద్యము ప్రథమపాదంబున యుద్ధకాండమున ౭౯౪౪ వ పద్యంబు నందును జెప్పఁబడియె.

సీతతోడనుండు నీకు సర్వవిధ కైంకర్యములు సర్వకాలములఁ జేసెద ననుటచే దేవీసహితుఁడైన దేవునే యర్చింపవలయునుగాని బాలకృష్ణునిఁదప్ప నేకమూర్తినిమాత్ర మర్చింపరాదని యేర్పడుచున్నది.

మీరు నిదురించియున్నను మేలుకొనియున్నను నేను గాచియుండెద ననుటచే లక్ష్మణుఁ డీ పదునాలుగు సంవత్సరములు నిదురయే పోలేదని కొందఱందురుగాని ౧౪౬౭ల పద్యమునఁ బ్రథమపాదమున లక్ష్మణుఁడు నిదు రించినట్లు శ్రీరాముఁడు మేలుకొలిపినట్లు చెప్పఁబడెను.

—• లక్ష్మణుఁ డరణ్యమునకు వచ్చుటకు శ్రీరాముఁడు సమ్మతించుట. •—

చం॥ అన విని ప్రీతచిత్తుఁ డయి • యన్న వచించెను లక్ష్మణా! వెసన్
జని భవదీయమిత్రులకు • సర్వముఁ దెల్పుము. మామ యజ్ఞమున్
జలిపెడుచోఁ బ్రచేతసుఁ డొ • సంగె స్వయంబుగ భీమదర్శనం
బులఁ బెనువిండ్ల రెంటి రవిఁ • బోలుచు హేమపరిష్కృతంబు లై. ౧౧౧౧

వెసన్=శీఘ్రముగా, భవదీయమిత్రులకున్=నీ స్నేహితులకు, మామ= మన మామ జనకుఁడు, భీమదర్శనంబులన్=చూచుటకు భయంకరములైనవి, హేమపరిష్కృతంబులై=బంగారుచే నలంకరింపఁబడినవై.

తాత్పర్యము

'నీవాఁడను' అని యాశ్రయించిన వారినిఁ బరిగ్రహింతును అనువ్రతము గల శ్రీరాముఁడు పరమార్థయుక్తములై శరణాగతి ధర్మయుక్తములైన లక్ష్మణుమాటల విని శరణు విని శరణు అనఁగానే అభయమ్మనవలసిన తా నింత సేపు బాగుసేయుటయే తప్పయియుండ నింకను బరీక్షించుట దోషమని యద్ధ ములు చెప్పక సంతోషించిన మనస్సుగలవాఁడై యిట్లు చెప్పెను. లక్ష్మణా! త్వరతోఁజని నీ మిత్రులకందఱకు సర్వ వృత్తాంతము మనము ముగ్గుర

యజ్ఞముచేయు సమయంబున వరుణుఁడు బంగారుచే నలంకరింపఁబడి సూర్యునివలెఁ బ్రకాశించుచుఁ జూచుటకే భయంకరమగు రెండువిండ్ల నిచ్చెను.

కం॥ వెలిఁగెడి రెండుకటారుల, ములుకులు నెపుడేని వెలితి•పోవనిపొదులన్
జెలు వగునభేద్యకవచం,బులదోయిని వాని దినముఁ•బూజింపంగన్. ౮౮౯

కం॥ మనగురువులసదనంబున, నునిచితి నవి యెల్ల మనకు•నుపయోగపడున్
వనసీమలఁ గావునఁ జని, కొనిరమ్ము యిటకు నీవు•గొబ్బున ననుడున్.

తాత్పర్యము ౮౯౦

ప్రకాశించు రెండు కటారులు అక్షయబాణతూణీరములు భేదింపరాని కవచములు రెండును వరుణుఁ డిచ్చెను. వానిని ప్రతిదినము పూజించుటకై గురువుల యింట నుంచితిని. అవి మనకు నడవులందు (రాక్షసవధార్థమై, వేఁటకగు నేని యిట్టివేల) నుపయోగపడును, కావున నీవుపోయి శీఘ్రముగ నిచ్చటికి తెమ్ము.

ఈయాయుధములను వరుణుఁడు శ్రీరామలక్ష్మణుల కిచ్చినట్లు బాలకాండమునఁ జెప్పకున్నను నిచటఁ జెప్పుటచేత నచ్చటను నీ కథ ననుసంధించునది. ఇది వాల్మీకి శైలి లక్షణము. ఒకసందర్భమున జరిగినవన్నియు నొక చోటనే చెప్పఁడు. సందర్భోచితముగాఁ గొంత యొకచోటఁ గొంత మఱియొక చోటఁ జెప్పును. వరుణుఁడు లక్ష్మణునకు శ్రీరామునకు ధనురాదికముల నిచ్చెనని బాలకాండమునఁ జెప్పినను జెప్పకున్నను నిచ్చటఁ జెప్పకతప్పదు. ఇచ్చటఁ జెప్పకుండినయెడల నవి వెంటఁదీసికొని పోవనట్లేర్పడును. అచ్చటఁ నిచ్చట జెప్పుట వ్యర్థము.

అట్టులే కాకాసురవృత్తాంతము చిత్రకూటమున జరిగెను. దాని నయోధ్యా చెప్పెను. ఇట్టివి కాండమునందుఁ జెప్పియుండవలెను. అచ్చటఁ జెప్పక సుందర కాండమందు సీతచేఁ జెప్పించెను. అది తనకు శ్రీరామునకు మాత్రము తెలిసిన రహస్య విషయమని యామె చెప్పెను. కావున దాని నిచ్చట బహిరంగపఱుపక రహస్యముగానేయుంచి యౌచిత్య మనుసరించి తగినచోటఁ జెప్పెను.

అట్టులే మణిబంధ విషయము దుందుభి విషయము రెండు మూఁడుసారులు చెప్పెను. ఇట్టివి మఱియుఁ గొన్నిగలవు ఇందెల్ల మొదటఁ జెప్పకపోవుట మఱపుచేతఁగాదు. ఏది యెక్కడ నెంతచెప్పవలయునో యక్కడ దాని నంతే చెప్పుట యాయన శైలిలక్షణము.

ఉ॥ అర్కసమతేజుఁడుం జని హి•తాళుల కెల్ల నెఱుంగఁ జెప్పి యా
చార్యునివీటి కేగి యల•సాధనరాజములన్ గ్రహించి వే
యార్యవిభుండు రామునకు•నన్నియుఁ జూపిన సంతసించుచున్
గార్యముతీ రెఱింగి యిటు•గ్రక్కున వచ్చితి వెంచినంతలోన్. ౮౯౧

అర్కసమతేజుఁడు=సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవాఁడు, ఇంతవఱకుఁ దన కైంకర్యమును శ్రీరాము డంగీకరించునో యంగీకరింపఁడో యనుచింతచే

వాడువాజినముఖముతోఁ దేజోహీనుఁడై యుండినవాఁడు. శ్రీరాముఁడు తన్నను గ్రహించెఁ గదా యను సంతోషముతోఁ దేజోవంతుఁడయ్యెను.

### తాత్పర్యము

సూర్యతేజుఁడైన లక్ష్మణుఁడు తన హితులకెల్లఁ దమ వనవాసయాత్రా విధముఁ దెలియఁజెప్పి శ్రీరాముఁడు చెప్పిన యాయుధములను దీసికొనివచ్చి శ్రీరామునకుఁ జూపఁగా శ్రీరాముఁడు సంతోషించుచు లక్ష్మణా మేలు! కార్యవిధ మెఱింగినవాఁడవై జాగుసేయక యింకను లక్ష్మణుఁడు రాలేదేయని తలఁచితినో లేదో శీఘ్రముగ వచ్చితివి.

మ॥ అనుచున్ మేలు వచించి నాకుఁ గలయ•ర్థాళిన్నినుం గూడి చ
యుక్యన బ్రాహ్మణ్యతపస్వికోటులను గు•ర్వారాధ కాత్మోపజీ
వినికాయంబులను న్విశేషముగ నీ•వింద్రృష్టు లం జేయుదున్
జని వాసిష్ఠు సుయజ్ఞుఁ దక్కఁగలశి•ష్ట వ్రాతముం బిల్వుమీ. ౭౯-౨

అర్థాళిన్=ధనములను, బ్రాహ్మణ్య తపస్వికోటులన్=బ్రాహ్మణులగుతప స్వుల సమూహమును, గుర్వారాధకాత్మోప జీవులనున్=గురువుల నారాధించు వారిని, మన సేవకులను, విశేషముగన్ = ఎప్పుడిచ్చుదానికంటె నెక్కువగ, ఈవిన్=దానముచే, వాసిష్ఠున్=వసిష్ఠకుమారుని సుయజ్ఞుఁడనువానిని, "బ్రాహ్మ ణ్యబాడవ్యేతు ద్విజన్మనామ్" అమరకోశము.

### తాత్పర్యము

అని మెచ్చుకొని నాకుఁగల ధనము నితరపదార్థములను నీతోడ బ్రాహ్మణు లగు తపస్వులకు గురువుల నారాధించువారికి మన సేవకులకు నెప్పుడు నిచ్చు దానికంటె హెచ్చుగనిచ్చి సంతోషపెట్టుదును. కావున వసిష్ఠుని కుమారుఁడైన సుయజ్ఞుని దక్కిన పెద్దలను బిలువుము.

### —• ౩౨వ సర్గము. శ్రీరాముఁడు తనపదార్థముల దానము చేయుట. •—

సీ॥ అని పల్క శుభము ప్రి•యం బగునుడిని సు,
యజ్ఞునింటికి నేగి•యగ్నిగృహము
నందు నాతనిఁగాంచి•వందనంబు లొనర్చి,
కడిఁదికార్యము సల్పఁ•గడఁగియున్న
రామునియింటికి•రారమ్ము మిత్రమా,
యన సంధ్యవార్చి యా•యనఘుతోడ
శ్రీరమ్యసుందర•శ్రీరామమందిరం, బును జొచ్చె,వచ్చెడి•పుణ్యమూర్తి
తే॥ వేదవిదునకు రాముండు వేదిజాత,తోడ నగ్నికిఁబోలె నె•దురుగఁబోయి
యంజలి ఘటించి మ్రొక్కి యా•యనఘునకి,
నిచ్చెఁదనవస్తువులను బెం•పచ్చుపడఁగ ౭౯-౩

కడిఁదికార్యము=ఇతరుల కసాధ్యమగు కార్యము, సంధ్యవార్చి = ఇది మాధ్యాహ్నికసంధ్య కావున నిప్పటికిఁ బదునాలుగు గంటలకాలమయినది, వేది

జాత=సీత, దీనివలన మాధ్యాహ్నిక సంధ్యయు నిత్యముగా గ్రహింపవలసి యున్నది.

తాత్పర్యము

ఈ ప్రకారము తనకుఁ శుభముఁ బ్రియమునగు మాటచెప్పిన వినివెంటనే సుయజ్ఞు నింటికిఁబోయి యగ్నిగృహమం దాయనయుండ నచటికిఁబోయి నమస్కారము లాచరించి మిత్రమా యసాధ్యకార్యము చేయఁబూనిన శ్రీరాముని యింటికి రమ్మని పిలిచిన నాయనయు మాధ్యాహ్నిక సంధ్య వార్చి కాంతిచేత రమ్యమై యందమైన శ్రీరాముల గృహమును బ్రవేశింపఁగా వచ్చుచున్న పుణ్యాత్ముఁడును వేదవేత్తయునగు నా సుయజ్ఞునకు వహ్నికిఁబోలె సీత తోడ శ్రీరాముఁ డెదురుగాఁజని మ్రొక్కి యా నిష్కల్మషమైన మనస్సుగల యాయనకుఁ దన వస్తువులన్నియు నిచ్చెను.

ఉ॥ బంగరుటంగదంబులును•భ్రాజితకుండల హేమసూత్రముల్
రంగగు చేకడెంబులును•రత్నకిరీటములున్ విభూషలున్
బంగరుటుంగరంబులును•బంధురరత్నచయంబు లెల్లని
చ్చెం, గమలాక్షిప్రేరణము•చే నిటు వెండియుఁ బల్కె నాతనిన్. ౮౬౪

ఇచ్చిన వస్తువులనెల్లఁ జెప్పుచున్నాఁడు.

బంగరు టంగదంబులున్=బంగారు భుజకీర్తులు, కర్మధారయంబులం దత్తున కచ్చుపరంబగునపుడు టుగాగమంబు బహుళంబు సు-వ్యా-సంధి ౫౨ వ సూ. భ్రాజిత=ప్రకాశించు, కుండల హేమ సూత్రములును = కుండలములు బంగారు మొలత్రాడులును, చేకడెంబులును=చేతధరించు కడియములు-రత్న కిరీటములు=రత్నములు చెక్కిన కిరీటములు, భూషలున్=ఇతరాలంకారములు, బంధుర రత్నచయములు=మనోహరమైన రత్నసమూహములు.

తాత్పర్యము

బంగారు భుజకీర్తులును, తళతళమను కుండలములు బంగారు మొలత్రాడులును, చేతికడియములును,రత్నకిరీటములును ఇతరములైన యలంకారములును, బంగారు చేతియుంగరములు మనోహరములయిన రత్నసమూహములు నివన్నియు నిచ్చెను. మఱియు సీతాదేవి ప్రేరింపఁగా నిటు లనెను.

కం॥ హారము సారసనపరి,ష్కారంబును హేమసూత్ర•సత్తమమును గే
యూరంబుల నంగదముల, దారార్థము నీకొసంగు•ధరణిజ కొనుమీ.

హారము=ముత్యాలసరము, సారసనపరిష్కారము=స్త్రీలు నడుమున ధరియించు ముప్పేట మొలనూలు, హేమసూత్రసత్తమము=మేలైస్త్రీలు మెడలో ధరించు తీఁగెవంటి సొమ్ము,కేయూరములన్=రెట్టకడియములను, దారార్థము= నీ భార్యకొఱకు, ధరణిజ=సీత.

తాత్పర్యము

అయ్యా! నీ భార్య ధరించుటకై ముత్యాలసరము ముప్పేట మొలనూలు, బంగారుతీఁగ, రెట్టకడియములు భుజకీర్తులు సీత యిచ్చుచున్నది. తీసికొనుము

కం॥ తల్పంబును మణిరచితా, కల్పంబు నొసంగు జనక•కన్యక గొను నీ
తల్పముకై వనగమనా, నల్పవినిశ్చయముఁ జేసి•నారము విబుధా!

తల్పంబును=పానుపును, మణిరచితా కల్పంబును=మణులచే రచియింపఁబడిన యాభరణములు గలది, కొనుము=నీయొద్ద నుంచుకొనుము, ఈమంచము భద్రపఱచియుంచుటకై యియ్యఁబడెను గాని నమము యని దానముగానీయఁబడలేదు, వనగమనానల్ప వినిశ్చయము=వనగమనమందు దృఢనిశ్చయము- విబుధా=పండితుఁడా, తల్పము=భార్య. ౪౬౪ ప. వ్యాఖ్య చూడుఁడు.

తాత్పర్యము

మణులుచెక్కిన యాభరణములచే నలంకరింపఁబడిన పానుపును నీయొద్ద నుంచుకొనుము. వనవాసమునకై ప్రయాణముచేయ దృఢనిశ్చయము చేసినారము.

తే॥ మేనమామయొసంగిన•మేటిగజముఁ,
గొనుముశత్రుంజయాఖ్యంబుఁ•గూడనిడుదు
వేయిగజము లటంచు వే•ర్వేఱ నీయ,
నన్నిగైకొనిరామువా•క్యంబుఁ బట్టి. ౮౯౩

శత్రుంజయాఖ్యంబు=శత్రుంజయమను పేరుగలది. ఇది శ్రీరామునకై మేనమామ యిచ్చినది, ఈ పేరుగలది దశరథునకు నొకటిగలదు. ఇది యది కాదు. దీనితోడ నింక వేయి యేనుఁగులిచ్చెదను, తీసికొనుమని వేఱువేఱుగా నీయన్=ప్రత్యేకప్రత్యేకముగా నీయఁగా- సంయుక్తమున నలఘురేఫము లఘువగును. కావున వేర్వేఱయయ్యెను. తాత్పర్యము

నాకు మా మేనమామ యిచ్చినది శత్రుంజయమను పేరుగల యేనుఁగు గలదు, దానిని వేయి యేనుఁగులతోడ నిచ్చెదను. గ్రహింపుము అని వేఱు వేఱుగా నీయఁగా శ్రీరాముని మాటప్రకారమే వానిని గైకొని

సీ॥ ప్రీతి సుయజ్ఞుండు•విధ్యుక్తరీతిని, రామలక్ష్మణుల ధ•రాతనూజ
దీవించి యరుగ ని•జావరజుం గని, యాయగస్త్యుని గా•ధేయసుతుని
నర్చించి పైదున•కంబువుల్ గూర్చిన, గతి నిమ్ము వారికి•గవులు వేలు
వెండియుఁ బైఁడియు•వివిధరత్నములుఁ,గౌసల్యభక్తిమైఁ•గాంక్షతోడ
తే॥నాశ్రయించినతైత్తిరీ•యగురువునకుఁదన్వికొనుదాఁకయానముల్•దానిపించు
పట్టుఁబుట్టంబుల నొసంగు,•పశుకములను!
నాలవేయింటిరత్నధ•నాంబరముల. ౮౯౪

విధ్యుక్తరీతిని=శాస్త్రములోఁ జెప్పిన ప్రకారము, నిజావరజున్=తన తమ్ముని, అంబువుల్=నీళ్లు, గవులు=గోవులు, పశుకములను=అల్పపశువులను-

ఇచట కప్రత్యయము మత్వర్థకము. పైరునకు నీళ్ళుగూర్చినట్లులను నుపమానము సత్పాత్ర దానమును సూచించుచున్నది. అపాత్రదానము బీటికినీళ్ళు కట్టినట్లు వ్యర్థము.

తా త్ప ర్య ము

సంతోషముతో సుయజ్ఞుఁడు శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము సీతా రామలక్ష్మణులను దీవించిపోఁగా శ్రీరాముఁడు తన తమ్మునితో నిట్లనియె. అగస్త్యకుమారుని విశ్వామిత్రకుమారుని బూజించి పైరునకు నీళ్ళుగూర్చి నట్లు వారికి వేయి యావులను వెండిబంగారు అనేక విధములైన రత్నములనిమ్ము. కౌసల్యాదేవి నాశ్రయించియుండు నట్టియు తిత్తిరీశాఖాధ్యయనము చేయు వారికి నధ్యాపకుఁడైనట్టి వానికిఁ దనివి దీర వాహనములు, దాసుల సమూహములు పట్టువస్త్రములు మేఁకలు మొదలగు సన్నజంతువులను వేయి యావులను రత్నములు ధనములు వస్త్రములు నిమ్ము.

తే॥ పెద్దకాలంబుగాఁగ నా•వీట నున్న, సూతునకుఁ జిత్రరథునకుఁ బ్రీతి•నిమ్ము
ధనములును వస్త్రతతులుర•త్నములుఁ,
జాలుఁ, జాలుననియెడునందాఁక•సంతసింప ౮౯౯

తా త్ప ర్య ము

చాలఁగాలముగ నాయింటనుండు చిత్రరథుఁడను సూతునకు ధనములు వస్త్రములు రత్నములు నాకుఁ జాలుఁ జాలునని యతఁ డనుదాఁక నిమ్ము.

తే॥ వటుకతులు మఠికాలాప•వర్గములును, నధ్యయనశీలు రగుట ని•రంతరంబు
నన్యమేదియుఁ జేయక•యలసు లగుచు,
వాచవిగఁ దినఁ గోరెడు•వారు మఠియు ౯౦౦

వటుకతులు=బ్రహ్మచారులు, కఠుఁడు చెప్పినవేద శాఖ నధ్యయనము చేయువారు, కాలావచరములు=కలాపిచెప్పిన వేదశాఖ నధ్యయనముచేయు బ్రహ్మచారుల గుంపు, అధ్యయనశీలురు=అధ్యయనము చేయుటయే ప్రధాన కార్యముగాఁగలవారు, అగుటన్=అయిన కారణమున, అలసులు=సోమరులు, వాచవిగన్=నోటికి రుచిగ, ఆశ్రమంబులందుండు శిష్యులు అధ్యయనము చేయనికాలమందు నడవులకుఁబోయి గురువునకుఁ దమకుఁ గావలసిన సమిధలు, దర్భ, కందమూల ఫలాదులు తెచ్చుచుందురు. వీరు రాజధానియందుండు వారగుటచే నట్టికార్యము లేవియులేవు కావునఁ జదువు తిండి తప్ప వేఱేమియుఁ నెఱుఁగరు కావున సోమరులనఁబడిరి.

మితాహారనియమము బ్రహ్మచారులకు లేదు.

శ్లో॥ అష్టౌగ్రాసా మునేర్భక్ష్యాః, షోడశారణ్య వాసినః
ద్వాత్రింశతం గృహస్థస్త-హ్యమితం బ్రహ్మచారిణః

ఎనిమిది కబళములు సన్న్యాసియుఁ బదునాఱు వానప్రస్థుఁడును, ముప్పది రెండు గృహస్థుఁడును, అమితముగా బ్రహ్మచారులును భుజింపవలెను. కబళ మనఁగా ఒకసారి నోటినిండఁ బట్టునంతటి పిడికిటి ముద్ద.

శ్లో॥ ఆహితాగ్నిరనడ్వాంశ్చ, బ్రహ్మచారీ చతేత్రయః
అశ్నంత ఏవ సిధ్యంతి, నైషాం సిద్ధి రనశ్నతామ్.

అహితాగ్నియు, ఎద్దులు, బ్రహ్మచారి, ఈముగ్గురు తినుటచేతనే యిష్ట సిద్ధిఁగాంతురు. వీ రుపవాసములవలన సిద్ధిఁగాంచరు అని వసిష్ఠుఁడు చెప్పెను.

తాత్పర్యము

బ్రహ్మచారులు కఠశాఖచదువువారు కలాపిశాఖచదువువారు వేదాధ్యయనము చేయువారగుటచే నే పనియుఁ జేయక సోమరులయి నోటికి రుచిగ తినఁగోరువారు.

తే॥ గొప్పవారలమెప్పులఁ॰గూరినార
లగుట నెనుబదిలొట్టిల॰నవ్వి మోయు
రత్నములతోడ నిమ్ము క్షీ॰రంబు పెరుఁగు
ఘృతము లభియింప వేయాల॰నిమ్ము మఱియు. ౯౦౧

తాత్పర్యము

గొప్పవారల మెప్పు పొందినవారగుటచే నెనుబదియొంటెలు నవిమోయు రత్నములు వారికిఁ బాలుపెరుఁగు నెయ్యిలభించునటులు వెయ్యియావుల నిమ్ము.

కం॥ ఇమ్ము కృషికర్మమగువృష,భమ్ముల నిరువాఱు మఱియు॰వ ర్లొకవెయిగో
త్రమ్ము లవి మోయునెద్దులఁ, దమ్ముఁడ వేవేగ యిచ్చి॰తరలింప వయా.

తాత్పర్యము

మీఁద జెప్పినవిగాక సేద్యమున కుపయోగించు రెండు నూర్లయెద్దులను వెయ్యిగోతముల వడ్లను నవిమోయు నెద్దులను త్వరగా నిచ్చి పీరనిబంపుము.

తే॥ వటులసంఘంబు కౌసల్య॰భవనమునను,
గలుగు నం దొక్కరొకరికిఁ॰గాంక్షదీర
వేయి వెయి యూలనీవయ్య॰వేఱు వేఱ,
దల్లి మెచ్చంగవలయు నా॰దానవిధిని. ౯౦౩

తాత్పర్యము ౯౦౨

కౌసల్యయింట బ్రహ్మచారులు పెక్కురు గలరు. వారిలో నొక్కొక్కరికి వారి కోర్కిదీర వేయియావులవంతున వేఱువేఱ నిమ్ము. నాదానవిధానమును దల్లి మెచ్చవలయును. కృతేయుగే బలిర్దాతా. త్రేతాయాం రఘునందన"యను నది స్మరింపనగు.

తే॥ తక్కినద్విజాతులకు నెల్లఁ•దగినరీతి,మక్కువ నొసంగుమీ నీవు•తక్కుధనము
టన్న సౌమిత్రి రాముని•యాజ్ఞ రీతి, ధనదునట్టులు సర్వంబు•దాన మిచ్చె.

తాత్పర్యము ౯౦౪

తక్కిన బ్రాహ్మణులకు నెల్లవారివారికిఁ దగినట్లు ప్రేమతో మిగిలినధనము నెల్లనిమ్ము. అని చెప్పఁగా శ్రీరాముని యాజ్ఞప్రకారము లక్ష్మణుఁడు కుబేరుని వలె సర్వము దానము చేసెను.

ఉ॥ కన్నుల నీరు జాలుకొనఁ•గాఁతియపాటున నిల్చియున్న యా
సన్ననిజానుజీవులకుఁ•జాలధనంబులు వేఱు వేఱ తా
మన్నన మున్నుగా నొసఁగి•మామక గేహముఁ దమ్ముని ల్లు ము
న్నున్నవిధంబుగా నరయు•చుండుఁడు మాయిటవచ్చునంతకున్. ౯౦౫

జాలుగొను=ప్రవహింపఁగ, ఆసన్ననిజాను జీవులకున్=సమీపించియున్న తన సేవకులకు, మామక గేహము=నాయిల్లు, తమ్ముని గేహము = లక్ష్మణుని యిల్లు, మున్నున్న విధంబుగా=ఇంతవఱకు నెట్లో యట్లే. అరయుచుండుఁడు= విచారించుచుండుఁడు.

తాత్పర్యము.

అందఱకన్నియు నియ్యఁ లక్ష్మణునకుఁ జెప్పి కన్నీరు వెల్లువగాఁ బాఱఁ దన సమీపంబున నిలఁబడియుండు తన సేవకులంజూచి వారికిఁ దానే సగౌరవముగాఁ జాలధనము వేఱువేఱుగా నందఱకిచ్చి మీకు జీవనహాని భయములేదు. మేము మరలి వచ్చువఱకు మాయిల్లు లక్ష్మణుని యిల్లు మీరిప్పటివలెనే కనిపెట్టి యుండుఁడు మీరు వీనిని విడిచి యెందును బోవలదు.

చం॥ అనుచును వారితో నని ధ•నాధిపతిం గని విత్త మెల్ల వే
కొని యిటు రమ్ము టన్నఁ జని•గొబ్బున వాఁడునుదేర నిచ్చె ని
ర్ధను లగుబాలవృద్ధులకుఁ•గ్రచ్చఱ సద్ద్విజవర్యకోటికిన్
జనసుతకీర్తిశాలి రఘు•చంద్రుఁడు లక్ష్మణసంయుతంబుగన్. ౯౦౬

తాత్పర్యము

అని వారికిఁ జెప్పి తన ధన కోశాధిపతినిఁ జూచి నాకుఁగల ధనమంతయు నిటకుఁదెమ్ము. అన వాఁడు శీఘ్రముగఁ దేఁగ దాని నెల్లబాలురకు వృద్ధులకు సద్బ్రాహ్మణుల సమూహమునకు లక్ష్మణుతోడ శ్రీరాముఁడిచ్చెను.

—• త్రిజటుఁ డను బ్రాహ్మణు వృత్తాంతము •—

ఉ॥ నాఁగటికఱ్ఱు గుద్దలియు•నాఁగలియుం గొని యుంఛవృత్తికిన్
బోఁగి దినంబునన్ వనము•లోనఁ జరించుచు, లేవడిం గడున్
దోఁగి, జరాభరంబునను•దూలుచు జవ్వని నాలి బిడ్డలన్
వేఁగునఁ బ్రోవుసేయు నొక•పింగళవర్ణుఁడు గార్గ్యుఁ డత్తఱిన్. ౯౦౭

వాఁగలి, దోఁటి, ఉంచవృత్తి=పొలములలో రాలిన గింజలనేఱికొని తిని జీవించువృత్తి, లేవడిన్=దారిద్ర్యముచే, తోఁగి=మునిఁగి, జరాభరంబునను=అతిశయించిన ముసలితనముచే, జవ్వని=యౌవనవంతురాలిని, ప్రేఁగుననన్=కష్టముతో, ప్రోపు=రక్షణము, పింగళవర్ణుఁడు=దారిద్ర్యముచే బూజు పాఱినమేనిరంగుగలవాఁడు, గార్గ్యుఁడు=గర్గుని వంశమునఁ బుట్టినవాఁడు, అత్తఱిన్=ఆసమయమందు.

తాత్పర్యము

నాఁగేటికొన ములికియుఁ, గడ్డపాఱయుఁ బండ్లు కోయుగోఁటియుఁ గొని యుంఛవృత్తికిలోపడి దిన దినము వనములో సంచరించుచు దారిద్ర్యమున మునిఁగి మిక్కిలి ముసలివాఁడై నడువలేక యుఁగుచు వయస్సుభార్యను బిడ్డలను నతికష్టముతో రక్షించు గర్గవంశమునఁ బుట్టినవాఁడు పేదఱికముచే బూజు పాఱిన దేహముగలవాఁడు త్రిజటుఁడను బ్రాహ్మణుఁడు ఆసమయంబున.

విష్ణుపురాణము ప్రకారము వివాహకాలమునఁ గన్యకకు నెనిమిది సంవత్సరములయినచో వరునకు నిరువదినాలుగు సంవత్సరము లుండవలయును. కావున స్త్రీకి మంచిప్రౌఢవయస్సు వచ్చునప్పటికి (౩౦) భర్తకు నలువదియాఱు సంవత్సరములగును. అయినను బ్రాహ్మణస్త్రీలు దవములచే వ్రతములచేఁ గాలము గడుపుచుందురు కావునను ఋతుకాలమందు మాత్రమే సంగమింతురు కావునను బ్రహ్మచర్యదీక్షగలవారు కావునను వారికి కామబాధవలనఁగలుగు దుష్టచేష్టలపై మనసుపోదు.

ఉ॥ దైవవశంబునం బురిని•దారఁగఁ గల్గుట భర్తఁ జూచి యా
పావని పాఱ గుద్దలిని•జాఱఁగ వైవుము రామచంద్రునిన్
నావచనంబు చేకొని క•నం బనుమీ మముఁ దెల్ప ధర్మస
ద్భావనుఁ డించు కేనియుఁ గృ•పన్ దయచేయఁడె యాలమేటికిన్. ౯౦౪

దైవవశంబునన్=దైవసంకల్పమున, (౭) వాని భాగ్యము కారణముగ, దారఁగన్=సంచరించునట్లు, పావని=పతివ్రతయైన యతనిభార్య, మముఁ దెల్పన్=మమ్ముగుఱించి చెప్పఁగా, ధర్మసద్భావనుఁడు = ధర్మముతోఁగూడిన మంచి యభిప్రాయముగలవాఁడు, ఆలము=ఆలస్యము-ఉపేక్ష.

తాత్పర్యము

ఆయన యదృష్టము కొలఁది దైవసంకల్పమున నా నగరమందు సంచరింపఁ గలుగునట్లు తటస్థింపఁగలుగుటచేఁ బతివ్రతయగు నాతనిభార్య మగనితో పాఱగుద్దలి పాఱవైచి నామాటవిని శ్రీరామచంద్రునిఁజూడఁబొమ్ము. భార్య బిడ్డలు గలవాఁడ దరిద్రుఁడనని దెలుపుము. ధర్మబుద్ధిగల శ్రీరాముఁ డేకొంచెమో దయచేయకుండునా పొమ్ము. ఆలస్యము చేయకుము.

కం॥ అని బోధించినఁ ద్రిజటుఁడు, తన పుట్టముచింపులెల్ల • దశరథసుతుఁడున్
గనకుండ దాఁపఁ జుట్టుచు, ననువుపడక చనియె రాము • నాలయమునకున్.

పుట్టము=వస్త్రము, దాఁపన్=మఱుఁగుపడునట్లు, అనువుపడక=సాధ్యము గాక.

### తాత్పర్యము

అని బోధింపఁగాఁ ద్రిజటుఁడు తాను గట్టిన వస్త్రమునందలి చింపులెల్ల శ్రీరామునకుఁ గానరాకుండునట్లు దాఁచిపెట్టఁగోరి యిటునటు త్రిప్పి దోఁపియేమి చేసియు దాఁచుటకు సాధ్యముగాక శ్రీరాము గృహమునకుఁ బోయెను.

కం॥ కొంచ కెద నంగిరో భృ, గ్వంచితతేజుఁ డగు త్రిజటుఁ • డరుగఁగ నతనిన్
బంచమకక్ష్యవఱకు వా, రించినవాఁ డెవఁడు లేఁడు • శ్రీరామాజ్ఞన్. ౯౧౦

ఎదన్=హృదయమందు, అంగిరో భృగ్వంచితతేజుఁడు = అంగిరువలె భృగువువలె గొప్ప బ్రాహ్మణ తేజస్సుగలవాఁడు, పంచమకక్ష్య=ఐదవకట్టు, వారించినవాఁడు=వలదని చెప్పినవాఁడు.

### తాత్పర్యము

మనస్సులో సంకోచింపక కూటికిఁ బేదయయ్యుఁ దపము బలమున నంగిరుతోను భృగువుతోను సమానమైన బ్రాహ్మణ తేజస్సుగల యా త్రిజటుఁడు శ్రీరాముని యింటిలోనికిఁబోఁగా ముందే పంచమకక్ష్యవఱకు నెవరినైనరానిండు అడ్డగింపవలదని శ్రీరాముఁ డాజ్ఞాపించియుండుటచే నాయనను నెవరు పోవల దను వారు లేరైరి.

కం॥ జనపతిసుతు డాయఁగఁ జని,
యునియెం ద్రిజటుండు రాఘ • వా!నిఱుపేదన్
గనికరమునం జూపుము నే, వని బ్రదికెద నుంఛవృత్తి • బహుపుత్రకుఁడన్.

### తాత్పర్యము ౯౧౧

శ్రీరాముని సమీపమునకుఁబోయి త్రిజటుఁ డిట్లనియెను. రామచంద్రా నిఱుపేదను, పెక్కురు బిడ్డల, గలవాఁడను. ఉంఛవృత్తిచే జీవించుచున్నాను. నాయందుఁ గనికరింపుము.

శ్లో॥ యాత్రామాత్ర ప్రసిద్ధ్యర్థం, స్వైః కర్మభిరగర్హితైః
అక్లేశేన శరీరస్య, కుర్వీత ధనసంచయమ్.

దేహయాత్ర జరుగుటకుఁగాను శాస్త్రనిషిద్ధముగాని స్వకర్మములచే శరీర క్లేశములేక గృహస్థుఁడు ధనము సంపాదింపవచ్చును. బ్రాహ్మణకర్మములలోఁ బ్రతిగ్రహము చేరినది కావున నిది శాస్త్రనిషిద్ధము కాదు. దేహధారణమునకై కుటుంబరక్షణమునకై యడిగెను గావున గర్హితముగాదు. బ్రాహ్మణుఁడు ధనముఁగూర్చి దాఁచియుంచవలెనని యార్జింపరాదు, యాచింపరాదు, కుచే లునివలె.

"నరాజ్ఞః ప్రతిగృహ్ణీయా ల్లుబ్ధస్యోచ్ఛాస్త్ర వర్తినః"
యని రాజులవలనను లోభులవలనను ప్రతి గ్రహము నిషిద్ధముగదా ఎట్లుత్రిజ టుఁడు శ్రీరామునిసొత్తు గ్రహింపఁగోరెను. ఇది యాపదలందు, ధర్మనిష్ఠులు రాజు లయినపుడు నన్వయింపదు. అదియునుగాక

దేవాతిథ్యర్చనకృతే, గురువృత్త్యర్థ మేవచ
సర్వతః ప్రతిగృహ్ణీయా, దాత్మవృత్త్యర్థ మేవచ.

దేవతలనతిథుల నర్చించునిమిత్తము, గురువును బోషించునిమిత్తము, తన దేహధారణము నిమిత్తము సర్వత్ర ప్రతిగ్రహింపవచ్చును. అదియునుగాక

వృద్ధౌచ మాతాపితరౌ, సాధ్వీభార్యా, శిశుస్సుతః
అప్యకార్య శతంకృత్వా, భర్తవ్యా మను రబ్రవీత్.

ముసలి తల్లిదండ్రులను, పతివ్రతయగు భార్యను పసిబిడ్డయగు కొడుకును నూ ఱకార్యములు చేసియైన రక్షింపవలయునని మనువు చెప్పెను. కావున త్రిజటుని యాచన దూష్యముకాదు.

చం॥ అన దరహాసభాసురము•ఖాంబుజుఁడై రఘురాముఁ డాడు నో
యనఘచరిత్ర! నామొదవు•లం దొకవేయియుమాత్ర చిక్కె, నీ
వును నొకదండమున్ విసరి•పో విడుమీ, యది యెంత మేర లోఁ
గొను నది యంత నీకిడుదుఁ•గొల్పుము నీ భుజశక్తి నావుడున్. ౯౧౨

దరహాసభాసుర ముఖాంబుజుఁడై=చిఱునవ్వుచేఁ బ్రకాశించు ముఖకమలముగలవాఁడై, అనఘచరిత్ర=పాపములేని నడవడిగలవాఁడా, చిక్కెన్=మిగిలెను, మొదవులందున్=ఆవులందు.

తాత్పర్యము

అని చెప్పఁగా శ్రీరాముఁ డింత ముసలియుఁ దపస్వియునయ్యు దారపుత్రాదులనిమిత్తము యాచింపవలసినవాఁడయ్యెఁ గదా. ఈయన సత్తయెంతో తెలిసికొందము అని యాయనను జూచి పుణ్యచరిత్రా నాయావులందు దానమీయఁగా మిగిలినవి వేయియున్నవి. నీవు నొక కఱ్ఱతీసికొని యామందపై విసరివైవుము. అది యెంతదూరమునఁబడునో యిచ్చటనుండి యంతవఱకుఁ గల యావులనన్నిటిని నిచ్చెదను. ఏదీ నీ భుజబలమును బరికొల్పుము. అనఁగా.

ఉ॥ దోవతి యెత్తి చెక్కి, పయి•దుప్పటి చక్కబిగించి చుట్టి, యా
పై వల కేల దండమును•బట్టి, పదంబులు ముందువెన్కగాఁ,
జీవను నీలకర్చికొని•చెచ్చెరఁ బ్రాణము లెల్లఁ, బాఱుఁడున్
దావిను రొప్ప వీచి ప్రమ•దంబున గోవులలోన వైచినన్. ౯౧౩

వలకేలన్=కుడిచేతియందు, ఈలకర్చికొని=దంతములు గట్టిగాబిగించి, పాఱుఁడు=బ్రాహ్మణుఁడు, ప్రమదంబునన్=సంతోషముతో.

తాత్పర్యము

వ్రేలాడుచున్న దోవతియంచులను పైకెత్తి చెక్కియది జాఱిపోకుండ మీఁద దుప్పటి బిగించి చుట్టి యావలఁ గుడిచేత దండమునుబట్టి కాళ్లుముందు వెనుకలుగాఁబెట్టిశక్తికొలఁది ప్రాణములను నీలకర్చుకొని పండ్లు బిగించి యా బ్రాహ్మణుఁడు దానిని త్రిప్పి త్రిప్పి విసరుసంతోషముతో నావుల గుంపులో వైచెను.

ఆవులన్నిటిని బ్రాహ్మణున కీయవలయునని మనస్సునందుండినను బ్రాహ్మణ ప్రభావము వెలిపఱుపఁగోరి నవ్వులాటకు రామచంద్రమూర్తి యిట్లనుటచే నంతటి కష్టదశప్రాప్తించినను నది యాయనకు శపంతయైన మనస్సున నాటలేదని యీ పరిహాసచర్య దెలుపుచున్నది. ఇట్లు పనిచేయించి పరీక్షించి యిచ్చుటచే బ్రాహ్మణుని యాచనాదోషమును దొలఁగించినవాఁ డయ్యెను. బ్రాహ్మణుఁడు కష్టించి సంపాదించినవాఁడయ్యెను.

చం॥ ఫలపవనాంబు భోజనశుభవ్రత వృత్తులఁజేసి చూడ దు
ర్బలతనులయ్యు బ్రాహ్మణ లపారతపోబల సంపదన్ మహా
బలయుతు లట్టివారలకు భవ్యులకెందు నసాధ్య మెద్దియుం
గలదె?చరాచరాఖిల జగంబులఁ బెద్దలుగారె సద్విజుల్.భార-ఆది-౭౧లో
ఈకాలమున బ్రాహ్మణులు భ్రష్టులగుటకు తపస్సులేకుండుటయే కారణము.

కం॥ సరయూతీరమునందుం, బరఁగెడివేవేలయాల•బసవనలకడన్
ధరణీసురకరముక్తము, గురుదండము పడఁగఁజూచి•గౌఁగిలినప్రేమన్.

వేవేలయాలన్=వేలకొలఁదినుండు నావులలో, బసవనలకడన్=ఎద్దుల యొద్ద, ధరణీసురకరముక్తము=బ్రాహ్మణుని చేతివలన విడువఁబడినది, గురుదండము=పెద్దకట్టె, కౌఁగిలినప్రేమన్=అతిశయించిన ప్రేమచేత.

తాత్పర్యము

బ్రాహ్మణునిచే విసరివేయఁబడిన యా గొప్పకట్టె సరయూనది యొద్దునం దొప్పుచున్న యావులగుంపుల నన్నిదాఁటి యెద్దులసమీపమందుఁబడఁగా శ్రీరామచంద్రమూర్తి యతిశయించిన ప్రేమచే.

ఉ॥ కౌఁగిటఁ జేర్చి యావిబుధ•కాంతుని నాసరయూతటంబునన్
మేఁగినయాల నెల్లఁ గొని•వ్రేఁడులు: మౌనివరాశ్రమంబునన్
వీఁగక తోలుఁ డంచుఁ బృథి•వీతనయారమణుండు పల్కె ని
న్నేఁ గనలేక కోఁడము•లేమొ వచించితి నన్ను సైఁపవే. ౯౧॥

విబుధకాంతుని=బ్రాహ్మణశ్రేష్ఠుని, ఆ సరయూతటము=సరయూతీరము వఱకు, మేఁగినయాలన్=ఆవరించుకొన్న యావులను, వ్రేఁడులు=గొల్లజాతి వారలు, మౌనివరాశ్రమంబునన్=మునిశ్రేష్ఠుని యాశ్రమమందు, వీఁగక=

వెనుదీయక: వృథివీతనయాతరమణుండు, కనలేక=తెలిసికొనలేక, కోఁడమ:లు=పరిహాసవాక్యములు, ఏమొ:=ఏవేవో, సైఁపవే=మన్నింపుమా.

తా త్ప ర్య ము

ఆ బ్రాహ్మణ శ్రేష్ఠునిఁ గౌఁగిలించి గొల్లలారా మీరు సరయూతీరము వఱకుఁగల యావులనెల్ల, దోలుకొనిపోయి, దానము తీసికొన్నవారు గదా తోలికొనిపోవలయు ననక, యీ మునీశ్వరు నాశ్రమమందుఁ దోలిరండు అని చెప్పి త్రిజటునిఁజూచి తపోధనా నీశక్తి తెలిసికొనలేక నవ్వులమాట లేవేవో మాటలాడితని క్షమింపుమీ.

చం॥ అలుగకుమీ మహాత్మక! దు॥రత్యయ మౌభవదీయ తేజము౦

దెలియఁగఁ గోరి వేడుకకు॥నే నటు పల్కితి, నింకఁ గొంతయే

కలదు ధనంబు, గోరు మది॥కాంక్షిత మేని యొసంగువాఁడ, నా

పలుకు నిజంబు నాధనము॥బ్రాహ్మణకోటినిమిత్త మే సుమీ. ౯౧౮

అలుగకుమీ=కోపింపకుమీ, మహాత్మ=గొప్ప మనస్సుగలవాఁడా, దురత్యయము=మీఱరానిది, భవదీయతేజమున్=నీ తేజము:ను, కాంక్షితమేని=కోరికగలదేని. తా త్ప ర్య ము.

మహానుభావా, నాపై గోపింపకుము వార్ధకమునకుఁ దో డాహారములేక కేవలదుర్బలమైన నీదేహమునందుఁగల తేజస్సులోకులకుఁ దెలుపంగఁగోరి వినోదార్థము నే నటుపలికితినిగాని నీ కావు లీయవలసివచ్చునని కాదు. ధనమందునునికఁ గొంతగలదు నీకుఁ గోరికకలదేని యదియు నిచ్చెదఁ గైకొనుము. నేనునిజము చెప్పుచున్నాను. మునుపటివలెఁ బరిహాసవాక్కులు గావు. నా ధనమంతయు బ్రాహ్మణ సంఘరక్షణార్థమేకాని నా నిమిత్తమైకాదు.

ఆవృత్తానాం గురుకులా, ద్విప్రాణాం పూజకోభవేత్

నృపాణామక్ష యోహ్యేష, నిధి బ్రాహ్మోభిధీయతే. మను. ౭-౮౨

గురుకులమున వేదాధ్యయనము పూర్తిగావించి మరలివచ్చిన వివాహార్థులగు బ్రాహ్మణులను రాజులు ధనధాన్యములొసఁగి శాస్త్రప్రకారము పూజింపవలెను. ఇట్లు బ్రాహ్మణులం దుంపఁబడిన ధనధాన్యాదులు నిధివలెఁ దఱుఁగనిదై యెల్లప్పుడు వీరికి మేలు గావించును.

కం॥ నినుబోఁటి మహాత్ములకున్, ధన మెల్లను నీయఁగా ని॥తాంతయశంబున్

ఘనసంప్రీతియుఁ గలిగెడు,

నన నాతఁడు తుష్టుఁ డగుచు॥నావాక్యములన్. ౯౧౯

నినుబోఁటి=నీవంటి, నితాంతయశంబున్=మిక్కి కీర్తియు, ఘనసంప్రీతియు=గొప్పసంతోషము, తుష్టుఁడు=సంతోషించినవాఁడు, శ్రీరాముని దుఃఖస్థితి యేమో పరిహాసమునందు మనస్సుపోవుటయేమో !! ఆయనకుదుఃఖము మనస్సునకుఁ దగులనేలేదు.

తాత్పర్యము

నీవంటి మహాత్ములకు ధనమంతయు నిచ్చిన విస్తారకీర్తియు గొప్పసంతోషమును గలుగును అనిన వాక్యముల కాయన సంతోషించి ధనముతో నాకేమియుఁ బనిలేదని తీసికొనక

తే॥ యశముబలమునుప్రీతియు•నతులసుఖము,
వృద్ధియగునంచు దీవించి•విప్రవర్యుఁ
డాలితోడను జేకొన్న•యాలతోడ, స్వాశ్రమావనికిని నేగె•నంత విభుఁడు.

తాత్పర్యము ౯౧౮

కీర్తి, బలము, సంతోషము, అసమానమగు సుఖము వృద్ధియగుఁ గాక యని దీవించి భార్యతోడను తనకు శ్రీరాముఁడిచ్చిన యావులతోడను దన యాశ్రమభూమికిఁ బోయెను.

చం॥ అనుపమధర్మవిక్రమగు•ణార్జితవిత్తము లాప్తకోటికిన్
ఘనుఁ డతిగౌరవంబు మును•గా మనసార నొసంగె, విప్రమి
త్రనిచయభృత్యపాళికి వ•దాన్యవరుండు దరిద్రభైక్ష్యజీ
వనపరసంచయంబుల క•వారిగ నిచ్చె యథార్హపూజలన్. ౯౧౯

అనుపమధర్మ విక్రమగుణార్జిత విత్తములు=అసమానమైన ధర్మము,ధర్మముతోఁగూడిన పరాక్రమముచే నార్జింపఁబడిన ధనములు. ఇట్లనుటచే నాయన ధనమంతయు స్వధర్మమునను సరించి ధర్మపద్ధతి సంపాదించినదేకాని యన్యాయార్జితమందుఁ గొంచెమైననులేదు. ఇది పితృధనమునుగాదు అనుట, ఆప్తకోటికిన్=ఆప్తులసమూహములకు,గౌరవంబు మునుగాన్=ముందుగా గౌరవించి, మనసారన్=నిండుమనస్సుతో- ఉన్నదంతయు నందఱకు నీయవలసివచ్చెనే యను విచారములేక యిట్లిచ్చుట తటస్థించెఁగదా యను సంతోషముతో, విప్రమిత్రనిచయ భృత్యపాళికిన్ = బ్రాహ్మణులకు మిత్రుల సమూహమునకు-భృత్యులసమూహమునకు, వదాన్యవరుండు = దాతలయందు శ్రేష్ఠుఁడు, యథార్హపూజలన్=వారివారి యోగ్యతకుఁ దగినట్లు గౌరవించి.

తాత్పర్యము

అసమానమైన సత్యపరాక్రమత్వముచే స్వధర్మమనుసరించి తానుసంపాదించిన ధనము లాప్తులను గౌరవించి సంతోషముతో నిండుమనస్సుతో నిచ్చెను. వారికేగాక బ్రాహ్మణులకు స్నేహితులకు సేవకులకు దరిద్రులకు భిక్షమెత్తి జీవించువారికి వారివారికిఁ దగినరీతి గౌరవించి యలక్ష్యబుద్ధిలేక విస్తారముగ నిచ్చెను.

—• { ౩౩-వ సర్గము. సీతారామలక్ష్మణులు తండ్రియొద్దకుఁ బోవఁజూచి ప్రజలు దుఃఖించుట. } •—

ఉ॥ ఈవుల నెల్లవారలను•దృప్తులఁజేసి రఘూద్వహుల్ ధరి
త్రీవరకన్యతో నరుగు•దేరఁగఁ దండ్రిని జూడఁగోరి శో

భాఽవిరళంబులున్ మలయ•జార్చితముల్ వరసాధనంబులున్
గ్రేవలఁ వ్రేలఁ బోవఁగఁ బు•రీజనముల్ గని దుఃఖతప్తులై. ౯-౧౦

ఈవులన్ = దానములచే, శోభాఽవిరళంబులున్ = దట్టమైన కాంతిగలవి, మలయజార్చితముల్=చందనముచేఁ బూజింపఁబడినవి, వరసాధనంబులున్ = శ్రేష్ఠములైన యాయుధములు, క్రేవలన్=పార్శ్వములందు.

తాత్పర్యము

దానములచే నెల్లవారినిఁ దృప్తులఁజేసి రామలక్ష్మణులు సీతాదేవితోఁ దండ్రినిఁ జూడఁగోరి యిల్లువిడిచి వెలువలికిరాఁగా దట్టమైన కాంతులుగలిగి గంధముచే నర్చింపఁబడిన యాయుధములు ధనుస్సులు ఖడ్గములులోనైనవి ప్రక్కల వ్రేలాడుచుండఁ బోవుచుండఁగాఁ బురమునందలి జనులు మిగుల దుఃఖముచేఁ దపించినవారై.

సీ॥ మిద్దెల నెత్తగు • మేడలఁ బ్రాసాద,శిఖరంబు లెక్కి వీ•క్షించువారు
నెఱసినమూఁకల • యిఱకటంబునఁ జూడఁ, గానమి నగరెక్కి•కాంచువారు
పట్టంగ గొడుగును•బంటొక్కఁడును లేక,నడుచురామునిఁ గని•యడలువారు
కటకటా యెంతటి•కష్టంబు వచ్చెరా, రామున కని వెతఁ•గ్రాఁగువారు.

తే॥ భవ్యచతురంగబలములు•పటిమ మెఱయ,
వెంబడినిరాఁగ వేంచేయు•విభుఁడు నేఁడు
కాలినడకను దమ్ముండు•నాలుఁ దోడు,రాఁగఁ జనియెడిఁగాయని•వేఁగువారు.

అడలువారు=దుఃఖించువారు, చతురంగ బలముల = రథములు, ఏనుఁగులు,•గుఱ్ఱములు, కాలిబంటులనెడి నాలుగువిధముల సేనలయొక్క, వేఁగువారు = తపించువారు.

ఇది మొదలు ప్రజలకు శ్రీరామునందుఁగల ప్రీతి విశ్వాస గౌరవములు ఆయనను విడుచుటవలన వారికిఁ గలిగిన దుఃఖము వర్ణింపఁబడుచున్నది.

తాత్పర్యము

మిద్దెలమీఁదను, మేడలలోను, సౌధములమీఁదను నెక్కిచూచువారును, వ్యాపించియుండు గుంపుల యిఱకటంబునఁబడి నలుగుటలో శ్రీరామునిఁజూడఁ గానక నగరెక్కిచూచువారును, పట్టఁగ గొడుగైనను బంటైనను లేక కాలినడక పోవు శ్రీరామునిఁగని దుఃఖించువారును- అయ్యయ్యో మన శ్రీరామునికెంత కష్టము వచ్చెరాయని శ్రీరామునిఁజూచి వ్యథచేఁ దపించువారును ఇంతకు ముందు నాలుగువిధములైన సేనలు వెంబడిరాఁగా వేంచేసిన ప్రభువు నేఁడు కాలితో నడచి భార్య తమ్ముఁడు తోడురాఁగ బోవుచున్నాఁడుగదా యని నిప్పు [illegible]వారును.

కం॥ శ్రీరుచి మరగియుఁ గోర్కులు, కోరెడువారలకు ముదముఁ • గూర్చెడువాఁడై
నేరండు ధర్మగౌరవ, కారణమునఁ దండ్రిమాటఁ • గాకుం జేయన్. ౬-౨

కాకున్=వ్యర్థము.

తాత్పర్యము

ఐశ్వర్యము రుచి యెట్టిదో యనుభవించి తెలిసినవాఁడైనను కోర్కులు కోరువారికి సంతోషముఁ గలిగించువాఁడయ్యును, ధర్మము నందుండు గురుత్వము కారణముగాఁ దండ్రిమాట వ్యర్థము చేయఁజాలకున్నవాఁడు.

కం॥ ఆకాశచరులకేనా, లోకింపన్ రాదు మున్ను • లోలాంబక నీ
రాకన్నె సీత నిపుడ, స్తోకం బగు తెరువుమూఁక • చూడం గలిగెన్. ౬-౩

ఆకాశ చరులకేన్ = ఆకాశమున విమానములమీఁద సంచరించుదేవతలకైనను, అస్తోకము=గొప్పది, తెరువుమూఁక=వీథులలోఁ దిరుగు బీదజనము.

తాత్పర్యము

పూర్వమాకాశమునఁ దిరుగు దేవతలకైనఁగానరాని యారాజకుమారి సీతాదేవిని నిపుడు కన్నవారు గుంపులు గుంపులై చూడ సాధ్యమయ్యెను గదా.

కం॥ హరిచందన సేవిని యగు, పరమోజ్జ్వలితాంగరాగ • పాత్రను గనుచున్
బురజనములు కనునీటిం, బొరిఁబొరిఁ దొరఁగించి రుష్ణ • ముగ శీతముగన్.

హరిచందన సేవిని=హరిచందనమును బూసికొనినది, పరమోజ్జ్వలితాంగరాగపాత్రను = మిక్కిలి ప్రకాశించుమైపూఁతకుఁ బాత్రురాలిని, ఉష్ణముగన్=వేఁడిగ, శీతముగన్=చల్లగా.

తాత్పర్యము

మిగులఁ బ్రకాశించు మైపూఁతలకు యోగ్యురాలై హరిచందనముపూసికొనియుండు సీతనుజూచి పురమునమున్న జనములు మీఁద మీఁద మిక్కిలి ధారలుగా శోక బాష్పములను హర్ష బాష్పములను గురియించిరి.

ఇటువంటి గొప్పదానికింతకష్టము వచ్చెఁగదా యని వేఁడికన్నీళ్ళను ఆమె పాతివ్రత్యమునకు సంతోషించి యానంద బాష్పములును గురియించిరి.

—• పౌరులు కైకేయీ దశరథుల నిందించుట. •—

కం॥ దయ్యంబు సోఁకి దశరథు, నియ్యనువునఁ బలుకు నిప్పు • డిది నిక్కం బౌ
నెయ్యెడనైనం బతి తన, నెయ్యపుసుతు నడవి కనుచు • నే దుర్నీతిన్.

తాత్పర్యము ౬-౪

అవి దశరథుఁడాడినమాటలుగావు. ఆయన మీఁదఁ బిశాచ మావేశించి యిట్లులు పలికినది. అట్లుగాకున్న నెప్పుడైన నేదేశమందైనఁ దండ్రియగువాఁడు నీతిదప్పి తన గారాబు కొడుకును నడవులపాలు సేయునా.

కం॥ కొడుకు గుణహీనుఁడైనను, వెడలఁగ నడువంగఁ దగునె? • విశ్వములను మే
ల్మిఁ దవడి గెల్చినఘనుఁ డగు, బుడుతని నిటు పాయునట్టి • పురుషుఁడు గలఁడే.

తాత్పర్యము ౯-౨౬

కన్నకొడుకు గుణములేనివాఁడైనను వెడలఁ గొట్టరాదు. న్యాయమిట్లుండఁ దన మంచిగుణములచే లోకమును జయించిన చిన్నపిల్లవానిని నిటువదలిపెట్టు పురుషుఁడుకూడనుండునా. మంచి గుణములు లేవని గొడుకును విడువరాదు. కాని దుష్టగుణములుగలవాఁడై యధర్మవర్తియై యపకీర్తి తెచ్చువానిని సగరువలె వదలవచ్చును.

చం॥ ఒరులకు నొప్పి నీయమి, య • నుత్తమ మౌ దయ, శాస్త్ర చింతనా
పరతయు, సత్స్వభావమును, • బాయనియింద్రియనిగ్రహంబు, ని
ర్భరతరచిత్తశాంతి, రఘు • రాముని పెట్టనిసొమ్ము లాఱు, నీ
పురుషవరోత్తమున్ సుగుణ • భూషణుఁ గోల్పడువారు నుందురే. ౯-౨౭

తాత్పర్యము

మనోవాక్కాయములఁ బరులకు నొప్పినీయకుండుటయు, నుత్తమోత్తమ దయయు, శాస్త్రమును జింతసేయుటయందే యాసక్తియు, సాధుస్వభావమును, నేసమయమునందైనను ఇంద్రియములను వానియిష్టప్రకారము పోనీయక వానిని దన స్వాధీనమం దుంచుకొనుటయు, మిక్కిలి యధికమైన శాంతము నీయాఱు గుణములు శ్రీరామచంద్రునకు ధరింపని సొమ్ములు- ఇట్టి పురుషోత్తముని కల్యాణగుణములే యలంకారముగఁ గలవానిని వదలిపెట్టువారుకూడ నుందురా. వివేకము గలవాఁ డెవ్వఁడైన నుండఁడని భావము.

ఉపనిషత్తులందుఁ జెప్పఁబడిన యాఱు హేయగుణములు లేకుండుటయేగాక వానికి మాఱాఱు కల్యాణగుణములేకలిగి కల్యాణగుణములే యాభరణములుగాఁ గల భగవంతుని జీవకోటికంటె నుత్తముని వదలువాఁడు నొకఁడుండునా? అధోలోకములపాలయి పోవువారుందురుగాని బాగుపడఁగోరువా రుండరని భావము.

కం॥ నీరమున బ్రదుకుజీవులు, నీ రిగిరిన గ్రీష్మమునను • నెఱిచెడుమాడ్కిన్
శ్రీరాముఁ డిట్టిధన్యుఁడు, దూరంబుగఁ జనఁగఁ బ్రాణ • దూపిలె జనముల్.

తాత్పర్యము ౯-౨౮

శ్రీరాముని విడువలేక జనులింత తపించుటకుఁ గారణము కవి చెప్పుచున్నాఁడు. నీటియందు బ్రతుకు జీవులు గ్రీష్మమున నీరిగిరినఁ బూర్ణముగాఁ దమ స్వరూపముననే చెడునట్లు శ్రీరాముఁడు ప్రజలకు జలజంతువులకు జీవనమైన జలము వంటివాఁడు. దూరముగఁ బోవఁగాఁ బ్రజలు శోకించిరి. ఇచట నారాయణ శబ్దార్థము వివక్షితము. సమస్తభూతకోటులకు అయనమనఁగా స్థానమైనవాఁడు. జలచరములకు జలమువలె భూతకోటికిఁ దానైనవాఁడు. అట్టివాఁడు దూరముగఁ బోయిన వానినాశ్రయించిన వన్నియుఁ జెడవలసినవే. కావున భగవ

త్పమాశ్రయణముగలవాఁడు చెడఁడుగాని తక్కినవారు చెడెడివారు. అట్టి యాశ్రయము దొలఁగిపోయినచో వివేకి యెవఁడు దుఃఖింపకుండును ?

కం॥ జగదీశ్వరుఁ డగురాముఁడు, వగ పొందిన జగము లెల్ల•వగ చెందుఁగదా
తగ వేరు హానిఁ జెందిన, నగములఁ బూవులును బండ్లు•నాశము గావే.

తాత్పర్యము ౯౨౯

శ్రీరాముఁడు జగదీశ్వరుఁడు. సమస్తమునకు మూలమైనవాఁడు. ఆయనకు వ్యసనము సంభవించిన లోకములెల్ల దుఃఖించుట యేమివింత. ఎట్లనః- చెట్టు వేరునకు హాని వచ్చెనేని యాచెట్టునందలి పూలు పండ్లు నాశము కావా ?

వేరునకుఁ జెట్టునకుఁ జెట్టునందలి పూలకుఁ బండ్లకు నెట్టిసంబంధమో భగవంతునకుఁ బ్రపంచమునకుఁ బ్రపంచమందలి ప్రాణికోటికి నట్టిసంబంధము తెలియవలెను. ఇందుఁ బరిణామవాదము సిద్ధాంతితము వాదాద్వైతులలోఁ గొందఱు దీనిని సమ్మతించి కొందఱు సమ్మతింపకున్నను మన్వాదులు ననుభవాద్వైతులందఱు దీనిని సమ్మతించినవారే. రామగీతఁ జూడుఁడు.

కం॥ వరధర్మసారుఁ డతిదు,ర్భరతేజుఁడు వేరితండు • ప్రజలకు, నితరుల్
నరు లాకులు పుష్పంబులు, గురుశాఖలు పండ్లు గారె•గుఱుతుగఁజూడన్.

తాత్పర్యము ౯౩౦

మీఁది పద్యంబునఁ జెప్పినదానిని గవియే విశద పఱుచుచున్నాఁడు.

శ్రేష్ఠమైన ధర్మమే సారముగాఁ గలవాఁడును మిక్కిలి యధికమైన తేజస్సు గలవాఁడును, నగు శ్రీరాముఁడు ప్రజలకు వేరు- ఇతరులు నరులు ఆకులు పుష్పములు పెద్దకొమ్మలు పండ్లుగదా.

వేరునకు బలమెట్లు సారమో శ్రీరామున కుత్తమ ధర్మము తేజము సారము. వేరులోని జలము వలననే చెట్ల కొమ్మలు కాయలు పూలు పండ్లు ఆకులు జీవించి తేజోవంతములై యుండునో యట్టులే భగవంతుని శక్తిచే జీవకోట్లన్నియు క్షేమముగ నుండఁగలిగినవి.

ఊర్ధ్వమూల మధశ్శాఖ, మశ్వత్థం, ప్రాహురవ్యయమ్, అని భ.గీ. ఉపనిషత్తు లిట్లే చెప్పుచున్నవి. వేరు సత్యమైనపుడు దాని పరిణామమయిన చెట్లు కాయలు పండ్లు పూలు ఆకు లెట్లు సత్యములో భగవంతుఁడు సత్యమైనచో సమస్త ప్రపంచము సత్యమే. మన్ను సత్యమైనచోఁ గుండలు సత్యములే.

నరులు = (1) మనుష్యులు (2) జీవాత్మలు.

ఉ॥ అంటఁగ వచ్చునే రఘుకు•లాగ్రణి రాముని౯ బాసి, యేల యా
తోఁటలు గేహముల్ మడులు•దొడ్లును లక్ష్మణురీతి వీడి యే
పూఁటకు రాముఁ డెందు నిలఁ • బూను సుఖార్తుల నేకమై యటన్
మాఁటుగలట్టి చుట్టముల • మానినులం గొని యేఁగి యుందమా. ౯౩౧

ఆఁటఁగన్=సహింపఁగా, సుఖార్తులన్=సుఖమునందు దుఃఖమునందు, ఏకమై=సమానమై యొకటై ఏకశబ్దమునకు సమానమని యర్థము. శ్రీరాముని సుఖము వంటి సుఖము శ్రీరాముని దుఃఖమువంటి దుఃఖముగలవారమై యని యర్థము. "రామ సుగ్రీవయో రైక్యం దేవ్యేవం సమజాయత" రామసుగ్రీవుల రైక్య మీ విధముగాఁ గలిగెను అని హనుమంతుఁడు చెప్పెను.'ఏకం సాంఖ్యంచ యోగంచ యఃపశ్యతి- సాంఖ్యము యోగము రెండు నొకటియే యని యెవఁ డెఱుఁగునో వాఁడే వాస్తవ మెఱిగినవాఁడు దీనికి మూలము 'ఏకసుఖదుఃఖాః' అనుటకు తీర్థీయులు సమాన సుఖదుఃఖా యనియే వ్యాఖ్యానించిరి.

### తాత్పర్యము

మీఁదఁజెప్పిన కారణముచే మనము శ్రీరాముని నెడఁబాసి యెట్లు సహింపఁ గలము. మనకుఁ బ్రాణము శ్రీరాముఁడు. ఆయన విడిచిపోయినపిమ్మట సీతోఁట లేల- యిండ్లేల- మనులేల-దొడ్లేల? కావున లక్ష్మణునివలె మనము సర్వసంగ త్యాగముఁజేసి యే దినమం దే గడియయందు శ్రీరాముఁ డెందు నిలుచునో యే సుఖము దుఃఖ మనుభవించునో యందే మనము నిలుచుచు నట్టి సుఖము నట్టి దుఃఖమునే యనుభవించుచు మనకుఁ గేవలము కావలసిన బంధువులను భార్యలను బిలుచుకొనిపోయి యందే యుందమా.

సీ॥ నిక్షేపముల నెల్ల • నెఱపెల్లగించియు, భవనాంతరము లెల్లఁ • బాడువెట్టి
ధనధాన్యములనెల్ల•మనవెంటఁ గొనిచనఁ,గులదేవతలు వీనిఁ•దొలఁగిచనఁగఁ
జిమ్మువారలు లేక • దుమ్ములు రేఁగుఁచు, బాదట్లు తీఁగెలు•పాఱుచుండఁ
గొక్కుబొక్కల మట్టి•కుప్పలు నిండఁగ, నెలుక లిచ్చగఁ బర్వు•లెత్తుచుండ.
తే॥ మంత్రహోమజపము లను•మాట లేక,బోఁకిపెంకులు నిండఁగఁ•బొలుపు వాసి
మనము విడిచినగృహముల•మనసుదీరఁగ్రైక
తలఁగొట్టుకొనియెడిఁ•గాకయుండ. ౯౩-౨

నిక్షేపములన్=పూడ్చియుంచిన ధనములను, భవనాంతరములు=ఇండ్ల లోపలిభాగములు, చిమ్మువారు=కసపుద్రోయువారు, పాదట్లు=బాఁజు, పొలుపు= అందము.

### తాత్పర్యము

రక్షణార్థమై భూమిలో దాఁచియుంచిన ధనమును బెల్లగించుకొని యిండ్ల న్నియుఁ బాడుపెట్టి ధనము ధాన్యము కైకకుఁ జిక్కకుండునట్లు మన వెంటఁ దీసికొనిపోఁగాఁ బూజించువారు లేమిని నిలువేలుపు లీయిండ్లను దొలఁగిపోవఁ గసవు చిమ్మువారలు లేమిచే నేలదుమ్ములు రేఁగుచు మిద్దెలబాఁజుల తీఁగలు వ్రేలాడుచుండఁ గొక్కులుతోడఁగా మట్టికుప్పలు నిండ్లునిండ నదరుబెదరు లేక యెలుకలు తమ యిచ్చకొలఁదిఁ బరువులెత్తుచుండ మంత్రమని హోమమని జప

మని తలఁచువారు లేక కుండపెంచికలు నిండఁగఁ గాంతి చెడఁగా మనము విడిచిన యిండ్లను దన మనసారఁ గైకతలపైఁ గట్టుకొననీ.

కం॥ రాముం డుండెడివనమే, శ్రీమానితమైనపురము • సీతేశుండున్
లేమని మనమును విడుచుట,చే మహితారణ్య మిదియు•సిద్ధం బగుతన్.

తాత్పర్యము ౯౩౩

శ్రీరాముఁడుండు వనమే సంపదచేఁ గలకలలాడుచుండు నగరము. ఆయన లేమిని మనము విడుచుటచే నిదియే పెద్ద యరణ్యము.

ఉ॥ నెట్టన యింద జేగిన వ•నీగుహలందలిసింహముల్ కరుల్
పుట్టల నున్నపాములును • భూధరసానుగతోగ్రపక్షులున్
దొట్టినభీతిచేఁ బఱచి • దూరము పాడఱి యున్నయట్టి యీ
పట్టనమందిరాళి నిర•పాయముగా సుఖియించుఁ గావుతన్. ౯౩౪

నెట్టన=అందఱొకమాటగా- ఇది కళ- ప్రమత్తాంతముగాదు- రూ. నెట్టనము, వనీగుహలందలి = అడవులయందలి గుహలయందలి, భూధరసానుగతోగ్రపక్షులన్=కొండల చఱులయందుండు భయంకరమైన పక్షులును, పాడఱి=పాడుపడి- మనుష్యసంచారములేని, ఈపట్టనమందిరాళిన్ = ఈనగరమందలియిండ్లవరుసలయందు, నిరపాయముగాన్=అపాయములేక.

తాత్పర్యము

అడ్డములేక మనమందఱ మొకపట్టుగ నిందుండక వెడలిపోయి యడవులలోఁ గాఁపురములుండఁగా నడవులలో గుహలలోఁ గాఁపురముండు సింహములు ఏనుఁగులు- పుట్టలలోనుండు పాములును కొండచఱులయందుండు పెద్ద పక్షులు నిలువనీడలేక మనకు భయపడి దూరముగాఁ బరువెత్తిపోయి మఱియెందు స్థలముగానక పాడుపడిన యీ యూరియిండ్లలో నే యపాయములేక హాయిగా సుఖించునుగాక.

ఉ॥ రామునితోడ నెల్లర మ•రణ్యముఁ బట్టినయంత మీఁద గా
రామునుతుండు చుట్టలు ని•రంతరమున్ భజియింప నుండనీ
బూమెలకైక మాంసమును • బూరియుఁ గాయలు మెక్కి వానిపై
దీమస మారఁగాఁ గఱవు • దీఱఁ బ్రభుత్వపటుత్వసంపదన్. ౯౩౫

బూమెలకైక=మాయలకైక, పూరి=గడ్డి, దీమసము=ధైర్యము, ఆరఁగాన్=నిండఁగా.

తాత్పర్యము

శ్రీరామునితోడ మనమందఱము నరణ్యమును జేరఁగానే యావల మాయలమారి కైక తన ముద్దుకొడుకు బంధువులు నెల్లప్పుడు సేవచేయుచుండ నిండీ మాంసము మెక్కుపులులు- సింహములు- తోడేళ్ళు- గడ్డితిను జింకలు

మొదలైనవి-కాయలుదిను పక్షులు మొదలైనవి- యగువానిపై దిగులులేక యానుగాదనువారులేక తన యధికారమంతయుఁ జూపుచు నుండెనిందు.

ఉ॥ శోకముపేర్మి నిట్లనెడి•చూపఱవాక్యము లాలకించుచున్
స్తోకవికారమేఁ గనక • దూరమునన్ మడికాను కొండతో
జోక రహించి మించు పితృ • సుందరమందిరవాటిఁ జూచి సీ
తాకమనుండు డాయఁ జని • తద్గతవీరజనాళిఁ జూచుచున్. ౯౩౬

చూపఱ=చూచువారియొక్క, ఆలకించుచున్=వినుచు, స్తోకవికారమేన్= కొంచెము మార్పైనను, కనక=పొందక, మడికానుకొండతోన్ = వెండికొండతో 'ఒంటిగా మడికానుగుంటిపై' నరసభూపాలీయము, జోకన్ = పోలికన్, పితృసుందరమందిరవాటిన్=తండ్రియుండెడి యందమైన యింటిని,సీతాకమనుండు =శ్రీరాముఁడు, తద్గతవీరజనులన్=అందుండు వీరులగు మనుష్యులను.

తాత్పర్యము

శోకాతిశయముచే నిట్లు పలుకుచున్న చూడవచ్చినవా రాడుకొనుమాటలు వినుచుఁ గొంచెమైనను మనస్సులో వికారమునొందక దూరమునందు వెండికొండతో సమానమై ప్రకాశించు తండ్రియుండు నింటినిజూచి శ్రీరాముఁడు చేరఁబోయి యందుండు వీరజనులఁజూచుచు.

కం॥ వారలయార్తికి మది నవి, కారుండై మందహాస • కలితాననుఁడై
భూరితరదైన్యయుతు నవి దూరస్థు సుమంత్రుఁ జీరి•తోరపురక్తిన్. ౯౩౭

అవికారుండై=మనస్సు చలింపనివాఁడై, మందహాసకలితాననుఁడై=చిఱునవ్వుతోఁగూడిన ముఖముగలవాఁడై, భూరితరదైన్యయుతున్=మిక్కిలి యధికమైన దుఃఖముతోఁ గూడినవానిని, అవిదూరస్థున్ = సమీపముననుండువానిని, చీరి=పిలిచి, తోరపురక్తిన్=అధికమగు ననురాగముచే.

తాత్పర్యము

వారల వ్యసనముఁజూచి మది చలింపనీయక చిఱునవ్వుతోఁగూడిన ముఖము గలవాఁడై మిక్కిలి వ్యసనపడుచుఁ గొంచెము దూరమునందు సుమంత్రునిఁ బిలిచి మిక్కిలి యనురాగముతో-

—• ౩౪-వ సర్గము. శ్రీరాముఁడు దనరాకను దండ్రికిఁ జెప్పఁ బంపుట. •—

చం॥ జనకునిఁ గాంచి యాజ్ఞ గొని•పోఁగెడువాఁ డయి యిట్లు పల్కెనో
యనఘ! మదాగమంబు మను•జాగ్రణికిం దెలుపంగదే యట
న్నను నతఁ డార్తి నీరు నయ•నంబులఁ గాఱఁగ లోని కేగి యా
మనుజవరేణ్యు దుఃఖభర•మగ్ను నిగ్రస్తదివాకరుం డనన్. ౯౩౮

సాగెడువాఁడు = ప్రయాణమైపోయెడివాఁడు, మదాగమంబు=నారాక, దుఃఖభరమగ్నుని=అధిక దుఃఖమున మునిఁగినవానిని, గ్రస్తదివాకరుండు = గ్రహణముపట్టిన సూర్యుఁడు.

తాత్పర్యము

రాజును జూచి యాజ్ఞగొని ప్రయాణమై పోవఁదలఁచి యిట్లనెను. పుణ్యాత్ముఁడా నారాక తండ్రికిఁ దెలుపుమా యన నాతఁడు మిగుల దుఃఖముచేఁ గన్నుల నీరుగాఱఁగ లోపలికిఁబోయి దుఃఖమునమునిఁగి రాహువుపట్టిన సూర్యునివలె-

ఉ॥ నీ ఱలమంగ నిప్పనఁగ • నిర్జల మైనతటాకమో యన
క్షీణనదుఃఖభారమున • నివ్వెఱమై సుతు రామచంద్రుఁ బ
ల్మాఱును సంస్మరించుచు వి • లాపము సేయునృపాలుఁ గాంచి తాఁ
దాఱని భక్తి మ్రొక్కి మును • దద్ద జయోక్తులు సన్నుతించుచున్. ౬౩౯

నీఱు=బూడిద, అలమంగన్=కప్పఁగా, నిర్జలము=నీళ్ళులేనిది, నివ్వెఱ నిండు + వెఱ = పూర్ణభయము- సమానంబుల లోపనుగాగమ లోపద్విత్వంబు లన్యశబ్దంబులమీఁదను గానంబడెడి- సు. వ్యా. సంధి ౫౬, తాఱని=తక్కువగాని.

తాత్పర్యము

బూడిదగప్పిన నిప్పు, నీళ్ళులేని చెఱువు అన్నట్టు అతిశయించిన దుఃఖాతిశయముచే నిండుభయముచే- దిగ్భ్రమగొని తన కుమారుఁడైన శ్రీరాముని బహువారు సంస్మరించుచు నేడుచుచుండఁగా నా రాజునుగాంచి కొఱఁతలేని భక్తి నమస్కరించి జయజయ యని పొగడుచు.

సీ॥ ఏమని చెప్పుదు • నీవార్త యనువెఱ, నేడ్పున గుదివడ్డ • యీరెలుంగు
గ్రాల మెల్ల వచించు • రామచంద్రుం డిదె, ద్వారంబునందున్న • వాఁడు దేవ
ద్విజులకు నుపజీవి • విసరంబులకు నెల్ల, విత్తంబు లొసఁగి సు • హృత్తములకు
నెల్లరకును జెప్పి • పృథ్వీశ మీయాజ్ఞఁ, గొని కాననములకుఁ • జనఁగఁగోరి
ఆ॥ వచ్చియున్నవాఁడు • మచ్చిక మిముఁ జూడ,
నడవి కరుగు నింకఁ • గొడుకుఁ జూడ
వయ్య రశ్మిపాళి • నర్కుని పోలిక, రాజగుణము లొప్పి • తేజరిల్ల. ౬౪౦

గుదివడ్డ=అణఁచుకొనిపోయిన, ఈరెలుంగు=సన్ననిధ్వని, ద్విజులకున్=బ్రాహ్మణులకు, ఉపజీవి విసరంబులకున్=సేవక సమూహములకు, విత్తంబులు=ధనములు, సుహృత్తములకున్=స్నేహితులకు, రశ్మిపాళిన్=కిరణముల సమూహములచే, అర్కునిపోలికన్=సూర్యునివలె.

తాత్పర్యము

నీకొడు కడవులకుఁబోవుచుఁ జెప్పవచ్చినాఁడన్న కీడువార్త నేనేమని చెప్పుదునని యేడ్చుచు దానివలన గొంతుగుదివడ సారథిమెల్లగా నిట్లనియె.

దేవా శ్రీరామచంద్రుఁడు బ్రాహ్మణులకు సేవకులకుఁ దన ధనమెల్ల దానముచేసి స్నేహితులకందఱకుఁ జెప్పి మీ యాజ్ఞతీసికొని యడవులకుఁబోవ నిదిగో వాకిట నిలఁబడియున్నాఁడు. ప్రేమచే మిమ్ముఁజూడఁ గోరుచున్నాఁడు. జాగుచేసిన నాయన వెడలిపోవును. అవలఁ గనులచూపులుకూడఁ గలుగవు. ఇట్లు లేద్పుచుఁ బడియుండుట రాజధర్మముగాదు. అయినదేమో యయినది. ఇప్పుడేడిచి యేమి ప్రయోజనము కావున ధీరుఁడవై కాంతులచే సూర్యునివలె రాజగుణములచే నీవును బ్రకాశించుచుఁ గొడుకును గన్నులనైనఁ జూడుము. ఆ భాగ్యముకూడ లేకుండ నేల చేసికొనెదవు.

కం॥ అన వననిధిగంభీరుఁడు, జననుతధర్మైకరతుఁడు • జలధరమార్గం
 బున విమలుఁడు సత్యాత్ముఁడు, జననాథుం డిటు లనియె•సచివాగ్రణితోన్.

వననిధి గంభీరుఁడు=సముద్రమువలె లోతెలుఁగనీయనివాఁడు, జననుత ధర్మైకరతుఁడు=జనులచే స్తోత్రములు చేయఁబడిన ధర్మమునందే ప్రీతికల వాఁడు, జలధరమార్గము=మేఘమార్గము- ఆకాశమువలె, విమలుఁడు=నిర్మల మైనవాఁడు, సత్యాత్ముఁడు=సత్యముపలుకుట స్వభావముగాఁగలవాఁడు, సచి వాగ్రణితోన్ = మంత్రులతో మొదటివానితో.

తాత్పర్యము

సముద్రమువలె గాంభీర్యముగలవాఁడును, ప్రజలస్తోత్రము చేయఁబడిన ధర్మమందే యాసక్తిగలవాఁడును, ఆకాశమువలె నిర్మలమైనవాఁడును- సత్య మాడుట స్వభావముగాఁగల యా దశరథుఁడు మంత్రితో నిట్లనెను.

శా॥ నాయిల్లాండ్రురనెల్లఁ దోడ్కొని సుమం•త్రా! యిందు ర, మ్మేను భా
 ర్యాయుక్తంబుగఁ జూడఁ గోరెదను ధ • ర్మస్థేయు శ్రీరాము, నా
 నాయాజ్ఞం జని రాణివాసముల కా • ర్యల్! రండు భూనాథుఁడు
 న్వే యుందుం జనుదెం డటంచుఁ బలికె • న్నిమ్మెల్ల నా నాసతుల్. ౫

ఇల్లాండ్రురన్=భార్యలను- ఆల్వాదులలోని ఉవర్ణంబునకును బూర్ణబిందు పూర్వకఙ్కారం బాదేశంబగు, ఇల్లాలు=ఇల్లాండ్రు సూ. ౧౩ సు. వా. కొన్ని బహువచనాంత నామంబులమీఁద బహువచనంబగు- ఈ బహువచనమున ఉవర్ణకముపై ఉవర్ణకము రువర్ణకముపై దువర్ణకమువచ్చును. కాఁగా ఇల్లాం డ్రురు అని రూపమేర్పడియె. సు. వ్యా. అచ్ఛిక ౫౩. భార్యాయుక్తంబుగన్= భార్యతోఁగూడినవాఁడనై, ధర్మస్థేయున్=ధర్మమున స్థిరబుద్ధిగల, రాణివాస ములకున్=అంతఃపుర స్త్రీలకు, ద్వి-రాణివాసద్రోహి రావణుఁబట్టి, పోఁడిమి చెఱు పవాబుధులు నుతింప॥ రంగ. ఆర్యల్=ఆర్యలారా! మధ్యమపురుషంబునం

దారగాగమంబు లోపంబు పైకల్పికంబు, వే=శీఘ్రముగ- రాజాజ్ఞయని చెప్పకున్నఁగైకయింటికి నొకతెయు వచ్చియుండదు.

తాత్పర్యము

ఇచటికి నా భార్యలనందఱఁ దోడుకొని రమ్ము. భార్యలతోఁ గూడినవాఁడనై పితృవాక్యపరిపాలనధర్మమందు స్థిరబుద్ధిగల శ్రీరామునిఁ జూడఁగోరెదను. నేను మాత్రము చూచిన శ్రీరామచంద్ర ముఖదర్శనమైనను వారికి లేకపోవును. అదియునుగాక తల్లులు గావున వారంద ఱేకవాక్యముగఁ బ్రార్థించిన వారి మాట విని నిలుమనేమో కావున నా యాజ్ఞప్రకారముపోయి (రాజాజ్ఞలేక యంతఃపురములకుఁ బురుషులెవ్వరు పోరాదు) రాణులనందఱఁ బిలువుమన సుమంత్రుఁడు పోయి రాణులనందఱఁజూచి యార్యలారా! రండు రాజు మీరంద ఱచ్చటికి రావలయునని యానతిచ్చెను అని చెప్పఁగా నా స్త్రీలు

దీనివలన గృహస్థులు భగవద్దర్శనము తా మొకరేచేయక భార్యలతోడఁ జేయుట శ్రేయస్కరమని సూచన.

తే॥ మూఁడువందలయేఁబడి • ముద్దరాండ్రు
కెంపువాఱినకన్నులఁ • గీడుపడుచు
సరగఁ జనుదెంచి రటకుఁ గౌ • సల్య బలసి
యంతట సుమంత్రు సుతుఁ బిల్వ • మనియె నృపతి. ౯౪౩

మూఁడువందల యేఁబది=మున్నూటయేఁబదిమంది, ముద్దరాండ్రు= స్త్రీలు, కర్మధారయంబున నదంతశబ్దముల కాలుశబ్దము పరంబగునపుడు నిత్యమ్ముగను ఉదంతములమీఁద బహుళంబుగ రుగాగమమంబగు- ముద్దరాలు- పేదరాలు లోనైనవి సు. వా. సంధి ౫౮ సూ. ముగ్ధశబ్దభవముముద్ద- కెంపు వాఱిన కన్నులన్=కన్నుల నీరుకాఱ నేడ్చుటచే నెఱ్ఱనైన కన్నులతో, బలసి = చుట్టుకొని, కీడుపడుచున్=కన్నులనిండ నీరుండుటచేఁ ద్రోవకానరాక పడుచు లేచుచు వచ్చిరని భావము.

తాత్పర్యము

మున్నూటయేఁబది మంది భార్యలు రాజాజ్ఞ తిరస్కరింపరాదని శ్రీరామునిఁ జూచు కోరికగలవారగుటను నేడ్చుటచే జోతులవలె నెఱ్ఱగానుండు కన్నులతో బాధపడుచుఁ దొందరగాఁ గౌసల్యను జుట్టుకొని యచ్చటికి వచ్చిరి. అంతట దశరథుఁడు శ్రీరాముని లోపలికిఁ బిల్వుమని సుమంత్రుతోఁ జెప్పెను.

భర్త యాజ్ఞనిచ్చెనేని భార్యలు భగవద్దర్శనార్థమై యాయపతోడఁ బోరానిచోటులకైనఁ బోవచ్చునని సూచన.

కం॥ ఆమాట యెఱుఁగఁ జెప్పిన, రాముఁడు లక్ష్మణుఁడు సీత • రాఁ దనవెంటన్
భూమీశు డాయఁ జనియెం, జేమోడ్పున నట్లు వచ్చు • సీతాకాంతున్. ౯౪౪

తాత్పర్యము

సుమంత్రుఁడు రాజుగారు రమ్మనినారు లోపల రండని చెప్పఁగా సీతయు లక్ష్మణుఁడు తనవెనుక రాఁగాఁ జేతులు జోడించుకొని శ్రీరామచంద్రమూర్తి రాజును జేరఁబోయెను. ఇట్లు వచ్చు శ్రీరాముని

—• దశరథుఁడు సీతారామలక్ష్మణులఁ జూచుట. •—

కం॥ అంతంతం గని ధరణీ,కాంతుం డాసనమునుండి • కడువడి దుఃఖా
క్రాంతమనస్కుం డయి త,త్కాంతలతో లేచె రాము • దాయం జనఁగన్.

కొంచెము దూరమునందే చూచి రాజు తానున్న యాసనమునుండి దుఃఖముచే నాక్రమింపఁబడిన మనస్సుగలవాఁడై తన వెంటలేచిన స్త్రీలతోడ శ్రీరామున కెదురుగాఁబోవఁ దాను లేచెను. దాయన్. రూ. డాయన్.

కం॥ రామున కెదురుగఁ బరువిడి, భూమీశుఁడు పోవలేక • పుడమిం బడియెన్
సాము తెరువునన్ దుఃఖభ,రామితజని తాశ్రుముకుళి • తాక్షుం డగుచున్. ౯౪౬

సాము=సగము, దుఃఖ........తాక్షుండు = దుఃఖాతిశయముచే నమితముగాఁ బుట్టిన కన్నీటిచే మూఁతలుపడిన కన్నులుగలవాఁడై.

తాత్పర్యము

శ్రీరామున కెదురుగఁ బరువెత్తుచుఁబోయి దుఃఖాతిశయముచే నమితముగఁ బుట్టిన కన్నీళ్ళచే త్రోవగానరాక పోవలేక సగముదూరమునందే భూమిమీఁదఁ బడెను.

శా॥ ఆరంగూరినయార్తిమై నిపతితుం • డైనట్టి భూకాంతునిం
జేరం బోవుచు రామలక్ష్మణులు చే • సేసెత్త హా రామ రా
మ్హా రామా యనుకామినీజనుల హా • హాకారముల్ భూషణో
దారారావము విశ్రమై బదిలిసెనా • ధాత్రీశుగేహంబునన్. ౯౪౭

ఆరంగూరిన=పూర్ణముగాఁగలిగిన, నిపతితుండు=పడినవాఁడు, చేసెతన్=ఒకరిచేతులమీఁదనుండి మఱియొకరి చేతులమీఁదికి– "చేసేతం బృథివీశులంది కొనఁ గాశీ పుణ్యతోయంబులన్ జేసెన్ మజ్జనము" అని తిక్కన నిర్వ, హాహాకారములు=హాహా యను ధ్వనులు, భూషణోదారారావము = సొమ్ములయతిశయించిన ధ్వని, ధాత్రీశుగేహంబునన్=రాజు నింటియందు.

తాత్పర్యము

నిండారుదుఃఖముచే భూమిమీఁదఁబడిన రాజును సమీపించి శ్రీరామలక్ష్మణులు చేచేనెత్తఁగా హా రామా హా రామా హా రామా యను స్త్రీల హాహాకారములు, వారు ధరించిన భూషణములరవళి వారు తల సొమ్ము కొట్టుకొనుటచేఁ గలిగిన ధ్వనులు రాజునింటఁ గలసి యతిశయించెను.

కం॥ రాముఁడును సౌమిత్రియు, భూమీశ్వరుఁ దమకరములఁ • బొదవుచు సీతా
వామాక్షితోడ నెత్తుచు, నామంచముమీద నుంచి • రాసీనుఁడుగన్. ౯౪౮

శ్రీరాముండును లక్ష్మణుఁడును సీతావామాక్షితోడ భూమీశ్వరుఁ దమ కరములఁ బొదవుచు నేడ్చుచు ఆమంచముమీఁద నుంచిరని యన్వయక్రమము.

తా త్ప ర్య ము

దీనివలన నెంతటి పతివ్రతయైనను నిష్కామదృష్టిచేఁ దాఁకవలసినంత కార్యముపడినపుడు తండ్రివావి గల పురుషుఁ దాఁకుట దోషముగాదు.సకామయై తండ్రి దోడులనైనఁ దాఁకరాదు. భావము ప్రధానము. దశరథుని దాఁకుటచే, విరాధుని దాఁకుటచే, రావణుఁ దాఁకుటచే,సీత పాతివ్రత్యమునకు హానిరాలేదని యామె యగ్నిప్రవేశకాలమునఁ జేసిన ప్రమాణములును- హానిచెందకుండుటయు సాక్ష్యము. తనభావముకొలఁది పుణ్యపాపములుగాని యితరుల భావముఁ బట్టికాదు.

శ్రీరామలక్ష్మణులు సీతాదేవితో రాజును దమ కరములతోఁ బొదివి దుఃఖించుచు నా మంచముమీఁద నా ముగ్వురు గూర్చుండఁబెట్టిరి.

ఉ॥ మూరుత మూర కుండి నృప•ముఖ్యుఁడు మూర్ఛను దేఱ నంజలిన్
జేరిచి తండ్రిఁ జూచి యను • శ్రీరఘురాముఁడు మాకు నెల్ల క్షో
ణీరమణుండ వీవు దగు•నే ధృతి దప్పఁగ దండకాటవిన్
జేరఁగ బోదు నాజ్ఞ దయ•సేయుము చూడుము చల్లఁజూపులన్. ౯౪౯

మూరుతము=అల్పకాలము ప్ర. ముహూర్తము. ౪౮ నిముషములకాలము.

తా త్ప ర్య ము

కొంచెము కాలము మాటలాడకుండి రాజు మూర్ఛనుండి లేవఁగానే శ్రీరాముఁడు చేతులుజోడించి తండ్రినిజూచి యిట్లనియె. మాకు నందఱకు నీవు రాజవు. నీవే యిట్లు ధైర్యము విడువఁదగునా ? దండకారణ్యమునకుఁ బోవుచున్నాను. అజ్ఞయిమ్ము. మమ్ము దయార్ద్రదృష్టితో శాంతముతోఁ జూడుము.

—• శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో వనమునకుఁ బోవ ననుజ్ఞ వేఁడుట. •—

కం॥ సీతయును లక్ష్మణుండును, నాతోడ న్వచ్చువారు • నయగతి నెంతెం
తో తథ్య హేతువుల నా,చేత నయునయంతపట్టు•చెప్పితి నిలువన్. ౯౫౦

తా త్ప ర్య ము

సీతయును లక్ష్మణుఁడును నావెంట నరణ్యమునకు వత్తురు- న్యాయము ననుసరించి సత్యమైన కారణముల నెన్నెన్నో చెప్పి నిలుపుటకు నాచే నయినంత ప్రయత్నముచేసి చూచితిని.

కం॥ నే నెంతయు వారించిన, మానక నాతోడ రాఁగ•మతిగొని నిలువన్
గా నొల్లరైరి యిచటం, గానన్ మైకొంటి వారు•కానకు రాఁగన్. ౯౫౧

మైకొంటిన్ = అంగీకరించితిని.

తా త్ప ర్య ము

నే నెంత వలదు వలదని యడ్డగించినను వదలక నా వెంటవచ్చు మనస్సు గలవారై యిచ్చటనుండుట కిష్టపడినవారుగారు- కావున వారు నావెంట వచ్చుట కంగీకరించితిని.

కం॥ మానుము దుఃఖము నాకున్, జానకికిని లక్ష్మణునకు•సరగున సెల వి
 మ్మా నాయన! ప్రజ కజువలె, నా నవనీవిభుఁడు పల్కె•నందనుతోడన్.

తండ్రీ! దుఃఖము వదలుము. నాకు- సీతకు- లక్ష్మణునకుఁ బ్రజకు బ్రహ్మదేవునివలెఁ ద్వరగా ననుజ్ఞయిమ్ము అనియడుగఁగా రాజు శ్రీరామున కిట్లనియె.

శ్రీరామచంద్రమూర్తి తన విషయమై లక్ష్మణు విషయమై యనుజ్ఞ వేఁడవచ్చునుగాని భర్తస్వాధీనయగు సీతావిషయమునఁ దండ్రియాజ్ఞ యేల? భార్య తన స్వాధీనురాలయినను దాను దండ్రికి నధీనుఁడు కావున నాయనకుఁ దెలుపక యేపని చేయరాదు.

తేషా మనుపరోధేన, పారత్ర్యం యద్యదాచ రేత్।
తత్తన్ని వేదయే త్తేభ్యో, మనోవచనకర్మభిః॥ మను. ౨౩౬

కొడుకు మనస్సుచేఁగాని, వాక్కుచేఁగాని కాయముచేఁగాని పారలౌకిక కార్యము తండ్రి శుశ్రూషకు విఘ్నములేకుండ నేదిచేయునో యది యెల్లఁ దండ్రికిఁ దెలుపవలయును. భారతమున విపులోపాఖ్యానంబున శిష్యుఁడు గురుభార్య నేవిధముగా రక్షించినది గురువునకుఁ జెప్పనికారణముచేఁ బాపము నొందెను. కావున సీత కనుజ్ఞవేఁడుట ధర్మ్యమే.

చం॥ తలఁపఁగ లేక మున్ను వ•రదానవిమోహితబుద్ధిఁ గైకమా
 యలవలలందుఁ జిక్కుకొని • యారట మందుచు నుంటఁబట్టి యిం
 తలు జనియించె, నన్నిపుడ • తండ్రి! నిరాకరణం బొనర్చి భూ
 తలము సమస్తముం గొనుము • తథ్యము నావలు కాదరింపుమీ. ౯౨౩

వరదాన విమోహితబుద్ధిన్ = వరముల నిచ్చుటచే మోహముచెందిన బుద్ధిచే, ఇంతలు=ఇంతటి విపరీతములు, "ఇంతలు పుట్టినచోటను" అని తిక్కన భారతము, నిరాకరణంబు=తిరస్కారము, తథ్యము=సత్యము.

తా త్ప ర్య ము

రాఁబోవు కష్టము లాలోచింపక వరములనిచ్చుటయే కదా యని దీనివలన నేమి కీడురాఁబోవునని యజ్ఞానినై కైక పన్నినమాయవలలోఁ జిక్కుకొని పరితపించుచుండుటచేత నింతటి విపరీతములు పుట్టెను. వలదంటినా సత్యహాని- పొమ్మంటినా ప్రాణహాని- ఈ రెండుగండములలోనుండి నీవు నన్నుఁ దప్పింపవలయును. నన్నుధిక్కరించి యిపుడు నేనడవికిఁబోనంటివా నాకు సత్యహాని లేదు. ప్రాణహాని లేదు. కావున నట్లుచేసి సమస్తరాజ్యము నీవే తీసికొనుము. ఇది సత్యము. నే వలదనువాఁడఁగాను. ఈమాత్రము నామాటయం దాదరణ ముంచుము.

ఇంతవఱకు దశరథుఁడు తానై నోరుదెఱచి శ్రీరామచంద్రమూర్తిని నీవడవికిఁబొమ్మని చెప్పలేదు. అట్లు చెప్పినది కైక. ఇప్పుడు నీవు పోవలదనుచున్నాఁడు. ఇది పితృాజ్ఞకాదా? ఏల శ్రీరామచంద్రమూర్తి దీని నిరాకరించెను.

తనయెదుటఁ గైక చెప్పినమాటను నెపుడు దాను ప్రత్యాఖ్యానముచేయలేదో యప్పుడే దశరథుఁ డంగీకరించెననుట స్పష్టము.

ఇతఁ డిప్పుడు చెప్పునది యుపచారము మాటయే. కాని పరమార్థవాక్యము గాదు. ఏలన రామచంద్రమూర్తికిఁ బ్రత్యుత్తరముగఁ బోయిరమ్మనెను.కావున నుపచారపుమాటలఁ బాటింపరాదు. అదియునుగాక తన్ను ధిక్కరించి రాజ్యము గ్రహింపుమనెను. అది పుత్రుని స్వధర్మమునకు విరుద్ధకార్యము. స్వధర్మవిరుద్ధమైన కార్యము నెవరు చెప్పినను వినరాదు. యస్స్వధర్మ పరిత్యాగీ పాషండిత్యుచ్యతే బుధైః॥ స్వధర్మము విడుచువాఁడు పాషండుఁడు పతితుఁడగును. ఆ స్వస్థచిత్తుఁడైన కారణమున స్వధర్మహాని కలిగించు కార్యము తండ్రి చెప్పినను గొడుకు వినరాదు. భర్తచెప్పినను భార్యయు వినరాదు. కావుననే సీత నిరాకరించెను.

పత్యురవ్యవలిప్తస్య, కార్యాకార్యమజానతః
తదాజ్ఞా నతు కర్తవ్యా, పతితస్యతు సర్వదా.

గర్వముచే నిది చేయఁదగినది యిది చేయరానిది యని తెలియక యాజ్ఞాపించిన భర్త యాజ్ఞగాని పతితుఁడైన భర్తయాజ్ఞగాని భార్య యెప్పుడు చేయనేరాదు.

చం॥ అనిన నృపాలుఁ జూచి జన•కాత్మభవాహృదయేశుఁ డాడు నీ
వనఘః సహస్రవర్షములు•హాయిగ నేలుము దేశ మింక, నీ
వనృతము పల్కనేల సుకృ•తాత్మక! నాదునిమిత్త మక్కటా
చనియెద దండకాటవికి • సౌఖ్యము మీఱఁగ నంద యుండెదన్. ౯౩౪

జనకభవా హృదయేశుఁడు = జనకరాజు పుత్రికయైన సీతకుఁ బ్రాణవల్లభుఁడు– రాముఁడు, అనఘ=పాపరహితుఁడా, ఇంతవఱకు నీవేమి పాపముచేసిన వాఁడవు కావు. ఇప్పుడు నాకారణమున నీకేల పాపము రావలెను, సహస్రవర్షములు=వేయేండ్లు, హాయిగన్ = సుఖముగ, అనృతము = అసత్యము, సుకృతాత్మకా=పుణ్యాత్మా.

తాత్పర్యము

అని చెప్పిన రాజునుజూచి శ్రీరాముఁ డిట్లనియె. పుణ్యాత్మా! నీ వింతవఱకు నేపాపముచేసి యెఱుఁగవు.ఇప్పుడు నా నిమిత్తముగ నీవేల యసత్యమాడినవాఁడవు కావలయును. నేనడవికిఁబోకుండిన నీవిచ్చిన వరములు వ్యర్థములగుటచే నీ వసత్యమాడినవాఁడవే కదా యగుదువు. ఆ దోషము వ్యర్థముపోవునా? నిన్నా

దోషమునుండి తప్పించు శక్తి నాకుండియు దానిఁ జేయనేని దోషము నాకును గలుగును గదా? నన్నుఁ జెఱచుకొని నిన్నుఁ జెఱిచిన రాఁగల లాభమేమి? దేహకష్టము పడఁగానే నేమి హాని. దేహకష్టమునకు వెఱవవలయునా? పరలోకహానికి వెఱవవలయునా? నిన్నసత్యవాదిం చి తిరస్కరించి యవిధేయుఁడనై వర్తించి రాజ్యమంతయు గ్రహించినను, నాకేమి సంతోషము- కావున దండకారణ్యమునకుఁ బోయెదను. సుఖముగా నందేయుండెదను.

కం॥ తొమ్మిదియు నైదు నేండ్లు వ,
నమ్ములఁ గ్రుమ్మరుచు నుండి॰నాబాసయుఁ దీ
ర మ్మరలఁ దండ్రి నీపాదమ్ముల. దర్శించువాఁడఁ॰దథ్యం బనినన్.

క్రుమ్మరుచున్=సంచరించుచు, బాస = బాషాశబ్దభవము = ప్రమాణము, తీరన్=చక్కఁబడఁగా, పాదమ్ముల దర్శించువాఁడన్=లంకలో రావణవధానంతరము దశరథుని దర్శించుటచే నిది సత్యమయ్యెను.నిన్నుఁ జూచెదనని చెప్పెనే కాని కౌసల్యకుఁ జెప్పినట్లు మరల నిటవచ్చి అని చెప్పలేదు,తథ్యము=సత్యము.

తాత్పర్యము

తొమ్మిదియైదు సంవత్సరములు వనములందుఁ దిరుగుచుండి నాప్రమాణము చక్కఁబడఁగా నీ పాదదర్శనము చేయువాఁడ- ఇది సత్యము.

తీరమ్మరలన్=తీరన్+మరలన్ - ప్రాసంబున మకారంబు పరంబగుచో ద్రుతంబునకు మకారాదేశంబగు లయ - 'కమ్మనిలతాంతములకు మెమ్మనసి- భార. ఆది. ౨ ఆ. మత్త. వృష్టిఁ జేరిసెమ్మహానది దీర్ఘకాసరసీవనంబులు నిండఁగాన్' అర. ౩ ఆ. ప్రౌ. వ్యా. సంధి ౨౨.

ఆ॥ సత్యవాక్యపాశ॰సంయుతుం డయి రహ,స్యముఁ బత్ని చేతఁ॰జెప్పఁబడుట
నార్తిఁగూరుచును ని॰జాత్మజు శ్రీరామ,చంద్రుఁ గాంచి పలుకు॰జనవిభుండు.

సత్యవాక్యపాశ సంయుతుండయి=సత్యవాక్యమనెడి త్రాటిచేఁ జక్కఁగాఁ గట్టఁబడినవాఁడై, రహస్యము=ఏకాంతమున- మఱెవ్వరు లేనిచోట, ఆర్తిగూరుచును = దుఃఖపడుచు.

తాత్పర్యము

ఏకాంతమం దెవ్వరులేనిచోట భార్యచేఁ జెప్పఁబడి సత్యవాక్యమను పాశముచేఁ గట్టబడినవాఁడగుటచేత మిగుల దుఃఖపడుచుఁ దన కొడుకు శ్రీరామచంద్రునిఁజూచి రాజిట్లనియె.

—॰ శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవ దశరథుఁడు సమ్మతించుట. ॰—

కం॥ ఇహమునఁ బెంపును బరమున,
మహితాభ్యుదయంబుగాఁ గు॰మారా! యిఁక భీ
రహితాధ్వమునను జిరశుభ,సహితంబుగఁ బోయి మరలి॰చయ్యనరమ్మా.

ఇహమునన్=ఈ భూలోకమందు, పెంపు=గొప్పతనము, పరమునన్= ఆ లోకమందు- గొప్ప మేలుకలుగునట్లు, భీరహితాధ్వమునన్ = భయములేని

మార్గమున, చిరశుభసహితంబుగన్=శాశ్వతశుభముతోఁగూడినవాఁడవై, చయ్యనన్ = శీఘ్రముగా.

తాత్పర్యము

ఇహమందు గొప్పతనము పరమందు గొప్ప మేలుగలుగునట్లుగా నాయనా యిఁక మేలుకలుగుమార్గమున శాశ్వతశుభముతోఁ గూడినవాఁడవై పోయి శీఘ్రముగా మరలిరమ్ము.

ఉ॥ ప్రాకటధర్మశీలుఁడవు•బంధురసత్యరతుండ వట్టిని
న్నా కగునే మరల్ప రఘు•నందన శక్యము, కోర్కినొక్కటిం
జేకొని తీర్పు, మీనిశ వ•సింపుము నాకడఁ గాన కిప్పుడే
పోకుము, యొండుపూఁ టయిన•బుచ్చెద హాయిగ నీదుకూటమిన్.  ౯౨౨

ప్రాకట ధర్మశీలుఁడవు=ప్రసిద్ధముగా ధర్మమును నాచరించు స్వభావము గలవాఁడవు, బంధురసత్యరతుండవు=సత్యమందు నధిక ప్రేమగలవాఁడవు.

తాత్పర్యము

ప్రసిద్ధధర్మము స్వభావముగాఁగలవాఁడవు- సత్యమునందు మిక్కిలి ప్రీతిగలవాఁడవు. అట్టి నిన్ను రాఘవా! మరలింప నాకు శక్యముగాదు. అయినను నాకొక్క కోర్కిగలదు. అది నెఱవేర్పుము. ఈరాత్రి నాయొద్దనుండుము. ఇప్పుడే యడవికిఁబోకుము. ఒకపూఁటయినను నీతోడ హాయిగాఁ గడపెదను.

ఉ॥ తల్లిని జూడ నన్న! నను•దండ్రిని జూడుము పుత్ర! మాకుఁగా
నుల్లము రంజిల న్నిలుము•యొక్కదినం బిట నాశ దీరఁగా
నెల్లనొసంగి నీకుఁ గని•దృప్తివహింతుము, నీప్రతిజ్ఞ యుం
జెల్లఁగ వేఁగుబోకటను•జేయ పయాపయనంబు నిచ్చపై.  ౯౨౩

వేఁగుఁబోకటన్ = రేపటి ఉదయమున.

తాత్పర్యము

అన్నా! రామచంద్రా నిన్నుఁ గన్నతల్లిని జూడుము. నీ వడవికిఁబోయెదవని యొట్లు పొక్కి పొక్కి యేడ్చుచున్నదో- కుమారా- తండ్రిని వృద్ధుఁడను నన్నుఁ జూడుము. మా నిమిత్తమై మా మనస్సులకు సంతోషముగలుగ నొకదినంబిటనుండుము. మా యాశదీర సమస్తము నీకుఁ గట్టిపెట్టి నిచ్చి చూచి తృప్తిపడుదుము. నీ ప్రతిజ్ఞదీర్ప నీ యిష్టప్రకార ముదయంబున లేచిపొమ్ము.

కం॥ ఎంతయుఁ బ్రియయుఁ నలఁ బాయుచుఁ,
నాంతారముఁ బోవ నీవు•గడఁగితి సీతా
కాంతా! నాప్రియమునకై, యెంతటి దుష్కరము సేయ•నెంచితి పుత్రా.

తాత్పర్యము

నీకు మిక్కిలి ప్రియములగు వాని నెల్లవదలి నాకుఁ బరలోకమున సంతోషము గలిగింప నీ వడవులకుఁ బోవఁబూనితివి. కొడుకా యెంతకష్టకార్యము చేయ నాలోచించితివి.

ఇచ్చటఁ బ్రియమనిన నిహలోక ప్రియముగాదు. శ్రీరామునరణ్యగమనము దశరథునకుఁ బ్రియమనుటమీఁది పద్యమునకు వాస్తవమునకు విరుద్ధము. కావునఁ బరలోకమునఁ బ్రియమనియే చెప్పవలయును.

ఉ॥ బాస యొనర్తు సత్యమునఁ • బాప మొకండును నే నెఱుంగ- న
న్మోసము చేసి యీకుటిల • మోహమునన్ మసికట్టివహ్ని యీ
దోసమురాశి వంశగుణ • దూషక యింతలు చేసె, నీవు న
య్యో యసతివాక్యమే నిలుప • యోజన చేసితి వేమి చేయుదున్. ౯౬౧

తాత్పర్యము

కుమారా! సత్యము మీఁదఁ బ్రమాణముచేసి చెప్పుచున్నాను. నే నేపాప మెఱుఁగను. నీ విషయమున ద్రోహబుద్ధి నాకు లేదు. ఈ కుచ్చితురాలు మోహముచే నన్ను మోసము చేసెను. ఈ బూడిదె కప్పిన నిప్పు, ఈ పాపములరాశి, వంశగుణమును నిందలపాలు చేసినది, యింత ఘోరకార్యములుచేసెను. అయ్యో నీవుకూడ దాని మోసమునే నిల్పఁజూచెదవు.ఇఁక నేనేమి చేయఁగలను.

కైక మోసముచేసెనంటివి. ఆమె చేసినది యేమి? నీవు పూర్వ మిచ్చెద నన్న వరములనే కదా కోరెనందువా. అది సత్యమేకాని లోకమున వరములు గోరువారు తన్ను నమ్మి దగ్గఱఁ జేరిన వాని గొంతుకోయునట్లు భార్యగదా నా యందుఁ బ్రేమగలదికదా నాకేల యహితము గోరునని విశ్వసించి నీ వరముల నిచ్చెదనన్నమీఁద నాచేఁ బ్రమాణము చేయించుకొని యింతటి ఘోరములైనవి కోరవచ్చునా? ఇది వేశ్యాలక్షణమేకాని పతివ్రతలక్షణమా, తన కొడుకునకు రాజ్యముఁ గోరినఁ గోరనీ- నీవేల యడవులకుఁబోవలె. ఇది కుచ్చితముగాదా, ఇది మోసముగాదేని యిఁక మోసమన నెట్టిది ?

కం॥ ఇది యేమి వింతకార్యము, పెదకొడుకై నీవు గలుగఁ • బేరిమి నాకున్
మదిఁ తలఁతె యనృతదోషముఁ,
బొదవింపఁగ నెంతలైన•బుధనుత యనినన్. ౯౬౨

తాత్పర్యము

నీ వడవికిఁ బోవుటయనునది యేమి యాశ్చర్యమైన కార్యము. నీవు నాకుఁ బెద్దకొడుకై యుండి యెంతకష్టములు వచ్చినను నా కసత్యదోషము గలుగ వర్తింతువా అనఁగా.

—• శ్రీరాముఁడు తన మనోనిశ్చయముఁ దండ్రికిఁ జెప్పుట •—

కం॥ జనకుని యార్తాలాపము, విని రాముం డనుజుఁగూడి•విరవిరవోవన్
దను విట్టు లనియెఁ దండ్రికిఁ, జనునే నీటోఁటి కిట్లు•సంతాపింపన్. ౯౬౩

తనువు=శరీరము

తా త్ప ర్య ము

తండ్రిచెప్పిన శోకముతోఁగూడిన మాటలనువిని శ్రీరాముఁడు తన తమ్మునితోడ దేహము విరవిరఁ బోవుచుండ నీ ప్రకారము చెప్పెను. తండ్రీ! నీ విట్లు సంతాపించుట పాడిగాదు.

కం॥ భూపాల! నీ వొసంగెడు, నాపరమపదార్థసమితి•నందినవాఁడన్
జే పెవ్వ రిత్తు రయ్యా? యీపాటికిఁ గాన వాని•నిచ్చింపఁ జుమీ. ౯౬౪

తా త్ప ర్య ము

రాజేంద్రా! నీ వియ్యఁదలఁచిన యన్ని పదార్థములు నేను గ్రహించినవాఁడనే. గ్రహించిన నెంత సంతోషమో నీమాట వలన నంత సంతోషించితిని. అయ్యా! యీనాఁడు నీవిచ్చిన జేపీవేళ నెవరిత్తురు? జేపటినుండి లేనివి యీనాఁ డొకనాఁడు లేకున్న నేమి కొఱఁత-కావున వాని మీఁద నాకుఁ గోరికలేదు.

కం॥ అర్థిమెయి నీ వొసంగువ, దార్థములకు మాఱు నేను•దగ నీబాసన్
వ్యర్థంబుచేయ కెటులేన్, సార్థకముగఁ జేయ నిమ్ము•యుఁగెద వనికిన్.
అర్థిమెయిన్ = ప్రేమతో. ౯౬౫

తా త్ప ర్య ము

నా కక్కఱలేని పదార్థముల నిచ్చెద నంటివి. అవి నాకేల! నాకుఁగావలసినది కోరెదను. వానికి బదులుగానిమ్ము. అది యేమనెదవా? నీ ప్రమాణము వ్యర్థముగాకుండునట్లు సార్థకమగునట్లు నన్నుఁ జేయనిమ్ము. అడవికిఁ బోయెదను.

మ॥ వనవాసంబున కీయకొంటి నిఁకఁ ద•ప్పం బోదు నానిశ్చయం
బనఘా! సక్షితిలోకపూగధనధా•న్యం బై నయైశ్వర్యమున్
మును నీకై కకుఁ జెప్పినట్లు భరతుం•బూన్పం గదే-నేను నీ
పనుపారం బదునాలుగేఁడులు వనీ•వాసాళితో నుండెదన్. ౯౬౬

ఈయకొంటిన్ = అంగీకరించితిని, సక్షితి లోకపూగధనధాన్యంబు=భూమితోను- జనులసమూహముతోను- ధనములతోను- ధాన్యములతోను గూడినది, ఐశ్వర్యము=ప్రభుత్వసంపద, పనుపు=ఆజ్ఞ, ఆరన్=పరిపూర్ణముగునట్లు, వనీవాసాళితోన్=అడవులందుఁ గాఁపురముచేయువారితో- ఋషులతోనని యర్థము.

తా త్ప ర్య ము

అడవులందుఁ బదునాలుగు సంవత్సరములుందునని యంగీకరించితిని- ఆనానిశ్చయము తప్పదు. తప్పెనేని నేనసత్యవాది నగుదును. భూమి-జనసమూ

హము - ధనము ధాన్యముతోఁగూడిన ప్రభుత్వసంపద సర్వము పూర్వము నీకైతకు నీవు చెప్పినట్లు భరతుఁడు పూనునట్లు చేయుము. నేను నీయాజ్ఞపూర్తి చేయుటకు ఋష్యాదులతోడ నుందును.

కం॥ అవనీశ సౌఖ్యమునకై, యవనివిభుత్వంబునకుఁ బ్రి•యంపడ నీవే
తవు నటు సేయు మన న్నే, నవు నని యీకొంటి నీదు•నాజ్ఞం దీర్పన్. ౯౬౩

తాత్పర్యము

"రాజేంద్రా! ప్రభుత్వమువచ్చిన సుఖమువచ్చునుగదా యని సౌఖ్యాభిలాషమున నేను యువరాజుగానుండ నంగీకరించినవాఁడనుగాను. నీవే ఇది తగును నీవిట్లు చేయుము"మని చెప్పఁగానే నీయాజ్ఞ మీఱరాదు గావున నీయాజ్ఞ నెఱవేర్ప నే నంగీకరించితిని.

ఉ॥ మాను విచారమున్, ధరణి•మండల మెల్లను గైకపట్టినిం
బూనుపు, మెల్ల రాజ్యమును•భోగము లొల్లఁ, బ్రియంబు లొల్ల, నీ
యానతిఁ దీర్చువాఁడ, హృద•యంబున మానుము దుఃఖ, మ్రుశులన్
బూనకు, మాపగాధవుఁడు•పొందునె క్షోభము నెన్నఁ డేనియున్? ౯౬౪

అపగాధవుఁడు=సముద్రుఁడు, క్షోభము=కలఁత, పూనుపుము=పూనునట్లు చేయుము, పూనునకిది ణి జంతరూపము.

కం॥ కాంచన మాలాలంకృత, చంచత్తనులీల మెఱయు•జవనాశ్వములం
బూంచి రథంబున, మణిమయ, పంచానన కేతు వెత్తె•బంధురభంగిన్॥
భారత. విరా. ౪-౪౫-౫౫.

తాత్పర్యము

నీవూ-దుఃఖమును మానుము-భూమండలమంతయు భరతుఁడు భరించునట్లు చేయుము.నేను రాజ్యమొల్లను-భోగములు నొల్లను-ప్రియపదార్థము లొల్లను-నాకుఁ గావలసినది నీయాజ్ఞ నెఱవేర్చుటే- దానిని జేయువాఁడను. హృదయమున దుఃఖము మానుము. పైటికి బాగుండినను లోపలఁ గ్రుళ్ళుచుండిన నేమి లాభము. కన్నీళ్ళు కార్పకుము. అది యెట్లు సాధ్యమందువేని సముద్రుఁడెప్పుడైన లోపల భాగమునఁ గలఁతనొందునా. సముద్రమున నెంత క్షోభముగలిగినను మీఁదిభాగమందే కాని లోపల నేకలఁతయునుండదు.

ఉ॥ ఒట్టిడుకొందు సత్యమున•నొప్పుగ నీదుసమక్షమందు నీ
వెట్టును సత్యవాది వగు•టే మదిఁ గోరెద, నొల్ల రాజ్యమున్
దొట్టిసుఖంబు, లొల్లఁ బ్రియుఁ•దోయజనేత్రను సీత, నొల్ల నె
ట్టెట్టివి కోర్కు, లొల్ల దివి•జేంద్రునిపట్టన, మొల్లఁ బ్రాణముల్. ౯౬౫

ఒట్టిడుకొందున్ = ప్రమాణముచేసెదను, ఎట్టును = ఏవిధముగనైనను, తొట్టి = మొదలుగాఁగల.

### తాత్పర్యము

సత్యముపై నీయెదుటనే ప్రమాణముచేసెదను. నా కోరికయంతయు నీవు సత్యవాదివి కావలయుననియే. కావున దానికి విరోధించెనేని రాజ్యము మొదలుగాఁగల సుఖముల్లొల్లను. నా యర్ధాంగలక్ష్మి సీతను నొల్లను. ఇంకనేవేవి కోరఁదగిన కోర్కులున్నవో వానినొల్లను. ఈలోకమునందలివేకావు దేవేంద్రుని పట్టనమిచ్చినను నొల్లను- ఇంతయేల నా ప్రాణములైన నే నొల్లను.

శా॥ తండ్రీ! నేను నిమేషమైన నిచటం•దారంగ రా దింక. నీ
కండ్రావిం గని దుఃఖ మొందకుము ని•క్కం బింత నామాట వే
ఱొం డ్రాఁ బోవదు కోరెఁ గైకయియు న•న్నుగ్రాటవిం బోవఁగాఁ
బండ్రెండు న్మఱి రెండువత్సరము ల•వ్వాక్యంబు నే నొప్పితిన్. ౯౩౦

తారంగరాదు=నిలువరాదు, కండ్రావి=చూచుటకు ఘోరమైనది- ఇది దేశ్యపదము- నామాట వేఱొండు రాఁబోవదు.

### తాత్పర్యము

తండ్రి నేనొక నిమిషమైన నిచట జాగుచేయుచు నిలువరాదు. ఈ ఘోరమునుజూచి దుఃఖింపకుము. ఇది నిజము. నానోట నిదితప్ప వేఱొండుమాట రాఁజాలదు. నీవు నన్నుఁ బొమ్మనలేదు. నేను నీతోఁ బోయెదననలేదు. కైక నన్నుఁ బదునాలుగేఁడులు వనములందుండఁ బొమ్మనెను. ఆమాట నే నంగీకరించితిని.

కం॥ అసత్యముఁ బాలించెదఁ, వాసిగ నానావిహంగ•వరమృగపాళీ
వాసిత మరణ్యదేశము, వాసముఁ గావింతు మేల•వగచెదు జనకా. ౯౩౧

### తాత్పర్యము

నేను జేసిన సత్యమును గాపాడుకొనెదను. నీ వరణ్యమునకుఁ బొమ్మంటివని నేను బోయితినని యాయాసపడను. కావున నీవలన నాకి కష్టము ప్రాప్తించెనని వగవకుము. ఆ తల్లి చెప్పినది- ఈకొడుకు పోయినాఁడని యూరడిల్లుము. కావున నా మాటప్రకారము అనేకవిధములైన పక్షులు పెద్దమృగములు వాసముచేయు నడవికిఁబోయెదను. తండ్రీ! యేలవగచెదవు.

కం॥ దేవతల కైనఁ దండ్రీ! దైవము జనకుండ యనుచుఁ•దగ వినియుంటన్
దైవంబ వనుచు నీనుడిఁ, గావించెడివాఁడ నేల•కాఱియపడఁగన్? ౯౩౨

దేవతలకైనను దైవము జనకుఁడేయని వినియున్న కారణమున నీయాజ్ఞ దేవునియాజ్ఞగాఁ దలఁచి నీమాట సార్థకముచేసెడివాఁడను. దీనికై యేల బాధపడెదవు.

కం॥ కడచనఁ బదునా ల్గబ్దము, లడవులలోఁ బిదపఁ జూడ•నగు నీవు ననున్
గడతేఱఁ గృతార్థుఁడ నై, విడువుము శోకంబు నన్ను•విడు మిప్పటికిన్.

కడచనన్ = తుదముట్టఁగా- కడఁచిపోఁగా, కృతార్థుఁడను = అనుకొన్న కార్యము చేసినవాఁడను.

తాత్పర్యము

పదునాలుగేండ్లు అడవులలోఁ గడచిపోఁగాఁ బిదప ననుకొన్న కార్యము చేసిన నన్నుఁ జూడవచ్చును. కావున శోకము వదలుము. ఇప్పటికి నన్ను వదలుము.

ఉ॥ నీవగపాటు గాంచి జన • నీముఖసర్వజనంబు బాష్పధా
రావికటీకృతాక్ష మయి • రాపిడి చెందెను, వారిఁ దేర్పఁగా
నీవ కవయ్య యింక, నిటు • నీవ వగంబడఁ దేర్పువార లే
రీ, వసుధాస్థలిం భరతుఁ • బ్రీతిని గూర్పుము నేను వీడితిన్. ౬౪

వగపాటు=వ్యసనపడుటను, జననీముఖ సర్వజనంబు=తల్లులు మొదలగు జనులందఱును, బాష్పధారావికటీకృతాక్షము=కన్నీటి ధారలచే నెఱ్ఱగా భయము కలుగునట్లుగఁ జేయఁబడిన కన్నులుగలవారై, రాపిడి=బాధ.

తాత్పర్యము

నీవు పడెడి వ్యసనమునుజూచి నాతల్లి మొదలగువారందఱు నాకై యటుండ నీ నిమిత్తమైకూడఁ గన్నీటిధారలచే రూపుమాఱిన కన్నులతో బాధ పడుచున్నారు. వారిని సమాధానపఱుపవలసినవాఁడ విఁక నీవేకదా. నీవే యిట్లేడ్చుచుండిన నీకు సమాధానము చెప్పువారెవరు? వారికి సమాధానము చెప్పువారెవరు? ఎవ్వరు లేరు. కావున నీవు దుఃఖముమాని భరతుఁడు రాజ్య భాగము పూనునట్లుచేయుము. నేను రాజ్యమును వదలితిని.

రాజ్యమిచ్చుటకు నీయకుండుటకుఁ దండ్రి దశరథుఁడు స్వతంత్రుఁడు పుత్రాజ్ఞకుఁ బనిలేదు. రామచంద్రమూర్తి దనుటకు నాయనకుఁ బట్టాభిషేకము గానులేదు. ఇట్లుండ నేను విడిచితి- నీవు రాజ్యము భరతునకిమ్మను నధికారము శ్రీరామున కెందుండివచ్చెను. ఇది లేని యధికారము వహించి చెప్పిన మాట కాదా ?

శ్లో॥ మణిముక్తాప్రవాళానాం, సర్వస్యైవ పితాప్రభుః
స్థావరస్యతు సర్వస్య, నపితా నపితామహః ॥

రత్నములు, ముత్తెములు, పగడములు లోనగు చరపదార్థములకుఁ దండ్రి ప్రభువు. స్థావరములకుఁ దండ్రిగాఁడు. తాత గాఁడు. అను వాక్యముండుట చేతనే శ్రీరామచంద్రమూర్తి సాద్రిసకాననంబుగానని చెప్పెను. అదియునుగాక తాను రాజ్యము వదలుకొంటిననుటచే వంశపరంపరాగతరాజ్యమును జ్యేష్ఠున కీయక కనిష్ఠునకిచ్చెనను నిందయుఁ బెద్దకొడుకు సమ్మతిలేకయే స్థావరములను బరులపాలుచేసెనను నిందయుఁ బూర్వదినమునఁ జేసిన రాజ్యప్రధాన ప్రతిజ్ఞకు భంగము లేకుండుటకుఁగానట్లు చెప్పెను.

ఉ॥ ఏఁ జనినంతటన్ భరతుఁ • డీమహి సాద్రిసకాననంబుగాఁ
బోఁజులు దీరి మంది తను • భక్తి భజింపఁగ నేలుఁగాక యే
గోఁజును లేక, నీనుడిని • గోర్కని దీర్చెద, నానిమిత్తమై
రోఁజెద వేల యిట్టు లతి • రూక్షముగాఁ, బయనింప నిమ్మఁకన్. ౬౩౭

ఏన్ = ఏను- నేను మొదటిరూపము- నేను నీవు వాఁడు లోనగు కొన్ని తొలుతనజాదులుగానుండి యావల హలాదులు నయ్యెను. ఏను ప్రథమావిభక్తి రూపము గావున కళయని నొకఁడు సాధింప వ్యర్థముగఁ బ్రయత్నించెను. కాని యది ద్రుతప్రకృతికమే. ఏనులోని నువర్ణముమీఁది యచ్చుపోఁగా, ఏన్ అని యయ్యెను. భారతమునందంతట నేను అను రూపము కానరాదు, మహి = భూమి, సాద్రి=పర్వతములతోఁ గూడినది, సకాననము=అడవులతోఁ గూడినది, పోఁజులు కట్టి=బారులుదీఱి- ఇది యన్యదేశమని తోఁచుచున్నది. పోఁజనకుఁ దురకభాషయందు సేన యని యర్థము. సేనయందు భటులు చాలులు చాలులుగా నెట్లుందురో యట్లని యర్థము, మంది=జనులు, గోఁజు=బాధ, రోఁజెదవు = నిట్టూర్పులు విడిచెదవు.

తాత్పర్యము

నేను దండకారణ్యమునకు వెడలిపోఁగా భరతుఁడు కొండలతో నడవులతోఁ గూడిన యీ రాజ్యమునంతయుఁ బారులుదీఱి జనములు తన్ను భక్తితో సేవింపఁగా నే బాధయులేక పరిపాలించునుగాక నీ యాజ్ఞప్రకారము నీ కోఁరిక దీర్చెదను. నా నిమిత్తమై యేల యింత క్రూరముగ నిట్టూర్పులు విడుచుచున్నావు, నాప్రయాణము సాగనిమ్ము.

ఇంద్రవంశము. ధీమజ్జనుల్ మెచ్చెడి•దేవరానతిన్
నేమంబుమైఁ దీర్పఁగ•నేనుగోరవ
శ్రీమేలిభోగంబుల•నిచ్చగింపఁ జూ
భూమీశ నాకై యిటు•పొక్క నేటికిన్. ౬౩౮

ధీమల్ + జనుల్=బుద్ధిమంతులగు మనుష్యులు, దేవరానతిన్=ప్రభుఁడవైన నీ యాజ్ఞను, నేమంబుమై=నియమముతో, పొక్కన్=వ్యసనపడ, ఇంద్రవంశవృత్తమునకుఁ దతజరగణములు తొమ్మిదవ యక్షరము యతి.

తాత్పర్యము

బుద్ధిమంతులు మెచ్చెడి నీయాజ్ఞను నియమముతో వ్రతముగాఁబూని నెఱవేర్ప నేను గోరినట్టి శ్రేష్ఠంబులైన భోగంబులను గోరను జుమా. రాజా! యేల నాకై వ్యసనపడెదవు.

తే॥ కలలాడించి నిను నేను•గాంక్ష సేయు, వాఁడనే రాజ్యకామజీ•వముల నకట?
సిత్యయైనను నా కేల•చెప్పెద విను, నీదుసత్యవ్రతం బెందు•నెగడుఁగాక.

తాత్పర్యము

నీచే నబద్ధమాడించి రాజ్యమును, భోగములను, ప్రాణములను నేనా కోరువాఁడను? సత్యమును విడువవలయునా? సీతను విడువవలయునా? యను సందేహము వచ్చునేని యెట్టి కష్టదశయందును విడువరానిదియుఁ, ప్రాణముల కంటెఁ బ్రియమైనదియు, నూ ఱసత్యములు చెప్పియయిన భరింపవలసినదియు నని శాస్త్రములు విధించు భార్యనైన వదలెదనుగాని సత్యమును వదలను.

శా॥ వ్యాఖ్యానం బిఁక నేల తండ్రి ఫలమూ•లాలీదళవ్యూహ మే
ముఖ్యాహారముగా మలల్ నదులసొం•పుల్ చూచుచున్ దండకా
ప్రఖ్యాతాటవిఁ జొచ్చి కల్పలతికా•ప్రఖ్యద్రుమచ్ఛాయలన్
సౌఖ్యం బారఁగ నుందు నీకు నిట స•త్సాఖ్యంబు సంధిల్లు నాన్. ౯౪౮

వ్యాఖ్యానంబు=వి + ఆఖ్యానంబు=విశేషించి చెప్పుట, ఫలమూలాలీ దళ వ్యూహ మే=పండ్లు- వేరులసమూహములు=ఆకులగుంపులు- వీనినే, మలల్ = కొండలు, ప్రఖ్యాతాటవి=ప్రసిద్ధమైన యడవి, కల్పలతికా ప్రఖ్యద్రుమచ్ఛాయ లన్=కల్పవృక్షముల సన్ననితీఁగలవంటి కొమ్మలతో సమానములైన చెట్లనీడల యందు-

తాత్పర్యము

తండ్రీ! చెప్పెద విను పెక్కుమాటలతోఁ బనిలేదు. కార్యము జరుగవలసి నది ప్రధానము.జరుగవలసిన దేమియందువా- పండ్లుకందమూలాదులు ఆకులు ఇవి ముఖ్యమైనయాహారముగాఁ (దీనివలన మాంసము పూర్ణముగా నిషేధింప లేదు) గాని కొండలు నందమైన యేళ్ళను జూచుచు దండకయని ప్రసిద్ధి కెక్కిన యడవియందుఁ గల్పవృక్షముకొమ్మలతో సమానమైన చెట్లనీడల వసిం చుచు హాయిగా నుందును- నీవో యిచ్చట సుఖముగా నుండుము.

కం॥ శోకంబునఁ దాపంబున, వ్యాకులుఁడై దశరథుండు•నాత్మజు సంశ్లే
షాకలితుఁ జేసి సోలెం, బ్రాకటచేష్టావిహీను•పగిదిన్ ధరపై. ౯౪౯

వ్యాకులుఁడై=మనస్సుకలఁత చెందినవాఁడై, ఆత్మజున్ = కొడుకును, సంశ్లేషాకలితున్=ఆలింగనముతోఁగూడిన వానిని, ప్రాకటచేష్టావిహీనుపగిదిన్= బొత్తిగాఁజేష్ట లేనివానివలె- నన(గాఁ బీనుఁగువలె.

తాత్పర్యము

శ్రీరాముఁడు తన్ను విడిచిపోవునే యను శోకముచేత నిద్రాహారములు లేక విశేషించి యేడ్చుట వలని దేహతాపముచేత గుండెచెదరినవాఁడై దశరథుఁడు కొడుకును గౌఁగిలించుకొని శవమువలెఁ గాలు సేతులాడింపక నేలమీఁదఁబడెను.

శా॥ హాహాకారము నిండఁగా నృపతియు•ల్లాం ద్రందఱున్ జేనిపె
న్మోహంపున్నతి కైక దక్క వగలో•మున్గన్, సుమంత్రుఁడు వ్యా
మోహోద్దామత మూర్ఛ స్రుక్క, నవలా•మూఁకల్ దురంతవ్యథన్
హాహా నాఁగ, సుమంత్రుఁ డంతఁ బటుకో•పాటోప మేపారఁగన్. ౯౮౦

తా త్ప ర్య ము

దశరథుని ముద్దుభార్య కైక తప్పఁ దక్కిన రాజభార్యలందఱు హాహా యను ధ్వనులచే నేడువఁగా (కైక దశరథుఁడు చచ్చినఁ జావనీ తనకొడుకునకు యౌవరాజ్యము మాఱు పూర్ణరాజ్యము వచ్చుననియుఁ బదా నేడ్చినఁగార్యహాని యనియు నూరకుండెను.) సుమంత్రుఁడు మిగుల మోహాతిశయముచే శోషిల్లఁగా నితర స్త్రీలందఱు నపారదుఃఖముచే నయ్యో, అయ్యో! యనఁగా సుమంత్రుఁడు లేచి తీవ్రమై యతిశయమైన కోపముతో. దీనికిఁ గ్రియ ౯౮౨-వ పద్యములోని 'వచించు' ననునది.

మోహంపున్నతి. వ్యాకరణము. "గరువపున్మురుపులోనగు స్థలముల స్థిర వర్ణము వరమైనపుడు నుగాగమముగలదు." సు-వ్యా-సంధి-౪౫. సూ.

—• ౩౫-వ సర్గము. సుమంత్రుఁడు కైకను దూషించుట. •—

చం॥ కటకట పండ్లు గీఁటి, యెస•కంబునఁ గేలు విదిర్చి, కన్నులన్
జొటచొట నిప్పు లుర్ల, మెయి•సొం పఱఁ, బైపయి వెచ్చ నూర్పుచున్,
జిటచిటలాడుచున్, నృపతి•చిత్తముజాడ నెఱింగి, కైకకుం
బటపట గుండియల్పగిలి•బ్రద్దలు వాఱఁగ, వాక్ఛరంబులన్. ౯౮౧

గీఁటి = కొఱికి, ఎసకంబునన్ = మిగులఁద్వరగా, విదిర్చి = విదలించి, నిప్పులు=నిప్పులవంటి వేఁడినీళ్ళు, ఉరలన్ = రాలఁగా, మెయిసొంపు = దేహ కాంతి, అఱన్=చెడఁగా, వాక్ఛరంబులన్ = మాటలను బాణములచే.

వ్యా- వాక్ఛరము- వాక్ + శరము = పూర్వమందు ఝయ్యులును బర మందు 'అమ్మ'లును గల శవర్ణమునకు ఛకారము వికల్పంబుగనగు. "వాక్శరము" అనియునగును. సు-వ్యా-సం-౬౬-సంస్కృతశబ్దసంధి ప్రకర ణము.

తా త్ప ర్య ము.

కటకటయని ధ్వనికలుగునట్లు పండ్లుకొఱికి మిక్కిలి వేగమునఁ జేతిని విద లించి కన్నులనుండి నిప్పులవంటి వేఁడినీళ్ళు చొటచొట రాల దేహకాంతిమాసి పోఁగా మీఁద మీఁద వేఁడి యూర్పులు పుచ్చుచుఁ గోపముచేఁ జిటజిటమని రాజు మనస్సు విధము దెలిసికొని కైకను దాను దిట్టినను రాజు కోపింపఁడని తెలిసి కొని కైకకు గుండెలు పట పట పగిలి తునుకలుగాఁగ వాక్కు లను బాణములు.

చం॥ హృదయము గాఁడి పాఱ, నుడి•యేటుల మర్మము లెల్ల వ్రయ్య, దు
ర్మదచరితన్ వచించు నిటు•ప్రాణధవున్ జగతీప్రభున్ దయా
సదనుని నాజినిన్ విడువఁ•జాలిననీ కొనరింపరానియ
ట్టిది యొకఁ డుండునే ధరఁ గ•డింది, యదేమిటి యాఁడుదానవే. ౯౭-౨

తా త్ప ర్య ము

హృదయమున నాఁటి దూసికొని యావలఁ బోవఁగా మాటలను దెబ్బలచే దేహము నలిగులిగాఁగఁ బొగరుపోతు నడవడిగలదానిని జూచి యిట్లనెను. ఓసీ-ప్రాణభర్త, భూమిపతి, దయావంతుఁడునగు దశరథుని వదలిననీకుఁ జేయరాని కార్యము వేఱొకటిగలదా. నీవేమియాఁడుదానవే- ఎంత దుష్టస్త్రీయైన నిట్లు చేయునా?

చం॥ తలఁకెడివాఁడు గాఁడు వసు•ధాపతి శైలమురీతి, నింద్రుఁడుం
బలె గెలువంగ దుర్జయుఁడు•వారిధి బోలెఁ గలంగఁ డట్టి యీ
బలియుని నీకుచేష్టలను•భంగము పెట్టితి వెంతజాణవే ?
తలఁతుఁ బతిఘ్ని వంచుఁ జెడు•దాన కులఘ్నివి గావె వెండియున్.

తా త్ప ర్య ము ౯౭౩

ఈరాజెంత యాపదలు వచ్చినను గొండవలె ధైర్యము విడిచెడివాఁడు కాఁడు. ఇంద్రునివలె నెట్టి శత్రువునైన జయింపఁగల శక్తిగలవాఁడు. సముద్రమువలె క్షోభము లేనివాఁడు. అటువంటి దేహబలము మనోబలము గలవాని నీవు కుచ్చితపుఁ జేష్టలచే నడుములు విఱిగి కూలఁబడునట్లు నలుగురిలో నవమానపడునట్లు చేసితివి. ఎంత నేర్పరివే. ఓసిదుర్మార్గురాలా: నీవు పతిని జంపిన దానవేకావు. కులముకూడ నాశము చేసిన దానవని తలంతును.

శ్లో॥ అవిద్వాంస మలంలోకే । విద్వాంస మపివాపునః ।
నయంతి హ్యుత్పథం నార్యః । కామక్రోధవశానుగమ్॥భార-౧౩-౪౭-౩౪

అవిద్వాంసునిఁగాని విద్వాంసునిఁగాని కామక్రోధములకు వశపడిన వానిని స్త్రీలు చెడుమార్గముల నీడ్తురు- దశరథుఁడు శైలము- ఇంద్రుఁడు- సముద్రమువంటి వాఁడైనను గామదాసుఁడగుటచే సతినినిగ్రైక యున్ని యాట లాడింపఁగలిగెను మూత్రపాత్రములపై వ్యామోహముగల మగవారి బ్రదుకిట్టిదే- "కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్"- మనుచరిత్ర సుమంత్రుఁడు కైకను బతిఘ్నివని తిట్టవచ్చునా? తిట్టుట తప్పుగాదు.

౧. దశరథుని యప్పటిస్థితిచూడఁ బెక్కునాళ్ళు బ్రదుకఁడని స్ఫుటముగఁ దోఁచెను. బ్రదికినను జీవచ్ఛవమే.

౨. అగ్నిర్గురు ద్విజాతీనాం । వర్ణానాం బ్రాహ్మణోగురుః । పతిరేకో గురు స్త్రీణాం। సర్వస్యాభ్యాగతోగురుః॥వృద్ధమనువు॥ బ్రాహ్మణుల కగ్ని గురువు.

అన్ని వర్ణములవారికి బ్రాహ్మణుఁడు గురువు. స్త్రీలకు భర్తయొకఁడే గురువు. అందఱకు నభ్యాగతుఁడు గురువు.

"గురుర్మమ గురుస్త్వం వై । యతోదైవతదైవతః ।
దేవాతిదేవ స్తస్మాత్త్వం । నక్తూనాథత్స్వమేప్రభో.
అశ్వమేధము- నక్తుప్రస్థ చరిత్రము.

ప్రభూ! నా గురువునకు నీవు గురువు. నాదైవమునకు నీవు దైవము. దేవతల నతిక్రమించిన దేవుఁడవు. కావున నాపాలి పిండియుఁ గైకొనుము. ఇది కోడలు మామతోఁ జెప్పినమాట- కావున స్త్రీలకు భర్తను మించిన గురువు లేఁడు.

"త్వమిత్యుక్తాతునిహతో, గురుర్భవతి భారత
గురూణా మవమానోహి, వధ ఇత్యభిధీయతే
అథర్వాంగిర సీహ్యేషా, శ్రుతి రేషా సనాతనీ ॥

గురువును నీవు నీవు అని పలుకుటయే యతనిఁ జంపినట్లు- గురువు నవమానించుటయే యతనిఁ జంపుట యని వేదము చెప్పుచున్నది. ఇది శ్రీకృష్ణ వాక్యము భార- కర్ణ. ఈ కారణముచేఁ గైక మగని నవమానించి పలుకుటచేఁ జంపినదే యయ్యెను. దశరథుఁ డదృష్టవంతుఁడు గావున మరణించెను. లేకున్న నలువురిలో నేమని తలయెత్తి తిరుగఁ గలఁడు? కావున సుమంత్రుఁడు పలికినది దుష్టముగాదు.

కం॥ కొడుకు లొకకోటి యుండినఁ, బడఁతికి విభు ననుసరింప•భవ్యం బగు నీ
యెడ వరదుఁడు మగఁడు నీ్కి,
పుడుగక కాఠింపఁ దగునె•యువిదా యిట్టుల్? ౯౦౪

తాత్పర్యము

ఒకతెగకుఁ గోటిమందికొడుకులున్నను పతి యసమర్థుఁడైనను మగని ననుసరించియుండవలసినది విధి. అదియే క్షేమమార్గము. అటులుండ నీయన నీవు కోరిన వరము లిచ్చువాఁడును మగఁడును. అట్టి వానిని నీవు వయస్సు పొగరుచే నిట్లు బాధింపవచ్చునా? యువతి శబ్దభవము ఉవిద.

తే॥ కాలధర్మంబుఁ గనెనేని•క్ష్మావరుండు, నవల వయసునఁ బెద్ద రా•జ్యంబు సేఁత ధర్మ, మీరాజు జీవించు•తరుణమంద, కొడుపఱుపంగఁ జూచెదా•పాడి నేఁడు.
కాలధర్మము=మరణము, పాడి=న్యాయము. ౯౦౫

తాత్పర్యము

లోకములోని ధర్మప్రకార మొకరాజు మరణించిన వెనుక నతని పెద్దకొడుకు రాజ్యము చేయుటయు శాస్త్రసమ్మతమైన కార్యము- న్యాయమిట్లుండ నీరా జూపిరితోనుండఁగానే యాన్యాయము చెఱుపఁ జూచుచున్నదానవు.

ఉ॥ నీకొడుకే ధరిత్రిఁ గొనుఁగనీ, ప్రభుతం గననీ, ధ్రువంబుగా
లోకుల మెల్ల రాముఁ డెటఁ లోలమతిం జరియించు నందము
శ్రీకుల మై చరించెద, మిఁకనీ, నెఱిమాలిననీదువీటిలో
నేకరణి న్వసింతురు సుధీంద్రులు సజ్జను లార్యసత్తముల్. ౬౭౬

లోలమతిన్ = ఆసక్తిగలమనస్సుతో, ముత్+శ్రీ+కులమై=సంతోషలక్ష్మి గలవారమై, నెఱిమాలిన=న్యాయము వదలిన, సుధీంద్రులు=బుద్ధిమంతులలో శ్రేష్ఠులు, సజ్జనులు=సాధువులు, ఆర్యసత్తముల్=ఆర్యులందుత్తములైనవారు.

తాత్పర్యము

నీ కొడుకే రాజ్యము గొనెనా- ప్రభువయ్యెనా- దృఢముగాఁ జెప్పెద వినుము- శాశ్వతంబుగా లోకుల మగు మేమందఱము శ్రీరాముఁడెందు నాసక్తితోఁదిరుగుచుండునో యందే సంతోషసంపద ననుభవించుచు వసించెదము. శ్రీరాముఁడెచటనున్నాఁడో యచటనే మాకు సర్వసౌఖ్యములు- సర్వభోగములు- సర్వసంతోషములుగాని నీతిమాలి న్యాయము దప్పిన నీయూరిలో మంచిబుద్ధి గల పండితులు మంచినడవడిగల సాధువులు-పెద్దవారు నెవరుందురు.

కం॥ ఇట్టిభవచ్చరితకు హా, చిట్టలు క్షితితల మదేలఁ జీలదొ రెండై
తిట్టరుకాదే యని నృప, పట్టింగారించు నిన్నుఁ బరమమునీంద్రుల్. ౬౭౭

చిట్టలు=చిత్రములు, నృపపట్టిన్=రాజకుమారుని,

తాత్పర్యము

అహా! యేమి చిత్రము- నీ యిటువంటి లోకధర్మవిరుద్ధపు నడవడికి భూమి రెండై పగిలిపోకయున్నదే- అధర్మము సహింపని యీవసిష్ఠాది మహామునులు నిన్నేల శపింపక క్షమించి యూరకున్నారో.

కం॥ మామిడిని నఱికి గొడ్డట, వేమును బా ల్పోసి పెంపఁ బెలయునె తీపై
నీమాతయట్ల నీవును, వేమున స్రవియించునొక్కొఁ బెలఁదీ తేనెల్. ౬౭౮

వేము = వేఁపచెట్టు.

తాత్పర్యము

మామిడి చెట్టును గొడ్డలిచే నఱికి పాఱవైచి దాని స్థానమున వేఁపచెట్టును నాటి పాలుపోసి పెంచినను నది తీపుకాఁగలదా. పట్టమహిషియగు కౌసల్యను నాదరింపవలసియుండఁగా నిన్నొకగొప్పచేసి యాదరించి దశరథుఁడు నెత్తిపై నెక్కించుకొనఁగానే నీవు మంచిదానవు కాఁగలవా. కాలేవు. నీతల్లి యెటువంటిదో నీవటువంటిదానవే- వేఁపచెట్టునుండి తేనెలు కాఱునా.

కం॥ నినుఁ గన్నతల్లియగుణము, వినినారము పూర్వమునను•విశ్రుతరీతిన్
గనినార మిపుడునీయెడ, వనితా! యెటు దాఁప నౌ స్వ•భావగుణంబుల్.

అగుణము=చెడ్డగుణము, విశ్రుతరీతిన్=ప్రసిద్ధముగా. ౯౪౯

తాత్పర్యము

నిన్నుఁ గన్నతల్లిచెడ్డగుణము పూర్వము సుప్రసిద్ధము గావింటిమి- అట్టి గుణము నీయందిపుడు కంటిమి- స్వభావగుణములు దాఁచుటెవరికి వశము. తేలునకుఁ గుమ్మరిపురుగు పుట్టునా ?

చం॥ ఎఱుఁగమె నీదుతల్లికథ • నెవ్వఁడో సిద్ధుఁడు నీదుతండ్రికిన్
నెఱి మృగకోటిపల్కెఱుఁగు • నేర్పు ఘటింప వరంబు పేర్మిఁ దా
నెఱుఁగుచు నుండి పాన్పున శ•యించినవేళను బైఁడిచాయ యై
కొఱలెడిచీమపల్కునకు•గొల్లున నవ్వె నృపాలుఁ, డంతటన్. ౯౫౦

తాత్పర్యము

నీ తల్లిచేసిన దుశ్చేష్ట చెప్పెద వినుము. ఎవరికిఁ దెలియదని తలఁచితి వేమో. ఒక సిద్ధుఁడు నీ తండ్రికిఁ బశు పక్ష్యాదుల మాటలు తెలిసికొను నేర్పు వరంబుచే ననుగ్రహించెను. ఒకనాఁడు పడుకటింటిలో భార్యతోడ శయనించి యుండిన సమయమందు బంగారువన్నెగల చీమమాట కాయన గొల్లుననవ్వెను.

సీ॥ కినుక పెంపార నీ•జనని యాతనిఁ జూచి,
యేల నవ్వితి విది•యెఱుఁగఁ దెలుప
మన్న నోదేవి! నే•నాడరా దది చెప్పి, నంతన మరణంబు•నందువాఁడ
ననిన నాతనిఁ జూచి•యుపహసించెడి నన్ను, నేల నీ కింతటి•యెల్లిదంబు
చావుము బ్రదుకు మే•చందమైనను గన్ను, చెప్పక విడ నంచుఁ•జేడె పలుక
తే॥ వరమ్మొసఁగిన ఘనున కా•వార్తఁ దెలుపఁ,బాడు గానిమ్ము చావనీ•పడఁతి జేఁడ
చెప్పకుమటన్న నట్ల యా•చెడిపెవిడిచి,హాయిగ జరించె ధనదుని•యట్టులతఁడు.

ఎల్లిదంబు=హేళనము, చెడిపె=చెడ్డస్త్రీ, ధనదునియట్లు=కుబేరునివలె.

తాత్పర్యము

అట్లు రాజు నవ్వఁగాఁ గోపాతిశయముచే నీ తల్లి యాయనను జూచి యేల నీవు నిష్కారణముగా నవ్వితివి. చెప్పుమనెను. నేనది చెప్పరాదు. అది చెప్పిన వెంటనే మరణము ప్రాప్తించునని నా గురువు నాజ్ఞ. కావునఁ జెప్పననెను. ఆమె నన్నవమానించిన పిమ్మట నీవు చచ్చిననేమి, బ్రతికిననేమి, చచ్చినఁ జావుము. బ్రదికిన బ్రదుకుము. నీవు నవ్వినకారణము చెప్పకతప్పదు. నన్నుఁజూచి నవ్వి యవమానించితివి అని నిర్బంధింపఁగా నా రాజు తనకు వరమిచ్చిన సిద్ధున కా వార్త తెలిపి యేమిచేయుమనెదవనెను. ఆయన రాజా యది యెటులైనఁ బాడుగాఁ బోనీ చావనీ. నీవుమాత్రము దానికి మర్మము చెప్పవలదనెను. ఆమాటప్రకారము నీతండ్రి దుష్టురాలైన నీ తల్లిని నూప వెడలఁగొట్టి సుఖించెను.

అట్లుచేయక నీకు దాసుఁడగుటచే నీ రాజు శ్లేడ్చుచున్నాఁడు. తా నేడ్చుటే కాక లోకమునంతయు నేడ్పించుచున్నాఁడు.

చం॥ అనయపుఁజెట్టసేఁతఁ దలి•యంతటిదానవు నీవు కావె? దు
ర్జనులు చరించుత్రోవను స•సద్విషయంబున నోసి పాపినీ!
జనపతి నేచె దీ విపుడు•సత్యము తల్లినిబోలి కూఁతురున్
జనకునిఁబోలి పుత్రుఁడును•సంభవ మందుదు రన్న నానుడుల్. ౯౯౨

అనయపుఁ జెట్టసేఁతన్ = నీతిమాలిన చెడుకార్యము చేయుటయందు, ఏంచెదు = బాధించెదవు, నానుడి=సామెత.

తాత్పర్యము

నీతిమాలిన చెడుకార్యము చేయుటయందు నీతల్లి యంతటిదానవు నీవు కావా? అంతకంటె నెక్కువై నదానవే. దుష్టజనులు పోవుత్రోవఁబోవుచుఁ జెడు విషయమునందుఁ బాపాత్మురాలా రాజును బాధించెదవు. అది యథార్థమే. ఎట్లన:— తల్లినిఁబోలి కూఁతురు తండ్రినిబోలి కొడుకు పుట్టుదురన్న సామెత కలదు గదా. అది యేల తప్పును.

చం॥ జనము వినంగఁ బల్కినర•సాపతివాక్యము సాగ నిమ్ము నీ
జననిని బోలఁ బోకు, పతి•సమ్ముఁ గొల్వుము, పౌరకోటికిన్
ఘనతర సమ్మదం బమరఁ•గా శరణం బవు గమ్ము, దేవరా
జనిభుని లోకభర్తఁబతి•సంకటపెట్ట కధర్మ మూనఁగన్. ౯౯౩

రసాపతి = భూమిపతి. రాజు.

తాత్పర్యము

లోకులందఱు వినునట్లు పలికిన రాజుమాట చెల్లనిమ్ము. నీతల్లివలె రాజును జంప యత్నింపకుము. భర్తను భక్తితో సేవింపుము. పురజనులకు మిక్కిలి సంతోషము గలుగునట్లు దిక్కుగమ్ము. ఇంద్రునితో సమానుఁడైన భూమి భర్తను నధర్మకార్యము చేయుమని బాధింపకుము.

చం॥ వరములు పొల్లుపోవు నని•వారిజనేత్ర తలంప, కింతకున్
గురుతర మైనసంపదలఁ•గూర్చెడు నీధరణీశ్వరుండు, దు
ర్భరబలశాలి జ్యేష్ఠు జన•రక్షణశీలు స్వధర్మరక్షకున్
బరమవదాన్యు రామవిభుఁ•బట్టముఁ దాల్పఁగ నిమ్ము దేవెరీ! ౯౯౪

పొల్లుపోవును = వ్యర్థములై పోవును, పరమవదాన్యు = గొప్ప దాతను, దేవెరీ = దేవీ.

తాత్పర్యము

నాకిచ్చిన వరములు వ్యర్థములాయెనని తలంపకుము. ఇప్పుడు నీకుఁగల యైశ్వర్యముకంటె హెచ్చుసంపదలను రాజు నీకుఁ గలిగించును. మిక్కిలి బల

వంతుఁడు కావుననే రాజ్యరక్షణమందు సమర్థుని, జ్యేష్ఠుఁ, శాస్త్రప్రకారము వంశాచారము ప్రకారము పట్టాభిషేకమున కర్హుఁడైన పెద్దకొడుకును- జనులను రక్షించుటే స్వభావముగాఁ గలవాఁడు కావుననే సామర్థ్యము హక్కుమాత్రమే గాక స్వభావముచేతను రాజుగానుండఁదగినవాఁడు. స్వధర్మరక్షయందుఁ బట్టు తలగలవానిని- మిగుల దాతను లోభితనములేక తాను సంపాదించినదంతయు నే నెపముచేనైన మరలఁ బ్రజలకే యిచ్చువానిని. ఇటువంటి శ్రీరామునిఁ బట్టముఁ గట్టుకొన నిమ్ము.

కం॥ ధరణిపతిఁ దండ్రిఁ బాయుచుఁ నరిగిన శ్రీరామచంద్రుఁ•డడవులకును సు
 స్థిర మై జగంబునందుం, బరివాదము నీకుఁ గల్గుఁ•బరికింప మెదన్.

 పరివాదము = నింద.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు రాజును దండ్రిని వదలిపెట్టి యడవులకుఁబోయెనా నీకు నిందతప్పదు. చక్కఁగాఁ బరిశోధించి చూడుము. నాకు రాజు వరము లిచ్చెదననెను నేను గోరుకొంటిని నాకేల యపనింద యనెదవా రాజును విడిచి శ్రీరాముఁడు పోయెనా మీఁదఁజెప్పిన రాజలక్షణములుగల శ్రీరాముఁడు లేమిని రాజ్యమరాజకమగును. ఇఁక నీరాజును గౌరవించువాఁడెవఁడు? ఉండియు లేనట్లే. లేదా శత్రువులువచ్చి మీఁదఁబడిరేని యీ ముసలిరాజేమి చేయఁ గలఁడు? రాజ్యము పరాధీనమగును. అప్పుడు నీ కపకీర్తి తప్పదు.

తండ్రియగు దశరథుని రామచంద్రమూర్తి వదలిపోయెనా దశరథు నంతటివాఁడే శ్రీరామునివంటి కొడుకును వదలెనే మన మేల వదలరాదని లోకులు వక్రమార్గములఁబోయిరా యట్టివారి నీ రాజేముఖము పెట్టుకొని శిక్షింపఁగలఁడు? ఆ యనర్థమునకు నీవు కారణమగుటచేతను నీకు నింద తప్పదు. ఇది బాగుగ నాలోచించుకొనుము.

ఉ॥ రాముఁడు గాన కేగినఁ బు•రంబున నంతటివాఁడు గల్గఁడో
 భామిని! కాన రాజ్యమును•బాలన సేయఁగ నిమ్ము రామునే,
 రాముఁడు రాజిలంగ యువ•రా జయి ఱేఁడు పురాచరిత్రమున్
 దా మది నెంచి కానకు య•థామతిఁ బోవుఁ దపంబు సల్పఁగన్. ౯౯౬

తాత్పర్యము

శ్రీరాముఁడు వనములకుఁబోయెనా రాజ్యపరిపాలనమం దంతటి సమర్థుఁడు లేఁడు. కాఁబట్టి కోపస్వభావురాలా- నీ కోపమువదలి శ్రీరాముఁడే రాజగునట్లు చేయుము. శ్రీరాముఁడు రాజుకాఁగాఁ బెద్దలచరిత్రము ననుసరించి రాజు వాన ప్రస్థాశ్రమ మంగీకరించి యడవులకుఁబోయి తపస్సు చేసికొనునుగాక.

చం॥ నయముగ, నిష్ఠురంబుగ, మ:నంబు గలంగఁగఁ, గేలు మోడ్చుచున్,
ఘనుఁడు సుమంత్రుఁ డాడినను గాఁటియు పొందదు, భ్రుక్కుదింతయున్
మనమున, నాస్యసీమ రుచి మార్చదు, కింకను దింప దేమియున్
వనిత నిజాశయంబు నెఱపన్ సమగట్టుట గట్టివాయి యై. ౯౯౩

నిజాశయంబు=తన యభిప్రాయమే, గట్టివాయి=గయ్యాళి.

తాత్పర్యము

సీతియు క్తముగను బరుషముగను మనసు కలఁతపాఱునట్లు చేతులు ముకు ళించియే గొప్పవాఁడగు సుమంత్రుఁడు పల్కఁగాఁ (దన యభిప్రాయమే కొన సాగవలెనని గయ్యాళి ప్రయత్నించుటచే) మనసునఁ గైక యేబాధయుఁ బొందినదికాదు. కొంచెమైన భ్రుక్కుదు- ముఖకాంతి మార్చదు- కోపమును దగ్గింపదు.

—• { ౩౬-వ సర్గము. దశరథుఁడు శ్రీరామునితోడ సైన్యాదులు పంప సుమంత్రునితోఁ జెప్పుట. } •—

తే॥ కైకమోము ప్రసన్నతా కలన గనక, యుంటఁ గనుఁగొని జనపతి కంటినీరు
జాలువాఱఁగఁ బైపయిఁ జాలవెడలు,నూర్పులను బల్కఁ దనవర మూహచేసి.

ప్రసన్నతాకలన = ప్రసన్నమైయుండుటను. ౯౯౪

తాత్పర్యము

ఇంతచెప్పినను కైక మోము ప్రసన్నముగాకుండుట చూచి రాజు కన్నీరు వెల్లువగఁగార్చుచు మీఁదమీఁద వేఁడియూర్పులు విడుచుచుఁ దానిచ్చిన వరముల నూహించి దశరథుఁడు సుమంత్రునితో నిట్లనియె.

కం॥ సూతా! సంతనకట్టుము, సీతాపతితోడ నరుగ క్షిప్రము రత్నో
పేత చతుర్విధసేనా,జాతంబుల నస్త్రశస్త్ర సంఘంబులతోన్. ౯౯౫

సంతనకట్టుము=సిద్ధముచేయుము, క్షిప్రము=వేగను, రత్నోపేత=రత్నము లతోఁగూడిన, చతుర్విధ సేనాజాతంబులన్ = నాలుగువిధములైన సేనాసమూ హములను.

తాత్పర్యము.

సారథీ! శ్రీరామునితోఁ బోవుటకై రత్నాదులతో రథగజతురగపదాతుల తోడి సేనలనన్నిటిని అస్త్ర శస్త్ర సమూహములను శీఘ్రముగా సిద్ధముచేయుము.

కం॥ గాణల రూపాజీవా, శ్రేణుల ధనవద్వణిజుల సిద్ధపఱుపుమీ
పోణిమి రాముని సేనల, రాణింపఁగఁజేయ వస్తు రాసులతోడన్? ౧౦౦౦

గాణలన్=గానముచేయువారిని, రూపాజీవా=వేశ్యల, శ్రేణులన్ = వరుస లను- రూపముచే జీవించువారు గనుక వేశ్యలు రూపాజీవలు,ధనవద్వణిజులన్= ధనవంతులైన వైశ్యులను- "వారస్త్రీ గణికా వేశ్యారూపా జీవా" అమరకోశము.

తాత్పర్యము

చక్కఁగా బాడువారిని, అందకత్తెలగు వేశ్యలను, ధనవంతులగు వైశ్యులను సిద్ధముచేయుము, వీరందఱు వారివారి వస్తువులతో సేనలతోఁబోయి శ్రీరాము నానందింపఁజేయువలయును.

కం॥ రాముని యాశ్రితజనమును, సాముల గరిడీల రామ•చంద్రుని మెచ్చౌ
నామనుజులఁ దరలింపుము, హేమాదు లొసంగి వారి•కిచ్చకొలందిన్.

తాత్పర్యము ౧౦౦౧

శ్రీరాముని నాశ్రయించియుండువారిని సాములు గరిడీలు చేయువారిని నింకను శ్రీరామునికి మెప్పైనవారిని వీరికందఱకుఁ గావలసిన బంగారు మొదలగునవి వారి కోరికదీరనిచ్చి పయనము చేయింపుము.

కం॥ ప్రకటముగ నాయుధీయుల, శకటంబులఁ బౌరజనుల • సాగింపు, వనా
టకు లగుబోయలఁ జెంచుల, వికలత లేకనుపు రామ•వీరుని వెంటన్.

ఆయుధీయులన్=ఆయుధములచే జీవించువారిని, శకటంబులన్=నూనె, నెయ్యి మొదలగు వస్తువులుగల బండ్లను, వనాటకులు = వనమునఁ దిరుగువారు, సాగింపుము=ప్రయాణమై పోవఁజేయుము.

తాత్పర్యము

ఆయుధములచే జీవించువారిని, నూనె నెయ్యి మొదలగు పదార్థములను దీసికొనిపోవ బండ్లను, బౌరజనులను, ప్రయాణమైపోవునట్లు చేయుము. త్రోవ చూపుటకై వనసంచారులైన బోయలను జెంచులను శ్రీరాముని వెంటఁ బంపుము.

కం॥ నొంచుచుఁ గరులను మృగములఁ,
ద్రుంచుచుఁ బలునదులలోనఁ•దోఁగుచునాస్వా
దించుచుఁ గమ్మని తేనెల, సంచితరాజ్యంబు మఱచి•యట సుతుఁ డుండున్.

నొంచుచున్=నొప్పికలిగించుచు, త్రుంచుచున్=నఱకుచు, తోఁగుచున్ = స్నానముచేయుచు, ఆస్వాదించుచున్=త్రాగుచు.

తాత్పర్యము

ఏనుఁగులను నొప్పించుచు, మృగములను ఖండించుచు, అనేక నదులలో స్నానముచేయుచుఁ, దియ్యనితేనెలఁ ద్రాగుచు, నీ మనోహరరాజ్యమును మఱచి యచటనే కొడుకుండును గాక.

కం॥ మనుజులు మిట్టాడనియా, వనములఁ జరియించు రామ•భద్రునితోడన్
బనుపుము నాకుం గలయా, ధనధాన్యము లెల్లఁ గొడుకు•దద్దసుఖింపన్.

మిట్టాడని = సంచరింపని.

తాత్పర్యము

మనుష్యసంచారములేని యీ యడవులందు సంచరించు రామభద్రుఁడు సుఖించుటకై యాయనవెంట నాకుఁగల ధనము ధాన్యములన్నియుఁ బనుపుము.

ఉ॥ మంచితలంబులం దొగి-స•మంచితరీతిని యజ్ఞకోటిఁ గా
వించుచు మౌనివర్యులకు • విప్రచయంబుల కెల్లఁ బ్రీతి సం
ధించుచు భూరిదక్షిణల • దివ్యమహర్షులతో సదా ప్రసం
గించుచు హాయి నుండెడిని • గిడొకయించుక లేక కానలోన్. ౧౦౦౫

ఒగిన్=చక్కఁగా, ఇంచుక=కొంచెమైనను.

తాత్పర్యము

మంచి ప్రదేశములందు జక్కఁగాఁ దగినరీతిని యజ్ఞములను జేయుచు మునిశ్రేష్ఠులకు బ్రాహ్మణులకు సంతోషముకలుగ భూరిదక్షిణలనిచ్చుచు దేవర్షులతోడను మహర్షులతోడను నెల్లప్పుడు ముచ్చటలాడుచు నేయాపదలేక యడవిలో శ్రీరాముఁడుండునుగాక.

కం॥ భరతుఁడు ధరణీరాజ్యముఁ, బురమున నిట నిల్చి సకల • భోగంబులతోఁ
బరమముదమ్మున నేలుతఁ,ద్వరపడుమీ రామవిభుఁడు•వనముల కరుగున్.

తాత్పర్యము ౧౦౦౬

భరతుఁడు పురమందు నిలిచి సకల భోగంబులతో సంతోషముతో రాజ్యముఁ బరిపాలించునుగాక. ఇవన్నియుఁ ద్వరగాఁ గానిమ్ము రామచంద్రుఁ డరణ్యము లకుఁబోవఁ ద్వరపడుచున్నాఁడు.

చం॥ అనుచు ధరాధవుం డన భ • యాకుల యై మొగ మెల్ల వాడఁగాఁ
గనుకనిఁ బెన్విషాదమున • గద్గద తోఁపఁగ నాల్కతొట్రిలన్
జనపతియాస్య మట్టి కని • సాధువరేణ్యుఁడ! పీతమండమ
ద్యనిభము పాడురాజ్య మజ • నాన్విత మేటికి నాదుపట్టికిన్? ౧౦౦౭

భయాకులయై=భయముచే మనస్సు కలఁతపడినదై, గద్గద=డగ్గుత్తిక, పీతమండమద్యనిభము = మండము = మీఁగడ- పెరుఁగులో మీఁగడ యెట్టిపో సారాయములో నట్టిదైనవస్తువు- అది త్రాగఁగా మిగిలిన కల్లుతో సమానము. మడ్డిత్రాగిన ముడ్డికి సత్తువ యని త్రాగుబోతులలో నొక సామెతకలదు- అజనాన్వితము=జనులలేమిచేఁ గూడినది, పాడురాజ్యము = జనులు వాసముచేయని రాజ్యము, సాధువరేణ్యుఁడ=సాధువులలో శ్రేష్ఠుఁడా. ఇది యెత్తిపొడుపుమాట,

తాత్పర్యము

దశరథుఁ డట్లెత్తిపొడిచినట్లు మాటలాడఁగా నిజముగా నటుచేయునేమో యని భయపడి ముఖము వాడిపోవ వికలతనొంది పెద్దదుఃఖముతో మాట డగ్గుత్తికపడ నాలుక తడఁబడ రాజుముఖము నిలువుచూపులఁ జూచుచు నోయా

యు త్తమ సాధువా నీవు చాలఁ బెద్దమనుష్యుఁడవుగా నున్నావే. సారము పోయిన కల్లువంటి జనములేని పాడురాజ్యము నాకుమారునకేల ?

ఉ॥ సిగ్గు దొఱంగి క్రౌర్య మెదఁ • జేర్చి వచించెదికైకఁజూచి యో
యెగ్గులమారి! నెత్తిపయి•నెత్తియు నెత్తఁగరానిమోపు నీ
విగ్గతి వెంచి యేఁచెద వ•టే, చెనఁటీ! ముసు వేఁడినా వటే?
యగ్గలికంపుటీసుమెయి • నాడెదవా చలపట్టి యీయెడన్ ? ౧౦౦౮

ఎగ్గులమారి = చెడుపుచేయు స్వభావముగలదానా, అగ్గలికంపుటీసుమెయిన్=అధికమైనకోపముచే, చలపట్టి=చలముపట్టి

తా త్ప ర్య ము

సిగ్గువిడిచి క్రూరత్వమే మనసులోనుంచుకొని వచించుచున్న కైకను జూచి యో యనిష్టురాలా నానెత్తిమీఁద నెత్తరాని భారమెత్తియు నింకను బాధించెదవా? ఓసి చెనఁటీ! నన్ను నీవు వరములు వేఁడువేళ శ్రీరామునివెంట నెవరు పోరాదని కోరితివా? ఇష్టమువచ్చినవారు పోవుదురు. లేనివా రుందురు. అధికమైన కోపముచేఁ జలమూని యీప్రకారము సిగ్గు భయములేక మాట లాడెదవా?

చం॥ అని కనరారఁ బల్కుమను•జాగ్రణి గుబ్బెత యిబ్బడించు కిం
కను భవదన్వయంబునన•కా సగరుండు నిజాగ్రపుత్రకుం
బనిచి సుకీర్తిఁ గాంచె నస•మంజుని నాగతి రామచంద్రుఁడున్
జనుటయె రిత్తచేతులను • సమ్మత మం చన భూమిపాలుఁడున్. ౧౦౦౯

కనరారన్ = నిండుకోపముతో, గుబ్బెత = స్త్రీ- కైక, గుబ్బెత = పెద్ద గుబ్బలుగలది, గుబ్బలు= స్తనములు, ఇబ్బడించు=రెండంతలగు.

తా త్ప ర్య ము

అని రాజు నిండుకోపముతోఁ బలుకఁగా నోహో వీఁడు మఱియొక ప్రకారమున నాకోరిక వ్యర్థముచేయఁదలఁచినాఁడని వయసుపొగరుగల యీ కైక యంతకు రెండంతలుగాఁ గోపించి నీవంశమునందే కదా సగరచక్రవర్తి తన పెద్దకొడుకును నసమంజుని నడవికి బంపి మంచికీర్తిని గాంచెను. అటులే నీ పెద్దకొడుకుగూడ రిత్తచేతులతో నడవికిఁబోవుటయే నాకు సమ్మతము.

కం॥ ఛీ యనుటను వినువారలు, మాయురె యని లజ్జఁ దలలు•మఱఁచుటయేన్ గై
కేయి గణింపద, యాయెడఁ, జేయలఁతిని వృద్ధమంత్రి•సిద్ధార్థుండున్.

చేయలఁతి=సమీపము, మాయురె=ఆశ్చర్యార్థకము. ౧౦౧౦

తా త్ప ర్య ము

ఛీ యిదియేమి తెలివితక్కువ మాటలాడుచున్నది యనఁటగాని- యామె మాటలు వినువారు స్త్రీలు పౌరా దీనివలన స్త్రీజాతికంతయు నపకీర్తి వచ్చు

చున్నదే. ఇంక నే యూఁడుదాని నే పురుషుఁడు నమ్మును అని సిగ్గుచేఁ దలలు వంచుకొనుటగాని కైకేయి లక్ష్యముచేసినది కాదు. ఆ సమయంబున సమీప మందున్న ముసలిమంత్రి సిద్ధార్థుఁడనువాఁడు.

—• సిద్ధార్థుఁడు కైకకు బుద్ధి చెప్పుట •—

తే॥ భూపునన్నన గలవాఁడు•పుణ్యశీలుఁ,డనియెఁ గైకేయి! తెలిసిన•యట్టులేల
మాటలాడెద: వాయస•మంజుఁ డేల,
వెడలఁగొట్టంగఁబడియె నా•విధమువినుము. ౧౧౧౧

తాత్పర్యము

రాజుచే గౌరవింపఁబడువాఁడు, పుణ్యస్వభావముగలవాఁడు కైకేయితో నిట్లనెను. కైకేయీ! తెలిసినదానివలె నేల మాటలాడెదవు. అసమంజుఁ డేల నగరమునుండి వెడలఁగొట్టఁబడెనో యావిధము వినుము.

ఉ॥ ఆయసమంజుఁ డీనగరి•యర్భకు లెల్లరు నాట లాడుచో
డాయఁగ బోయి వారిని గ•డంకను దా సరయూజలంబులన్
గూయిడుచుండ వైచి పసి•కూనలు మున్గుచుఁ దేలి కొట్టుకోఁ
గోయని యార్చి వేకుకలు•గూర్చును బుగ్గలు లేవ దుష్టుడై. ౧౧౧౨

అర్భకులు=పిల్లవాండ్రు, కడంకను=బలముచే, కూయిడుచుంటన్=ఏడ్చు చుండఁగా, పసికూనలు=చిన్నపిల్లవాండ్రు.

తాత్పర్యము

ఆయసమంజుఁ డీపట్టణమున వీథులలో నాడుకొను పిల్లవాండ్రను బల వంతముగాఁ బట్టుకొనిపోయి సరయూనదినీళ్ళలో వారు కుయ్యో మొఱ్ఱోయని కూఁతలు పెట్టుచున్నను విడువకవైచి వా రానీళ్ళలో మునుఁగుచుఁ దేలుచుఁ గాళ్ళుసేతులు కొట్టుకోఁగా కోయని కేకలువేయుచు వారు మునిఁగి బుగ్గలులేవఁగా దుష్టుఁడై వినోదించుచుండెను.

ఉ॥ ఆతనిఁ జూచి నాగరజ•నావళియెల్లను గోపగించి త
ద్భూతలనాథు నిట్లనియె•భూమిజనంబుల నొంచెడి నీతనూ
జాతుని నొంచెఁ గోరికొని•సాగఁగఁ బంపుము తక్కువారి నా
భ్మితలభర్త యిట్లనియెఁ• గారణ మే మిటు పల్కఁ జెప్పుడీ. ౧౧౧౩

నాగరజనావళి=నగరమందుండు జనములసమూహము.

తాత్పర్యము

ఇట్లు శిశుహత్యచేయు నసమంజుని జూచి నగరముననున్నవారందఱు వానిపైఁ గోపగించి యా సగరచక్రవర్తినిజూచి అయ్యా రాజా నీవు భూమిజనుల నైనఁ గోరికొనుము. నీ కొడుకునైనఁ గోరికొనుము. వీరిలో నొకరిని గోరి తక్కిన వారినూరువెడలఁగొట్టుము. అనఁగా రాజు లోకులారా మీరిట్లు చెప్పుటకుఁ గారణమేమో.

చం॥ ప్రకృతిజనంబులార! యనఁ • బార్థివసత్తమ యేమి చెప్పఁగ
న్వికటవిరుద్ధ వర్తనుఁడు • నీసుతుఁ డాడెడియూరిబిడ్డలన్
దికమికలాడఁ గొంచుఁ జని • తెప్పునఁ దా సరయూజలంబులన్
వికలుఁడు గాక ముంచుచును • వేడుకఁ జూచెడిఁ జచ్చు చుండఁగన్.

ప్రకృతిజనములారా చెప్పుఁడనిన వారిట్లనిరి. రాజా యేమని చెప్పుమనెదవు. భయంకరము లోకవిరుద్ధములగు నడవడిగల నీకొడుకు కాడఁకొనుచుండెడి యూరివారిబిడ్డలను వారు తికమికలాడుచుండఁగాఁ దీసికొనిపోయి తటాలున సరయువు నీటియందు మనసునఁ గొంచమైనఁ గలఁతలేక ముంచుచు వారు చచ్చుచుండ వేడుకచూచుచున్నవాఁడు.

చం॥ అని జనముల్ వచింప విని • జాగ్రతి వారలతుష్టిఁబొందఁ బు
త్రుని సహభార్యుఁ గానలకు • ద్రోయఁగఁ జచ్చెడుదాఁక వాఁడునున్
గొని యొకకఱ్ఱ గంపయును • ఘోరమహాటవులందు దిక్కుది
క్కునఁ జరియించెఁ గందములు•గూడుగ నాకులు వేళ్ళు మెక్కుచున్.

తాత్పర్యము ౧౦౧౩

అని జనములు చెప్పఁగా విని రాజు వారలను తృప్తిపఱుపఁ గొడుకును పెండ్లముతో నడవులందుఁ ద్రోయఁగా వాఁడు చచ్చువఱకుఁ గఱ్ఱగంప తీసికొని ఘోరములైన పెద్దయడవులందు దిక్కుదిక్కులుదిరిగి దుంపలు ఆకులు వేళ్ళు నాహారముగాఁ దిరుగుచుండెను.

ఆ॥ పాపియైనసుతునిఁ • బాసె ధర్మాత్ముఁడు, సగరచక్రవర్తి•దానః చెపుమ
పాప మేమి రామ•భద్రునియెడఁ గంటి, విట్టులడవి కరుగ•నెట్టుటకును.

తాత్పర్యము ౧౦౧౪

ధర్మాత్ముఁడైన సగరచక్రవర్తి పాపాత్ముఁడైన తనసుతుని వదలెను. శ్రీరామునియందు నీవేమి దోషము తెలిసి యడవులకుఁ బంపుమనెదవు. ఆ దోషమేదియో చెప్పుము.

ఉ॥ మే మొకదోషమేని నిర • మిత్రుఁడు రామునియందుఁ గాన మో
భామిని! పోఁక నేర్చునొకొ • పంకము చందురునందుఁ, బల్కు నీ
వేమియుఁ గాంచి యున్నయెడ • నిప్పుడ రామునిఁ ద్రోచి పుచ్చ నా
భీమమహాటవీస్థలికిఁ • బెంకెతనం బిది యేల రిత్తకున్. ౧౦౧౫

నిరమిత్రుఁడు=శత్రువులు లేనివాఁడు, భీమమహాటవీస్థలికిన్=భయంకరమైన పెద్ద యడవిప్రదేశమునకు, పంకము=బురద.

తాత్పర్యము

పగవాఁడనువాఁడులేని శ్రీరామునందు మాకొక దోషము కానరాలేదు. సముద్రమునఁ బుట్టిన కారణముచేఁ జంద్రునికి బురదతగులునా ? నీవేమి

దోషము గంటివో చెప్పుము. ఇప్పుడే భయంకరములైన యడవులకుఁ ద్రోచి వేయవచ్చును. నిష్కారణముగా నేల యీ మూర్ఖత.

ఆ॥ సాధు వైనవానిఁ•సత్పథనిరతునిఁ, దీర నాపసలను • గూరఁజేయ
ధర్మహాని యగుటఁ•దప్పక తెగఁగాల్చు,శక్రు తేజ మైన•వక్రగమన. ౧౦౧౮

సత్పథనిరతునిన్=మంచిమార్గమందుఁ బ్రేమగలవానిని, తేరన్=తేరకు-కారణములేక, వక్రగమన=వంకరపోకలు గలదానా.

తాత్పర్యము

సాధువై సన్మార్గమందుఁ బ్రీతిగలిగినవాని నిష్కారణముగ నాపదలపాలు చేయుట ధర్మహాని కావున నాదోషము వంకరనడతగలదానా ! యింద్రునైన దహించును. ఇఁకఁ దక్కినవారి మాటయేల.

ఉ॥ కావున రాజ్యలక్ష్మిని వి•ఘాతము సేయకు రాముఁ డొందఁగా
దేవిరొ, యీసు మాను మిఁకఁ • దీరకుఁ దెచ్చెద వేల హావళిన్
రావడిపోవనీకు మది • రాజసతీ ! యపనిందఁ బాపుకో
నా విని కైకఁ గాంచి నర•నాథుఁడు పల్కె భృశార్తియుక్తుఁడై. ౧౦౧౯

విఘాతము=విఘ్నము, ఈసు=ఈర్ష్య, హావళిన్=ఆపద, రావడి పోవనీకుము=రాతివలె గట్టిగానీకుము, భృశార్తియుక్తుఁడు=మిక్కిలి వ్యసనముతోఁ గూడినవాఁడు.

రావడు- రాయి + పడు - 'రావడిపోయెఁగాక ధృతరాష్ట్రుఁడు గన్నది యేమి యీసభన్' భార.

తాత్పర్యము

కావున నోదేవీ శ్రీరామచంద్రమూర్తి యౌవరాజ్యపట్టాభిషేకమునకు విఘ్నము కలిగింపకుము. ఈర్ష్యవదలుము. ఏల నిష్కారణముగ నాపదదెచ్చి పెట్టెదవు. మనసు రాయిచేయకుము. అపకీర్తిని బోఁగొట్టుకొనుము అనిచెప్పఁగా రాజు మిగులదుఃఖపడుచుఁ గైక కిట్లనియె.

ఉ॥ ఈవచనంబు లెల్ల రుచి•యింపవు గాదటె నీకుఁ బాపినీ!
భావన సేయ లేవు హిత•పద్ధతి నాకును నీకు, దుష్టమా
ర్గోవల లోభవృత్తిఁ గొని • ద్రొక్కెదు, నీచపుఁజేఁత మాన వీ
కావల మేల కట్టుకొని•కాఁతియ పెట్టెద వెల్లవారలన్. ౧౦-౨౦

పాపినీ=పాపాత్మురాలా, కావలము=మూర్ఖత్వము, కాఁతియ=బాధ.

తాత్పర్యము

పాపాత్మురాలా! యీమాట లేవియు నీకు రుచింపవుగదా. నీకు నాకు నేది మేలో యది యాలోచింపలేవు. లోభగుణములచేఁ జెడ్డత్రోవలఁబోవఁజూచెదవు

నీచమైనకార్యము చేయవదలవు. ఏల మకుటతనమును గట్టుకొని యెల్లవారిని బాధపెట్టెదవు.

ఉ॥ నీవును నీసుతుండు నిఁక ♦ నెత్తినిఁ గొట్టుకొనుండు శాశ్వతం
బౌవసుధాధిపత్యము దు ♦ రాత్మకురాల! సుఖంబు విత్తమున్
భూవిభుతన్ దిగ న్విడిచి ♦ పోయెద రాముని వెంటఁ గానకున్
నీవికటాధిపత్యమును ♦ నేర్తు నటే గన నొక్కపూఁటయేన్. ౧౦-౨౧

వసుధాధిపత్యము = ప్రభుత్వము, దురాత్మకురాల = చెడుమనస్సుగలదానా, విత్తము=ధనము, భూవిభుతన్=భూప్రభుత్వమును, వికటాధిపత్యమును =నీయుక్రమాధిపత్యమును.

తా త్ప ర్య ము

ఓసి చెడ్డమనస్సుగలదానా! సుఖము ధనము రాజ్య ప్రభుత్వము సర్వము వదలి శ్రీరాముని వెంబడి నేను నడవులకుఁబోయెదను. శాశ్వతమైన యీ ప్రభుత్వము నీవు నీకొడుకు నీ నెత్తిపైఁ గొట్టుకొనుఁడు. నీ యన్యాయ్యప్రభుత్వము నే నొకపూఁటయైనఁ జూడఁగలనా.

—♦ ౩౭-వ సర్గము. కైక సీతారామలక్ష్మణులకు నారచీర లిచ్చుట. ♦—

కం॥ సచివుఁడు జనకుఁడు పలికిన,వచనంబుల నాలకించి ♦ పరమవినీతుం
డచలధృతి రామభద్రుఁడు, వచియించెం దండ్రిఁజూచి♦వఱలెడిభక్తిన్.

సచివుఁడు=మంత్రి, పరమవినీతుండు=మిక్కిలి వినయముగలవాఁడు, అచలధృతి=చలనములేని ధైర్యముగలవాఁడు, వఱలెడి=ప్రకాశించు.

తా త్ప ర్య ము.

మంత్రియును దండ్రియును జెప్పిన మాటలవిని మిగుల వినయము చలింపని ధైర్యముగల రామభద్రుఁడు భక్తియతిశయముచే నిట్లనెను.

ఉ॥ ఏటికి మీర లెల్ల నట ♦ కెల్లసుఖంబులు వీడి దండకా
వాటిని సర్వసంగములఁ ♦ బాసి చరించుచు వేరు వెల్లఁకుల్
గాటముఁగాగ మెక్కుచును ♦ గాలము ద్రోయఁగ నున్ననాకు, నీ
కేటికి భ్రాంతి,యర్థ మొకొ ♦ యేనుఁగు నిచ్చియుఁ ద్రాడుకోరఁగన్.

తా త్ప ర్య ము ౧౦-౨౩

తండ్రీ! మీరందఱు నడవులకు వచ్చెదమనెదరే ఏమిచేయను? నేనో సర్వసుఖములు వదలి సర్వసంగములు విసర్జించి దండకావనమందుఁ దిరుగుచు వేరు వెల్లఁకులు దండిగాఁదినుచుఁ గాలముద్రోయుచుందును. నాకు మీతోడి జంజాటములేల? ఇంకను నీకుభ్రాంతియేల? ఏనుఁగును దానముచేసి త్రాటినీయఁ గలహించెదవు.

ఉ॥ పంపఁగ నేల నాబడిని ♦ వాహినికోటుల, వానిఁ గైక హ
ర్షింపఁగ నేన యాభరతుఁ ♦ జేర్చెద, నాకవి యేల తండ్రి! తె

ప్పింపుము నారచీరలను • వేగమ గంపయు గడ్డపాఱ, నే
నింపుగ నుండువాఁడఁ బది • యేఁడులు నాలుగుఁ గానసంబులన్.
వాహినికోటులన్ = సేనలసమూహములను. ౧౦౨౪

తాత్పర్యము

ఈ సేనలగుంపులను నా వెంబడిపంప నేమిప్రయోజనము? నే నెవరిమీఁద నైన దండెత్తిపోవుచున్నానా? కైక సంతోషించునట్లు వానినెల్ల నేనే భరతుని కిచ్చెదను. నా కివియన్నియు నేల? నాకుఁ గావలసినవి నారచీరలు-గంప-గడ్డపాఱ అవి త్వరగాఁ దెప్పింపుము. చాలును. నేను పదునాలుగు సంవత్సరము లరణ్యమునం దుండెదను.

తే॥ రాముఁడిటుపల్కవిని ప్రహ•ర్షమునఁ బొంగి,
తాన నారలఁ గొనివచ్చి•దాశరథికిఁ
గట్టుకో వీని ననియిచ్చెఁ•గైక జనుల,
మధ్యమున సిగ్గు బిడియంబు•మదిని గొనక. ౧౦౨౫

ప్రహర్షమునన్=మిగుల సంతోషముచే, నారలన్=నారవస్త్రములు గట్టి-"నారలుగట్టి కూరలశనంబుగ"నని భారత ప్రయోగము.

తాత్పర్యము

దశరథుఁడు చెప్పినది శ్రీరాముఁ డంగీకరించునేమో, సమస్తజనులు సేనలు శ్రీరాముని వెంటఁ బోవునేమో, నాకోరిక వ్యర్థమగునే అప్పుడిది నే నడుగకపోయితినే యని విచారపడుచున్న కైక శ్రీరాముని మాటలువిని దక్కెరా రాజ్యమని మిగుల సంతోషించి యుప్పొంగి నారచీరలు తానే తెచ్చి "రామా వీనిని గట్టుకో" యని నందఱు జనులనడుమ సిగ్గుగాని జంకుగానిలేక శ్రీరామున కిచ్చెను.

ఉ॥ ఇవ్విధిఁ గైక హస్తమున • నీయఁగఁ గైకొని నారచీరలన్
దువ్వలువల్ దొలంగ నిడి • తుష్టి మెయిన్ ధరియింప రాఘవుం
డవ్వల లక్ష్మణుండు మను • జాగ్రణి తండ్రి గనుంగొనంగఁ దాఁ
జివ్వనఁ దాల్చె నారలను • చిత్తమునందుఁ గలంక దీఱఁగన్. ౧౦౨౬

దువ్వలువల్=సన్ననివస్త్రములు, తుష్టిమెయిన్=సంతోషముచే, అవ్వలన్=శ్రీరాముఁడు ధరించినవెనుక, చివ్వనన్=ఆలస్యములేక.

తాత్పర్యము

ఈవిధముగఁ గైక నారలను దనచేతితోఁ గట్టుకొమ్మని శ్రీరామునకీయఁగా శ్రీరాముఁడును దాను ధరించియున్న సన్నవస్త్రములను దీసి యావలఁబెట్టి సంతోషముతో నారవస్త్రములు గట్టుకొనెను. అయనఁ గట్టుకొన్న పిమ్మటఁ దండ్రి యెదుటనే యాయన చూచుచుండఁగనే త్వరగా నారచీరలను గైక మనస్సునందుఁ గళంకము దొలఁగునట్లు సౌమిత్రి గట్టుకొనెను.

శా॥ పట్టుంబుట్టము గట్టియున్న జనకా • పత్యంబు కైకేయి యీ
పుట్టంబుల్ ధరియింపు మం చొసఁగినం • బూఁబోఁడి సిగ్గున్ వ్యథం
దొట్టన్ భీతిలె నాఁడుజింక వలఁ గ • న్గొన్నట్టులై వానిఁ దా
నట్టే చూచుచు, వెండి చేతఁగొని ధ • ర్మాభిజ్ఞ చింతారతిన్. ౧౦-౫౭

పట్టుంబుట్టము=పట్టువస్త్రము, జనకాపత్యము = జనకునిబిడ్డ-సీత, పుట్టంబుల్=వస్త్రములు, ధర్మాభిజ్ఞ=ధర్మము తెలిసినది, చింతారతిన్=ఆలోచించినదై.

ఇది స్త్రీలు పట్టుపట్టినపుడు వారికిఁగల తెంపరితనము లజ్జాభయహీనత క్రౌర్యపరిమాణము దయా దాక్షిణ్య శూన్యత తెలుపును.

వారు చేసినంత సాహస మేజాతిపురుషుఁడైనను జేయఁజాలఁడు.

తాత్పర్యము

శ్రీరామలక్ష్మణులు నారవస్త్రములు కట్టుకొన్న పిమ్మట నీవు వీనిని గట్టుకొమ్మని కైక తనచేతికి నారవస్త్రము లీయఁగాఁ బట్టువస్త్రముఁ గట్టుకొనియుండిన యా జానకి సిగ్గు వెత దగులఁగా వలను జూచిన యాఁడుజింకవలె భయపడి యావస్త్రముల నెగాదిగఁజూచుచుఁ బతివ్రతాధర్మమెఱింగిన సీత- మగఁడు దీనిని గట్టుకొన్నప్పుడు నేనేల కట్టుకొనరాదని యాలోచించి వానిని దనచేతికిఁ దీసికొని

కం॥ ఏమియుఁ జేయఁగఁ దెలియక, తా మది దూపిల్లి ధర్మ • దర్శిని బాష్ప
స్తోమపరిపూర్ణ లోచన, యై మఱి గంధర్వనిభుని•నాత్మహృదీశున్. ౧౦-౫౮

ధర్మదర్శిని=పతివ్రతాధర్మమును స్వానుష్ఠానముచే లోకమునకు బోధింప నాలోచించినది, దూపిల్లి = శోకించి, బాష్పస్తోమ = కన్నీళ్ళసమూహముచే, పరిపూర్ణలోచనయై=నిండిన కన్నులుగలదై, గంధర్వనిభుని=గంధర్వులతో సమానమైన సౌందర్యముగలవానిని, ఆత్మహృదీశున్ = తనప్రాణేశ్వరుని.

తాత్పర్యము

వస్త్రములు చేతికిఁ దీసికొని యిటువంటి కఱకువస్త్రము లాగంధర్వులతో సమానుఁడైన నామగఁడు ధరించెఁగదా యని శోకించి నీటిచేనిండిన కన్నులతో భర్తనుజూచి-

కం॥ ఎట్టులొకో మౌనిజనుల్, కట్టెద రీవల్కలములఁ • గానల ననితా
ని ట్టట్టు ద్రిప్పి వానిని, నెట్టును నేరకయు భ్రాంతి•నెనఁగుచు మఱియున్.
వల్కలములు=నారచీరలు, కానలన్=అడవులయందు. ౧౦-౫౯

తాత్పర్యము

నాథా యీ నారవస్త్రములను నడవులలో మును లెట్లు కట్టుకొందురోయని వానిని గ్రిందికిఁ బైకిఁ ద్రిప్పి యెట్లు కట్టుకొనవలయునో తెలియక భ్రమచెంది

ఉ॥ కై కొని యొక్క చీరఁ దన • కంఠమునం దవిలించి యొండు దాఁ
జేకొని కేల నేమియును • జేయఁగ నేరక నిల్వ సిగ్గున
న్వే కని రామభద్రుఁడును • నీరజలోచన పట్టుఁజీరపైఁ
బ్రాకటరీతిఁ దాన కొని • వల్కలముల్ ధరియింపఁ జేసినన్. ౧౦౩౦

తాత్పర్యము

ఒకచేత నొకచీర తీసికొని మెడక్రిందఁ దగిలించి గడ్డముతో నదిమిపట్టి రెండవది తీసికొని యేమిచేయుటకుఁ దెలియక సిగ్గుపడి నిలువఁగాఁజూచి శ్రీరాముఁడు తటాలునఁబోయి యామె కట్టుకొన్న చీరమీఁదనే దానిని ధరింపఁ జేయుచుండెను.

ఈ నారచీరలు మూరెడు మూఁడు జేనెలుగల చెట్లపట్టలు. వలవలెనుండును. వీనిని గొంచెముగాఁ డెంకాయచెట్లయందుఁ జూడవచ్చును. రొమ్ము మీఁదనొకటి కట్టుకొనవలయును. మొలకుముం దొకతునుక వెనుక నొకతునుక కట్టుకొనవలయును. మూరెఁడు మూరెఁడు గుడ్డతుండ్లు రెండో మూఁడో యిచ్చి యిప్పటి యాఁడువారిని గట్టుకొనుఁడనిన నావిధము తెలియును. అందునవి చెట్లపట్టలు గావున గఱుకుగానుండును.

—• సీతను దోడ్కొని పోవలదని రాజకాంతలు శ్రీరామునిఁ బ్రార్థించుట. •—

కం॥ రాముఁడు తానై తనప్రియ,భామకుఁ జీరలను గట్టఁ•బరికించి యటన్
రామలు తమతమలోచన,సీమల నశ్రువుల నించి•చిడిముడిపడుచున్.

తాత్పర్యము ౧౦౩౧

శ్రీరాముఁడు తానే తన ప్రియభామకుఁ జీరలు గట్టుచుండఁగాఁ జూచి యందున్న స్త్రీలందఱు కన్నులనుండి నీళ్ళుకాఱఁ దొట్రుపాటుపడుచు.

కం॥ రామా! యెవ్వరు సీతా,భామను నిటుగాన కరుగఁ • బలికిరి? యేలా
సీమాటిని గొనిపోయెదు? మామాటలు వినఁగదయ్య•మానఁగదయ్యా.

తాత్పర్యము ౧౦౩౨

రామా! సీత నడవికిఁబొమ్మని యెవరుచెప్పిరి? ఈ యుత్తమస్త్రీని నీవేల యడవులకుఁ బిలుచుకొనిపోయెదవు. అయ్యా! మా మాటలు వినుము. పిలుచుకొనిపోకుము.

కం॥ జనకునినిర్బంధముచే, వనములకు న్నీవు పోవ • వత్సా! నీమా
ఱనయంబు నీమె నైనను, గనుఁగొని మే మూఱడిల్లఁ•గాఁ జేయఁ గదే.

తాత్పర్యము ౧౦౩౩

మీ తండ్రి నిర్బంధమువలన నీ వడవులకుఁబోఁగా నాయనా! నీమాఱుగ నీమెను జూచియైన మేము వ్యసనము మానునట్లు చేయవయ్యా.

కం॥ తమ్ముఁడు నీవును తోడుగఁ,గ్రుమ్మర, వనులకును బొండు•కోమలి బాలన్
ఱమ్ముగ్ధ మృదులగాత్రి. వ, నమ్ముల మునిభంగి నెట్లు•నవసెడిఁ బుత్రా.

తా త్ప ర్య ము

మగవారు తమ్ముఁడు నీవు నొకఁనొకరు తోడుగ నడవులకు సంచారము చేయఁబోవుడు. నాయనా! కోమలియు బాలయునగు నీ ముగ్ధ కోమలదేహము గలది యడవులయందు మునులవలె నెట్లు కష్టపడఁగలదు.

చం॥ వినఁగద వయ్య మాపలుకు•వీడుము జానకిఁ దండ్రి! మానుడిన్
గొనవుగదయ్య నీవు నిటఁ•గూరిమి నిల్వఁగ ధర్మబుద్ధి నం
చును నట నున్న భామ లను•సూక్తుల వించును నాదరింప కా
ఘనమతి నారచీరలను•గట్టెను సీతకుఁ దుల్యశీలకున్. ౧౦౩౫

మానుడిన్ = మామాటను.

తా త్ప ర్య ము

అయ్యా? మా మాటలు వినవయ్యా! జానకిని వదలిపెట్టిపోవయ్యా. నీకుఁ బుణ్యమగును. నీవు ధర్మముఁ దలఁచి పితృవాక్యపరిపాలనమునకు నీవు పోయెదవేని పొమ్ము అని యచ్చటనున్న యంతఃపురస్త్రీలు పల్కెడి మంచి మాటలు వించును గైకేయి చెప్పుమిచే నా పలుకుల నాదరింపక శీలమునందుఁ దనతో సమానురాలయిన సీతకు నారవస్త్రములును గట్టెను.

—• సీత నారచీరలు గట్టఁగూడ దని వసిష్ఠుఁడు నిషేధించుట. •—

ఉ॥ చీరలు చక్కఁ గట్టుకొను•సీతను నాఁగి వసిష్ఠమౌని యా
క్రూరచరిత్రఁ గైకఁ గని•రోషముమై నను వంశపాంసనీ!
ఘోరకుశీల! యోచెనఁటి•కూళవిధంబున మోసగించియున్
ఘోరమునుం, బ్రమాణపథ•సంస్థితి నొల్లవదేల దుర్మతి? ౧౦౩౬

చీరలు=వస్త్రము. ఆంధ్రభారతకాలమునందును వస్త్రపర్యాయముగ చీరలను శబ్దము వాడుకయందుండెను. ఇప్పుడు స్త్రీలవస్త్రములందే వాడుకలో నున్నది.

సైన్యము లింతవడియుఁ దలల చీరలెత్తఁగక॥ విరా. ౨ ఆ.

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు నేర్పినప్రకారము చీరలను జక్కఁగాఁగట్టుకొనుచున్న సీతను గట్టుకొనవలదు కట్టుకొనవలదనిచెప్పి వసిష్ఠమౌని నిర్దయమైన నడవడిగల యా కైకనుజూచి కోపముచే నిట్లనియె. ఓసీ వంశనాశకురాలా! భయంకరచరిత్రా యోసి దుష్టపునడవడిగలదానా! వంచనచే రాజును మోసగించియు నీ వెంత ప్రమాణము చేయించుకొంటివో యంతలో నిలువక యేల మర్యాదమీఱి పోవు చున్నావే దురాత్మురాలా?

ఉ॥ పోవఁగ రాదు రాముపువుఁ•బోటి హృదీశ్వరు వెంటఁ, బట్టపుం
దేవెరి యై నిజేశ్వరుని•దివ్యమహాసన మెక్కుతన్, గృహ

స్థావితథాశ్రమస్థులకు • నర్మిలిభార్యయ యాత్మయౌఁ గదా
కావున రాము మాఱు సతి • క్ష్మాతల మెల్లను నేలు చుండెడిన్. ౧౦౩౭

గృహస్థావితథాశ్రమస్థులకున్ = వ్యర్థముగాని గృహస్థాశ్రమమందుండు వారికి, అర్మిలిభార్యయ=ప్రేమగల భార్యయే.

తాత్పర్యము

సీతాదేవి నారచీరలను గట్టనురాదు. అడవికిఁ బోవనుగూడదు. ఇచటనే పట్టపుదేవియై (పట్టాభిషేకము చేసికొనిన రాణియై) తనమగఁ డెక్కవలసిన సింహాసనమును దానెక్కునుగాక. అది యేన్యాయమనుసరించి యందువా గృహస్థధర్మమందుండు పురుషునకు వానిభార్యయె వాని యాత్మ కావున శ్రీరామునిమాఱు సీతయే రాజ్యమంతయు నేలునుగాక.

పురుషునకు వానిభార్యయె యాత్మయని కిష్కింధాకాండమున 'శాస్త్రప్రయోగాద్వివిధాచ్చ వేదాదాత్మాహ్యనన్యాః పురుషస్యదారా' యని ౨౪-వ సర్గమునందుఁ దారావాక్యము గలదు. చూడు కిష్కింధ పద్యము ౬-౨౩.

ఆత్మాహిదారా సర్వేషాం, దారసంగ్రహ వర్తినామ్.

శ్లో॥ ద్విధా కృత్వాత్మనోదేహ, మర్ధేన పురుషోభవత్
అర్ధేననారీతస్యాంసః, విరాజ మసృజత్ప్రభుః ॥మను॥
ఆత్మానాం ద్వేధాపాతయ త్తతః పతిశ్చ పత్నీచాభవతాం
బృహదారణ్యకము.

యోభర్తా సా స్మృతాంగనా. మను. ౯-౪౫.
యోభర్తాసైవ భార్యాస్మృతా. వాజసనేయ బ్రాహ్మణము.

ఈ ప్రమాణములచే భార్యాభర్తల కభేదము గావున భర్తమాఱు భార్య సింహాసన మెక్కవచ్చునని వసిష్ఠుఁడనెను. రామాయణవాక్యమే వేదప్రమాణము. దానికిఁ బ్రమాణములు చూపుట సూర్యుఁడున్నాఁడని ఋజువుచేయ దివిటీలెత్తినట్లే.

కం॥ అట్టిది కా దని జానకి, పట్టుగఁ బతివెంటఁ జనఁగఁ • బనిపూనిన మే
మెట్టును దోఁ జనువారము, పట్టనమే పోవు రామ • భద్రుని వెంటన్. ౧౦౩౮

తాత్పర్యము

రాముఁడు కాననములందు నల్లాడుచుండ నేను సింహాసనమునఁ గూర్చుండి ప్రభుత్వము నిర్వహింతునా అదియేటి స్త్రీధర్మమని సీత పట్టాభిషేకమంగీకరింపక పట్టుపట్టి శ్రీరాముని వెంటనే పోయెదనని పూనెనా మేమును వారి వెంటఁబోవువారమే. మామాటయేల అయోధ్యానగరమే శ్రీరాముని వెంటఁ బోవును. ఇది లక్షణావృత్తి. అయోధ్యపోవుననఁగా నయోధ్యయందలి జనము లందఱు పోవుదురని యర్థము.

ఉ॥ జాయయుఁ దాను రాఘవుఁడు ♦ సొగెడిచోటికి నంతపాలకుల్
వ్యాయతవిత్తదాసశక ♦ టాదిగఁ బోయెడివారు, పూర్వజుం
డేయెడ నుండు నవ్వనికి ♦ నేగు భవత్తనయుండు సానుజుం
డై యజినంబు వల్కలము ♦ లాదటఁ దాలిచి మౌనివేషియై. ౧౦౩౯

జాయ=భార్య, అంతపాలకుల్=రాష్ట్రాంతపాలకులు- దండనాయకులు, వ్యాయతవిత్తదాసశకటాదిగన్=విస్తారమైన ధనము- దాసులు- శకటములోనైన జీవాజీవరూపపదార్థములతోఁ గైముత్తిక న్యాయముచే భార్యలు బిడ్డలును గ్రాహ్యము. పూర్వజుండు=అన్న, భవత్తనయుండు=నీకొడుకు, సానుజుండై=తమ్ముఁడగు శత్రుఘ్నునితోఁగూడినవాఁడై, అజినము=జింకచర్మము, వల్కలము=నారచీర, అదటన్=ప్రీతితో, మౌనివేషి = మునివేషమును ధరించినవాఁడునై.

తాత్పర్యము.

శ్రీరాముఁడు తనభార్యతోడ బోయెడిచోటికిఁ దమ భార్యలు బిడ్డలు ధనము దాసులు బండ్లులోనగు జీవముగల జీవములేని పదార్థములతో సేనానాయకులు పోవుదురు. వారు మేము పోవుట యటుండనీ. నీ కొడుకు భరతుఁడే తమ్ముఁడగు శత్రుఘ్నునితోడఁ గృష్ణాజినము నారచీరలు ప్రీతితోధరించి మునివేషమున నన్న యున్నచోటికిఁ బోవును.

కం॥అంతటఁ బాడఱు రాజ్యము,నంతయు జనతాఽహితాప్రి♦యాత్మకః కొని య
త్యంతాధికారముమ ని,శ్చింతంబుగఁ జూపు చెట్టు♦సేమల మీఁదన్. ౧౦౪౦

పాడఱు=పాడుపడిన, జనతా=మనుష్యసమూహమునకు, అహిత = మేలు కానిదియ్యు, అప్రియ = అనిష్టకరమైనదియునగు, ఆత్మిక = మనస్సుగలదానా, నిశ్చింతంబుగన్ = విచారములేక- అవ్యయీభావసమాసము గావున నపుంసకలింగము, చెట్టుసేమలు=చెట్టులుచేమలు, చెట్టుసేమలు- ద్వంద్వసమాసంబునఁ బదంబుకంటెఁ బరంబులయిన పరుషములకు గసడదవలగు. సు. వ్యా. సంధి ౪౦ సూ.

తాత్పర్యము

అంతటఁ బాడుపడిన రాజ్యము సర్వము జనులకు నహితము నప్రియము నైన మనస్సుగలదానా! గ్రహించి నీ యధికారమంతయుఁ దప్పొప్పులు ప్రశ్నించువాఁడు లేమిని నెట్టి విచారములేక చెట్లమీఁదఁ జేమలమీఁద యథేచ్ఛముగఁ జూపుము.

త్రికాలవేదియగు వసిష్ఠుఁడు చెప్పినదంతయు యథార్థమయ్యెను. వానప్రస్థువలె నందిగ్రామమందుఁ గదా భరతుఁడుండెను.

కం॥ రాముఁడుపాలింపనిచోఁ, గామినిః రాష్ట్రం బ దెవ్వఁ♦గానేరదు, శ్రీ
రాముఁడు నిలిచినవనమే, శ్రీమానిత రాష్ట్రమగును♦సిద్ధము సుమ్మీ.

తాత్పర్యము.

రాష్ట్రము రాష్ట్రమనెదవు. ఓసి కాముకా శ్రీరాముఁడు పాలింపనియెడ నది రాష్ట్రమయ్యును రాష్ట్రము గాదు. శ్రీరాముఁడు నిలిచినది వనమైనను రాష్ట్రమే యగును.

చం॥ తనకును బ్రీతిపూర్వకముగఁ•దండ్రి యొసంగనిరాజ్య మేల నే
యనువున నర్హుఁ డౌ భరతుఁ • డావలు కట్టుల యుండ నిమ్ము, నీ
తనయుఁడె యీమహీపతికిఁ • దా నుదయించుట కల్గె నేని ని
న్నును దనతల్లిగాఁ దలఁప•నూల్కొనునే కనుఁగొమ్ము వానుడిన్.

ఏలింపన్=పాలింపఁగా, అనువునన్=విధముగ. ౧౦౪౨

తాత్పర్యము

తనకుఁ బ్రీతితోడఁ దండ్రి యియ్యని రాజ్యము పాలింప భరతుఁ డెట్టు లర్హుఁడగును. అగునుగాక కాకపోవును గాక. ఆమాట యటుండనీ. భరతుఁడీ రాజుబీజమునకే పుట్టియుండెనా నిన్నుఁ దన తల్లిగా నెంచుటకైనా సుత్స హించునేమో నామాట చూడుము. కలదు గదా పితౄన్ సమనుజాంతే నరా యను న్యాయము.

తే॥ నేలనుండియు నీ వెంత•నింగి కిపుడు,
మిడిసిపడినను భరతుండు•మిటుకులాఁడి
పితృకులాచార ధర్మనం•వేది యెల,తప్ప నడచును ధర్మంబు•ముప్పుగదుర.

తాత్పర్యము

భూమిమీఁదనుండి యాకాశమునకు నీవెంత యెగిరిపడినను ఓసి మిటుకు లాఁడీ! దండ్రివంశము నాచారమెఱింగిన భరతుఁ డా ధర్మమునకు హానివచ్చు నట్లేల నడచును.

కం॥ కొడుకునెడఁ బ్రేమకతమున, నిడుమలు తెచ్చితివి వాని•కిది యెఱుఁగవొకో
పుడమిని రాము భజింపని,జడమతి యొకఁడేని లేఁడు•సత్యము కైకా.

తాత్పర్యము ౧౦౪౪

కొడుకునందలి ప్రేమకారణముగ వానికిఁ గష్టములు తెచ్చిపెట్టితివి. ఇది నీవెఱుఁగవుగదా. నీ నెత్తిపై మట్టి నీవే వేసికొనుట తెలియలేకయున్నావు.అట్లేల జరుగునందువా. శ్రీరాముని సేవింపని మూఢుఁడొకఁడైన లేఁడు. కైకా యిది సత్యము.

చం॥ కనియెదు గాక నీ విపుడ•కైకః వసుంధరఁ గల్గుగొడ్డులున్
జనములుఁ జాములున్ శకున•సంతతులున్ రఘురాము వెంబడిన్
జనఁ బురి బాసి చెట్టులను • సత్ఫలపల్లవపుష్పకోటితో
వెనయిక లేక రామవిభుఁ • డేగెడిత్రోవకు నున్ముఖంబు లౌ. ౧౦౪౫

కైకా నీ విపుడే నీ కన్నులారఁ జూచెదవు. తొందరపడకుము. ఏమిచూచెద నందువా. నామాట నిజమో యబద్ధమో చూచెదవు. భూమియందునిగల పశువులు, మనుష్యులు, పాములు, పక్షిసంఘము అయోధ్యవిడిచి శ్రీరాముఁ వెంబడిపోవఁగా నడవఁ గాళ్ళులేని చెట్టులు మంచి ఫలములు చిగుళ్ళు పూలు వీనిఁసమూహముతో నొద్దికలేక యవి రాలిపోవుచుండఁగా నవియన్నియు శ్రీరాముడుండు దిక్కుభూనకే తిరిగియుండును. (చూ ౧౨-౨౩—౧౨-౨౪—౧౨-౨౨ ప.)

కం॥ ఇమ్ము భూషణములు గై, కొమ్ము నారలను మరలఁ • గోడలిచే నం
చమ్ముని తల్లజుఁ డావస, నమ్ములఁ గట్టంగ నీక • నాతికి ననియెన్. ౧౦౪౬

తాత్పర్యము

సీతకు సొమ్ములిమ్ము. కోడలిచేఁ జీరలు మరలఁ గైకొమ్ము అని యా మునిశ్రేష్ఠుఁడు సీతను నా నారచీరలఁ గట్టనీయక కైకతో నిట్లనియె.

ఉ॥ రాముని నొక్కనిం గద య • రణ్యనివాసముఁ జేయఁ గోరి, తీ
భామినితోడ నేమి పని • పాపకుశీల? నిజాధినాథుతో
నీమహిళావతంసమును • నెప్పటియట్టుల తా నలంక్రియా
శ్రీమహనీయ యై చనుతఁ • జె ల్వెడఁబాయక సర్వయుక్తయై. ౧౦౪౭

తాత్పర్యము

పాపపుఁ గుత్సితచరిత్రా: నీవు శ్రీరాముఁ డొకని నేకదా యడవులకుఁబోవఁ గోరితివి. తక్కినవారెవ రెట్లుపోయిన నీకేల? వారినేల నీవు నిర్బంధించెదవు. ఈమె యెట్లుపోయిన నీకేల? కాఁబట్టి యామె తనభర్తతో నెప్పటియట్టు అలంకరించుకొని కాంతియుక్తయై యామెకుఁ గావలసినవన్నియుఁ దీసికొనిపోవునుగాక.

కం॥ యానంబులు సురుచిరపరి,ధానంబులు భూషణములు • దాసీజనసం
తానంబులు మఱి తక్కవి,ధానంబులు గూడి సీత • ధవువెంటఁ జనున్.

యానంబులు=వాహనములు, సురుచిరపరిధానములు=మిక్కిలి సుందరమైన చీరలు, భూషణములు = సొమ్ములు, దాసీజనసంతానంబులు = దాసుల గుంపులు.

తాత్పర్యము

వాహనములు, అందమైన చీరలు, సొమ్ములు, దాసీజనుల గుంపులు మఱియు నింకను గావలసిన యేర్పాటులతోడ సీత మగని వెంటఁ బోవలయును.

కం॥ వరదానకాలమున నీ,వరవర్ణిని సీత దాల్ప • వల్కలముల నో
తరుణీ: యడుగుట లేదుగ, తొరతొర నారలని బీల • తొయ్యలి కియన్.

వరవర్ణిని=శ్రేష్ఠమైన దేహకాంతిగలది- ఉత్తమస్త్రీ, తొరతొర=శీఘ్రముగ.

తాత్పర్యము

నీవు నీ భర్తను వరములడుగుకాలమున నీ యుత్తమస్త్రీ సీత నారచీరలు కట్టుకొనవలయునని యడుగలేదు గదా. ఏల యాదర బాదర యేమో మునిఁగి పోయినట్లు లామెకు నారచీర లిచ్చితివి.

కం॥ అని గురుఁడు విప్రముఖ్యుం, డనుమాటల నాత్మ నిడక • యతివ ధరించెన్
దనపతి చనియెడి తెరువునఁ, జనఁ గోరుట నారచీర • సంతస మారన్. ౧౦౨౦

తాత్పర్యము

అని యీప్రకారము గురుఁడు బ్రాహ్మణ ముఖ్యుఁడునగు వసిష్ఠుఁడు పలికిన మాటలను మనసునఁ దవులనీయక తన పతిపోవుమార్గమునందే తాను బోవుటయందిష్టముగలది గావున సీత నారచీరయే సంతోషముచే ధరించెను.

ఇట్టి యభిప్రాయముగలది సీత మరల నెట్లు మంచి వస్త్రములు ధరించె ననఁ బతియాజ్ఞచేసనని యెఱుఁగునది. పతి యెదుటనున్నప్పుడు సతి యలంకార యుక్తయైయుండుట శాస్త్రనిషిద్ధముకాదు.లోపాముద్రాదు లిట్లు చేసినవారే కదా.

ఇంతకు శ్రీరాముఁడు కార్యార్థమై పరులబలాత్కారమున వానప్రస్థవేషము వేసికొనెనేగాని విరాగియై వానప్రస్థాశ్రమ స్వీకారము చేసినవాఁడు కాఁడు.

-• ౩౮-వ సర్గము.సీతకు నారచీర లిచ్చుటకు దశరథుఁడు కైకను నిందించుట •-

కం॥ ఆచీర లట్లు సీత సమీచీనమతిన్ ధరింప • మిక్కిలి జనముల్
వాచాపారుష్యంబునఁ, జీ ఛీ యని దశరథు న్వ • చించుచు నేడ్వన్. ౧౦౨౧

సమీచీనమతిన్ = చక్కని మనస్సున, వాచాపారుష్యంబునన్ = పరుషపు వాక్కుల్లచే.

తాత్పర్యము

వసిష్ఠుని మాటయందు మనస్సుంచక సీత యా నారవస్త్రములను మనస్సునఁ గోపాదులులేక పట్టుచీరలు ధరించునప్పటి మనస్సుతోనే ధరింపఁగాఁ జూచినవారందఱు కఠినవాక్కుల దశరథుని ఛీ ఛీ యనుచు నేడ్వఁగా.

శా॥ అనాదం బతిదుస్సహం బగుడుఁ దా • నాలించి భూపాలుఁడున్
మానెన్ దేహముపై యశంబుపయి ధ • ర్మంబందు శ్రద్ధం, గడుం
బూనెన్ దుఃఖము, నంతఁ గైకఁ గని యా • పూఁబోడి యీనారలన్
మేనం దాలిచి పోవరాదు వనికిన్ • నిక్కంబు సుమ్మింతయున్. ౧౦౨౨

తాత్పర్యము

చూచెడివారందఱు పెట్టు చీవాట్లధ్వని వారల యేడుపుధ్వని విన సహింపరానిదగుటచే నిఁక మనము బ్రతుకుట వ్యర్థము. మరణమే తగిన శరణము. ఒకవేళ బ్రతికినా యిదివఱకు వచ్చినకీర్తి నాశమయ్యెను. ఇఁక రాఁబోవునది యపకీర్తియే.ఇంతటి యధర్మము నాయెదుట జరుగఁగా గన్నులారఁజూచి యేమియుఁ

జేయఁజాలని నాకు ధర్మవిచార మెందుండివచ్చును. నావలన లోకమే ధర్మ శూన్యమగుననియు దేహముఁ గీర్తి ధర్మము నివి నాకుఁ దక్కవనియు నమ్మి మిక్కిలి దుఃఖించి కైకను జూచి యీ సుకుమారములాంగి యీ నారచీరలు గట్టి యడవికిఁబోరాదు. ఇది నిజము.

కం॥ పాప నెఱపూపవయసుది, పాపము! సుకుమారి సీత•వని కరుగఁగా
నోప దని కూడ దని కడుఁ, బాపం బని నిజము గురుఁడు•పలికెం గైకా.

పాప=చిన్నపిల్ల, నెఱపూపవయసుది=మిక్కిలి లేఁతవయస్సుది, సుకుమారి=కోమలమైన యవయవములు గలది.

తాత్పర్యము

ఈ లేఁతవయస్సు చిన్నపిల్ల అయ్యో పాపము సుకుమారియగు సీత యడవులకుఁబోఁజాలదని పోఁగూడదని పోయినచో బంపినవారికి మిక్కిలి పాపమని వసిష్ఠుఁడు సత్యము చెప్పెను.

మత్తకోకిలము. భూపచంద్రముపుత్రి యై ధరఁ•బుట్టి సాధుచరిత్ర యై
పాపమెద్ది యెఱుంగ నట్టిది•బాల శ్రీమతి యేరికే
పాపముం బచరించెనే యిటు•వల్కలంబులతోడుతన్
దాపసిం బలె నెల్లరుం గనఁ•దా సభాస్థలి నిల్వఁగన్: ౧౦౮

తాత్పర్యము

మహారాజు కూఁతురై లోకములోనివారివలెఁ గాక భూమియందుఁ బుట్టి పతివ్రతయై యేపాపము నెఱుఁగని బాలశోభావతి సీత యీప్రకారము తాపసివలె నారచీరలుగట్టి యందఱుచూడ సభాప్రదేశమున నిల్చుటకు నేమిపాపము చేసెనే, మత్తకోకిలవృత్తమునకు, రసజజభరలు గణములు పదునొకండవ యింటయతి.

మత్తకోకిలము. చేసినాఁ డనె నీకు బాసను•సీత నారలతో వనీ
వాసముం బచరింప, నీగతి•బంది పెట్టెద వేటికే?
తా సుఖంబుగ సర్వరత్నవి•తాన సంయుత యై చనున్,
గాసి యేటికి నొంద?నారలు•గట్ట కుండెడుఁ గావుతన్.౧౦౯

బాస=ప్రమాణము, బంది పెట్టెదవు=నిర్బంధపఱిచెదవు, సర్వరత్న వితాన సంయుతయై=సమస్తరత్నాభరణములతోఁ గూడినదై.

తాత్పర్యము

ఓసీ! సీత నారచీరలతో వనవాసముచేయఁ బంపెదనని నీకు నేను ప్రమాణముచేసితినా? ఏల యిట్లు నిర్బంధపఱిచెదవు. యథాసుఖముగ సమస్తాభరణములతోఁ బోవును గాక. ఆమె యేల నిష్కారణముగ నాయాసపడవలయును. కావుననారచీర లామె కట్టరాదు.

సీతాదేవి పతివ్రతయని తుల్యశీలయని (వ. ౧౦౩౪) చెప్పఁబడెనుగదా. అట్టి యుత్తమపతివ్రత తనమగఁడు నారచీరలు కట్టుకొనియుండఁ దానెట్లు పట్టుచీరలు ధరించెను? ఇది వ్రతభంగము కాదా? కాదు.

ఏలన:—ఆమె కామాసక్తయై భోగము, సుఖముఁగోరి కట్టుకొన్నదిగాదు. పతివ్రత తుల్యశీల గనుకనే వసిష్ఠుఁడు మొదలగువారు వలదువలదనినను (వ. ౧౦౨౦) నారచీరలు సంతోషముతోఁ గట్టుకొనెను. కాని గురువునకు గురువగు మామగారు మంచిచీరలు కట్టుకొనిపోవలసినదని చెప్పుటచేతను, భర్త దాని నామోదించుటచేతను వారి యిరువుర యభిప్రాయములకు విరోధముగఁబోరాదు గావున వారి యిష్టప్రకారము కట్టుకొనెను. తన తండ్రి యభిప్రాయమునకు విరోధముగ వర్తించు నిష్టము లేకయే రావణువధానంతరము, శ్రీరామచంద్రమూర్తివిభీషణునితో "శ్లో॥ సీతను వసుంధరాసం. జాతను దివ్యాంగరాగ•సకలాభరణో, పేతనువేగమమూర్ధ స్నాతనుగాఁజేసి తోడి•చయ్యనఁదెమ్మా" యుద్ధ ౧౬౩౮ యని చెప్పెను. అదియునుగాక యనసూయ సీతాదేవికి వస్త్రములంగరాగములిచ్చి ధరింపుమన ధరించి శ్రీరాము నొద్దకుఁబోయి యా సమాచారమంతయుఁ జెప్పఁగ శ్రీరామచంద్రమూర్తి సంతోషించెనుగానివలదనఁడయ్యె. (అయో ౧౨౬౮ వ.) కావునఁ బతి యనుమతి సీతాదేవి మంచివస్త్రములు ధరించి యాయనతోడనే యుండుటచేఁ బాతివ్రత్యనియమ హానిలేదు. భర్త పరోక్షమందు స్త్రీ సొగసులు చేసికొనరాదు.

ఉ॥ కాటికిఁ బోవ నా కిపుడు•కాలము దాపుగ రాఁగఁ గూళనై
పాటి దొలంగి ఘోర మగు•బాస యొనర్చితి నీచబుద్ధి, నా
మ్మాటయె నన్ను గాల్చెడిని•మానక వేణువు దానిపువ్వనన్,
బాటిల కున్నె దుఃఖములు•పాపపు జంతలమాటఁ బట్టినన్? ౧౦౨౬

కాటికిన్=స్మశానమునకు, కూళనై=దుష్టుఁడనై, పాటి=క్రమము, జంతలు=గయ్యాళిస్త్రీలు, అర్థాంతరాన్యాసాలంకారము.

తాత్పర్యము

స్మశానమునకుఁ బోవుటకు నాకుఁ గాలము సమీపించుటచే 'వినాశకాలే విపరీతబుద్ధి' యన్నట్లు దుష్టుఁడనై క్రమమువిడిచి కామాసక్తమైన నీచబుద్ధినై క్రూరమైన ప్రమాణముచేసితిని. శ్రీరామునిమీఁదఁ బ్రమాణముచేసితిని. మాట దప్పినను శ్రీరామునకే కీడు. మాటప్రకారము జరిపినను శ్రీరామునకే కీడు. కావున వెదురునందుఁబుట్టిన పువ్వు వెదురునే చెఱుచునట్లు నామాటయే నన్నుఁ గాల్చుచున్నది. పాపాత్మురాండ్రైన దుష్టస్త్రీల మాటవినిన దుఃఖములురావా. తేలునకు గర్భము, వెదురునందుఁ బూవు, అరఁటియందు గొల, ఇవన్నియు మూలనాశమునకే. అళీకుళీకర్కటి వేణురంభా వినాశకాలేఫలము ద్వహంతి.

కం॥ అల్లీల బాసలం గొని, యిల్లీలను బేరుఁ బెంపు•నిందును సందున్
బొల్లవడఁ జేయువరములఁ, బిల్లతనముచేత వలచి•ప్రేలెదు కంటే. ౧౦౨౭

తా త్ప ర్య ము

ఆవిధముగాఁ బ్రమాణములు చేయించుకొని యీ విధముగా నిహమందుఁ బరమునందుఁగూడఁ గీర్తి, గొప్పతనము నాశముచేయు వరములను గొప్పబుద్ధి యాలోచనములేక కోరి యెట్లు వదరుచున్నావో చూచితివా.

ఉ॥ మాటకు నైనఁ జూత మొక•మాటు రఘూత్తమునందుఁ బాపముం
బాటిలె నందువేఁ దెలుపు•మా కనుఁగొందము, పల్కు వింద మీ
పాటలగంధియందుఁ గల•పాప మొకం డయినన్, దురాత్మురా
లా! టకటొంకు మాన విది•లక్షణమే మగనాల వైనచోన్. ౧౦౨౮

టకటొంకు=మోసము, మగనాలవు=పతివ్రతవు, మగని+ఆలు=మగనాలు=లంజకాదనుట.

తా త్ప ర్య ము

శ్రీరామునం దొకపాపము మాటమాత్రమునకైనఁ గలిగినా నంగీకరించెదను. ఒకటి చెప్పుము. చూతము. అట్టిలే యీ సీతయందు నొకపాపముండినఁ జెప్పుము. దుష్టబుద్ధిగలదానా! నీవు మోసము మానవైతివి. మగనితోఁ గాఁపురము చేయు స్త్రీలక్షణమా యిది.

తే॥ హితచరిత్రక హరిణాక్షి•మృదులశీల, బాలసాధుతపస్విని•పార్థివేంద్రు
కన్య భూసుత మిక్కిలి•కరుణ గలదు, పాపమెయ్యది గంటివే•పరుషతకును ౧౦౨౯

తా త్ప ర్య ము

సీతయం దొక్కొక్క గుణము చూచినను నామె విషయమై యిట్లువర్తించుట సరిగాదు. లోకహితమైన నడవడిగలది. జింకకన్నులవంటి కన్నులుగలది మృదుస్వభావముగలది. చిన్నవయస్సుది. మంచి తపస్సు చేయునది. (పతివ్రత) మహారాజుకూఁతురు. మిక్కిలి దయగలది. క్రౌర్యమెట్టిదో యెఱుఁగదు. ఇట్టి యీమెయందు నేమిపాపము కనిపెట్టి యింతటి క్రౌర్యమునకుఁ దెగించితివే.

శా॥ ఓసీ! రామవివాసనాకలితపా•పౌఘంబె యాత్మాంతమున్
గాసిం బెట్టఁగఁ జాలి నారకమునం•గ్రాఁచున్ నినున్, వెండియున్
శ్రీసీతాసతి లోభబుద్ధి నిటు క•స్తిం బెట్టఁగాఁ గల్గునే
దోసంబుల్ నిను నేమి చేయఁ గలుగున్•దుర్దాంతమై యెంతయున్.

రామవివాసనాకలితపాపౌఘంబె=రాముని నరణ్యములకుఁ బంపుటచే సంపాదించిన పాపసమూహమే, ఆత్మాంతమున్=ఆత్మయుండువఱకు, శాశ్వతముగా, నారకము=నరకము, క్రాఁచున్=కాల్చును, కస్తి=కష్టము, దుర్దాంతమై=అణఁపరానిదై.

తాత్పర్యము

ఓసీ! రాము నడవులకుఁబంపుటచే సంపాదించిన పాపమే నిన్ను శాశ్వత నరక బాధల ననుభవింపఁ జేయఁజాలియున్నది. ఇఁక నీ శ్రీ సీతను లోభ బుద్ధిచేఁ బెట్టెడు కష్టములవలనఁ గలుగు పాపములు ప్రాయశ్చిత్తాదులచే శమింపఁజేయ సాధ్యముకానివైనను నిన్ను నేమిచేయఁగలవు. శాశ్వతనరకాను భవముకంటె ఘోరశిక్షలేదుగా.

కం॥ రాముఁ డభిషేకమునకై, యీమేడకు వచ్చియున్న•యెడ నాతనితో
రామా! వనికిం బొమ్మన, నామాటయె వింటి నన్య•మాడవు కాదే. ౧౦౬౧

తాత్పర్యము

అభిషేకమునకై శ్రీరాముఁ డీమేడకువచ్చినపు డాతనితో రామా యడవికిఁ బొమ్మంటివి. అంతమాత్రమువింటిని అంతియకాని యిఁకనేమాటయు జెప్పలేదుగదా.

మ॥ వినవే రామవివాసనం బొకఁడ న•న్వేఁడంగ నీకొంటి, నీ
వనఘన్ సీతను వేడ, వేఁ బ్రతిన సే•యన్, దాఁటి యీ మేర యీ
వనజాక్షీమణి నారచీరలను ని•ల్వం జూడఁగాఁ గోరుటన్
జనఁగాఁ జూచెదు దుర్గతిం బడఁగ, నిన్•సైరింపనే జాలుఁడున్. ౧౦౬౨

తాత్పర్యము

ఓసి విను. రాము నరణ్యమునకుఁ బంపుమనియే నీవు కోరితివి. నేను దాని నంగీకరించితిని సీతను గురించినది నీవు కోరినదిలేదు. నేను ప్రతిజ్ఞచేసినది లేదు. ఆ మర్యాదవిడిచి యీ స్త్రీరత్నము నారగుడ్డలుకట్టుకొని నిలువంబడఁగాఁ జూడఁ గోరినదానవగుటచే నీవు నరకములఁబడఁ జూచుచున్నావు. నిన్ను నీశ్వరుఁడు క్షమించునా.

కం॥ అని విలపించుచు బహుళా, రిని, గుందుచు దశరథుం డ•తివ్యథ నిలవ్రా
లినఁ గని జనకునితో నిటు, లనియెన్ శ్రీరామచంద్రుఁ•డతివినయమునన్. ౧౦౬౩

తాత్పర్యము

అని యేడ్చుచు మిక్కిలి వ్యసనమునఁ బరితపించుచు దశరథుఁడు మిగుల బాధపడుచు నేలఁబడఁగా జూచి తండ్రితో శ్రీరామచంద్రుఁ డతివినయమున నిట్లనియెను.

—• శ్రీరాముఁడు తనతల్లిని గాపాడుమని తండ్రిని వేడుకొనుట. •—

సీ॥ నాతల్లి కౌసల్య•నవ్యగుణాకల్ప, సాధుతపస్విని•సత్యశీల
యిదివఱ కెన్నండు•మది దుఃఖ మెఱుఁగదు,
నే నెడఁబాయుట•నేఁడు మొదలు
పుత్రశోకంబునఁ•బొగులుచు నుండును, నేండ్లు చెల్లిన యది•యెట్టులైన
నాదుఃఖమున మర•ణంబు నందక యుండ, నీవెను బాలింపు•మీమహాత్మ

తే॥ నిన్ను మదినైన నెపుడు నిం•దింపఁబోదు,
నన్నుఁదలఁచుచుఁ దలఁచుచు•నన్నగిల్లి
కాలుపురి కేగ కుండఁగఁ•గావ వయ్య,
నాదుప్రార్థన నోనర•నాథచంద్ర. ౧౬౪

సర్వగుణాకల్ప=అందమైనగుణములే యాభరణములుగాఁ గలది, సాధు తపస్విని=మేలైనతపస్సు చేయునది, సత్యశీల=సత్యమే స్వభావముగాఁగలది దుర్గుణములుగలదై తపస్సునది యెఱుఁగక యసత్యమాడ జంకని నీ ముద్దు పెండ్లాము కైకవంటిది గాదనుట,మరణంబు నొందకయుండన్=చావకయుండు నట్లు, భోగ్యవస్తువులిచ్చి పోషింపకున్నను ప్రాణములో నుండనిచ్చినఁజాలును అని భావము. నే నిచటనుండఁగనే యామె ననాదరించినవాఁడవు. నేను లేన ప్పుడు నీ వేమి యాదరింతువు. కాని ప్రాణముపోవు పనిమాత్రము చేయకుము

తాత్పర్యము

నరేశ్వరా! నా తల్లి కౌసల్యాదేవి శ్లాఘ్యమైన గుణములే యాభరణ ములుగాఁ గలది. బాగుగాఁ దపస్సుచేసినది. సత్యమాడుట స్వభావముగాఁ గలది. ఇదివఱ కెన్నఁడిట్టి దుఃఖమనుభవించినది కాదు. నేను విడిచిపోవు కారణ మున నీ దినము మొదలు కడుపు దుఃఖమునఁ దపించుచుండును. దానికిఁ దోడు వయస్సు మీఱిన ముసలిది. నాదుఃఖముచేఁజావక దేహము ధరించియైన నుండునట్లు నీమెను రక్షింపుము. అంతమాత్రము చేసిన నీవు మహాత్ముఁడవే. అట్లు చేయకుండుటకుఁ గారణముండదు. నీ విట్లుచేసితివని యామె నిన్ను నిందింపదు. నన్నుఁ దలంచుచుఁ దలంచుచుఁ జిక్కి యమపురి కేగకుండు నట్లు కనిపెట్టియుండఁ గోరెదను. ఇదియే నా ప్రార్థన. మఱియేదియుఁ గావ లయునని నిన్ను నేను గోరను.

కం॥ అడవులలోఁ దిరుగుచు నే, నిడుమలఁ బడు చుందు ననుచు•నెంతోవనటన్
బడుచుఁ గృశించుచు మిడికెడు,
మడియకయుండంగ నాదు•మాతంగనుమీ. ౧౬౫

అటవులలోఁ దిరుగుచుఁ గష్టములు పడుచుందునని మిక్కిలి దుఃఖ పడుచు బక్క చిక్కి తెల్లపాఱియుఁ జావకుండునట్లుగా మిక్కిలి సంతాపించు చున్నది. మడియకయుండన్‌కాన్ = మడియకయుండునట్లు నాతల్లిని జూచి కొనుము. ఇదియే నా ప్రార్థన.

తాత్పర్యము

నే నడవులలోఁదిరుగుచుఁ గష్టపడుచుందుననియే మిక్కిలి శోకించుచు కృశించి దుఃఖించును గాని యితరులవిషయ మాలోచించినదికాదు. కావున నా తల్లిని జావకుండఁ గాపాడుము.

కం॥ అనురాముని వచనము విని, మునివేషముఁ గొనినయతని•మోముం గనలే
కను బల్కనేరకయు నాం,ద్రుడు దానుం ద్రెళ్ళి ధరణి•దూక్షపుమూర్ఛన్.

తాత్పర్యము

అని శ్రీరాముఁడు చెప్పుచుండఁగా దశరథుఁ డాయన మాటలువిని ముని వేషముననున్న యాయన ముఖమును జూడ లేక తన భార్యలు దానుఁ గ్రూర మైన మూర్ఛ మునిఁగి భూమిమీఁదఁబడి.

క్త్వార్థకసంధి.

కనలేకను=వ్యతిరేక క్త్వార్థకమైన (లేక) కళయే. లేకయును అనుదానిలో 'యు'లోపింపఁగా మిగిలినరూపము లేకను. అర్థవిశేషమం దిట్లు కళలకును నువర్ణంబు చేర్పఁబడును. వెండిన్, మఱిన్. ఇత్యాదులు ప్రయోగంబులఁగలవు.

"వాటువడి మూర్ఛవోయిం। బోటిద్దైత్యుండు. ఉ. హ. ౪ ఆ

"అనఘుయిది యేటితపమే। మనుపమ దుఃఖితులమగుట నాధారములే। కనుసంతానచ్ఛేదం। బున వ్రేలెద మధమలోకముల తెరువుననన్॥ భార. ఆది-౨. ౧౩౯.

౩౯-వ సర్గము. మునివేషధరుండైన శ్రీరామునిఁ జూచి దశరథుఁడు దుఃఖించుట.

ఉ॥ ఇంచుక సేఁపు భూమితన•యేశునిఁగూర్చి మహీశుఁడుం బ్రలా
పించు నయో పురాకృతము•వ్రేఁపక పోవునె నన్ను, లేఁగలన్
గ్రించుతనాన నెన్నింటికిఁ•గిడుగఁ బాపితి నాక్కొ గోవులన్
గొంచక యెన్ని ప్రాణులకుఁ•గూర్చితినో దురితంపు హింసలన్. ౧౦౬౭

కొంచెము తెప్పరిల్లి రాజు శ్రీరామునిఁగూర్చి యిట్లు ప్రలాపించెను. అయ్యో! పూర్వముచేసిన పాపము నన్నుఁగాల్పక వ్యర్థమైపోవునా? కీడు గలుగునట్లు దూడలను వాని తల్లులనుండి నీఁచుఁడనై సంకోచింపక యెడఁ బాపితినో, ఎన్ని జీవులకుఁ బాపకరమైన హింసలఁ గావించితినో, అపాపము నేఁడు నన్నిట్లు బాధించుచున్నది.

ఉ॥ వెల్గెడివాఁడు తేజమున•వీతవహుం డన నాదుపుత్త్రుఁ, డీ
నల్గురుఁ జూడ నాయెదుట•నారలు గట్టుకొనంగ సైఁచెదన్,
నీల్గను గైకబారిఁ బడి•నిర్భరదుఃఖ మిఁ కొందు గల్గునే?
కల్గ దనాగతం బయిన•కాలమునన్ మరణంబు దేహికిన్. ౧౦౬౮

వీతవహుండు=అగ్ని, అనాగతంబు=రానిది.

తాత్పర్యము

అగ్నివలెఁ దేజముచేఁ బ్రకాశించువాఁడు కదా. నా కొడుకు అట్టివాఁ డీ లోకులు చూడ నాయెదుటనే నారచీరలు కట్టుకొనఁగాఁ జూచి సహింపవలసి వచ్చెను. ఈ దురవస్థఁజూచి సహించి ప్రతిక్రియచేయలేని యనాథత్వమున కంటె భరింపరాని దుఃఖమేదికలదు. ఈకైక బారిఁబడి చచ్చినవాఁడనుగాను, మరణము మాత్ర మకాలమందు రమ్మనిన నెట్లువచ్చును. అది యసాధ్యము. కావున ననుభవింపవలసినదే విధి.

కం॥ వంచించి నన్ను స్వార్థం, బెంచి కటా కైక యొకతె•యిూయున్న ప్రజా
    సంచయముం గారించెడి,
        నంచును రామా యటంచు•నశ్రులునించెన్. ౧౦౬౯

తాత్పర్యము

ఒక్క కైక యయ్యో. నన్ను వంచించి ధనకాముయై తన లాభము మాత్రముచూచుకొని యింతమంది జనులను బాధించుచున్నది కదా. శ్రీరామా యని కన్నీరు కార్చెను.

కం॥ రామా యని యొకపరి పై, నేమాటయుఁ బలుకలేక•యేడ్చు సుమంత్రున్
    భూమీశుఁ డనియెఁ దెమ్మా,
        రామున కుపవహనయోగ్య•రథ మెుం దిటకున్. ౧౦౭౦

అని=చెప్పి, ఒకపరి=ఒకసారి, ఉపవహనయోగ్యము = ఎక్కిపోవుటకుఁ దగినది.

తాత్పర్యము

ఒకసారి రామా యనిపలికి యామీఁద నేమాటయుఁ బలుకలేక యేడ్చు సుమంత్రునిఁజూచి శ్రీరాముఁ డెక్కిపోఁదగిన తేరు తీసికొని యిటకు రమ్మ.

కం॥ కొని చని మహానుభావుని, జనపదముల నెల్లఁ గడచి•చని యట విడుమీ
    యనవుడు నాతఁడు తేరిం,
        గొనితేరఁగఁ జనిన నని యెఁ•గువలయపతియున్. ౧౦౭౧

కువలయపతి=భూచక్రమున కధిపతి=రాజు.

తాత్పర్యము

అరథముపై శ్రీరామునిఁ దీసికొని యూళ్ళెల్ల దాఁటిపోయి యచ్చట వదలి పెట్టుము అని చెప్పఁగా నతఁడు రథము తీసికొనివచ్చుటకుఁబోయెను.

ఆ॥ నోరులేనివాని•వీరుని నడవులఁ, దల్లిదండ్రు లిట్లు•దలఁగఁ ద్రోయ
    నరసి. సాధుగుణుల•యమలగుణంబుల,
        ఫలము నిట్టిదనుచుఁ•దలఁచువాఁడ. ౧౦౭౨

నోరులేనివానిన్=పెద్దలకుఁ బ్రత్యుత్తరము చెప్పఁజాలనివాని, ఇట్లుచెప్ప లేకపోవుట దుర్బలత్వముచేత నాయనినఁ గాదు, వీరునిన్=బలపరాక్రమశౌర్యములు గలవానిని, అట్లయిన నేల నిరాకరించలేదు. చెప్పినవారు తల్లిదండ్రులు ఆకారణముచే బదులు చెప్పలేక చిక్కుపడినాఁడు. వారికిఁ బ్రత్యుత్తరము చెప్పనురాదు. వారియందు శౌర్యము చూపనురాదు. ఇఁక నేమిచేయఁగలఁడు అరసి=ఆలోచించి.

తాత్పర్యము

పెద్దలను ధిక్కరింపలేనివాఁడు, వారేమియనినను సైరించియుండు వాఁడు. వీరుఁడై ధిక్కరింప శక్తిగలవాఁడు. ఇట్టివానిని మనము చెప్పినదానికి నెదిరించి చెప్పఁడు గదా యను ధైర్యముతో రక్షింపవలసిన తల్లిదండ్రులే యిట్లు దగ్గఱనుండకుండ దూరముగా నెట్టివైచుట యాలోచింపఁగా సాధుచరిత్రుల నిర్మలగుణముల ఫలమిట్టిదేకదా. ఇట్టి సద్గుణములు కలవాఁడు

లోకమున సుఖపడఁడు అని తలఁచెదను. మెత్తగానున్న మెత్తబుద్ధియయ్యె నన్నొసామెతగలదు గదా. కావున మెత్తఁదనము వ్యర్థము.

కం॥ త్వర త్వర కార్యముఁ జేయఁగ, వెరవరి యగుసారథియును•వేవే తేరిన్
దురగములఁ బూన్చి ధరణీ,శ్వరచంద్రముఁ డుండునింటి•వాకిట నిలిపెన్.

వెరవరి=ఉపాయశాలి, వేవే=త్వరత్వరగా, తురగములన్=గుఱ్ఱములను, పూన్చి=పూనునట్లుచేసి,

తాత్పర్యము

అలస్యములేక కార్యముచేయు నుపాయము తెలిసిన సారథియును మిగుల శీఘ్రముగాఁదేరిని సిద్ధముచేసి గుఱ్ఱములనుగట్టి రాజుండు నింటివాకిటి నిలిపెను.

కం॥ కనకాలంకృతిభూషిత, మును బరమజవాశ్వయుక్త•మును వరదంబున్
గొని వచ్చితి రామునికై, యని యాతఁడు విన్నవింప•నాక్ష్మాధవుఁడున్.

కనకాలంకృతిభూషితమును=బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినది, పరమ జవాశ్వయుక్తమును=మిక్కిలివేగముగాఁబోఁగల గుఱ్ఱములఁ గూడినది, అరదము=తేరు, రథశబ్దభవము అరదము, తద్భవంబున వర్ణాధిక్యము.

తాత్పర్యము

బంగారుసొమ్ములచే నలంకరించి మిగుల వేగముగఁబోఁగల గుఱ్ఱములనుగట్టి శ్రేష్ఠమైన రథమును దెచ్చితినని సుమంత్రుఁడు విన్నవింపఁగారాజు

సీ॥ విత్తకోశాధ్యక్షు•సత్తము దేశకా,లజ్ఞు నిశ్చితుఁ బిల్చి• ప్రాజ్ఞ వర్య
వెల గలనగలు దు•వ్వలువలఁ బదునాలుఁ, గేఁడుల కగునట్టు•లీలతాంగి
కీయఁగఁ గొని తెమ్ము•యీా వన నతఁడేగి,
యన్నియుఁ గొనివచ్చి•యప్పగింపఁ
గోడలి కన్ని యా•కువలయపతి యిచ్చె, నిచ్చిన వానిని•బుచ్చుకొనుచు

తే॥ మేలిభూషణములఁ గొన్ని•మేనఁ దాల్చి
మెఱుపునకు మెఱుఁ గిచ్చిన•మేల్మి దనర
వెలిఁగెఁ దత్కాంతి గృహ మెల్ల•వేగుఁబోక
బాలసూర్యునిచే మిన్ను•వఱలునట్లు. ౧౦౪౨

విత్తకోశాధ్యక్షున్=బొక్కసమునకు నధికారి, సత్తమున్ = సజ్జనులందు శ్రేష్ఠుని, దేశకాలజ్ఞున్=ఏప్రదేశమున నేకాలముల నెట్లు నడువవలయునో యది తెలిసినవాఁడు, నిశ్చితున్=నిశ్చయబుద్ధిగలవానిని, ప్రాజ్ఞవర్య = బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా, అప్పగింపన్=ఒప్పగింపఁగా, కువలయపతి=భూచక్రాధిపతి, మేనన్=దేహమునందు, తాల్చి=ధరించి, వేగుఁబోకన్ = ఉదయకాలమునందు, మిన్ను=ఆకాశము.

తాత్పర్యము

ధనశాలకు నధిపతియు, సాధువర్తనము గలవారిలో నుత్తముఁడును, బొక్కసమునం దెంత ధనముండునది వాస్తవజ్ఞానము గలవాఁడునునగువానిని

బిలిచి బుద్ధిమంతుఁడా! వెలగల భూషణములు, సన్నని పట్టువస్త్రములు ఇవి పదునాలుగేఁడులకుఁ జాలినన్ని యీ సీత కిచ్చుటకై తెమ్ము అని రాజాజ్ఞాపింపఁగా నతఁడుపోయి యన్నియుఁదెచ్చి రాజున కిచ్చెను. అందుఁ గొన్ని భూషణములు దేహముమీఁద ధరించెను (నారచీరలు కట్టుకొనునపుడు కట్టుకొన్న చీరతోపాటు ఆభరణములను దీసివైచెను.) ఇట్లు ధరింపఁగా బంగారు దేహకాంతిగల యామె యా భూషణములను ధరించుటచే మెఱుపునకు మెఱుఁగు పెట్టినట్లయ్యెను. ఆకాంతిచేత బాలసూర్యునిచే నాకాశము ప్రకాశించునట్టు లా గృహమంతయుఁ బ్రకాశించెను.

—• కౌసల్య సీతకు ధర్మోపదేశముఁ జేయుట. •—

కం॥ డెందమునఁ జింత యేమియుఁ,
జెందక నిలుచున్న స్నుషను•సీతను దలుఁ జే
రం దిగిచి కోసలాత్మజ,పొందుగఁ గౌఁగిటను గ్రుచ్చి•పొలఁతుక కనియెన్

డెందమునన్=హృదయమందు, ఏమియున్=కొంచెమైనను, స్నుషను=కోడలిని, తిగిచి=లాగుకొని, పొలఁతుకకున్=స్త్రీకి, సీతకు.

తాత్పర్యము

అడవికిఁబోవలసివచ్చెఁగదా యను విచారము కొంచెమైనను లేక బాగున్నప్పుడుండుదానివలెన్ నిలఁబడియున్న కోడలిని సీతను తనయొద్దకుఁ జేయిపట్టి లాగికొని కౌసల్యాదేవి కౌఁగిలించుకొని యామె కిట్లనెను.

కం॥ కలిమియు సౌఖ్యము సతతము,
నలువుగఁగూర్పఁగను బ్రాణ•నాథుఁడు కీవిన్
గులుకుచు, సిరులు దొలంగినఁ,
గులటలుగద పతిని దూఱు•గుణహీనసతుల్. ౧౦౪౪

కలిమి=సంపద, నలువుగన్=చక్కఁగా, ప్రాణనాథుఁడు = భర్త, కులటలు=కులధర్మము నతిక్రమించి నడచువారు; ఱంకుటాండ్రు, దూఱు=నిందించు, గుణహీనసతుల్=పతివ్రతాగుణములులేని స్త్రీలు.

తాత్పర్యము

సంపదసౌఖ్యము నెల్లప్పుడు చక్కఁగాఁ దమ భర్తలు తమకుఁ గలిగించువఱకు విలాసముతోఁ గులుకుచుఁ, గాలము కారణముగా నా సంపదలుదొలఁగి పేదఱికము వచ్చినపుడు ఆ భర్తలను నిందించువారు ఱంకుటాండ్రేకదా. ఇఁక నైశ్వర్యము కలిగించుచు బాగుగనున్నప్పుడే భర్తను నిందించుచు గోడుకుడిపించు కైకవంటివా రెటువంటివారని నేను జెప్పఁగలను అని భావము.

కం॥ తొలుత సుఖ మనుభవించియుఁ, గలిమి మఱి పతి కెడనై•కష్ట మొదవుటన్
దొలఁగ సుఖమతని నిందలు, పలుకుట పాయుటయు స్త్రీస్వ•భావము తల్లీ

తొలుతన్=ముందు, కలికీ=సుందరీ, 'కలికి యొప్పిదంబు కాంతయయ్యె' యని నిఘంటువు, ఏదేని=ఏదోయొక.

తాత్పర్యము

మొట్టమొదట నార్జనపరుఁడైన భర్తతో సుఖ మనుభవించియు నావల నేదో యొక కష్టము వానికి రాఁగా నాకారణమున సుఖము దొలఁగఁగా నతని నిన్నుఁ గట్టుకొని నేనేమి సుఖముపడినాను. ఇట్లు కష్టపడుటకా నేను నిన్నుఁ గట్టుకొన్నది యని తిట్టుటకు నతని విడిచిపోవుటయుఁ ఁబ్లీ స్త్రీల సహజగుణము లోకాపవాదమునకు, నరకమునకుఁ బతనమునకుఁ, వేఱుగతిలేదీయని, భయ పడుటచే స్త్రీలు భర్తలుతోడఁ గాఁపురము చేయుదురుగాని యీవిచారములు లేనివారు భర్తలతోఁ గష్టకాలములందుఁ గాఁపురములు చేయనొల్లరని భావము.

ఉ॥ బొంకులపుట్టినిండ్లు యి స్వపూరుషు గేలిగ వెక్కిరించుచున్
గొంకక దుష్టచింతనలఁ కున్ నిధు లై భృశగూఢచిత్తలై
మంకుతనంబునన్ వయసుమంపున రోయఁగఁ జేయుచుందు రే
ణాంకముఖుల్ నిమేషమునఁ బ్రాణమువోలెను జూచుభర్తనేన్ ౧౦౬

గేలిన్=పరిహాసముగా, భృశగూఢచిత్తలై=మిక్కిలి రహస్యముగఁ దమ మనస్సులను దాఁచువారై, మంకుతనంబునన్=మూర్ఖత్వముచే, వయసుమంపు నన్=వయస్సుమదముచే, రోయఁగన్=అసహ్యించుకొన, ఏణాంకముఖుల్= చంద్రబింబమువంటి ముఖముగలవారు స్త్రీలు, నిమేషము=నిమిషము, అత్యల్ప కాలము.

తాత్పర్యము

అసత్యములకు జన్మస్థానములై, హేళనముగాఁ దమ భర్తలను వెక్కి రించుచు, దురాలోచనలు చేయుటయందు జంకులేక, తమ మనస్సును వెలు పలివారికిఁ దెలియనీయక, మకురుతనముచేత, వయస్సుమత్తున, దేహము తెలియక వర్తించుచు స్త్రీలు తమ ప్రాణమువలె రక్షించుకొనుచుండెడి భర్తల మనస్సులైనను నిమిషకాలములో రోఁతపుట్టఁ జేయుదురు.

చం॥ కులముమహత్తముం గన రకుంఠితరక్తి విభుండు సేయుచె
య్యుల మదిఁ జేర్ప, రాత్మవిభునుజ్జ్వలపాండితి మెచ్చ రెంతయున్
దలఁపరు పాణిసంగ్రహముదత్తధనాదుల నెంచ రాత్మలన్
జలజదళాక్షీః జాఁగ లగుచంచలచిత్తలు మత్తకాశినుల్ ౧౦౭

కులముమహత్త్వమున్=కులముయొక్క గొప్పతనము, అకుంఠితరక్తిన్= మొక్కవోని యనురాగముచే, విభుండు=మగఁడు, చెయ్యులన్=కార్యములను చెయువు మొదటిరూపము, ఉజ్జ్వలపాండితిన్=జ్ఞానాతిశయముచేఁ బ్రకాశించు పాండిత్యము, పాణిసంగ్రహము=వివాహము, దత్తధనాదులన్ = తమకీయఁ

బడినధనములలోనైనవానిని, జాఁగలు=జంకుటాండ్రు, ధూర్తస్త్రీలు, చంచల చిత్తలు=చపలమనస్సుగలవారు, మత్తకాశినుల్=మదముచేఁ బ్రకాశించువారు.

తాత్పర్యము

తాము పుట్టిన కులముయొక్కగాని వంశముయొక్కగాని గొప్పతనమును నాలోచింపరు. మన మీచేయరానిపని చేసిన మన కులమునకు మన వంశమునకు నపకీర్తి వచ్చునే యని యాలోచింపరు. తమయందుఁ దమ భర్తలు కొఱఁతలేని యనురాగముతోఁ దమ్మాదరించి చేయు పనులను మనస్సునందు నిలుపరు. తమభర్తల పాండిత్యము దానివలనవారు సంపాదించిన కీర్తి నాలోచింపరు. తమ యకార్యములవలనఁ దమ భర్తల కపకీర్తివచ్చునే యనియుఁ జూడరు. పాణిగ్రహణకాలమందుఁ జేతిలోఁ జేయువైచి ప్రమాణముచేసినట్టు లగ్నిసాక్షికముగాఁ జేయి పట్టుకొంటిమే దాని నెట్లు విడువవచ్చునా యనియు నాలోచింపరు. తమకంతవఱకు వారిచ్చిన ధనము వస్త్రములులోనగు పదార్థము లను మనస్సున గణింపరు. ఇవన్నియుఁ జేయువారెవరు? అందఱుకారు. చపల చిత్తములు గలిగి నిలుకడయగు బుద్ధిలేక మదముపట్టి తిరుగు స్త్రీలు కైకవంటి వారు.

కం॥ పతిహిత యయి శీలంబును,
శ్రుతమును సత్యంబు శమము సొబగును గలయా
పతివత్నీ రత్నమునకుఁ,
బతి యొక్కఁడె పరమగతియుఁ బావనగతియున్. ౧౦౪౧

స్తంభమును దృఢముగా నాటఁగోరువారు ముందు గుంతలోనుంచి యిటునటు లూఁచి యావల బిగించుట గలదు అట్టులే కైకచేసినట్టు చేయవల దని త్యాజ్య విషయములు దుష్టస్త్రీల లక్షణములు తెలుతఁజెప్పి యావల నను సరించుటకు సాధ్వీలగు స్త్రీల లక్షణమును దెలుపుచున్నది.

పతిహిత=తనభర్తకు మేలుకోరునది, శీలంబును=పాతివ్రత్యమును, శ్రుతము=పెద్దలవలన వినికిడి, శమము=ఇంద్రియనిగ్రహము, పతివత్నీరత్నమునకు=భార్యామణికి, పతిగలది పతివత్ని.

తాత్పర్యము

తన భర్తకు నుభయలోకంబుల శ్రేయస్సుగలుగఁ గోరుచుఁ బతివ్రతయై పెద్దలవలన ధర్మాధర్మ పుణ్యాపుణ్య సదాచార దురాచారములు మొదలగునవి విని సత్యము దప్పక కామాదులచే నింద్రియదాసి గాక సౌందర్యముగల భార్యామణికిఁ బతియొక్కఁడె గతి. ఆయనయే పావనమైన గతి.

కం॥ అక్కట నాదుతనూజుఁడు, దిక్కఱి వనవాసియగుట దెప్పకు మమ్మా
రొక్కము గలిగిన లేవడిఁ జిక్కిన దైవత మతండె చెలువా నీకున్. ౧౦౪౨
రొక్కము=ధనము, లేవడి=లేమిడి=పేదతనము.

తాత్పర్యము

పతివ్రత లక్షణ మిట్టిదియగుటచేతను నీవు పతివ్రతవగుటచేతను గొప్ప వంశమునఁబుట్టి పెద్దలవలన శాస్త్రమర్యాద పాతివ్రత్యము తెలిసికొన్నదానవగుటచేత నయ్యో నాకొడుకు దిక్కులేక యడవులపాలు పడవలసివచ్చుటకు నిందింపకుము. తల్లీ! ధనము గలిగినను దారిద్ర్యమునఁ జిక్కువడినను నీకు సుందరీ దైవమతఁడే సుమా.

కం॥ అత్త వచించినమాటలు, చిత్తంబున నిలిపి సీత•చేమోడ్పునఁ దా
హత్తించి దనదుచూపా,మత్తచకోరాక్షియందు• మానుగఁ బలికెన్.

చేమోడ్పునన్=అంజలిచేత-అమత్తచకోరాక్షియందుఁన్ = అమదించిన చకోరములవంటి కన్నులుగల కౌసల్యయందు, హత్తించి=పొందించి, మానుగన్=చక్కఁగ.

తాత్పర్యము

అత్తగారు చెప్పినమాటలు బాగుగ మనస్సునఁ బొందుపఱచి కేలు ముకుళించి తన చూపు నా కౌసల్యయందు నిలిపి అందమైన యోగ్యమైన మాట లిట్లు చెప్పెను.

ఉ॥ అత్తరో! మున్ను వింటి జన•కావసథంబున నుండి భక్తి సం
పత్తిని వల్లభుం గొలుచు•పద్ధతు లన్నియు, మీరు చెప్పిన
ట్లత్తనరక్తిఁ గొల్చెద న•నార్యులతో సరిచేయఁ బోకుఁడీ,
పుత్తునె ధర్మముం, దొలఁగఁ•బోవునె వెన్నెల చంద్రుఁ బాయుచున్?

౧౦౭౪

జనకావసథంబునన్=తండ్రి యింటియందు, వల్లభున్=భర్తను, అనార్యతోడన్=దుష్టస్త్రీలతో,

తాత్పర్యము

అత్తరో! నేను పూర్వము తండ్రిగారి యింటనుండు కాలమునందుభక్తి సమృద్ధిచే భర్తను సేవించు విధములన్నియు విన్నదానను, మీరు చెప్పినట్లు భక్తితోడను అనురాగముతోడను మీకొడుకును సేవించెదను. దుష్టస్త్రీలవలె నేను జేయుదునని మీకొడుకును విడిచిపోవుదునని, దరిద్రుఁడని నిందలాడుదునని, తలఁపకుఁడు. ధర్మము నెప్పుడైన వదలుదునా? చంద్రుని విడిచి వెన్నెల యుండఁగలదా! భార్యాభర్తల కవినాభావసంబంధము కలదుగదా.

పతివ్రతా ధర్మములు.

శాండిలియను పతివ్రత తాను స్వర్గమున విశేషసుఖ మనుభవించుటకుఁ గారణము సుమనయను నామెతోఁ జెప్పుచున్నది. భారతము అనుశా ౧౨౩వ యధ్యాయము.

శ్లో॥ నాహం కాషాయవసనా, నాపివల్కల ధారిణీ
నచముండాచ జటిలా, భూత్వా దేవత్వమాగతా

అహితానిచ వాక్యాని, సర్వాణి పరుషాణిచ
అప్రమత్తాచ భర్తారం, కదాచి న్నాహ మబ్రువమ్
దేవతానాం పితౄణాంచ, బ్రాహ్మణానాంచ పూజనే
అప్రమత్తా సదాయుక్తా, శ్వశ్రూ శ్వశురవర్తినీ
అపై ఋన్యే ప్రవర్తామి, నమమై తన్మనోగతమ్
అద్వారి నచతిష్ఠామి, చిరం నకథయామిచ
అసద్వా హసితంకించి, దహితంవాపి కర్మణా
రహస్య మరహస్యంవా, నప్రవర్తామి సర్వథా
కార్యార్థే నిర్గతంచాపి, భర్తారం గృహమాగతమ్
ఆసనే నోపసంయోజ్య, పూజయామి సమాహితా
యదన్నం నాభిజానాతి, యద్భోజ్యం నాభినందతి
భక్ష్యంవా యదివాలేహ్యం, తత్సర్వం వర్జయామ్యహమ్
కుటుంబార్థే సమానీతం, యత్కించి త్కార్యమేవతు
పునరుత్థాయ తత్సర్వం, కారయామి కరోమిచ
అగ్ని సంరక్షణపరా, గృహశుద్ధిం చకారయే
కుమారాన్ పాలయేనిత్యం, కుమారీం పరిశిక్షయే
ఆత్మప్రియాణి హిత్వాపి, గర్భసంరక్షణేరతా
బాలానాం వర్జయేనిత్యం, శాపం కోపం ప్రతాపనమ్
అవిక్షిప్తాని ధాన్యాని, నాన్నవిక్షేపణం గృహే
రక్తవత్సప్రహయే, గేహే, గావస్సవయవ మోదకాః
సముద్గమ్యచ శుద్ధాహం, భిక్షాందద్యాం ద్విజాతిషు
ప్రవాసం యదిమేయాతి, భర్తాకార్యేణ కేనచిత్
మంగళైర్బహు భిర్యుక్తా, భవామి నియతాతదా
అంజనం రోచనంచైవ, స్నానం మాల్యానులేపనమ్
ప్రసాధనంచ నిష్క్రాంతే, నాభినందామి భర్తరి
నోత్థాపయామి భర్తారం, సుఖంసుప్త మహం సదా
ఆతురేష్వపి కార్యేషు, తేనతుష్యతి మేమనః
నోత్థాపయే సుఖంసుప్తం, హ్యాతురం పాలయేపతిమ్
నాయాసయామి భర్తారం, కుటుంబార్థేపి సర్వదా
గుప్తగుహ్యా సదాచాస్మి, సుసంమృష్ట నివేశనా
ఇమంధర్మపథంనారీ, పాలయంతీ సమాహితా
అరుంధతీవనారీణాం, స్వర్గలోకే మహీయతే. భార. అను.

అర్థము

కాషాయవస్త్రము కట్టిగాని నారచీరలు ధరించిగాని తల బోడిచేసికొనిగాని జడలు పెంచికాని యిట్టి వేషములచే నాకు దేవత్వము రాలేదు. అహితములైనవి పరుషములైనవి యగు మాటలను బొరపాటునసైన నేను భర్తనాడినదానఁగాను. దేవపితృబ్రాహ్మణపూజయందు నెప్పుడు హెచ్చరికకలిగి వర్తించితిని. అత్తమామల సేవ చేసితిని. నే నొకరిమీఁదఁ గొండెములు చెప్పినదానఁగాను. నే నొకరిని మోసగింపరాదని నా నియమము. నేను వాకిటనిలిచినదాననుగాను. చాలసేపు పరులతో మాటలాడినదానఁగాను. నేను జెడుపనియేదియుఁ జేయలేదు. నేను పకపక నవ్వలేదు. అహితమైన కర్మము చేయలేదు రహస్యమని నాకొకరు చెప్పినదానిని నేను మఱియొకరికిఁ జెప్పలేదు. కార్యార్థమై బయటఁబోయియుండిన మగఁడు యింటికిరాఁగానే కూర్చుండుటకుఁ బీటవేసి యుపచరింతును. నా మగనికి సంతోషకరము ప్రియముకాని యన్నముగాని భక్ష్యముగాని భోజ్యముగాని లేహ్యముగాని నేను దినుఁదానఁగాను. కుటుంబము నిమిత్తమై పదార్థములు తెచ్చినపుడు యెంత కొంచెమైనదైనను నేను లేచి యవన్నియు నేనే చక్కఁజేసెదను. లేదా చేయించెదను. అగ్నులను జక్కఁగా రక్షింతును. గృహమును బరిశుద్ధముగా నుంచుదును కొడుకులను రక్షింతును. పుత్రికలకుఁ దెలియనివి చెప్పి పనులు నేర్పుదును. నాకుఁ బ్రియమైన పదార్థములు వదలియైన గర్భమును రక్షింతును. పిల్లవాండ్రను నేను గోపింపను. తిట్టను. ఆవులకు నేనే మేపువేయుదును. బ్రాహ్మణులకు నేనే లేచిపోయి భిక్షమువేయుదును. నాభర్తయేదేనికార్యముపై గ్రామాంతరముపోయెనేని మంగళసూత్రముఁదప్ప మఱి యేయలంకారము ధరింపను. కాటుకపెట్టుకొనను. స్నానము చేయను. పూలుపెట్టుకొనను. గంధము పూసికొనను. అలంకారము చేసికొని సంతోషింపను. నాభర్త సుఖముగ నిద్రించునపుడెంతటి కార్యముఁపడినను నేను నిద్రలేపను. దేహబాధ కలిగినపు డుపచారముచేసి రక్షింతును. కుటుంబమునకుఁ గావలసినవాని నిమిత్తమై భర్తను బీడింపను. నాకు భర్త చెప్పిన రహస్యమును రక్షింతును. ఇల్లలికి ముగ్గులు పెట్టి పరిశుద్ధముగ నుంతును. ఇట్టిచర్యగల స్త్రీ, స్త్రీలలో నరుంధతివలె స్వర్గసుఖ మనుభవించును.

తే॥ తంత్రిలేకున్న వీణనా•దంబు లేదు, చక్ర మెడసిన శకటంబుఁ•సాగఁబోదు
కువలయాక్షికి నూర్గురు•కొడుకులున్నఁ,
ప్రాణపతిలేమి సౌఖ్యంబుఁ•బడయరాదు. ౧౮॥

తంత్రి=తంతె, ఎడసినన్=తొలఁగిన, శకటంబు=బండి, కువలయాక్షికిన్=స్త్రీకి.

తాత్పర్యము

తంతెలులేని వీణయందు నాదము కలుగదు. చక్రము దొలఁగిపోయెనా బండి పయనింపదు. కావున స్త్రీలకు నూర్వురు కొడుకులున్నను అష్టైశ్వర్యములున్నను భర్తలేకున్న సౌఖ్యము సాధ్యముకాదు.

కం॥ మితముగనిచ్చును జనకుఁడు,
మితముగఁ దల్లియును సుతుఁడు•మితముగనిచ్చున్
మితిలేని సుఖము నిచ్చెడు, పతినిన్ భజియింప దెవతె•పరమపవిత్రా.

పరమపవిత్రా=మిగులఁ బవిత్రురాలా. ౧౦౮౬

తాత్పర్యము

మిగులఁ బవిత్రురాలా! స్త్రీకిఁ గన్నతండ్రియు మితముగా నిచ్చునేకాని తనకుఁ గలదియంతయు నీయఁడు. కొడుకు తనకుఁ దన భార్యబిడ్డలకుఁ గావలయునని యంతయు దాఁచి యేదో కొంచెము నిచ్చును. తల్లియు నంతియ. ఒక భర్తమాత్రమే మితిలేక తనకుఁగల దంతయు భార్యకునిచ్చును తన దేహమును బుణ్యమునుగూడఁ బంచియిచ్చును. ఇటుండ నటువంటిభర్తను దన మేలుగోరు నెవతె సేవింపకుండును?

కం॥ వింటిని బెద్దలవలనను, మంటిని సద్ధర్మగతిని•మఱి విభు నేలా
గెంటనములాడుదును, వాల్గంటికి దైవతమనంగఁ•గాంతుండ కదా.

మంటిని=మనితిని, జీవించితిని, గెంటనములు=నిష్ఠురములు, వాల్గంటికిన్=వాలుఁగంటికిన్=నిడుపాటి కన్నులుగలదానికి, కాంతుండ=భర్తయే.

తాత్పర్యము

పెద్దలవలన మంచి నెడ్డలవింటిని. అందు మంచిమార్గమవలంబించిజీవించితిని. ఇంతచేసినపిమ్మట నేనేల నా భర్తను బరుషము లాడుదును. స్త్రీకిదేవుఁడనఁగా భర్తయేకదా.

కం॥ అన విని వనటయు నెలమియుఁ,
పెనఁగొనఁ గౌసల్య బాష్ప•వితతులు రాల్పన్
గని సవతులలో నుండెడి, జననికి వలగొనుచు రామ•చంద్రుం డనియెన్॥

వనట=దుఃఖము, ఎలమి=సంతోషము, పెనఁగొనన్=పెనసి పురికొనఁగా, వలగొనుచున్=ప్రదక్షిణించి నమస్కరించుచు.

తాత్పర్యము

నాకోడ లిటువంటి యుత్తమస్త్రీ గదాయని సంతోషము. ఇటువంటిదాని కెంత కష్టము వచ్చెనని దుఃఖము. రెండును బెనవేసికొనఁగాఁ గౌసల్య కన్నీళ్లు రాల్పఁగాఁ గని సవతులలోఁ దాను గొప్ప, పెద్దది, పట్టమహిషి యను గర్వము లేక వారితోఁ గలిసి కూర్చుండిన తల్లికిఁ బ్రదక్షిణముచేసి రామచంద్రుఁ డిట్లనెను.

—• శ్రీరాముఁడు కౌసల్యాదిమాతలయొద్ద సెలవు తీసికొనుట. •—

చం॥ అడలకు మమ్మ! నాజనకు•నాదర మొప్పఁగఁ జూడవమ్మ నా
కడవుల నాలుగుం బదియు•నబ్దము లేగెడి నీదునిద్రలో,
వడిఁ జనుదెంచి మిత్రహిత•వర్గముతో వెలయంగఁ గాంతు వం
చడ లుడుగంగఁ బల్కి తన•యుంబవిధంబున నేడ్చువారికిన్. ౧౦౮౯

అడలకుము=పరితాపపడకుము, అడలు=దుఃఖము.

తాత్పర్యము

తల్లీ! వ్యసనపడకుము, నానిమిత్తమై దుఃఖించుచుఁ దండ్రిని నాదరింపకుండెదవేమో. నీకొడలికి నీవు చెప్పిన మాటలు నీవును మదియందుంచుము. ఏ కారణమున నేవ్యసన మెంతతగిలినను భర్తనుపేక్షింపరాదు. నాతండ్రినన్నడవులకుఁ బంపెనను కోపముచే నీవీయనను నుపేక్షింపరాదు. నీవు నిద్రబోయి లేచినంత యల్పకాలములో నాకుఁ బదునాలుగేఁ డడవులలోఁబోవును. అది తీరఁగానే త్వరగావచ్చి మిత్రులతోను హితులతోను గూడిన నన్ను నీవు చూడఁ గలవు అని దుఃఖముపశమింపఁ బల్కి తన తల్లివలెనే దుఃఖించు.

కం॥ మున్నూటేఁబదితల్లుల, కు న్నతుఁ డై మోడ్చి కేలు•కొమరుగ ధృతిసం
పన్నుఁడు ధర్మయుతం బగు, నన్నెఱి వచియించె వారి•నందఱఁగనుచున్

నతుఁడై=నమస్కరించినవాఁడై, ధృతిసంపన్నుఁడు=ధైర్యమే సంపదగాఁ గలవాఁడు, నెఱి=విధము. తాత్పర్యము

మూఁడు వందల యేఁబది మంది తల్లులకు నమస్కరించినవాఁడై చేతులు జోడించి ధైర్యసంపద వెలయఁగ ధర్మముతోఁగూడిన విధముగ వారి నందఱఁజూచి యిట్లనెను.

కం॥ జ్ఞానము లేమినొ, చనవుననో, నీతి దొఱంగి పలికి•యుండిన మిమ్మున్
నానేరము క్షమియించుడు. నానతి నా కిడుఁడు తల్లు•లారా! కరుణన్.

తాత్పర్యము ౧౦౯౧

మీ కష్టములు తెలియని కారణముచేతనో, తెలిసినను నాకుఁ దెలివి లేకుండుటచేతనో, నీతివిడిచి పలికియుంటినేని తల్లులారా! నా నేరము క్షమించిదయచే నాకు వనమునకుఁబోవ ననుజ్ఞయిండు.

మ॥ అనినన్ రామునిమాటలన్ విని సరో•జాక్షుల్ భృశార్తిన్ మహా
నినదం బారఁగఁ గ్రౌంచ లట్లఱవ ము•న్నిస్తుల్యవాద్యధ్వనిన్
గొనబౌ భూమిధవేంద్రుహర్మ్యము మహా•కోలాహలోపేత మై
వనజాతాయతలోచనానికరరా•వస్ఫూర్తి నొంపొందుడున్. ౧౦౯౨

సరోజాక్షుల్=కమలములవంటి కన్నులుగల యాస్త్రీలు, భృశ+ఆర్తిన్=అధిక దుఃఖముచే, మహానినదంబు=పెద్దధ్వని, క్రౌంచలు=క్రౌంచములు,మున్=

పూర్వము నిన్నటివఱకు, నిస్తుల=అసమానమైన వాద్యధ్వనిన్=వీణలు మొదలయినవాని ధ్వనిచేత, గొనబౌ=అందమైన, మహాకోలాహలోపేతమై= గొప్ప సంకులధ్వనితోఁగూడినదై, వనజాతాయతలోచనా=కమలాక్షులయొక్క, నికర=సమూహముల, రావస్ఫూర్తిన్ = ధ్వనియతిశయముచే, సొంపు+అఱుడున్=అందముచెడిపోఁగా.

తాత్పర్యము

ఆ మాటలువిని యాస్త్రీలందఱు మహాపరితాపముతోఁ బెద్దపెట్టునఁ గ్రౌంచములవలె గొల్లుననేడువఁగా నిన్నటివఱకు వీణెలు మద్దెలలు, పణవములు తాలములు లోనగు మంగళవాద్యములతో నిండియుండిన రాజుమేడ పెద్దకోలాహలధ్వనితో స్త్రీల గుంపుల నేడ్పుధ్వనితో నందముమాసెను.

-• ౪౦-వ సర్గ. సుమిత్ర లక్ష్మణునకు శ్రీరామువెంటఁబోవ ననుజ్ఞయిచ్చుట •-

కం॥ రాముఁడు సీత కృతాంజలి, సౌమిత్రియు దైన్య దుఃఖ•సంతాపములన్
భూమీశ్వరు వలగొని శ్ర,ద్ధామతిఁ జరణముల వ్రాలి•తగుగతిఁ బిదపన్. ౧౦౯౩

కృతాంజలి=చేమోడ్పుగలవాఁడు, వలగొని=ప్రదక్షిణించి, తండ్రికివలెఁ దల్లికిని బాదములంటియే యభివాదనము చేయవలెను. కృతాంజలి కాకాక్షి న్యాయముచే నుభయత్ర యన్వయించును.

తాత్పర్యము

శ్రీరాముఁడు, అయనవెనుక సీత, ఆమెవెనుక చేమోడ్పున లక్ష్మణుఁడు దీనత్వము దుఃఖము, సంతాపము వీనితోఁగూడి రాజునకుఁ బ్రదక్షిణముచేసి శ్రద్ధతోడి మనస్సులతో నాయనపాదములపైఁ దగినవిధముగ వ్రాలియావెనుక.

కం॥ జనకతనూజను దమ్ముని, దనతల్లికి మ్రొక్కఁ బనిచి•దైన్యవశుం డై
వనజేక్షణుండు తానును, వినయమున నమస్కరించె•వెలఁదుకమిన్నన్.

తాత్పర్యము ౧౦౯౪

శ్రీరాముఁడు ముందుగ సీతను లక్ష్మణునిఁ దనతల్లికి మ్రొక్కుమ్మనియని చెప్పి యావలఁ బ్రతిదినము వీరిసేవ యిఁక నాకు దుర్లభముగదా యని దీనాననమునఁ దానును నామెకు వినయమున నమస్కరించెను.

కం॥ అనుపదమున లక్ష్మణుఁడును, ఘనభక్తిని జాఁగి మ్రొక్కి•కౌసల్యకు, వెం
డిని దనజనని సుమిత్రకు,వినయంబున మ్రొక్కె భక్తి•వివశుం డగుచున్

అనుపదమునన్=వెంబడి, వెండిని=వెండియును, వెండిశబ్దముకళ, దీనికి "యును" సముచ్చయములు చేర్పఁబడినవి. అందలి 'యు' లోపింపఁగా వెండిను అని నిలిచి ఈధాతు యుష్మదర్థంబులమీఁదఁ దక్క నికారై కాంత

శబ్దమునకు ద్వితీయాషష్ఠుల నిందత వర్ణకములగు, తత్పమ, ౪౩ సూ. ప్రకారము వెండిని నయ్యెను. ఇది సీతారాములతోడఁ జేసిన నమస్కారముగాక ప్రత్యేకనమస్కారము.

తాత్పర్యము

కౌసల్యకు శ్రీరాముఁడు నమస్కరింపఁగానే మిగుల భక్తితో సాఁగిలఁబడి లక్ష్మణుఁడు కౌసల్యకు నమస్కరించి మఱియును దనతల్లిసుమిత్రకు వినయమున భక్తిపరవశుఁడై మ్రొక్కెను.

ఆ॥ వందమానుఁడైన•నందనుఁ జేరంగఁ, దిగిచి యశ్రు లురల•వగపుతోడ
శిరము మూరుకొనుచుఁ•దరుణీమతల్లి సు,
మిత్ర హితముఁ గోరి•పుత్రుననియె. ౧౦౯౬

వందమానుఁడు= నమస్కరించుచున్నవాఁడు, నందనుస్=కొడుకును, ఇచ్చట సంతోషపెట్టువాఁడను నర్థముగల నందన శబ్దము సార్థకము. శ్రీరాముని వెంట లక్ష్మణుఁడుపోవుట సుమిత్రకు మిక్కిలి సంతోషకరమని భావము. అశ్రులు=కన్నీరు, మూరుకొనుచున్ = ఆఘ్రాణించుచు, తరుణీమతల్లి=స్త్రీలయందు శ్రేష్ఠురాలు.

తాత్పర్యము

తనకు నమస్కరించుచున్న కొడుకును దగ్గఱఁదీసికొని కన్నీరుగాఱ వ్యసనముతో నాయన శిరస్సువాసనచూచి స్త్రీలయందుత్తమురాలైన సుమిత్ర లక్ష్మణు శ్రేయస్సుఁగోరి కొడుకుతో నిట్లనెను.

సీ॥ నిఖిలసుహృద్వర•నియతానురక్తత, రామునితోడ న•రణ్యములకుఁ
బోవ జన్మించితి•వీ వ్మాన తిచ్చెద, నేమఱదవు సుమీ•యెప్పుడైన
నీవ్యసనంబునసేని•రాముఁ డేగ వనాళి, వ్యసనియైన సమృద్ధి•నెసఁగు చున్న
నీతండె గతి నీకు•నెల్లడ ధర్మంబు, జ్యేష్ఠానువర్తియై•చెలఁగు చుంట
తే॥ పుత్రక! సనాతనంబైన•పుణ్యవృత్తి
మీకులంబున నిదియ సు•మ్మీ తలంప
దానమును యజ్ఞ దీక్ష యు•ద్ధమున మృతి య
టంచు బోధించి బోవమ్మ•టంచు మఱియు ౧౦౯౩

నిఖిలసుహృద్వర నియతానురక్తతన్=(1) సమస్త సుహృత్తులయందు శ్రేష్ఠమై నియతమైన యనురాగము కలిమిచే (2) సకల సుహృత్తులయందు శ్రేష్ఠుఁడైన శ్రీరామునియందలి నియమమైన యనురాగముచే, (3) నిఖిల సుహృద్వర=సకలస్నేహితులందు శ్రేష్ఠుఁడా, జన్మించితి=పుట్టితివి, అనతిచ్చెదన్ =అనుజ్ఞయిచ్చెదను, ఏమఱదవు=హెచ్చరిక తప్పెదవు, వనాళిన్=వనముల వరుసలయందు, జ్యేష్ఠానువర్తియైన = పెద్దవాని ననుసరించి వర్తించుట, బోవమ్ము=కార్యమునందలి యాదరాతిశయముచే రెండుమార్లు చెప్పెను, బో యిరమ్మనక=పొమ్మనుట యుపలక్షణముగదా యనరాదు. తన కొడుకు

శ్రీరాముని వెంట సర్వకాలములనుండుట ప్రధానము రమ్మనిన శ్రీరాముని వెంటఁ గొంతకాలమే యుండి తన్నావల రమ్మని యర్థము చేసికొనునేమో యని యామాట చెప్పలేదు. శ్రీరాముఁడు వచ్చిన నీవు రమ్ము అయనరాకున్న నీవు రావలసిన పనిలేదు.

లక్ష్మణునివలెఁ గైంకర్యము చేయువారు భార్యను దల్లిని విడిచి చేయ వలసినట్లు లేర్పడెనేని వారికి పోషణమార్గము భర్తనో, కొడుకులనో చూపియట్లు చేయవచ్చునని యేర్పడుచున్నది. అంతియకాని యది నెపము పెట్టుకొని వారిని దిక్కులేనివారిగ విడువరాదు.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! లోకరక్షణార్థము కౌసల్య కడుపున శ్రీరాముఁ డెట్లు పుట్టెనో యట్లులే సకలసుహృజ్జనశ్రేష్ఠుఁడగు నాయనకు సహాయుఁడవై నియత మైన యనురాగముతోఁ జరింప నీవు నాకడుపునఁ బుట్టితివి. కావున శ్రీరాముని వెంట నీ వరణ్యములకుఁబోయి నీ జన్మము సార్థకముచేసికొనుము. అట్లాయున పోవునపు డాయన పుష్పఫలభరితవృక్షంబుల యందము చూచుచు హెచ్చరిక తప్పునపుడు నీవు నట్లయ్యెదవు సుమా. ఆయన స్వవిషయమునఁ బ్రమాదపడి నను నీ వాయనవిషయమునఁ బ్రమాదపడరాదు. కావున దిక్కులు చూచుచుఁ బోక యాయనయందే దృష్టి నిలిపినపుడు ఆయన గమనసౌందర్యమునఁ గలి గిన యానందమునఁ బరవశుఁడవై నిన్ను నీవు మఱచెదవు సుమా. అటయిన నాయన రక్షణమందు హెచ్చరిక తప్పెదవు, జాగ్రత్త. ఇచ్చట సుఖముల మరగి నాయందు భార్యయందుఁగల ప్రేమచే శ్రీరాముని నేమఱియుండి యుండుట బాగని తలఁచెదవేమో. అట్టిపొరపాటును బడకుము మమ్మునందఱ విడిచియైన నీవు పోవలసినవాఁడవే, నిలువరాదు, శ్రీరామచరణసేవకనియే నీవు పుట్టితివే.నీకు నేను జెప్పవలసినదేమున్నది. పలువిధముల దాస్యమునందు నీవు ఆదిశేషుఁడవే కదా.ఏయే సమయములం దెట్లెట్లు దాస్యముచేయవలయునో నేను నీకుఁ జెప్పవలయునా? నాయనా నే నాఁడుదానను. శ్రీరాముని వెంటఁ బోయి యాయనను సేవించుభాగ్యము నాకులేదు. నీమూలమున నాయనసేవ చేయఁగోరుదానను. నీవు చేసితివా నీ పుణ్యమున నేను దరించెదను. అప్పుడు నేను నిన్నుఁ గన్నందునకు సార్థకము. నీవు సకల సుహృత్తులయందు నియత మైన యనురాగము కలవాఁడవు. ఇఁక సుహృద్వరుఁడైన శ్రీరామునందు ననురాగము కలిగియుండుమని నేను జెప్పవలయునా? నేను దానిఁ జెప్పవల సినపని లేదుగాని నేను జెప్పవలసినది యొకటి కలదు. అది యేమంటివా, ఎప్పుడైన నాయన విషయమునం దేకారణమునైన నేమఱుపాటుగలవాఁడవు గాకుము. అనతిచ్చెదఁ బొమ్ము. శ్రీరాముఁడు కౌసల్య నడిగినట్లు నీవు నన్నానతిమ్మని యడుగఁ బనిలేదు. నీ వడుగకముందే నేనే యాజ్ఞయిచ్చె దను పొమ్ము. శ్రీరాముఁడు దరిద్రుఁడే యాయనను గొలిచిన నేమి

లాభమందువా. అట్లనకుము. రాజ్యహీనుఁడై దరిద్రుఁడైనను రాజై సంపన్నుఁడైనను నీకు గతి యతఁడే. శ్రీరాముఁడు దరిద్రుఁడైనను నీకు రాఁగల నష్టి లేదు. ఆయన సంపన్నుఁడైన నీకు రాగల లాభములేదు. నీవు శ్రీరామునందు భక్తిగలవాఁడవైతివా బాగుపడెదవు శ్రీరామునందు భక్తిలేనివాఁడవైతివా చెడెదవు. నిన్ను రక్షించునది చెఱచునది నీ భక్తియే. కావున నాయన యే దశయందుండిన నీకేమి? పెద్దవాని ననుసరించి తిరుగుట చిన్నవానికిధర్మము. దాసునకు స్వామిసేవ ధర్మము. దరిద్రుఁడైనను స్వామి స్వామియే సంపన్నుఁడైనను స్వామి స్వామియే. పతివ్రతా ధర్మమువంటిదే దాసధర్మము. కావున నీ స్వత్వము ఆయన స్వామిత్వము నాలోచించి సేవచేయుము నాయనా యిఁక వంశాచారమును జెప్పెద వినుము. సనాతనపుణ్యాచార మీరఘువంశమునఁ జిన్నవాఁడు జ్యేష్ఠానువర్తియై యుండుటయేకాక దానికంటె ముఖ్యములైన పరమధర్మములు దానము, యజ్ఞములందు దీక్ష, రణమున మరణము, ఇవి వంశధర్మములు కావున వీనిని గాపాడుకొనుము పోయిరమ్ము. ఈమూఁడైనను నీవు శ్రీరామునికొఱకే చేయుము. దానము చేసినను శ్రీరామునికొఱకే. యజ్ఞదీక్షయు శ్రీరామునికొఱకే. రణమున మరణము శ్రీరాముకొఱకే.

తే॥ రాముఁడ యెఱుంగుమీ దశ•రథుఁడు నిజము
నను దలంపు మా జనకుని•తనయఁ బుత్ర!
యటవియ యయోధ్య యంచు నీ•వాత్మఁ జూచు
బోయి రమ్ము యథాసుఖ•ముగను దండ్రి. ౧౦౬౭

ఇట్లు శ్రీరామునివెంట లక్ష్మణుఁ డిపుడుపోయినను బోయినచోటఁగష్టము తోఁచినపుడు మరలఁ దల్లిదండ్రులను నగరమును స్మరించునేమో యని తలఁచి సుమిత్ర వానికిఁ బ్రతినిధులఁ జూపుచున్నది.

శ్రీరాముఁడ యెఱుంగుమీ దశరథుఁడు, ఈదశరథుఁడు సోపాధికుఁడగు తండ్రి. వానిపైఁ బ్రేమవదలుము. సోపాధికబంధువుల నమ్మినవచ్చెడుగతి చూచితివిగదా. శ్రీరాముఁడు నిరుపాధిక స్వాభావికమైనతండ్రి. కావున నతని యందే ప్రేమయుంపుము.

ననుఁదలఁపుమి జనకతనయ, నన్ను=సోపాధికమాతనైన నన్ను. కావున నాపైఁ బ్రేమయుంచకుము. నాపై నీవింతప్రేమయుంచియు నీపై నాకెంతో ప్రేమగలిగియు నేమి ప్రయోజనము నేను నీకష్టముఁ దొలఁగింపఁ గలిగితినా కావున నాయందు మాతృభావముంచుటవలన ఫలములేదు. ఈ జనకతనయ= జానకి ఈమె నీకు స్వభావమునఁ దల్లి. ఈమెకు నీవొక్కనమస్కారము చేసినను నిన్నీమె కాపాడఁగలదు. ప్రణతి ప్రసన్నజానకి యని సుందరకాండమునఁ జెప్పఁబడును.

అటవియయయోధ్యయంచు నీవాత్మఁజూడు=ఈయయోధ్య శ్రీరాముఁడు లేని కారణమున నయోధ్యకాదు. ఇదియొక యడవివంటిదే దేవానాంపూ రయోధ్యయని నాయోధ్యే త్యపరాజితేతి యనునట్లు శ్రీరాముఁ డుండినఁగదా యాపేరుసార్థకము. అయనయుండుచోటే యయోధ్య కావున మమ్మును దీనిని స్మరించి వీనియందుఁ బ్రీతియుంచి ప్రయోజనములేదు. శ్రీరాముఁడుండు స్థానమే నీకుఁ బ్రాప్యమగుస్థానము.

౨. రాముఁడ=రాముఁడే, దశరథుఁడు=జ్యేష్ఠభ్రాతాపితృసమః అన్న తండ్రితో సమానుఁడు. అను న్యాయము ననుసరించి శ్రీరాముఁడే దశరథుఁడని తలఁచి తండ్రియం దుంచవలసిన గౌరవము భక్తి రామునందుంచి యాయ ననే పూజింపుము.

నసుఁదలఁపుమీ జనకతనయుఁ బుత్ర=అన్నయందుఁ దండ్రిభావముంచి నపుడు వదినెయందుఁ దల్లిభావముంచుట స్వభావసిద్ధమేకదా. కావున నన్నుఁ దల్లినని యెట్లు గౌరవించి భక్తితోఁబూజించెదవో యట్లే సీతను భక్తితో గౌరవించి పూజింపుము.

౩. రాముఁడ యెఱుంగుమీ దశరథుడు="గుణైః దశరథోపమః" గుణములచే దశరథునితో సమానుఁడని చెప్పఁబడుటచే దశరథునియం దెట్టిగుణము లున్నవో యట్టిగుణములే శ్రీరామునియందును గలవు కావున శ్రీరాముఁ డెదురుగానున్నప్పుడు దశరథుఁడు స్మరణమునకు రావలసిన కారణమే కలుగదు.

అట్టులే. నసుఁదలంపుమీ జనకతనయన్=నాయందు నెట్టిగుణములు కలవో యట్టిప్రీతి వాత్సల్యములు సీతయందును గలవు. కావున సీతాసన్నిధానమున నన్ను స్మరింపఁ గారణము లేదు.

అటవియ యయోధ్య=అయోధ్యయందుండునవి కృత్రిమ రమణీయ పదార్థములు, అవియెట్లు నీకు భోగ్యములో యట్టులే యడవియందలి సహజ సౌభాగ్యవంతములయిన పదార్థములు నీకు భోగ్యములే యగును. కావున నయోధ్యను స్మరింపఁ గారణము కలుగదు.

౪. రాముఁడ దశరథుఁడు=దశరథుఁడెట్లు స్త్రీపరవశుఁడో శ్రీరాముఁడు నట్టివాఁడే. యథాపితా తథాపుత్ర యను న్యాయము గలదుగదా. ఇదిమాయామృగ వృత్తాంతమందుఁ గననగు. దశరథుఁడు స్త్రీకి వశుఁడై సమయమునఁ గైక మాయోపాయము చెప్పెడువాఁడు లేక చెడెను.) శ్రీరాముఁడట్టులే భార్యకు వశుఁడై చెడిపోవనుండెనేని నీవు హెచ్చరింపుము. మనకేమిలే యని యూరకుండకుము.

నసుఁ దలంపుమీ జనకపుత్రిన్=ఇప్పుడు నిన్నెట్లడవులపాలై పొమ్మనుచున్నానో యట్టులే సీతయు శ్రీరామునిమీఁది ప్రేమచే నిన్నుఁ బొమ్మనఁ గలదు.

అడవియ యయోధ్య=ఇప్పు డయోధ్యవిడిచి యరణ్యమునకుఁ బోవునపుడు నీవెట్లు రక్షింప వెంబడిపోవుచున్నావో యట్టులే యడవి విడిచివేఁగ

చోటికిఁ బోవునపుడును నీవు వెంటనేపొమ్ము. నీమాటవినలేదని వారిపైఁ గోపింపకుము.

౫. రాముఁడ దశరథుఁడు=దశరథుఁ డెట్టిశూరుఁడో శ్రీరాముఁడు నట్టి శూరుఁడే. దశరథుఁడు దేవతలపక్షమున రాక్షసులతో యుద్ధము చేసినవాఁడు రోహిణీ శకటభేదనముచేయకుండ శనినాఁపినవాఁడు.అంతటివాఁడేశ్రీరాముఁడు.

నముఁదలంపుమీ జనకపుత్రి=దశరథు శ్రేయస్సునకు నే నెట్లు సంతోషించుదాననో సీతయుఁ దన భర్త శ్రేయస్సునకు సంతోషించునదే.తం దృష్ట్వా శత్రుహంతారమ్మని అరణ్యకాండమునఁ జెప్పఁబడును.

అయోధ్య యెట్లు భూతకోటికి నాధారమైయున్నదో యరణ్యము నట్లే జీవకోటి కాధారమైయున్నది.

౬. రాముఁడ దశరథుఁడు=దశరథుఁ డు శ్రీరాము నెట్లెడఁబాసియుండలేఁడో యట్లే శ్రీరాముఁడు దశరథు నెడఁబాసి యుండలేఁడని యెఱుఁగుము. నే నెట్లు మిమ్మెడఁబాసియుండలేనో సీతయు మిమ్మెడఁబాసియుండలేదు. శ్రీరాము నెడఁబాసి యయోధ్య యెట్లుచెడెనో అట్లే యరణ్యముకూడ శ్రీరామవియోగమును సహింపలేదు. 'అపివృక్షాః పరిమ్లానా' యెట్లుకూడ రామవియోగమున వాడిపోయె నని సుమంత్రుఁడు చెప్పఁగలఁడు. ౧౨-౩౪ ప.

౭. రాముఁడు దశరథుఁడు=దశరథుఁడెట్లు చక్రవర్తిగా నిప్పుడున్నాఁడో శ్రీరాముఁడు నట్లే చక్రవర్తి కాఁగలఁడని తెలియుము. నే నిప్పు డెట్లు పట్టపురాణినై యున్నానో యట్టులే సీతయు నుండఁగలదు. అడవి.......యయోధ్య, అయోధ్య యెట్లు సర్వసమృద్ధికలదై యున్నదో యట్లే యరణ్యముఁ బుష్పఫలాదులచే సమృద్ధమైయుండును.

౮. రాముఁడ దశరథుఁడు=రాముని నిపుడు కాలినడక తిరుగు మనుష్యమాత్రునిఁగా నెంచి యవమానదృష్టిఁ జూడకుము. పుష్పకాదులగు ననేకరథంబుల నెక్కి తిరుగఁగలఁడు దశరథుఁడు=పదితేరులు గలవాఁడు, నముఁదలంపుమీ జనకుని తనయన్=నేనెట్లు దశరథునితో నానావాహనంబుల దశరథుఁడు యుద్ధమునకుఁ బోవునపుడు పోవుచుంటినో యట్లే సీతయుఁ బుష్పకాదుల సంచరింపఁ గలదు. అటవియు.......యయోధ్య, మీకెట్లడవియందు నిత్యసంచారము గలుగఁ గలదో ఆవల నయోధ్యయందును నిత్యసంచారము గలుగఁ గలదు.

౯. రాముఁడ దశరథుఁడు = శ్రీరాము నెట్లు పరిపూర్ణమైన తండ్రిగా భావించెదవో యట్టులే దశరథుని బరిపూర్ణమైన తండ్రిగా భావింపుము.'భూమిప నెడలేదు జనకబుద్ధి' యని తండ్రి నవమానింపకుము. శ్రీరాముఁ డెట్లుతండ్రిని గౌరవించునో యట్లే నీవు గౌరవింపుము, నను...జనకతనయన్=అ గోచి లోనిదే కదా యాప్రాఁత యన్నట్టు లాదశరథుని భార్యగదా యీమెయు శ్రీరామునికిఁ గైకవంటి సవతితల్లియేకదా ఏవేళ కేమి కీడు శ్రీరామునకుఁ

జేయునోయని నన్నునాదరింపకుము. సీతయం దెట్టి గౌరవముంచెదవో యట్టి గౌరవమే నాయందు నుంచుము.

అటవియ యయోధ్య=శ్రీరాముఁడున్నదే నగరము, శ్రీరాముఁడులేనిది యడవియని "వనం నగరమేవాసు యత్ర రామో మహీపతి" యన్నట్టు లయోధ్య నవమానింపకుము ఇందును శ్రీరాముని పాదుక లుండఁగలవు. ఇదియును శ్రీరామునకు వాసస్థానము కాఁగలదు. కావున దీని నవమానింపకుము.

దశరథుఁడు రాముఁడ=దశరథుఁడు శ్రీరాముఁడే. రాముని నెడఁబాసి మరణించునని యెఱుంగుము. శ్రీరాముని నెడఁబాసి దశరథుఁడు బ్రతుకలేఁడు అని తెలియుము, నను......జనకతనయన్=దశరథుఁడు మరణించిన పిమ్మట నన్నెవ్వరిచ్చట నాదరించువా రుండరు,కావున నాకు దశరథు భార్యయను గౌరవమిచట గలుగదు కావున నా పుట్టినిల్లు చేరవలసినదాననే. అచ్చట నెవ్వరనిన మగధదేశమున వారు మన రాజకూఁతురని యందురు, కావున నన్నుఁ జనకుని కూఁతురని యెంచుము, అయోధ్యాపతి భార్యయని తలంపకుము,

అటవియ యయోధ్య, శ్రీరాముఁ డరణ్యమునకుఁబోయి దశరథుఁడు స్వర్గమునకుఁబోఁగా నిఁక నయోధ్య యడవివలెనుండునని యెంచుము, నీవు తలఁచుకొని విచారపడవలసినది దిందేదియు నుండదు.

౧౧. రాముఁడ దశరథుఁడు, (౭) దశమనఁగా కొఱుకునది. పాములు మొదలగువానిఁ గొఱికితినువాఁడు గరుడుఁడు, రథమనఁగాఁ దేరు, వాహనము, శ్రీరాముఁడు గరుత్మంతుని వాహనముగాఁగల విష్ణువని యెఱుంగుము, దశమనఁగాఁ జిలుకలోనగు పక్షి, పక్షివాహనముగాఁ గలవాఁడు విష్ణువు, దశఃపక్షి విహంగమయని నిఘంటువు, కొఱుకునది దశము.

దశరథుఁడు "రథోదేహేపి" నానా. అనుటచే రథశబ్దమునకు దేహమనియు నర్థముగలదు. కావున దశరథుఁడనఁగా దశరూపములు గలవాఁడని యర్థము. "దాశార్హో దశరూపభృ" త్తని యమరుఁడు. కావున దశరథుఁడనఁగా దశావతారములుగల విష్ణువు.

నిజమునను=సత్యముగా, జనకతనయన్ = సీతాదేవిని, మాన్=లక్ష్మీదేవిఁగా "మారమా మంగళ దేవతా", "మాశ్రీ మానేమృతావేలా మేధాశ్రీమత్య మాతృషు"నానా, కావున సీతను లక్ష్మినిగా నెంచుము. సీతాలక్ష్మీర్భవాన్ విష్ణువని యుద్ధకాండమున సీతయే లక్ష్మి నీవు విష్ణుఁడవని బ్రహ్మాదులు స్తుతింతురు.

అడవియ యయోధ్య దేవానాం పూరయోధ్యా యను శ్రుతివలన వైకుంఠమయోధ్య యని తెలియునగు. కావున నడవియే లక్ష్మీనారాయణులుండు వైకుంఠమని తలంపుము.

౧౦. తత్త్వము విచారించిన నీకు వాస్తవముగఁ దండ్రియనఁగాఁ దండ్రివలె రక్షకుఁడు దశరథుఁడా శ్రీరాముఁడా యని యాలోచించితివేని రాముఁడఁ=రాముఁడే యని యెఱుంగుము అట్టులే నీకు నిజమైన మా=తల్లి సేనా సీతయాయని యాలోచించితివేని పారమార్థిక జనని జనక తనయయె యని యెఱుఁగఁగలవు. యోగ్యమైన వాసస్థానమిది యయోధ్యయా యడవియా యందువేని రాముఁడుండు నడవియే నీకు వాసయోగ్యస్థలము అన్ని గుణములుండుటచే నిప్పటికి వనవాసము దుఃఖకరముగాఁ దోఁచినను దానినంతగాఁ బాటింపకుము. పోయిరమ్ము. ఏమార్గమున శ్రీరాముఁడు పోవునో నీవు నా మార్గముననేపోయి శ్రీరాముఁడు వచ్చునప్పుడు రమ్ము. ఈ లోపల రాకుము. శ్రీరాముఁడు నీ మనస్సు పరీక్షించుటకై పొమ్మనును. ఆ మాట నీవు విని నీ సహజకైంకర్యలక్ష్మిని విడనాడకుము. "ఏతత్సామగాయన్నాస్తే" యన్నట్లు వైకుంఠమునందువలె భగవంతునితో నేకస్థలవాసము గోరక "రామరూప్యను సంచరన్" అన్నట్లు రాముఁ డెందెందుఁబోవునో నీవు నందం దాయనతోడఁ బోయి శుశ్రూషచేయుము అని భావము యథాసుఖముగను "కోదండధరుండనై మెలపుదాలిచి సర్వము నేన తీర్చెదన్" అని చెప్పితిని గదా. అట్టి కైంకర్యసుఖము నీ చేతిలోనున్నది. ఈ సుఖముచెడక లభించునట్లు పోయి రమ్ము (2) రామునకు యథాసుఖముగను ఏవిధముగ నీవు వర్తించిన రామునకు సుఖహాని కలుగదో యట్లు వర్తించియుండుము. "భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేనచ లక్ష్మణ" యని ముందు రాఁ గలదు. అయోధ్యయందు నీకెంత సుఖముగలదో నీ కంత సుఖ మడవియందుఁ గలదు. 'వలఁచువాఁడఁగాను నీ లేనిచోట' పద్యము ౮౩౩ అని చెప్పితివికదా ఆమాట వాస్తవపడనిమ్ము. నీవు గోరినది రామసహవాసముగదా. అది యడవియందు నిరంతరము నిరంతరాయమ్ముగా లభించును. ఆఁడుపిల్ల సీత శ్రీరామునితోఁ 'దలఁపను దల్లినిం దలఁపఁ దండ్రి స్మరింపను దోడఁబుట్టులన్ దలఁపను నిల్లువాకిలి' ననియె. నీతోడనున్న స్వర్గము, నీతోడు రహింపకున్న నిరయంబదియె" యని చెప్పెఁ గదా. ఆ చిన్నదానికున్నంత ధైర్యము శ్రీరామసహవాసమం దనురక్తియు మగవాఁడవైన నీకుండవలదా.

తండ్రి=ఈయనకు శ్రీరామసేవ యనర్ఘముగా లభించెను. ఈయన యెంత భాగవతుఁడో ఎంత పుణ్యాత్ముఁడో అట్లుగాకున్న నిట్టి శ్రీరామసేవ యెవరికి లభించును అని తండ్రియని సగౌరవముగాఁ బిలుచుచున్నది. భాగవతు లెట్టివారికైనను దండ్రులవలెఁ బూజ్యులు, పుత్రకాంక్షచేఁ గైక యపకీర్తిపాలాయెను. నీవు శ్రీరామసేవజేసి నాకుఁ గీర్తి తెచ్చెదవని నమ్మియున్నాను నీవలన నా కపకీర్తిరాకుండ బిడ్డను దండ్రివలెఁ గాపాడుము. శ్రీరామసేవచేయు కొడుకులు తల్లిదండ్రుల నుద్ధరింతురు. అట్టివాఁడు గాని కొడుకుండినసేమి? మండినసేమి? కావున శ్రీరామసేవచే నీవు ధన్యుఁడవై నన్ను

ధన్యురాలినిఁ జేయుము. నిజము నన్నుఁ + దలంపుమాయనియు నిజము నను+దలంపుమాయనియు సందర్భానుసారముగఁ బదవిభాగము చేసికొన వలయును. నన్నుఁ దలంపుమన్నచో నర్ధబిందువు శ్లేషకారణమున లోపించెను. శ్లేషసబిందు నిర్బిందోర్వర్ణైకనం కుత్రచిన్మతమ్ అనికారిక. ఇట్టి ప్రయోగ ములుగలవు.

ఈ సందర్భమున లక్ష్మణచర్యయే కఠినమైనదను కొందమనిన వాల్మీకి హృదయమంతకంటెఁ గఠినము. తన వనప్రయాణమునకు నాజ్ఞగొనుటకైనఁ జెప్పుటకైన లక్ష్మణుఁడు సుమిత్ర. ఊర్మిళ యిండ్లకు బోయినవాఁడు కాఁడు. శ్రీరాముఁడైనను దల్లియాజ్ఞ దీసికొనిరమ్మనికాని భార్యకుఁ జెప్పిరమ్మనిగాని యనినవాఁడుకాఁడు. సుహృత్తులకుఁజెప్పి శీఘ్రముగ రమ్మనెను. అయనయు నట్లే చేసెను. తల్లికి భార్యకుఁ జెప్పఁబూనినఁ దనకుఁగలిగిన కాలహరణమే లక్ష్మణునకుఁ గలుగును. ఆ దినము ప్రయాణముసాగదని శ్రీరాముఁడు దలంచియుండవచ్చును. లక్ష్మణు నభిప్రాయమదియేయైయుండును. సుమిత్ర నింతకుముందు చూడనికారణముచేతనే యామెయిపుడింత విశేషించి చెప్ప వలసివచ్చెను. బాలకాండమున నేమిచెప్పఁబడెనో యంతయేకాని యావల వాల్మీకియూర్మిళ పేరు స్మరించినవాఁడు కాఁడు. ఏమిటికో? తాను జెప్పఁబూనిన కథాప్రపంచమున కనావశ్యకమనియొ. సీత యూర్మిళ యిరువురిలో నూర్మిళకే యెక్కువ దుఃఖమని చెప్పవలసియున్నది. సందర్భబలముచేఁ బ్రసిద్ధిచెందినది సీతాదేవి. అపహరణాది సందర్భములు పొసఁగకుండిన సీతాదేవియంత ప్రసిద్ధికి వచ్చియుండదు. అమె భర్తతోడనుండిన కారణమున నామె దేహకష్టముల మనస్సున గణించినదికాదు. ఇతరుల విషయమనుకొనునది కాదు. ఊర్మిళయో పతి ప్రవాసియైన కారణమున సర్వభోగములు వర్జించి యలంకారాదుల మాని శ్రమజీవలెనై సర్వదా పతిని స్మరించుచు నడవులలోఁ బతికి నేవేళ కేమోయేమి తినుచున్నాఁడో యెట్లున్నాఁడో యని భయపడుచు వ్యసనపడుచు నుండెను. సీతాదేవికంటె నూర్మిళాదేవికే విశేష మనోవేదనయని చెప్పవలసియున్నది.

చం॥ అని సుతుచిత్తదార్ఢ్యమున•కై యిటు బోధముచేయ నంత నా
మనుజవరేణ్యు రాముని సు•మంత్రుఁడు మాతలి యింద్రునట్లు స
ద్వినయమున న్వచించె నదె•తే రరుదెంచెట కేగ నాజ్ఞచే
సిన నట కెన తోలెదను•జేయుఁడు తొందర యాల మేటికిన్. ౧౦౯

చిత్తదార్ఢ్యమునకై =మనస్సు దృఢపడుటకుఁగాను.

తాత్పర్యము

ఈ ప్రకారము సుమిత్రాదేవి శ్రీరామునితోడఁ బోవఁబూనిన లక్ష్మణు మనస్సు చలింపక దృఢపడుటకై చెప్పఁగా నావల శ్రీరామునిఁజూచి సుమంత్రుఁడు మాతలి యింద్రునివలె నిట్లు సంబోధించెను. రామచంద్రా, అదిగోఁ దేరు సిద్ధముగానున్నది, రండు, మీరెచ్చటికేగ నాజ్ఞచేసెదరో యచ్చటికి నేనే

తోలెదను, తొందరపడుడు. జాగేల? పదునాలుగు సంవత్సరములలో నొక దినము కడచినను గడచినదే కదా.

—• సీతారామలక్ష్మణులు తేరెక్కి వనములకై పోవుట. •—

చం॥ వనముల నాలుగుం బదియు•వర్షము లుండఁగ మీర లిప్పుడే
చనుఁడని చెప్పెఁ గైక, యది•సాగుత నేఁడు మొదల్గ రాఘవా,
యన నినసన్నిభం బయి య•నంతమణీమయ మౌశతాంగమున్
జనకతనూజ యెక్కె నరు•సంబున భూషణభూషితాంగియై. ౧౧౦

ఇన సన్నిభంబు=సూర్యునితో సమానము, అనంతమణీమయమౌ=లెక్క లేని రత్నములు విశేషించి చెక్కఁబడిన, శతాంగము=తేరు, అరుసంబునన్= సంతోషముతో, భూషణ భూషితాంగియై=సొమ్ములచే నలంకరింపఁబడిన యవయవములు గలదై.

తాత్పర్యము

రామచంద్రా! యిప్పుడే మీరడవులలోఁ బదునాలుగువర్షము లుండఁ బొండని కైక చెప్పెనుగదా. ఆమె చెప్పినప్రకారము నేఁడే మొదటిదిన మగును గాక అనఁగా బాలసూర్యునితో సమానమై యనేక రత్నములు చెక్కిన యారథమును బతివెంటఁబోవు భాగ్యము లభించెఁగదా యని సీతాదేవి సంతోషముతో సమస్తాభరణములు ధరించి ముందెక్కెను.

కం॥ అనలోపమాన మగుచుం, గనకమయం బై నరథముఁ•గౌసల్యానం
దనుఁడును సుమిత్రపట్టియు, ననుమానము లేక యెక్కి•రత్యుత్సుకతన్.

అనలోపమానము=అగ్నితో సమానము, కనకమయము=బంగారుతో నిండినది, అత్యుత్సుకతన్=మిక్కిలి సంతోషముతో.

తాత్పర్యము

అగ్నిహోత్రముతో సమానమై బంగారుమయమైన యాతేరిని శ్రీరాముఁడు లక్ష్మణుఁడును సంతోషముతో సందేహింపక యెక్కిరి.

కం॥ వనవాసార్థము పతితో, ననుగమనము సేయుసతికి•నవనీసుతకున్
జనపతి మామ యొసంగిన,
యనుపమభూషణములను మ•హాధనచయముల్. ౧౧౦-అ

వనవాసార్థము=వనమునందు వసించుటకొఱకు, అనుగమనము సేయు= వెంటఁబోవు.

తాత్పర్యము

తనభర్తతో వనవాసము చేయుటకై పోవుచున్న సీతకు ఆమె మామ దశరథుడిచ్చిన యనమానములైన సొమ్ములు, విశేష ధనసమూహములు.

కం॥ ఆయిరుపురకవచంబులు, నాయుధముల్ చర్మయుక్త•మగుగుద్దలియున్
వే యుంచి రరదమున నా, ఛాయం గని తేరు దోలె•సారథి వడిగన్.

తాత్పర్యము

శ్రీరామ లక్ష్మణుల కవచములు, విండ్లు, బాణములు, కత్తులు లోనగు నాయుధములు, చేతికి రావుదగులకుండుటకై తోలుగప్పిన గుద్దలిని, ద్వరగా సేవకులు తేరిపై నుంచిరి. ఆపెట్టినవిధముఁజూచి మెల్లగఁదోలినఁ బౌరులు నంతఃపుర జను లడ్డపువత్తురు ప్రయాణము సాగనీయరను నభిప్రాయముతో సారథి తేరిని వడిగాఁదోలెను.

చం॥ అనిలజవంబునం బఱచు•నట్లు సుమంత్రుఁడు దోల నయ్యయో
యని బలితంపుమూర్ఛఁ గొని•రందఱు పౌరులు వేడ్కఁ జూడవ
చ్చినజనముల్ బలంబులు వి•శేషపుఁగాలము, క్రుద్ధమత్తదం
తినిచయవాజిశింజితము•నెక్కొనె సంకుల మైనయాపురిన్.　　౧౧౦౪

అనిలజవంబునన్=వాయువేగమున, పఱచు=పరువెత్తు, క్రుద్ధ=రోషించిన మత్త=మదించిన, దంతినిచయ=ఏనుఁగుల గుంపులయొక్కయు, వాజి=గుఱ్ఱములయు, శింజితము=సొమ్ములధ్వని, నెక్కొనెన్=అతిశయించెను, సంకులము=జనులకోలాహలముచే నిండినది.

తాత్పర్యము

సుమంత్రుఁడు వాయువేగముతోఁ బోవునట్లు గుఱ్ఱములను దోలఁగాఁ జూడవచ్చిన జనులు పురముననున్నజనులు సేసలు చాలఁగాల మయ్యయో యని వ్యసనముచే గాఢమూర్ఛనొందిరి. జనులకోలాహలముచే నిండిన యాపట్టణమందుఁ గోపించిన మదించిన యేనుఁగులయు గుఱ్ఱములయు సొమ్ముల ధ్వను లతిశయించెను.

—•శ్రీరాముని పోకకుఁ బ్రజలు దుఃఖించుట.•—

ఉ॥ రాముని వెంట నెండలను•గాఁగినవారలు నీటికిన్వెలన్
వే ముదునల్ల బాలురును•వీడక పాఱిరి, యశ్రుపూర్ణమౌ
మోముల నార్తనాదముల•మోరల నెత్తి రథంబుచాయకున్
రాముని తేరు పట్టుకొని•ప్రక్కల వెన్కల ప్రేలి కొందఱున్.　　౧౧౦౫

తాత్పర్యము

ఎండవేఁడిమికిఁ దపించినవారు నీళ్ళకై పరువెత్తినట్లు తొరతొరగాముసలివారు బాలురుకూడ శ్రీరామునివెంట వదలక కన్నీళ్ళచే నిండిన ముఖములతో నేడుపుధ్వనులతో రథముప్రక్క ముఖములెత్తికొని కొందఱు తేరుపట్టుకొని ప్రక్కలవెనుక వ్రేలాడుచుఁ గొందఱు పరువెత్తిరి.

కం॥ పోవుచు నీగతిభృశదుః•ఖావేశవినష్టసత్త్వు•లై సూతునితో
నీవిధమున వాకొందురు, పోవయ్య సుమంత్ర మెల్ల•బుణ్యం బగుతన్.

భృశదుఃఖావేశ వినష్టసత్త్వులై=అధికమైన దుఃఖమావేశించుటచే నశించిన బలముగలవారై, వాకొందురు=చెప్పుదురు.

జను లీవిధముగఁ బోవుచు మిగులదుఃఖము వారి నావేశించుటచే బలము లేనివారై సారథితో నయ్యా సుమంత్రా! నీకుఁ బుణ్యములభించును మెల్లగాఁ దోలుమని యందురు.

ఉ॥ ఎన్నఁడు చూడఁగాఁ గలమొ • యీరఘురాముని మోముఁ ద్రమ్మ జన్
దిన్నగఁ దోల వన్న! యిటు • తీవర మేటికి రన్న, పగ్గముల్
మన్ననఁ బట్టి వన్న! యొక • మా టయినం గనఁగొందు మిప్పుడే
సన్నుతశీలుఁ డైనరఘు • చంద్రము చారుముఖారవిందమున్ ౧౧౦౩

సుమంత్రునితోఁ బౌరులు చెప్పెడుమాట లింకను జెప్పఁబడుచున్నవి.

తాత్పర్యము

అన్నా! సుమంత్రా! శ్రీరాముని యందమైన ముఖకమలమును మరల నెన్నాళ్ళకుఁ జూడఁగలమో యేమో యిప్పుడే యింకొకమాటు చూడనీవయ్యా మెల్లగఁ దేరిని దోలవయ్యా, ఏమయ్యా! యిప్పుడుతొందర. పగ్గములను బిగఁ బట్టవయ్యా.

సీ॥ రామునితల్లికి • రాయియో యను మొండెఁ,
గాఁబోలు గుండియ • గాకయున్న
దేవగర్భోపముఁ • డీ వనజాక్షుండు, వనికి నేఁగఁగఁ బెట్లి • పడక యున్నె
కాంచననగము న • ర్కప్రభ పాయుని, చంద మై తననాథుఁ • జాయవోలెఁ
గానకొని వెన్కని • చనియెడి యీమె వో, ధన్యాత్మురాలన • ధరణియందు
తే॥ నార లక్ష్మణ నీవే కృ • తార్థుఁడ విల,
ననయమును బ్రియవాదిని • ననఁగు భ్రాత
దేవసంకాశు నిర్మల • భావసుజనను,
బరిచరింపఁగఁ జనెదు నీ • భాగ్య మహహ! ౧౧౦౪

దేవగర్భోపముఁడు=దేవకుమారునితో సమానుఁడు వనజాక్షుఁడు=పుండరీకాక్షుఁడు, ఎఱ్ఱకమలములవంటి కన్నులుగలవాఁడు, పుండరీకము=ఎఱ్ఱకమలము పుండరీకం సితాంభోజ మనుట ప్రమాదము, కప్యాసం పుండరీకమక్షిణీ యని శ్రుతి కాంచననగము=బంగారుకొండ, మేరువు, ప్రియవాదిని=ప్రియమే చెప్పువానిని, దేవసంకాశున్=నారాయణుతోసమానుని, పరిచరింపఁగన్=సేవచేయ.

తాత్పర్యము

శ్రీరామునివంటి కుమారునిఁ గన్న కడుపుగల తల్లిగుండె రాయియో యినుమో యైయుండవలయును అట్లుగాదేని మన్మథునివంటి సౌందర్యముగల యీ పుండరీకాక్షుఁ డడవికిఁబోవుచుండఁగా శోకాగ్నిచేఁ బెటిలి తునుకలై యెగిరి పడకయుండునా? సూర్యుఁ డేప్రక్కనుండినను ఆయన కాంతి మేరుపర్వతమును నెడఁబాయక యంటియుండునట్లు తన భర్తను విడువక ఆయన నీడవలె నాయన వెంబడి సీత పోవుచున్నది. పుణ్యాత్మురాలన నీమెగదా.

ఔరా లక్ష్మణా! భూమియందుఁ బుట్టినవారలలో నీవే జన్మమును సఫలము చేసి కొన్నవాఁడవు. ఏలయందువా. ఎప్పుడును ప్రియవాక్యములే పలుకువాఁడును నారాయణుతో సమానుఁడునగు నీ కూర్మిసోదరుని, శ్రీరామచంద్రమూర్తిని నిర్మలమనస్సుతో సేవించుటకై పోవుచున్నావు. అహా ఏమి నీభాగ్యము.

కం॥ రామునితో నీ పోవుట, యేమానుగఁ బరమసిద్ధి•హేతువు కల్యా
ణామల బీజంబిదియే, పో పూనక నాకమార్గ•మును నని వనటన్. ౧౧౦౯

పరమసిద్ధిహేతువు=మోక్షకారణము, కల్యాణామలబీజము = శ్రేయస్సు లకు నిర్మలమైన విత్తనము, నాకమార్గము=స్వర్గమునకుఁ ద్రోవ.

తా త్ప ర్య ము

లక్ష్మణా! శ్రీరాముని వెంట నీవు పోవుట మోక్షమునకుఁ గారణమగును అటుగాక యైహికసుఖము గోరువారికి శుభము శ్రేయస్సు నను ఫలమిచ్చు వృక్షమునకు విత్తనమిదియే. లేదా స్వర్గసుఖముఁ గోరువారికిని నిదియే మార్గము. శ్రీరామానుసరణము, భుక్తి స్వర్గమోక్షములందు వారువారు కోరిన ఫలమునిచ్చునని భావము.

కం॥ ఉనుగక కనుఁగొను బొడబొడ, జడిగొని వర్షించుబాష్ప•జలములు పోవం
దుడువఁగ జాలక రాముని, బడి నేగిరి పౌరు లెల్ల•బటుదుఃఖమునన్.

జడిగొని=జడివానవలె. ౧౧౧౦

తా త్ప ర్య ము

ఈప్రకారము తపించుచు విడువక యేకధారగా జడివానవలెఁ గన్నుల నుండి కాఱునీళ్ళను దుడువఁగ సాధ్యపడక యవి యట్లు కాఱుచుండఁగనే శ్రీరాముని వెంటఁబోయిరి.

—•దశరథుఁడు శ్రీరామునిఁజూడ వచ్చుట.•—

ఉ॥ రామునిపోకఁ గందునని•రామలతో నిలు వీడి వచ్చి సు
త్రామసమానుఁ డాజి తన•ధామున బద్ధమతంగజార్థ మౌ
భీమక రేణుకారవము•వెల్వుస సారసపత్రలోచనో
ద్దామనినాదముల్ చెలఁగఁ•దద్దయు గ్రస్తమృగాంకు నట్లునై, ౧౧౧౧

పోక=పోవుట, రామలతో=స్త్రీలతో, సుత్రామసమానుఁడు=ఇంద్రునకుద్ది యైనవాఁడు, అజి=దశరథుఁడు, బద్ధమతంగజార్థమౌ=బంధింపఁబడిన యూథ నాథుఁడగు నేనుఁగు నిమిత్తమైన, భీమ=భయంకరమైన, కరేణుకారవము=ఆఁ డేనుఁగులధ్వని, సారసపత్రలోచనా=కమలముల రేకులవంటికన్నులుగల స్త్రీల యొక్క, ఉద్దామనినాదముల్=అతిశయమగు ధ్వనులు, గ్రస్తమృగాంకునట్టులు =రాహువుచేఁ బట్టఁబడిన చంద్రునివలె.

తాత్పర్యము

శ్రీరాముఁ డడవికిఁబోవుట చూచెదనని (పౌరులవలె వెంటఁబోవుటకుఁ గాదు. నిలుపుటకుఁ గాదు) యంతఃపుర స్త్రీలతోడ నిల్లువదలివచ్చి దశరథుఁడు తన సమీపమందు బంధింపఁబడిన యూథనాథుఁడగు నేనుఁగువలె యేడ్చునాడేఁ నుఁగుల పెద్దధ్వనివలె స్త్రీలందఱు నొక్కపెట్ట గొంతెత్తి యేడువఁగా దశరథుఁడు రాహువుపట్టిన చంద్రునివలెఁ దేజోహీనుఁడయ్యెను.

కం॥ అరుదెంచుతండ్రిఁ గనుఁగొని, స్థిరమతి రాముండు సూతుఁ◆దీవరపఱిచెన్
దురగంబులఁ బోనిమ్మి,సరగున నీవంచు నట్లు◆సలిపె నతండున్. ౧౧౨

స్థిరమతి=వనవాసము నుండి చలింపని మనస్సుగలవాఁడు, సరగునన్=శీఘ్రముగా.

తాత్పర్యము

వచ్చుచున్న తండ్రినిఁజూచి చలింపనివాఁడై శ్రీరాముఁడు సారథీ!రథము శీఘ్రముగఁ బోవఁదోలుము అని తీవరింపఁగా నతఁడట్లే చేసెను.

కం॥ తోలుము తోలు మటంచును,వాలాయింపఁగను రామ◆భద్రుఁడు,జనముల్
తాళుము తాళు మటంచన, నేలీలం జనక సూతుఁ◆డిఱికెన్మదుమన్.

వాలాయింపఁగను=బలవంతపెట్టఁగ, ఇఱికెన్=ఇఱుకుకొనెను. ౧౧౩

తాత్పర్యము

దశరథుఁ డెదిగినేని ప్రయాణ మాలసించునేయని తోలుము తోలుమని శ్రీరాముఁడు తీవరింపఁగా జనములు దానివెంటఁ బరువెత్తలేక సారథీ! మెల్లగా మెల్లగాఁ దోలవయ్యా! నిదానింపుము నిదానింపుమని మొఱలుపెట్టఁగా సారథి యెటుచేయుటకుఁ దోఁపక యిరువురినడుమ నిఱుకుకొని మిడిసెను. ప్రజలనిమిత్తమై మెల్లగాఁ జననిచ్చిన దశరథుఁ డెదుగును, ఆయన నిమిత్తమై త్వరగాఁ బోనిచ్చిన వెంటవచ్చు ముదుసళ్ళు బాలురు దుర్బలులు పరువెత్తలేక, బాధపడెదరు.

కం॥ హరిఖురఘట్టన జనముల, చరణహతిన్ రేఁగుదుమ్ము◆జనసంచయని
ర్భరశోకజాతఘనరస, సరిదాళి నడంగెఁ బుడమి◆జంబాలముగన్. ౧౧౪

హరిఖురఘట్టనన్=గుఱ్ఱముల గిట్టలయొక్క త్రొక్కుడులచే,ఘట్టనశబ్దము చరిత్రాదులలోఁ జేరినది, చరణహతిన్ = కాలిత్రొక్కుడులచే, జన=జనము యొక్క, సంచయ=సమూహములయొక్క, నిర్భర=అతిశయించిన,శోక=వ్యసనమువలన, జత=పుట్టిన, ఘనరస=నీళ్ళు, సరిత్+ఆళి=ఏటివరుసలచే, జంబాలము=బురద.

తాత్పర్యము.

గుఱ్ఱముల గొరిజల త్రొక్కుడులచేతను జనములపాదముల త్రొక్కుడులచేతను రేఁగిన దుమ్ము జనుల కన్నులనుండి వెలువడిన జలప్రవాహములచే నేల బురదయగుటవలన శమించెను.

శా॥ హాహా నిస్వనపూరితం బగునయో•ధ్యాపట్టనంబందు సీ
తాహృన్నాథుప్రయాణవేళను నితాం•తదూ్యన మయ్యెం బ్రజా
వ్యూహం బెల్ల,విసారసంక్షుభిత మం•భోజాళి నా నావరా
రోహాళుల్ గనుసీరు గార్చెను మహా•క్రూరంపుశోకవ్యథన్. ౧౧౧౨

హాహా నిస్వనపూరితంబు=హాహా కారధ్వనులచే నిండినది, దూ్యనము=దుఃఖించినది, వ్యూహము=సమూహము, విసార=చేఁపలచే, సంక్షుభిత=మిక్కిలి క్షోభచెందిన, అంభోజాళినాన్=కమలసమూహమో యనునట్లు, వరారోహాళుల్=స్త్రీలవరుసలు, వరారోహ=పెద్ద పిఱుఁదులుగలది, మహాగొప్పదై, క్రూర=తీవ్ర మైన, శోకవ్యథన్=శోకబాధచే, శ్రీరాముని వెంటఁబోవు పురుషుల గతి చెప్పి యయోధ్యయందు నిలిచిన స్త్రీజనముల దశను జెప్పుచున్నాఁడు, 'మత్స్యే మీనో వైసారిణోండజః విసారశ్శకులీచ' అమరుఁడు.

తాత్పర్యము

హాహా కారధ్వనులచే నిండిన యా యయోధ్యాపట్టనమందు శ్రీరాముఁడు ప్రయాణమైపోవు సమయమున జనసమూహమంతయును దుఃఖమగ్న మయ్యెను. చేఁపలచేఁ గదలింపఁబడిన తామరపూవులనుండి జలజల రాలు నీళ్ళ వలె స్త్రీలు సహింపరాని శోకబాధచేఁ గన్నీరు కార్చిరి.

ఉ॥ ఏకమనంబుతోడిజన•బృందము నెల్లను గాంచి ఱేఁడు శో
కాకులచిత్తుఁ డౌచు మొద•లంటఁగఁ గొట్టినవృక్షముంబలెన్
జోక దొఱంగి వ్రాలుటయు•జూపఱు హోయని యేడ్వ సాగి ర
స్తోకముగాఁగ ఱేఁడు భృశ•దుఃఖితుఁ డై ధర నొలి యుంటకున్. ౧౧౧౬

ఏకమనంబుతోడి=రాముని వెంట నందఱము పోవలసినదే యను నొక్క యభిప్రాయముతోనుండెడి, జనబృందమున్=జనసమూహమును, శోకాకుల చిత్తుఁడు=శోకముచేఁ గలఁతనొందిన మనస్సుకలవాఁడు, జోక=బాగు, దృఢ స్థితి, దొఱంగి=తొలఁగిపోయి, చూపఱు=చూచువారు, అస్తోకము=అధికము.

తాత్పర్యము

శ్రీరాముని వెంట మనము పోవలసినదే. ఇందు నిలువరాదను నొక్క నిశ్చయాభిప్రాయముతోఁ బోవుచుండు ప్రజలను జూచి నే నెంతమందికి దుఃఖము కలిగించితినని దుఃఖముచేఁ గలఁతనొందినవాఁడై వేరు పుట్టనఱికిన చెట్టువలె దృఢస్థితితప్పి నేలపైఁబడి మూర్ఛపోయెను. రాజు నేలపైఁబడి యుండుటను నందున్నవారు రెండవవిపత్తు వచ్చెనే యీయన చచ్చెనేమో యని యాయనకై యేడువసాగిరి.

కం॥ అదియెడఁ గొందఱు కౌసల్యా యనుచున్ రామరామ•యని కొందఱు దుః
ఖాయితమతులై యేడ్చిరి, హోయని యంతఃపురంబు•ను విదలు కలఁకన్.

తాత్పర్యము

అందుఁ గొందఱు కౌసల్యా కౌసల్యా యని, కొందఱు రామా రామా యని, యంతఃపుర స్త్రీలు దుఃఖస్వరూపము నొందిన మనస్సులతో హోయని యేడ్చిరి.

ఉ॥ భ్రాంతమనస్కుఁడై వెనుక•వచ్చునృపాలునిఁ దల్లి జానకీ
కాంతుఁడు పాశబద్ధ మగు•కర్కకిశోరము దల్లి జూచున
ట్లింతయు ధర్మరజ్జుల న•హీనముగాఁ బరిబద్ధుఁడౌట నే
త్రాంతములం గనిం గనఁడ•యంతగఁ గానఁగ నొల్లకుండుటన్. ౧౧౮

భ్రాంతమనస్కుఁడు=దిగ్భ్రమనొందిన మనస్సుగలవాఁడు, పాశబద్ధము=త్రాటిచేఁ గట్టఁబడినది. కర్కకిశోరము=తెల్లపిల్ల గుఱ్ఱము, కర్కస్తుదర్పణే, ఘటభేదే సితాశ్వేగ్నౌ॥ నానార, ధర్మరజ్జులన్=ధర్మమను త్రాటిచే, పరిబద్ధుఁడు=చక్కఁగాఁ గట్టబడినవాఁడు, నేత్రాంతములన్ = కనుఁగొనలచే, కనిన్=కని యును, అర్థవిశేషమున సముచ్చయము, అంతగన్=పూర్ణముగ.

మనస్సుచెదరి దిగ్భ్రమనొంది తన వెంటవచ్చు తండ్రిని దల్లినిద్రాటిచే గట్టఁబడిన గుఱ్ఱపుపిల్ల తల్లిని జూచునట్లు పితృవాక్యపరిపాలనమను ధర్మపాశముచేఁ గట్టఁబడినవాఁడగుట శ్రీరాముఁడేమియుఁ జేయఁజాలక వారినిఁ బూర్ణముగఁజూచుటకు మనస్పొల్లక యోరచూపులఁ జూచియుఁ జూడనివానివలె నుండును.

తే॥ యానముల వచ్చుటకు యోగ్యు•లయ్యు రిత్త,
గాళ్ళ వచ్చెడివారి సు•ఖంబు గలిగి
శోకభరితుల రాముండు•చూచి సూత, తోలు తోలు మటంచును•దొందరించె
యానము=వాహనము. ౧౧౯

తాత్పర్యము

వాహనములమీఁద వచ్చు యోగ్యతగలిగియు నుత్తకాళ్ళ వచ్చువారిని, నెంతో సుఖింపవలసినవారయ్యు దుఃఖముగ్నులైనవారిని, దల్లిదండ్రులను జూచి శ్రీరాముఁడు వారికిఁ గానరాకుండఁబోవుట మేలని తలఁచి సారథి శీఘ్రముగఁ దోలుమని త్వరించెను.

తే॥ కోలపోటును సైఁపని•కుంజరంబు,
పగిది జనకుండు జననియుఁ•బడెడిదుఃఖ
ములను జూడంగ నోపండ•జలజలోచ,
నుండు రాముండు కరుణాత్మ•కుండుగాన. ౧౨౦

కోలపోటు=అంకుశముతోడి పోడుపును, కుంజరము=ఏనుఁగు, కరుణాత్మకుండు=దయగల మనస్సుగలవాఁడు.

తాత్పర్యము

దయామయుఁడు కావునఁ బరుల దుఃఖముచూచి సహింపలేని శ్రీరాముఁడు అంకుశముపోటును సహింపలేని యేనుఁగువలెఁ దల్లిదండ్రులు పడెడు బాధను జూడలేకపోయెను.

ఉ॥ కట్టఁగఁబడ్డలేఁగకయి • కాంక్షను బాఱెడిగోవువోలె నా
పట్టపుదేవి తేరుబడి • పర్విడుచుం దనయా! రఘూత్తమా!
పట్టి! కుమార! లక్ష్మణ! కృ•పాపర! యయ్యయొ తల్లి జానకి!
యెట్లు సహింతురా యనుచు •నేడువ రాముఁడు చూచెఁ బల్మఱున్. ౧౧-౨౧

తాత్పర్యము

త్రాటఁ గట్టివేయఁబడిన దూడయొద్దకుఁ బరువెత్తుగోవువలెఁ బట్టపురాణి యగు కౌసల్య తేరువెంబడి పరువెత్తుచుఁ గొడుకా- కొడుకా- రఘువంశదీపకా- బిడ్డా- పుత్రా- లక్ష్మణా- దయావంతుఁడా అయ్యయ్యో తల్లీ జానకీ మిమ్ము విడచి నే నెట్లుసహింతునని యేడువఁగా శ్రీరాముఁడు పలుమాఱు చూచెను.

తే॥ నిలు నిలు మటంచు నఱవంగ • నృపతి పిఱుఁదఁ
బద పద మటంచు రాముండు • పలుకు చుండ
బండికలుదోయిఁ జిక్కిన•వానిభంగి
మిడికెను సుమంత్రుఁడను మంత • నడుకు గదర. ౧౧-౨౨

తాత్పర్యము

వెనుకనుండి రాజు సుమంత్రా! నిలుపు రథము నిలు నిలు మని యఱచు చుండఁగా శ్రీరాముఁడో ఊఁ ఊఁ తోలు తోలు మని తొందరపెట్టఁగా బండికం డ్లకు రెంటికినడుమఁ జిక్కినవానివలె సుమంత్రునిమనస్సు తపించెను.

ఉ॥ క్రమ్మఱి నీవు పోవఁగ ధ•రాపతి ని న్నని యేల యాఁశతాం
గమ్మును నిల్పవైతి నుడి • గైకొన వేటి కటన్నఁ జెప్పనా
నెమ్మది నీదువాక్యముల • నే వినఁగాన నటంచు, నేల నా
నిమ్మహితార్తి దీర్ఘ మగు • నేనియు దుస్సహ మౌను తేనికిన్. ౧౧-౨౩

క్రమ్మఱి=తిరిగి, శతాంగమును=తేరిని, నుడి=మాట, ఇమ్మహితార్తి=ఈ గొప్పవేదన, దీర్ఘము=నిడివి, దుస్సహము=సహింపరానిది.

తాత్పర్యము

నీవు మరలి యూరికిఁ బోయినపుడు రాజు నిన్నుఁజూచి నేను దేరిని నిలువు మనిన నేల నిలుపవైతివి.నామాట యేల నీకులక్ష్యములేదాయెను అని ప్రశ్నించె నేని నీమాట నాకు వినఁబడలేదని చెప్పుము. అసత్యమేల చెప్పవలె ననిన నాయన మాటప్రకారము నిలిపితివా యాయన వచ్చి యెదుగును. నన్ను విడువ లేక పరితపించును. ఇది నేనెఱుఁగఁ గానవచ్చువఱకుండును. కావున నేనుండు

కొలఁది నాయనకు దుఃఖము క్రమక్రమముగ హెచ్చునేకాని తగ్గదు. ఇంత దుఃఖము దీర్ఘకాలమువడెనా యాయన సహింపక మరణించును (౬౧-వ స. నిజమరివ్యాఖ్య చూడుఁడు) ఇట్టి యసత్య మసత్యముగాదు. దశరథుని మేలుకై చెప్పఁబడినది పరులకు నిష్కారణముగ నష్టి- భయము తాపము గలిగించునదియుఁ దనకు నన్యాయముగఁ దుష్టిలాభము గలిగించునదియు నగు నసత్య మసత్య మగునుగాని పరుల మేలునకై చెప్పు నసత్య మసత్యముకాదు. తేరునిలుపుటవలనఁ గార్యహాని ధర్మహాని దశరథునకుఁ బ్రాణహాని.

చం॥ అని రఘురాముఁ డాడఁగ శ • తాంగము వెంబడి వచ్చు నెల్లరన్
సనయత నిల్వఁ జెప్పి రభ • సంబుగఁ బోవుగుణాల సూతుఁడున్
ఘనరయ మారఁ దోలుటయు • క్ష్మాధవుకాంతలు నార్తి రామచం
ద్రుని వలగొంచు నిల్చిరి మ • నోజలజంబులు కంద నశ్రులన్. ౧౧-౩౪

శతాంగము=తేరు, సనయత=మంచిమాటలతో, రభసంబుగన్=శీఘ్రముముగ, ఘనరయము=మిక్కిలిత్వర, వలగొంచు=ప్రదక్షిణించి.

## తాత్పర్యము

అని శ్రీరాముఁడు చెప్పుచుండఁగాఁ దన రథమువెంటవచ్చు నెల్లవారిని మంచిమాటలచే నిలుఁడని శ్రీరామునిచేఁ జెప్పించి త్వరగాఁబోవు గుఱ్ఱములను మఱింతత్వరగాఁబోవునట్లు సూతుఁడు తోలఁగా రాజునకు సంబంధించిన స్త్రీలు వ్యసనముతో వేఁడికన్నీళ్ళచే హృదయము గందిపోవఁ దమ దేహములను నిలిపిరిగాని దృష్టులు మనస్సు శ్రీరామునివెంటఁ బోకుండ నిలుపలేరైరి.

కం॥ అతివేగంబునఁ జనియెడి,క్షితిపతిసుతురథముతోడఁ • గ్రేవల నశ్రూ
ద్ధతి నంధు లగుచుఁ బఱచుచు,
మతిఁదలఁపరు మనుజులెవరు • మరలెడిమాటన్. ౧౧-౩౫

## తాత్పర్యము

అంతఃపురస్త్రీలు శ్రీరామునివెంటఁ బోవలేక దేహములను నిలిపిరిగాని లోకులాపనియుఁ జేయఁజాలక యతివేగమునకుఁబోవు రాజకుమారునితేరితోడఁ బ్రక్కలఁ గన్నీళ్ళతో గ్రుడ్డివారై కనలేక యున్నను బరువెత్తుచు నిలుతమను మాటనైనఁ దలఁచినవారు కారు. ఇదియే బంధువులకు హితులకుఁ గలభేదము.

ఉ॥ దూరము పోవ రాదు సుమి • తూర్ణమ క్రమ్మఱఁగోరువారితో
ఘోరము డా! యనన్ సచివ • పూగము, సర్వగుణోపపన్ను లా
వారలమాటఁ బట్టి సహ • భార్యుఁడునై ప్రవిషణ్ణరూపుఁడై
వారి స్రవింప మేన నిలు • వంబడె నచ్చట రాముఁ జూచుచున్. ౧౧-౩౬

తూర్ణము=శీఘ్రముముగ, సచివపూగము=మంత్రులసమూహము, సర్వగుణోపపన్నులు = ఎల్లసద్గుణములతోఁ గూడినవారు, సహభార్యుఁడు = భార్యలతోఁ

గూడినవాఁడు, ప్రవిషణ్ణరూపుఁడు=మిక్కిలి విషాదముతోఁగూడిన మనస్సుగల వాఁడై, వారి=నీళ్ళు, స్రవింపన్ = కారఁగా.

తాత్పర్యము

రాజేంద్రా! పోవువారు శీఘ్రముగా మరలి రావలయునని కోరువారు పోవువారివెంట దూరముపోరాదు అని మంత్రులుచెప్పఁగా మంచిగుణములు గలవారు చెప్పిన హితవాక్యముఁవిని భార్యలతో మిక్కిలి విషాదపడుచు దేహమునఁ జెమటలు కారుచుండ శ్రీరాముని జూచుచు నచ్చటనే దశరథుఁడు నిలుచుండెను.

—• ౪౧-వ సర్గము. శ్రీరామునకై యంతఃపురస్త్రీలు దుఃఖించుట. •—

కం॥ మ్రొక్కుచుఁ దల్లికిఁ దండ్రికి, నక్కరటిని రామచంద్రుఁ • డరిగిన నాపై
వొక్క మొగి నంతిపురమున, మిక్కుటమై యార్తరవము•మింటికి నెగసెన్.

ప్రస్తుతము శ్రీరామప్రజల వృత్తాంతము చెప్పుటచాలించి యీలోపల నంతఃపురమున జరిగిన వృత్తాంతమును గవి చెప్పుచున్నాఁడు.

అక్కరటిని = ౧౯౬౩-౧౯౬౫ పద్యములలోఁ జెప్పినవిధముగా, ఒక్కమొగిన్=ఒక్కసారిగ, మింటికి = ఆకాశమునకు- దీనివలన నంతఃపురస్త్రీలలోఁ గౌసల్యాసుమిత్రాకైకేయులు వారి పరిచారికలు కొందఱుమాత్రమే రథము వెంట వీథులఁబడి వచ్చిరని మున్నాటయేఁబది ముద్దరాండ్రు రాజాజ్ఞలేమిని గాఁబోలు రారైరని తోఁచెడిని. తల్లికి ఏకవచనము వివక్షితము. తల్లులందఱకని యర్థము.

తాత్పర్యము

ముందుచెప్పినవిధముగ శ్రీరాముఁ డందఱు తల్లులకుఁ దండ్రికి నమస్కరించి రథమెక్కి పయనమై పోఁగా నంతఃపురమున మిక్కిలి యధికమైన యేడుపుధ్వని యాకాశమున కెగసెను.

కం॥ గతి యెవ్వఁ డనాథులకున్,
గతి యెవ్వఁడు దుర్బలులకుఁ•గడుఁదపసులకున్
గతి యెవఁడు శరణ మెవఁ డా,పతి గతిచెడి యెచటి కేగు•వాఁడో యకటా.

అనాథులకున్=దిక్కులేని స్త్రీపురుషులకు, అనాథలు+అనాథులు=ద్వంద్వమున నేకశేషమునఁ బుంలింగ రూపము, దుర్బలులకు=బలములేని స్త్రీపురుషులకు- ధనబలము-బంధుబలము దేహబలము లోనైనవి లేనివారికి.

తాత్పర్యము

దిక్కులేనివారికిని బలములేనివారికిని నెవఁడు పొందఁదగినవాఁడో తపస్సు చేసికొనువారికిఁ బ్రాపింపఁ దగినవాఁడు రక్షకుఁడు నెవఁడో యట్లందఱకు రక్షకుఁడు ప్రాప్యుఁడునైనవాఁడు ప్రాపురక్షకుఁడులేక యయ్యో యెక్కడఁ బోవుచున్నాఁడో.

సీ॥ తనమీఁద నెవరైనఁ•దంట లాడిన నైనఁ, గోపంబు చెందఁడే•కొమ్మలార!
యేమి చేసిన నది•యెవరి నొప్పించునో, యని జంకుచుండునే•యమ్మలార!
యెవ్వరేనియుఁ గింక•నొవ్వంద వారల, నూఱట లాడునే•యువిదలార!
పరసుఖదుఃఖముల్•స్వసుఖదుఃఖము లట్లు,పరికించు చుండునే•తరుణులార!
తే॥ కన్నతల్లిని గౌసల్యఁ•గన్నపగిది
మనల నందఱఁ జూచునే•మగువలార!
యట్టిపుణ్యాత్ముఁ డటువంటి•యనఘ చరితుఁ
డెచట నున్నాఁడొ కటకటా•యెందుఁ జనునొ. ॥౨౯

తంటలు=కొండెములు, కింక=కోపముచే, నొవ్వ=నొప్పి.

తాత్పర్యము

తనమీఁద నెవరైనను గొండెములు చెప్పినను గోపింపఁడు. తానుజేయు కార్య మెవరిమనసునకైన నొప్పికలిగించునో యని సందేహించి యట్లెవరి మనసు నొవ్వని కార్యములే చేయుచుండును. తనమీఁద నెవరైనఁ గోపించి నొప్పిచెందినను వారలను సమాధానపఱుచును. ఇతరులసుఖము తనసుఖముగను ఇతరుల దుఃఖము తన దుఃఖముగను జూచుచుండును. కన్నతల్లిని గౌసల్య నేవిధముగఁ జూచునో యట్టులే మనలనందఱఁ జూచును. అటువంటి పుణ్యాత్ముఁడు అటువంటి నిర్దుష్ట చరిత్రుఁడు ఎందున్నాఁడో-యెందు బోవుచున్నాఁడో.

కం॥ నచ్చి తను దాయఁ గైకయు,
మచ్చరియై యేఁప విభుఁడు•మతిచెడి విడిచెన్
సచ్చరితులోకరక్షకు, నెచ్చటఁ జనుచున్నవాఁడొ•యెయ్యది గతియో. ॥౩౦

నచ్చి=నమ్మి, మచ్చరి=మచ్చరముకలది, ఏఁపన్=బాధింపఁగా.

తాత్పర్యము

భార్యగదాయని నమ్మి దగ్గఱకుఁబోఁగాఁ గైక శ్రీరామునిమీఁద మచ్చరము కలదై తన్ను బాధింపఁగా దానిబాధపడలేక మనస్సుచెడి మంచినడవడిగల లోక రక్షకుని రాజు వదలిపెట్టెను. అయ్యో శ్రీరాముఁ డెచ్చటఁ బోవుచున్నాఁడో. ఆయనగతి యేమో.

ఉ॥ ఎంతటిబుద్ధిహీనుఁడొ క•దే ధరణీశుఁడు జాలి మాలి యే
కాంతము సత్యశీలుని జ•గజ్జనతాప్రియు ధర్మమూర్తి దు
ర్దాంతపరాక్రమాఢ్యుని న•రణ్యములం బడఁ బంచె నంచు శు
ద్ధాంతనితంబినీజనము•హా యని యేడ్చెను దుస్సహవ్యథన్. ॥౩౧

ఏకాంతము=మిక్కిలి, జగత్=లోకమునందలి, జనతా=జనసమూహము లకు, ప్రియున్=ప్రియుఁడైనవానిని,ధర్మమూర్తిన్=ఆకారముగొన్న ధర్మమును, దుర్దాంత = అణఁపరాని, పరాక్రమాఢ్యునిన్ = పరాక్రమ సంపత్తిగలవానిని, శుద్ధాంతనితంబినీజనము = అంతఃపుర స్త్రీసమూహములు, దుస్సహవ్యథన్ = సహింపరాని దుఃఖబాధచే-

తాత్పర్యము

ఈరాజెంతబుద్ధిలేనివాఁడో కదా. అటుగాకున్నఁ గొంచెమైన దయలేక మిక్కిలి సత్యమాడుట స్వభావముగఁ గలవాఁడును, లోకములోని జనసమూహముల కందఱకుఁ బ్రియుఁడైనవాఁడును, ధర్మస్వరూపుఁడును, శత్రువులకు నణఁపరాని పరాక్రమసంపన్నుఁడును, నగు కొడుకును శ్రీరామచంద్రమూర్తిని నడవులపాలు చేయునా యని యంతఃపురస్త్రీలందఱు సహింపరాని దుఃఖబాధచే హా యని యేడ్చిరి.

కం॥ లేఁగలఁ బాసినయావులు, నాఁ గమలేక్షణలు బిగ్గ నాదున నార్తిన్
ద్రాఁగఁగ మ్రోఁగుడు విని ధర,
మ్రాఁగెన్ మ్రాఁగన్నుఁదోడ మనుజవిభుండున్. ౧౧౩౨

నాదు=ధ్వని, క్రాఁగఁగన్=తపింపఁగా, మ్రోఁగుడు=ధ్వని, మ్రాఁగెన్=సోలెను, మ్రాఁగన్నుఁదోడన్=మూఁతలుపడుచున్న కన్నులతో-

తాత్పర్యము

లేఁతదూడలను విడిచిన యావులవలె నాస్త్రీలందఱు గట్టిగా నేడ్వఁగా శోకముచేఁ దపించుచు నాధ్వని విని రాజు మ్రాఁగన్నుఁదోడ మూర్ఛపోయెను.

సీ॥ వండరు గృహమేధు లిండులలోపల, వేల్వ రగ్నులలోన విబుధ లెవరు
మనుజుఁడొక్కండైనఁ బనికిఁబోనొల్లఁడు,
మార్తాండబింబంబు మఱుఁగుపడియెఁ
గరులు దిండి దొఱంగి కన్నీరు గార్చెను, నాఁలు లేఁగలఁ జన్నుఁ లంట నీవు
తొలిచూలు మగబిడ్డఁ గలిగియు జనయిత్రి, యానంద మంద దాఁ వంత యైన
తే॥ దారుణంబుగ గురుబుధాంగారకులఁ ద్రి,
శంకువును నాక్రమించి దేఁ బాంకు, వీత
కాంతిఁ జుక్కలు గ్రహములు గ్రాలధూమ,
యుక్తమయ్యె విశాఖయు వ్యోమవీథి. ౧౧౩౩

గృహమేధులు=గృహస్థులు, విబుధులు=పండితులు, వేల్వరు=హోమము చేయరు, మార్తాండబింబంబు=సూర్యబింబము, మఱుఁగుపడియెన్ = కానరాకపోయెను, కరులు=ఏనుఁగులు, వ్యోమవీథిన్=ఆకాశమందు.

తాత్పర్యము

గృహములందు స్త్రీలు పురుషులు దుఃఖించుచుఁబడియుండిన కారణమున స్త్రీలు వంటచేసినవారు కారు- పురుషులు వంట యయినదా యని యడిగినవారు గారు. నిత్యాగ్నిహోత్రులయిన పండితులుకూడ దుఃఖాతిశయముచేఁ గర్తవ్యతామూఢులై హోమము చేయఁబూనినవారు కారు. అగ్నులును జల్లారియుండెను. ఒక మనుష్యుఁడైన నాఁడు విధిగాఁజేయవలసిన కార్యమైనను జేయఁబో నిచ్చగింపఁడు. ప్రొద్దుగ్రుంకువేళ గాకపోయినను దనవంశమునఁ బుట్టిన భగవదవ

తారమూర్తికే యిట్టి కష్టదశ వచ్చెఁగదా దీని నేనేమని చూతునని సూర్యుఁడు కానరాకపోయెను. ఏనుఁగులు తిండివదలి కన్నీరు గార్చుచుండెను. ఆవులు తమ దూడలు పాలుత్రాగవచ్చినను ద్రావనీయక తన్నెను. తొలిచూలు మగబిడ్డను గనియు నా తల్లి అయ్యో శ్రీరాముఁడే నా పెద్దకొడుకని తొడమీఁదఁబెట్టుకొని శైశవంబున లాలించి ముద్దాడుచుంటినే. అట్టివాఁడే యిట్లాయెనే ఇఁక వీఁడా నన్నుద్ధరించువాఁడు. కౌసల్య యెన్నెన్ని తపసులు ధారవోసి లేకలేక కాంచి యెంతో హెచ్చరికగాఁ బెంచిన పెద్దబిడ్డఁడే యిట్లయ్యెనే యిఁక నల్పవ్రతములు చేసియో అవియుఁ జేయకయో కన్న యీ కొడుకు గతియేమోయని తల్లికొంచెమైన సంతోషించినదికాదు.

గురువు, బుధుఁడు, అంగారకుఁడు అను గ్రహములు క్రూరముగ నిక్ష్వాకు వంశమువారి కూటస్థపురుషుఁడగు త్రిశంకువును జంద్రుని నాక్రమించిరి. గురువు, బుధుఁడు స్వయముగఁ గ్రూరగ్రహములు గాకున్నను గ్రూరగ్రహమైన యంగారకునితోఁ జేరుటచేతనో వేఱొక క్రూరస్థానమునకు వచ్చుటచేతనో వారును గ్రూరులైరి.

"పూర్ణే చతుర్దశేవర్షే పంచమ్యాం భరతాగ్రజ" అని పదునాలుగు వర్షములు పూర్తికాఁగాఁ బదునైదవ సంవత్సరము మొదటిదినమైన పంచమియందు శ్రీరాముఁడు భరద్వాజాశ్రమముఁ జేరెను. కావున శ్రీరాముని ప్రయాణదినము పంచమియైయుండవలెను.

ఈనాఁడు పుష్య నక్షత్రము కావునఁ జంద్రుఁడు కర్కాటరాశియందుండును. బుధుఁ డెప్పుడు సూర్యుని సమీపముననుండు కావున నేఁడతనికిఁ జంద్ర సంబంధము కలుగదు. అట్లుండ బుధచంద్ర సంబంధము చెప్పుట తప్పని పూర్వపక్షము. చంద్రునియెదుట యనఁగాఁ జంద్రునితో నేకరాశియందుండుట యని మాత్రముగాదు. అతని వీక్షణము చాలునుఁ కావునఁ జంద్రవీక్షణమును బట్టి చంద్ర సంబంధము చెప్పఁబడెను. ఆ కారణముచేతనే గురు బుధులతోఁ గలిపి చెప్పక ప్రత్యేకముగాఁ జెప్పఁబడెను అని సిద్ధాంతము. వక్రగతిగాఁ జంద్ర సంబంధమని కొందఱు చెప్పుదురు. కాంతిహీనములై యశ్విన్యాది నక్షత్రములు-సూర్యాది గ్రహములుండఁగా విశాఖానక్షత్రము ధూమకేతువుతోఁ గూడినదయ్యెను. సూర్యుఁడు విశాఖానక్షత్రమున జన్మించెను. శ్రీరాముని వంశము సూర్యవంశము. ఇక్ష్వాకుల కులతార విశాఖ. దీనికి ధూమకేతువు క్రమ్ముటరాఁగల దశరథుని మరణము సూచించెను. ఒక మహాత్ముని దుఃఖమునకు లోకమంతయు దుఃఖించును.

త్రిశంకువిషయమై విశాఖవిషయమై శ్రీరాముఁ డిట్లు లక్ష్మణునితోఁ జెప్పెను.

"త్రిశంకుర్విమలోభాతి రాజర్షి స్సపురోహితః
పితామహవరోస్మాక, మిక్ష్వాకూణాంమహాత్మనామ్
విమలేచ ప్రకాశేతే విశాఖేనిరుపప్లవే
నక్షత్రవరమస్మాక, మిక్ష్వాకూణాం మహాత్మనామ్.

"మనకుఁ బితామహుండు నిర్మలన్నృపర్షి" యు-౪. న.

సహపురోహితుఁడగుఁ త్రిశంకుఁడదిగొ మింట వెలుఁగుచున్నాఁడు మేలిరుచుల॥ యుద్ధ ౭౦.

కం॥ మనయిక్ష్వాకులతారకఁ గనుము విశాఖను, వెలింగెఁగడు విశదంబై తనరి నిరుపద్రవంబుగ. యుద్ధ. ౭౯.

తే॥ కాళికానిలరయమునఁ • గడలి కళవ,ళించుచుఁ బుర మెల్ల•సంచలించె
నిరులు గప్పెను దిక్కుల•నెల్లఁజుక్క,యైన గ్రహమైన నెల్గద•యంబరమున.

కాళికా=మేఘపంక్తితోఁగూడిన, అనిల=వాయువుయొక్క, రయమునన్=వేగముచే, కడలి=సముద్రము, కళవళించుచుండఁగాన్=కలఁతపడునట్లు,ఇరులు=చీఁకట్లు- ఇది నిత్యబహువచనాంతము, అంబరమునన్=ఆకాశమందు.

తాత్పర్యము

మేఘపంక్తులతోఁగూడిన గాలియొక్క వేగముచే సముద్రము క్షోభించు విధముగాఁ బట్టనమెల్లను సంచలించెను. దిక్కులయందుఁ జీఁకట్లు క్రమ్మెను- ఆకాశమున నక్షత్రమైనను గ్రహమైనను బ్రకాశింపలేదు.

కం॥ దారుణదైన్యము పేర్మి వి,హారాహారములయందు•నానగరమునన్
బూరుషులు సతులు నొకరేన్, గూరుపరు మనంబునందుఁ•గోరిక యైనన్.

౧౧౩

దారుణదైన్యము పేర్మిన్=భయంకరమైన దుఃఖముయొక్క యతిశయముచే, విహారాహారములయందున్=సంచారమందును భోజనమందును-

తాత్పర్యము

తీవ్రమైన దుఃఖాతిశయముచేత నా పట్టనమందు నాఁడు వారియందుఁగాని, మగవారియందుఁగాని యొక్కరైన నాసమయమందు వేడుకగాఁ దిరుగుటయందుఁగాని భోజనమందుఁగాని కోరికగలవారు లేకుండిరి.

తే॥ వేఁడినిట్టూర్పులూర్చుచుఁ•బోఁడిమిచెడి,
వ్యసనసంతప్తమైయయో•ధ్యాజనంబు
కాటువేసిన నెత్తురన్•మాట లేని,వదనములఁ బల్లటిల్లెను•ముదముఁ బాసి.

నిట్టూర్పులు=నిడివిశ్వాసములు, నిడు+ఉర్పు=నిట్టూర్పు- కుఱు- చిఱు- కడు- నడు- నిడు శబ్దంబుల అడల కచ్చుపరమైనపుడు ద్విరుక్తటకారంబగు-

సు. వ్యా. సంధి ౩౯ సూ. ఊర్పుచున్ = విడుచుచు, వదనములన్=ముఖము
లతో, పల్లటిల్లెన్=తెల్లఁబోయెను.

తాత్పర్యము

వేఁడియు నిడివియునగు శ్వాసములు పుచ్చుచు నందముచెడి వ్యసనముచే మిగుల సంతాపపడి యయోధ్యయందలి జనులు గత్తితోఁ గోఁచినను నెత్తురను మాట లేని ముఖములతో సంతోషముచెడి తెల్లఁబోయిరి.

కం॥ వీవఁడు వాయువు చల్లగఁ, బావకుఁడుం జల్లపడియె♦ భానుఁడు తాపా
భావత నొప్పెను శశియు, న్బావిరి నిజసౌమ్యదర్శ♦నత్వము మానెన్.

తాపాభావతన్ = తాపములేమిచే, సౌమ్యదర్శనత్వము=ప్రసన్నుఁడై కాన వచ్చుటను, మానెన్=వదలెను.

తాత్పర్యము

వాయువు చల్లగ వీవలేదు- అగ్నియుఁ జల్లనయ్యెను- సూర్యుఁడు వేఁడిమి లేనివాఁడాయెను- చంద్రుఁడు ప్రసన్నుఁడై యుండుట మానెను.

ఇదంతయుఁ బురజనుల దుఃఖాతిశయమును దెలుపును.

ఉ॥ పాలకు నేడ్వఁ డెవ్వఁడును♦బాలుఁడు తల్లిని జూచి, తల్లులన్
బాలురుఁ దమ్ము లన్నలును♦భార్యలు భర్తలుఁ జుట్టపక్కముల్
చాలఁగ రామునందు తమ♦స్వాంతము నిల్పి యొకళ్ళొకళ్ళలన్
దూలుచుఁ బాసి పోయి రెటొ♦దుస్సహశోకభరంబు ప్రేఁకనన్. ౧౧౩

చుట్టపక్కములు=చుట్టము + పక్కము=చుట్టపక్కములు- ద్వంద్వ సమాసంబునఁ బదంబుకంటెఁ బరంబయిన పరుషములకు గసడదవలు ప్రాయికంబుగనగు- సు. వ్యా. సంధి ౪౦ సూ. ప్రాయికమనుటచే నిందు 'పకారమునకు వకారము రాలేదు. స్వాంతము=మనస్సు, ప్రేఁకనన్=భారముచే.

తాత్పర్యము

అంత పట్టనమందొక పసిబాలుఁడైనను దల్లిని జూచి పాలకై యేడ్వఁడు- తల్లులను బిడ్డలు- బిడ్డలను దల్లులు తమ్ములన్నలను అన్నలు తమ్ములను భార్యలు భర్తలను, భర్తలు భార్యలను నొకరినొకరు విడిచి సహింపరాని శోక భారముచేఁ దమ దేహములు మఱచి తా మెక్కడికిఁ బోవునది తమకే తెలియక మనస్సులు శ్రీరామునందుంచి యెందెందోపోయిరి.

తన యొంటికొడుకు శ్రీరామునివంటివాఁడు అడవికిఁబోవుచుండఁ దల్లి యుపేక్షించెఁగాని యేమి సాహాయ్యము చేయఁగలిగెను. తల్లులందఱు నిట్టివారే కదా యని కొడుకులు తల్లుల నుపేక్షించిరి. దీర్ఘకాలము నోమరాని నోములన్ని నోఁచి తపస్సులు ధారవోసి కానక కానక యొక్కకుమారునిఁగాంచి వీఁడు మన

కిహపరములకు ధారకుఁడుగానుండునని యెంతో యాశయుంచుకొనిన తల్లిని శ్రీరాముఁడు విడిచిపోయెను. ఇఁక నే కొడుకు తల్లిని రక్షించును. కొడుకుల నమ్మిన నీగతియేకదా యని తల్లులు బిడ్డల నుపేక్షించిరి. భార్యలనఁగా నెప్పుడును తమ సుఖము చూచుకొని దానికై కైకవలె భర్త నెట్టికష్టములపాలైనఁ జేయువారేకదా వీరి నమ్మిన నేమి ప్రయోజనమని భర్తలు భార్యల నుపేక్షించిరి. పెద్దభార్య కౌసల్య నుపేక్షించి యామె కుమారుని నడవికిఁబంపిన దశరథునిఁజూచి భర్తలనఁగా సమయము వచ్చినపు డెంత గుణవతియైనను వదలువారేకదా యని భార్యలు భర్తల నుపేక్షించిరి. పుట్టఁగా భ్రాతలు- పెరుఁగఁగా జ్ఞాతులన్నట్లు భరతుఁడు కదా శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుటకు హేతువయ్యెను. కానఁ దోడఁబుట్టువులందఱుఁ దమ యన్నలకుఁ దమ మేలునకై ద్రోహముచేయువారే యని యన్నలు తమ్ముల నుపేక్షించిరి. ముఖ్యులగువారే యిట్లయిన నిఁకఁ జుట్టములు పక్కములా మనలను రక్షించువారు. వీరు మనము పెట్టినఁ దినిపోవువారేయని బంధువు లొకరినొక రుపేక్షించిరి. వీరందఱు నమ్మరానివారే శ్రీరాముఁడొక్కఁడే తల్లియైనను-దండ్రియైనను-అన్నయైనను-దమ్ముఁడైనను-భర్తయైనను-బంధువైనను అని మనస్స్వంతయు నాయనపై నుంచిరి. దీనివలన సోపాధికబంధువులందఱు నక్కఱ లవసరముల నాదుకొనువారు కారు. కావునఁ ద్యాజ్యులనియు నిరుపాధిక బాంధవుఁడు శ్రీరాముఁడే యెందున్నను విశ్వసింపఁదగినవాఁడనియు నేర్పడుచున్నది.

౨-వ పాదంబున నుభయయతి.

ఉ॥ రాముని మిత్రు లందఱు భరం బగుశోకముపేర్మి దిగ్భ్రమన్
ధామములంద ఱోలుచును దద్దయు మానరు సెజ్జ లప్డు, సు
త్రామునకు న్వణంకుసధరాధరధారిణినా నయోధ్య శ్రీ
రాముఁడు లేమిచే వణఁకెఁ గ్రాలినభీతియు నార్తిముంపఁగన్. ౧౧౩౯

ఱోలుచున్=ఏడ్చుచు, సుత్రామునకున్=ఇంద్రునకు, సధరాధరధారిణి= పర్వతములతోడి భూమిని.

తాత్పర్యము

బాంధవులందఱు నమ్మరానివారేయగుదురు గాక ప్రాణపదములుగానుండు మిత్రులేల శ్రీరాముని నిలుపరైరి యనుటకు సమాధానమును గవి చెప్పుచున్నాఁడు. శ్రీరాముని మిత్రులందఱు భారమైన శోకాతిశయముచే దిక్కు తెలియక యిండ్లయందే యేడ్చుచుఁ బండుకొనియుండిరి. బంధువులందఱు దేహములమీఁద స్మృతియైనఁ గలవారై సంచరించుచుండిరి గాని వీరికి దేహస్మృతియు లేదాయెను. నిలుచుటకుఁ గూర్చుండుటకుఁగూడ శక్తిచాలక పడిపోయిరి. దీనివలన వారి దుఃఖాతిశయము తెలియనగు.

శ్రీరాముఁడు తన తల్లిదండ్రులకును దెలుపని రహస్యములనెవరికిఁ జెప్పునో యట్టి స్నేహితులు వీరు తమ ప్రాణమైనను వదలి శ్రీరాము రక్షించువారు. అందఱుననఁ=అందఱు నిట్టివారే కాని దీనికి వ్యతిరేకముగా నడచువాఁ డొక్కఁడైన లేఁడు. అందఱు నొక్కవిధమువారు. చక్రవర్తి సర్వస్వతంత్రుఁడగు తండ్రి యడవికిఁ బో నాయనా యని పంపెను. తల్లియగు కౌసల్య యడవికిఁ బోయి నపుడచట నేమి కీడు మూఁడునో యని దీవించి పంపెను. ఈమిత్రులు వారివంటివారు కారు. శ్రీరాముఁ డడవికిఁబోవునన్న వార్త వినఁగానే మూర్ఛిల్లి పడిపోయిరి. మరల లేచినవారు కారు. కావున వీరు కౌసల్యా దశరథులకంటె శ్రీరామునియెడల మిగులఁ బ్రీతిగలవారని భావము.

అంతటి ప్రేమఁగలవారైనచో శ్రీరాముని కాళ్లు పట్టుకొనియైన రామా యడవికిఁ బోకుమా యని నేల మరల్పరైరి యనిన దుఃఖాతిశయముయొక్క భారముచే దిక్కు తెలియక పిడు గడిచినవారివలె నేమియుఁ దోఁపకయుండుటచే నింటియందే యేడ్చుచుండిరి. అపుడు=అట్టి పరవశస్థితిలో పడుక పెట్టినవారు కావున మరల లేవవలె శ్రీరాముని కడ్డముపోవలెనని వారికిఁ దోఁచినదికాదు. బుద్ధి చక్కని స్థితిలోనుండినఁ గదా శ్రీరామునకై పోవుట వేఁడుట పిలుచుకొని వచ్చుట వీరో దిగ్భ్రమచే నేమిచేయుటకు నాలోచింపలేని స్థితిలోనున్నవారు. ఇట్టి స్థితిలో వారేమి చేయఁగలరు.కొండంత బరువు వ్యసనముమీఁదఁ బడుటయే దీనికిఁ గారణము. కొండ తటాలున మీఁదఁబడిన లేచుటయుండునా. బుద్ధి పూర్వకముగాఁ బండుకొన్నవారు లేతురుగాని మతిచెడి పడినవారెట్లు లేతురు? కావున వీరు శ్రీరామునిఁ బ్రార్థింపనులేదు. ఆయన వెంటఁబోవను లేదు. కొండల ఱెక్కలు ఖండింప వజ్రమెత్తిన యింద్రునకుఁ గొండలతోడి భూమి వణఁకినట్లు శ్రీరాముఁడు లేమిచే నయోధ్యయు భీతిచేతను వ్యసనముచేతను వణఁకెను.

— ౪౨వ సర్గము. దశరథుఁడు మరలి తనగృహమునకుఁ బోవుట —

ఉ॥ రామరథోత్థితం బగుపరాగము దోఁచెడునంతదాఁక నా
భూమివిభుండు పుత్రకునిఁబోయినవంకను జెప్ప ప్రాల్పఁ, డా
భూమిపరాగమున్ సుతునిఁబోవుట భూపతి చూచునంతకున్
స్తోమముగాఁగ రేఁగెఁ బతిఁ బ్రుక్కక యుండెడి గాక యంచునో. ౧౧౪౦

రామరథోత్థింబగు=శ్రీరాముని రథముపోవుటవలన లేచిన, పరాగము= దుమ్ము, స్తోమము=సమూహము.

తాత్పర్యము

శ్రీరాముని రథము పోవు వేగమున లేచిన దుమ్ము కానవచ్చువఱకు దశరథుఁడు కొడుకు పోయిన ప్రక్క చూచుచు ఱెప్పవ్రాల్పకయుండెను. కొడుకు పోవుట రాజు చూచుచుండువఱకు దుమ్ము విశేషముగా లేఁగుచుండెను.

శ్రీరాముఁడు కానరాకపోయిన పక్షమున దశరథుఁడు దుఃఖపుమాని యింటికిఁ బోవునను తలంపుచేతనో యేమో దుమ్ములు రేఁగెను.

ఉ॥ ధూళియు మాయ మైన ధృతి•దూలి ధరం బడి యున్న యల్లభూ
పాలకు రాముతల్లి కుడి•ప్రక్కను గైకయి వామభాగమం
దోలిన పట్టి యెత్తుటయు•నొయ్యనఁ దెప్పిఱి లేచి భూధవుం
డాలరి కైకఁ గాంచి యిటు•లాడె మనం బెరియన్ వ్యథాగ్నులన్. ౧౧౪౧

మాయమైనన్=కానరాకపోఁగా, ధృతిదూలి=ధైర్యముచెడి, ఆలరి=దుష్టురాలు, వ్యథాగ్నులన్=వ్యసనమనెడు నిప్పులచే, ఎరియన్ = కాలఁగా.

తాత్పర్యము

రథము చూపుమేరదాఁటి చాలదూరము పోవుటచే దుమ్ముకూడఁ గానరాకపోఁగా ధైర్యముచెడి దిటముదప్పి రాజు నేలఁబడఁగాఁ గౌసల్య కుడిప్రక్కను, గైకేయి యెడమప్రక్కను బాగుగఁబట్టి లేవనెత్తఁగా మెల్లనఁదెప్పిఱిల్లి లేచి దుర్మార్గురాలగు కైకనుజూచి శోకాగ్నిచే మనసు కాలిపోవుచుండ రాజిట్లనెను.

ఉ॥ అంటకు మింక నన్ను దురి•తాత్మిక! పొమ్ముటు, నీదుమోమునున్
గంట కసహ్య మయ్యెడిని•గా వికఁ బాంధవి, భార్య గావు, నీ
యుంట సహింప నోవ, విను•ముర్విని నీయుసు లుండుదాఁక ని
న్నంటినవారు నా కహితు•లట్టులె నేనును వారి కిం కిటన్. ౧౧౪౨

దురితాత్మిక=పాపపు మనస్సుగలదానా, పొమ్ముటు=అటు దూరముపొమ్ము.

తాత్పర్యము

ఓసి పాపాత్మురాలా! నన్నుఁ దాఁకకుము- దూరముగాఁబొమ్ము. నీముఖము చూచుటయే యసహ్యముగానున్నది. ఇఁక నీవు తాఁకిన నెట్లు సహింపఁగలను. నేను సైరింపను. నీవు చచ్చుటయే నాకు సంతోషకరము. ఈ భూమిమీఁద నీ ప్రాణ మెంతవఱకుండునో యంతవఱకు నీవేకాక నీకుఁ గావలసినవారందఱు కూడ నాకు శత్రువులే. నావారందఱు నీకు నట్టివారే.

ఆ॥ కేవలార్థపరవు•క్లిష్టధర్మవు నీవు, గాన నగ్నిసాక్షి•కముగఁ గొనిన
తావకీనకరముఁ•దద్దయు విడిచితి, నిందు నూర్ధ్వలోక•మందుఁ గూడ.

కేవలార్థపరవు = ధనమునందు మాత్రమే నీ వాసక్తిగలదానవు, క్లిష్టధర్మవు=నాశముచేయఁబడిన ధర్మముగలదానవు, తావకీనకరము=నీచేయి.

తాత్పర్యము

నీవు ధర్మము నాశముచేసియైన యర్థమే సాధింపవలయునను తలంపుగలదానవు-నీకు ధర్మముతోఁ బనిలేదు, గావున నగ్నిహోత్రుఁడు సాక్షిగా వివాహకాలమున నేను గ్రహించిన నీచేతిని నీలోకమందుఁ బరలోకమందుఁగూడఁ బూర్ణ

ముగ విడిచితిని. ఈలోకమందు నీక నా భార్య వెట్లు గావో పరలోకమందు నాతోడి సాలోక్యము నీకు లేకపోవునుగాక. (౧౧౪౦ పద్యము చూడుఁడు.)

కం॥ భరతుం డీరాజ్యముఁ గొని మురియుట కలిగినను వాఁడు•మెఁగిని నివాపా
చరణం బొనరుపఁ దండ్రికిఁ,బరగతి నవి నాకుఁ గాక•పరఁగుత మనుచున్.

ఇల్లు కైకతోడి భార్యా భర్తృ సంబంధమును రెండులోకములందును దెగఁదీసి కైకయికిఁ బుట్టిన కారణముచే భరతుని పుత్రత్వ సంబంధము దెగఁ దీయుచున్నాఁడు. ఉంకుటాలితోడి భార్యా సంబంధము ఘటశ్రాద్ధముతో ముగియును. ఉంకుటాలి కొడుకు తన కొడుకుగాఁడు. అట్టులే కైక సంబంధము దాని కొడుకు సంబంధమును వదలించుకొనుచున్నాఁడు.

నివాపాచరణంబు=తిలోదకతర్పణము.

## తాత్పర్యము

భరతుఁ డీ రాజ్యము గ్రహించి సంతోషింపఁ గలిగినా వాఁడు నాకుఁ బుట్టినవాఁడు కాఁడు. తండ్రితో ద్వేషించువాఁడు అన్యరేతస్సునకుఁ బుట్టిన వాఁడు. కావున వాఁడు నాకుఁ బుత్రుఁడు కాఁడు. కావున వాఁడు అస్మత్పితరమ్మని విడుచు నివాపములు తిలోదకములు పరలోకమున నాకుఁ జెందకయుండునుగాక. నాకు వాఁడు పుట్టియుండెనా యీ రాజ్యమును వాఁడంగీకరింపఁడు.

ఉ॥ ధూళిని బ్రుంగియున్నపతిఁ•దోయజలోచన రాముమాత దాఁ
గాలుప గట్టునశ్రువులఁ•గన్నులు మూఁత పడంగఁ బాచుకొం
చోలిని దోడుకొం చరిగె•నుర్వరభర్త సుతుం దలంచి తాఁ
గేలను నిప్పు నంటినటు•కీర్తితు బ్రాహ్మణుఁ జంపినట్టులై. ౧౧౪౨

అని యిట్లు చెప్పుటచేఁ గైకేయి దూరముగఁ దొలఁగిపోయెను.

బ్రుంగి = మునిఁగి, ఉర్వరభర్త = భూమిభర్త- ఇది సాధ్యసమానము గావున దీర్ఘము రాలేదు- ఇందు రెండును దత్సమశబ్దములే- కౌసల్య యొక్కతెయె రాజును బట్టుకొనె ననుటచే రాణులున్న కారణమునఁ బురుషు లెవ్వరు సమీపింపరైరని తోఁచెడిని- పరిచారికలుండినను వారు దాఁకుటకై ధైర్యము చాలదు.

## తాత్పర్యము

దుమ్ములోఁబడి మునిఁగియున్న భర్తను శ్రీరాముని తల్లి కౌసల్య కన్నీళ్ళు కాలువలై పాఱుచుండుటచేఁ గన్నులు మూఁతలు పడుచుండినను నెటెట్లో పట్టుకొని మెల్లగాఁ బిలుచుకొనిపోయెను. రాజు తన కొడుకును దలఁచి తానై నిప్పును జేతితోఁ దాఁకి యది కాల్పఁగా బాధపడునట్లు కీర్తిమంతుఁడైన బ్రాహ్మణుఁ జంపి బ్రహ్మహత్యచేఁ దేజురూపుమాసి వికారస్వరూపుఁడైనట్లు.

ఆ॥ సొక్కి మరలి మరలి • చూచుఁ దీ రంగిన, జాడ గ్రస్తుఁ డైన • సవితృనట్లు
మాఱుపడఁగ రూపు • మఱి మఱిపలవించుఁ, బుత్రుఁ గవసు దాఁటి • పోక యెఱిఁగి.

సొక్కన్=మూర్ఛబోవును, గ్రస్తుఁడైన=రాహువుచే మ్రింగఁబడిన, సవితృ నట్లు = సూర్యునివలె- షష్ఠీసమాసంబులం దుకారఋకారముల కచ్చుపరమగు నపుడు నుగాగమంబగు. సు. వ్యా. సంధి ౪౬.

తాత్పర్యము

మూర్ఛబోవును- లేచును- తేరుపోయిన దిక్కు మరలి మరలి చూచును. రాహువు మ్రింగిన సూర్యునివలె రూపు మాఱుపడఁగ కొడుకు గవను దాఁటి పోయెనని విని మీఁద మీఁద నేడ్చును.

కం॥ కొడుకును గొని పఱచెడిత, త్తడిమిన్నలయడుగు లివిగొ • ధరఁ గనఁబడెడిన్
కొడు కేకనరాఁడే యెటు, మిడుకుదునో సుకృతిఁ బాసి • మేదినిమీఁదన్.

తత్తడి=గుఱ్ఱము, మిన్న=శ్రేష్ఠము- మఱిశబ్దభవము మిన్న ఉత్తమము లైన గుఱ్ఱములయొక్క, సుకృతిన్=పుణ్యాత్ముని, మిడుకుదునో=దుఃఖితునో.

తాత్పర్యము

కొడుకును మోసికొనిపోవు నుత్తమాశ్వముల యడుగుల గుఱుతు లవిగోఁ గానవచ్చుచున్నవి కాని కొడుకే కానరాకయున్నాఁడు. అటువంటి పుణ్యాత్ముని విడిచి భూమిపై నెటులు దుఃఖించుచు బ్రదుకుదును.

ఉ॥ హాయి నలంది గంధము మ • హార్హలు చేడెలు వీచు చుండ భ
వ్యాయతతల్పమందు సుఖి • యై నిదురించెడి నాతనూభవుం
డేయెడ వృక్షమూలమున • నేగతిఁ దా దెసమాలి కట్టియో
చేయిరయొ జాయొ దిండుగను • జేసి ధరం బడి యుండు వాఁడొకో. ౧౫౩

అలంది=పూసికొని, మహార్హలు=యోగ్యురాండ్రు, భవ్యాయతతల్పమందున్=సుఖకరమై నిడివియైన పానుపునందు, దెసమాలి=దిక్కులేక.

తాత్పర్యము

చందనమును సుఖముగాఁ బూసికొని యుత్తమస్త్రీలు వింజామరలు వీచు చుండ సుఖకరమై నిడివియైన పానుపునందు సుఖముగా నిద్రబోవు నాకొడు కేస్థలమందు నే చెట్టుమొదల నేవిధముగా దిక్కులేనివాఁడై, కట్టెతుండో చేయియో జాయియో దిండుగానుంచుకొని నేలఁబడియుండువాఁడో.

తే॥ వందిమాగధనుతులను • వాద్యములను
మేలుకొనువాఁడు కృపణుఁ డై • ధూళి దులుపు
కొనుచుఁ బ్రస్రవణాంతిక • కూటములను
లేచును వశాళి యూథపు • లీల సుతుఁడు. ౧౫౪

నుతులను=పొగడ్తలచే, వాద్యములను=మంగళ వాద్యధ్వనులను, కృప ణుఁడై=దీనుఁడై, ప్రస్రవణాంతికకూటములను = కొండవంకల సమీపప్రదేశము లందు, వనాళిన్=వనముల వరుసలయందు, యూథపులీలన్=గజనాయకునివలె.

తాత్పర్యము

స్తోత్రపాఠకులయు వంశపరంపరలఁ బొగడువారలయు స్తోత్రములచేతను, మంగళధ్వనులచేతను నిద్రమేలుకొనువాఁడు దీనుఁడై దుమ్ము దులుపుకొనుచు సెలయేళ్ళ సమీపప్రదేశములందు వనములందు గజసమూహనాయకునివలె నాకొడుకు లేచునుగదా.

ఆ॥ త్రిజగములకు విభుఁడు♦దీర్ఘబాహుఁడు పట్టి, దిక్కు లేనివాని♦తెరువు దోఁప
నడవిఁ బడుచుఁ బోవ♦నటవీచరుల్ జనుల్, గన్నులారఁ గాంచ♦నున్నవారు.

త్రిజగములకు=మూఁడు లోకములకు, విభుఁడు=ప్రభువు, దీర్ఘబాహుఁడు= నిడివియైన చేతులు గలవాఁడు, పట్టి=నా బిడ్డఁడు, తెరువు = మార్గము, అటవీ చరుల్ = అడవియందుఁ దిరుగువారు.

తాత్పర్యము

మూఁడు లోకములకుఁ బ్రభువై యాజానుబాహుఁడై చక్రవర్తియగు నా కొడుకు దిక్కులేనివానివలె నడవులంబడి పోవుచుండ నడవిలోఁదిరుగుఁ చెంచులు బోయలు- మొదలగువారు కన్నులపండువుగఁ జూడఁగలరు.

చం॥ వల దన మాన దయ్యె జన♦ వందిత యౌ జనకేంద్రుకూఁతు, రా
కలికి సదా సుఖోచిత స♦ కంటకభూములఁ బోవు చుండు, న
చ్చెలువ యరణ్యమే మెఱుఁగుఁ♦ జేడ్పడి భీతిని శ్వాపదాళికూఁ
తలకుఁ దలంకుఁ బెగ్గలిఁకఁ♦ దత్తఱమందు గభీరహుంకృతిన్. ౧౧

కలికి=సుందరి, సదా = ఎల్లప్పుడు, సుఖోచిత=సుఖింప యోగ్యురాలు, సకంటకభూములన్=ముండ్లతోఁగూడిన నేలలందు, చెలువు+అ=చెలువ=సౌంద ర్యము గలది, చేడ్పడి = దిగాల్పడి, శ్వాపదాళి = హింసించు స్వభావముగల, పులులు సింహములతో తోడేళ్ళు మొదలయినవాని సమూహములయొక్క, తలం కున్=బెదరును, గభీరహుంకృతిన్=గంభీరమైన హుమ్మను ధ్వనిచే.

తాత్పర్యము

పోవలదమ్మా పోవలదనిన వినదయ్యెను. జనులచేఁ బొగడ్తకన్న జనక రాజు కూఁతురు అట్టి సుందరి యెప్పుడు సుఖింప యోగ్యురాలు- ముండ్లనేలలోఁ బోవుచుండును గదా. ఆ రూపవతి యడవియనిన నెట్లుండునో యేమి యెఱుఁ గును. మాంసము దిను క్రూరమృగముల కూఁతలకు భయముచే దిగాల్పడి బెదరునుగదా.

కం॥ ఓవిధవా! రాజ్యంబును, నీవే తలఁ గొట్టుకొమ్ము • నీయిష్టము పై
నావనజనేత్రుఁ బాయుట, జీవింపఁగ నొల్ల గడియు•నేఁపును గైకా. ౧౧౨౦

గైకను సంబోధించుటచేఁ గైక యింకను దశరథు సమీపమందియున్న దని యూహింపవలయును. లేదా స్మరణమనియైనఁ దలంపవచ్చును.

తాత్పర్యము

ఓసి విధవా! నీ యిష్టప్రకారము రాజ్యము నీవే తలకుఁగట్టుకొని యూరేగుము. కమలమువంటి ముఖము కన్నులుగల నా రామచంద్రుఁడు నెడఁబాయుటచే నిఁక నొకగడియయైనను నేను బ్రదికియుండ నిష్టపడను. కావున నన్నుఁ జచ్చిన వానిఁగా నిశ్చయించుకొమ్ము.

కం॥ అని పలవించుచు జనపతి, జనసంఘము వెంట రాఁగఁ•జనియె నరిష్టం
బు నగుపురంబునకును దా,వనట మృతస్నాతుఁబోలి•వశ మఱి మఱియున్.

పలవించుచున్=ఏడ్చుచు, అరిష్టంబు=అశుభము, వనటన్=శోకముతో, మృతస్నాతున్=చచ్చినవారికై స్నానముచేసి వచ్చువారివలె, వశమఱి=వశము చెడి.

శ్రీరాముని వెంబడిపోయి యాయనను సాగనంపి తిరిగి తనపురముఁ బ్రవేశించువానిని మృతస్నాతుఁడని చెప్పుట యశ్లీలము- అమంగళము కదా యని యాక్షేపము. రాజదృష్టి ననుసరించి యిది దోషముగాదు. ౧౧౨౧-వ పద్యమందుఁ జేప్పడి ఛీత్కనిశ్వాసదాళి కూఁతలకుఁ దలంకు పెన్గలఁకఁ దత్తఱ మందునని యరణ్యమున సీత కేదో కీడుకలుగుట సత్యమని దశరథుఁడు నిశ్చయించుకొనెను. ఆ కారణమున శ్రీరామునకు విపత్తు రాఁగలదు. అందువలన దనకుఁ గీడు కలుగుట సత్యమని యాయన యభిప్రాయము. కావుననే గైకను విధవాయని సంబోధించి రాజ్యంబును నీ యిష్టమైనట్లు నీవే తలఁగట్టు కొమ్మని చెప్పెను. ఈ యనిష్టపరంపరలు హృదయమునఁ గలవాఁడు, కావున నాయనను మృతస్నాతుఁడనుట దోషముగాదు.

ఇచ్చట మృతస్నాతుఁడనుటకు స్నాతుఁడైన మృతుఁడు- స్నానము చేయింపఁబడిన శవమని యర్థముచెప్పుట బాగని తోఁచెడి-మృతునకై కర్మ మారంభించునపుడు శవమును స్నానముచేయింతురు గదా, వశమఱి = పరవశుఁడై - వశముచెడి యనువద మనుగుణముగానున్నది- చెమటచేతను కన్నీటి ధారలచేతను దడిసినవాఁడగుట స్నాతుఁడే.

తాత్పర్యము

ఈప్రకార మేడ్చుచు దశరథుఁడు జనులగుంపు అనఁగా మంత్రులు లోనగు వారును శ్రీరాముని వెంటఁబోజాలని బడుగులు తన వెంటరాఁగా నమంగళకర

మైన పురమునకు మృతస్నాతువలెఁ బరవశుఁడై పరులు తన్నుఁ దీసికొనిరాఁగా వచ్చెను.

చం॥ జనములు లేనిగేహములు • చావడులున్ బలహీనలోకరో
దనములు మూఁతలుం బడిన • దైవతకూటము లాపణంబులున్
గనుఁగొన నెందునే నొకఁడు • గాఁగ మహాపథమంద తోఁపఁగా
మనుజవరుండు చూచుచు స్వ•మందిరముం జొరఁబాఱె నేడ్చుచున్.

గేహములు=ఇండ్లు, బలహీన=బలముపోయిన, లోక=జనులు, రోదనములు=ఏడ్పులు, దైవతకూటములు=దేవాలయములు, ఆపణములు=అంగళ్ళు, మహాపథమంద=పెద్ద రాచబాటయందు మాత్రమే, తోఁపఁగాన్=కానరాఁగా- బలహీనలోకమనుటచే నేమాత్రమైనను నడువ శక్తిగలవారును శ్రీరాముని వెంటఁ బోయిరని భావము.

తాత్పర్యము

మనుష్యులులేని యిండ్లు- చావడులు- బలము లేని కారణమున శ్రీరాముని వెంటఁబోలేక నిలిచిన బడుగులయేడ్పులు, మూఁతలుపడిన దేవాలయములు, నంగళ్ళు గలదై పెద్ద రాచబాటయందు మాత్ర మెచ్చటనో యొకఁడు కానరాఁగా రాజు పాడుపడినదానివలెనుండు పట్టనమును జూచుచుఁ దన యింట నేడ్చుచుఁ బ్రవేశించెను.

ఈ పురవర్ణనము స్మశానమును దలపించుచున్నది- కావున మృతస్నాతుఁడనుటకు మీఁదఁ జెప్పిన రెండవ యర్థమే పొసఁగియున్నది.

తే॥ గరుడహృతపన్నగం బయి•క్రాలునక్షు,
భితమగుహ్రదంబుచొచ్చిన•గతిని, సవిత
మబ్బుమాటున కరిగిన•మాడ్కి సుతులు, సీత యును లేనియింటిఁ•జేరి యచట

గరుడహృతపన్నగము = గరుడునిచే నపహరింపఁబడిన పాము గలది, అక్షుభితము=కలఁతనొందనిది, హ్రదము=మడుఁగు, సవిత=సూర్యుఁడు.

తాత్పర్యము

తనయందున్న పామును గరుడుఁడు హరించుకొని పోఁగాఁ గలఁతలేక స్తిమితముగానుండు మడుఁగునందుఁ బ్రవేశించునట్లు సూర్యుఁడు మేఘముల చాటునకుఁ బోయినట్లు కొడుకులు కోడలులేని యింటిని సమీపించి యచట.

పాముగల మడుఁగునందు జనులు ప్రవేశింప భయపడుదురు. అట్లులే శ్రీరాముఁ డున్నప్పుడు శత్రువు లయోధ్యయందుఁ బ్రవేశింప భయపడు చుండిరి- ఇప్పుడా భయము లేకుండుటచే వాకిలి దెఱచిన యింటఁ గుక్కలు ప్రవేశించినట్లు శత్రువులు ప్రవేశింప ననుకూలపడెను.

తే॥ గద్గదస్వరయుక్తుఁ డై • క్ష్మావరుండు,
మృదులమందార్థవాక్కుల • నీ రెలుంగు
తోడ బిల్లనుఁ గనుఁగొని • తోడివారి,
నాకు నిచ్చట నిలువ మ • నంబులేదు. ౧౧౨౬

గద్గదస్వరయుక్తుఁడై = డగ్గుత్తికతోఁగూడిన స్వరముగలవాఁడై, క్ష్మావరుఁడు = రాజు, మృదులమందార్థ వాక్కులన్ = మెల్లనివియు, మందార్థ = అర్థముకొంచెముగాఁ గలిగినవియునగు వాక్కులచే, ఈ రెలుఁగుతోడ = సన్నని గొంతుతో.

తాత్పర్యము

డగ్గుత్తికచే మాఱుపడిన స్వరముతో మెల్లగా నర్థము కొంచెముగాఁగల మాటలను సన్నని గొంతుతోఁ దోడనున్నవారినిఁ జూచి యిచ్చటనుండ నాకు నిష్టములేదు.

— • దశరథుఁడు కౌసల్యాగృహమునకుఁ బోవుట. • —

కం॥ తీసికొని పొండు నన్నుఁ, గౌసల్యాగేహమునకు • గలుగదు హృదయా
శ్వాసం బొండెడఁ గడుపి, శ్వాసంబునఁ జూచు రాము • జననియ నన్నున్.
హృదయాశ్వాసము = మనస్సునకూఱట, విశ్వాసము = శ్రద్ధ. ౧౧౨౭

తాత్పర్యము

కైకేయికొంపలోఁగాని నా యింటిలోఁగాని యిఁక నుండుటకు నా కిష్టము లేదు. కౌసల్యామందిరమునకు నన్నుఁదీసికొనిపొండు, ఆ రామజననియే నన్ను శ్రద్ధతో విచారించును.

ఇదియే భోగినికిఁ బత్నికిఁగల భేదము.

కం॥ అన మార్గదర్శకులు స, ద్వినయంబున రాముజనని • వీటికిఁ గొనిపో
యిన నచటఁ బడియుఁ దల్పం,
బున లుళితమనస్కుఁడగుచుఁ • బొక్కుచు నేఁడున్. ౧౧౨౮

మార్గదర్శకులు = త్రోవచూపువారు, సద్వినయంబునన్ = మంచి వినయంబున, దీనివలన శ్రీరాముని విషయమున నింత క్రూరుఁడైన వీఁడేమి రాజని యతని నుపేక్షించినవారిపుడాయన కైకచే మోసగింపఁబడెననియు, నది బుద్ధిపూర్వకముగ మనస్స్ఫూర్తి చేసిన కార్యము గాదనియు, నెఱింగి యథాప్రకారము వర్తించిరని భావము, తల్పమునన్ = పానుపునందు, లుళితమనస్కుఁడు = కలఁతనొందిన మనస్సుగలవాఁడు.

తాత్పర్యము

తనకు ముందుపోవుచుఁ ద్రోవచూపు భటులు నిజమైన వినయముతో దశరథుని గౌసల్యయింటికిఁ దీసికొనిపోవ నచట నాయన పానుపుమీఁదఁ బడియు మనస్సు నెమ్మదిలేక యేడ్చుచునేయుండెను.

కం॥ కోడలు నిద్దఱుకొడుకులు, వీడినయవ్వీడు విగత•విధు వగునభమున్
జూడఁగని బాహు వెత్తుచు, వీడితె రామా! యటంచు•బిగ్గర నేడ్చెన్. ౧౧౯౫

విగతవిధువు=చంద్రుఁడులేనిది, నభము = ఆకాశము- ఇచటఁ జంద్ర శబ్దము గ్రహనక్షత్రముల కుపలక్షణము.

తాత్పర్యము

కోడలు నిద్దఱు కొడుకులు లేని యీ యింటిని చంద్రుఁడు నక్షత్రములు గ్రహములులేని యాకాశమువలెఁ జూచుచు దశరథుఁడు రెండుచేతులెత్తి రామా వదలిపోయితివా యని గట్టిగ నేడ్చెను.

కం॥ సేమమున మరలి వచ్చిన,రాముని౯ గని కౌఁగిలించి•రమణఁ జెలఁగఁగా
నీమహి నంతకు బ్రదికెడి, యామహితాత్ములె ధన్యు•లవురా యనుచున్.

తాత్పర్యము ౧౧౯౬

క్షేమముగా శ్రీరాముఁడు మరలి రాఁగా నాయనను గౌఁగిలించి సంతోషించుటకు నంతవఱకు జీవించియుండువారె సార్థకజన్ములు- నాకంత పుణ్యము లేదు.

ఆ॥ పొరలి పొరలి మిగుల•బొక్కు చుండఁగ నిట్లు, రాజుపాలి కాళ•రాత్రినాఁగ
రాత్రి వచ్చె, నర్ధ•రాత్రంబువేళను, నాతఁడనియెఁ గోస•లాత్మజకును.

బొక్కుచున్=దుఃఖించుచు, కాళరాత్రి=ప్రలయకాలపు రాత్రి- సర్వభూత సంహారకమగు నిది మిగుల భయంకరమైనశక్తి, అర్ధరాత్రంబు=నడిరేయి- ఏక దేశ సంఖ్యావ్యయంబులకును సర్వ సంఖ్యాత పుణ్యశబ్దంబులకును బరమైన రాత్రి శబ్దము అకారాంతమగు సు.వ్యా. సమాస-౫౪ సూ. అర్థరాత్రియనుట తప్పు.

తాత్పర్యము

పొర్లి పొర్లి మిక్కిలి యేడ్చు రాజు పాలిమృత్యుదేవత కాలరాత్రివలె రాత్రి వచ్చెను. ఆ నడిరేయిని నాయన కౌసల్యతో నిట్లనియె.

చం॥ వినఁ గదె రామచంద్రు వెను•వెంటను బోయిననాడుచూపు లా
ఘను విడనాడి యిప్పటికి• గ్రమ్మఱి రా, వటుగాన నిన్ను నేఁ
గనుఁగొన నేర నయ్యెదను•గాంతరొ? దావునఁ జేరి నీకరం
బున నను నంటు లెస్స యనఁ•బొక్కుచు నుగ్మలి చేరి నాథునిన్. ౧౧౯౮

దశరథుని పంచేంద్రియములలో నొకటొకటియు శ్రీరామునకే లోపడినవి. అవి యనన్యార్హ శేషంబులనుట యీ పద్యమునఁ జెప్పఁబడినది. శ్రీరామచంద్రుని వెనువెంటను=సకల కల్యాణగుణమణులకును సముద్రుఁడగు శ్రీరాము వెంబడిపోయి- చూపులు క్రమ్మఱిరావు. (౧) సముద్రమములోఁబడినది మరలి వచ్చునా? అట్లే గాంభీర్యమున సముద్రుఁడు గుణములకు మహాకరము అని చెప్పఁబడిన చంద్రునికంటె నభిరాముఁడగు నా శ్రీరామచంద్రునియందు నాటుకొనిన నా చూపులు మరలిరావు. (౨) రామ....చూపులు=రామం రమయతాం

పరమ్మన్నట్లు ఇది జడపదార్థము, ఇది యజడపదార్థ మను భేదములేక యందఱ నొక్కవిధముగా సంతోషింపఁజేయునవిగదా శ్రీరాముని గుణములు. లోకమున వస్తువును గ్రహించునపుడు దృష్టి తానుగఁబోయి గ్రహించును. నా విషయ మందో యిప్పుడు నాదృష్టులు శ్రీరాముని గ్రహించుటలేదు. శ్రీరాముని యాకా రమే నాదృష్టులను గ్రహించెను. ఆయాప్రకారమే వానిని గ్రహించి విడువ కుండుటచే నందే బద్ధములై మరలి రాకయున్నవి. అదిగాక లోకమున దృష్టులు తమ సమీపమునకు వచ్చినవానిని గ్రహించుట న్యాయ్యమైయుండ నాదృష్టులే సంచారము చేయుచుఁబోయి శ్రీరాము నాకారమందు నిలిచినవి- చూచితివా- చేతనకార్యమగు సంచారమును అచేతనదృష్టులు చేయుచున్నవి. ఇది కాలవైప రీత్యముచేఁగదా "కామరూప్యనుసంచర" న్నని పరమపదమున భగవంతు ననుసరించునట్లు ఇచ్చట సంసారమున నాదృష్టి శ్రీరామునంద చేయఁదొడఁగెను. (౩) రామ......చూపులు=చక్షుర్దేవానా ముతమర్త్యానా" మన్నట్లు దేవతలకు మనుష్యులకు నందఱకు దృష్టివంటివాఁడు గదా శ్రీరాముఁడు. అట్టివాఁడు ముందుపోవుచుండఁగా నేనుమాత్ర మిందుందునా యని నా దృష్టి తలఁచి శ్రీరాముని వెంబడించినది. చూపు అనఁగా జూచునదియని కదా యర్థము. సారా సారములఁ జక్కఁగఁ జూచునదీ నాదృష్టి కాఁబట్టియే శ్రీరాముని వెంబడించినది. నాకు మేలు చేయునది తనకు మేలు చేసికొనదా. తాను అస్వతంత్రయైనను శేషికి హితముచేయవలసినదే శేషవస్తువు కార్యమైనను, ఇపు డెట్టి స్వాతంత్ర మంగీకరించినది చూచితివా- శేషుఁడనఁగా భృత్యునివలె లోపడియుండువాఁడు. శేషి=స్వామి- లోపఱుచుకొనియుండువాఁడు- దృష్టిరమ్య వస్తువునేకదా చూడఁ గోరును. శ్రీరామునికంటె రమ్యవస్తువు మఱియొకఁడుండినఁ గదా చూపులు శ్రీరాముని విడిచి మఱియొకదానికై పోవును. 'మందార మకరంద మాధుర్య మునఁదేలు మధుపంబు పోవునే మదనములకు' నన్నట్లు రామ సౌందర్యాను భవము మరగిన దృష్టి మఱియొకదానికై యెట్లు పోవును.

నాదు చూపులు- (౧) అఱువదివేలేండ్లు పుత్రునకై యనేక వ్రతములను నుపవాసములను జేసి కొడుకు పుట్టునా పుట్టునాయని యేకారి యెదురు చూచు చున్న నా చూపు. (౨) జన్మప్రభృతి నాతోడఁ బరిచయముగల నా చూపు, నేఁడు శ్రీరాముని జూడఁగానే వెడలిపోయెఁగదా. కావున నిది యొక యభిసారిక యేమో. అభిసారికయనఁగా ప్రియుని సంకేతస్థలమునకు నీవు రమ్ము నేను వచ్చెదనని యభిసరింపఁజేయునది యభిసరించునదియగు నాయిక. (౩) కైకేయి మొదలగు దుష్టచిత్తల దృష్టియైనచో శ్రీరాముని ననుగ మింపదు. ఇది నాదృష్టి. నేనన్నన్నో "నందామి పశ్యన్నపి దర్శ నేన" నాదునందనుని డాయఁగవచ్చెఁడు వానిఁజూచి పొంగిపడు వాఁడ సమక్షముచూచినంతనే యౌవన మిప్పుడే యొదవినట్లగు"

ఇటువంటి స్థిరస్నేహముగల నాదృష్టి. (౪) "పృథివినధిపులు నూతనప్రియులు గారె యన్నట్లు వింతవస్తువులకై పరువెత్తునది కదా నాదృష్టి. నిమిష నిమిష మునకుఁ గ్రొత్తవైభవముతోఁ గానవచ్చు శ్రీరాముని సౌందర్యమును ననుభ వింపక నా దృష్టియెందుఁ బోఁగలదు. (౫) సమస్తవిషయములందును జాప లము కలది కదా నా దృష్టి. కాన శ్రీరామునియెడఁ జాపలము చెందినది. నా చపలగుణము నా చూపునకు వచ్చినది. కారణగుణము కార్యమునందు సంక్ర మించును గదా. కూఁతురు భర్తనువదలి తండ్రియొద్దకుఁ బోయినను దండ్రి యామె నా కూఁతురని యభిమానముంచులాగున నాదృష్టి నన్నువదలి శ్రీరామునియొద్దకుఁ బోయినను నాకు దానియందుండు చిరపరిచయము నాది యన్న యభిమానమును బోఁగొట్టుకొన్నది. ఈచూపు నాదియేయైన పక్షమున నన్ను వదలిపోక నన్నే యనుసరించి యుండును. ఇది యిట్లతని వెంబడిం చుటచే నాది కాదని తోఁచుచున్నది. (౬) శీలవతి భర్తనువిడిచి యెన్ని దిన ములు పుట్టినింట నుండఁగలదు, హృషీకేశుని (ఇంద్రియాధిపతిని) విడిచి నాదృష్టి పుట్టినయిల్లైన నా నేత్రములం దెన్నినాళ్లుండఁ గలదు. కావున నది దాని పతియొద్దకుఁ బోయెను.

ఇంద్రియములు విషయముల ననుసరింపవా యది యొక దోషమా యనినఁ జెప్పుచున్నాఁడు. ఆ ఘనువిడనాడి యిప్పటికిరావు=ఇప్పటికిన్=ఆయన నగ రము పొలిమేరను దాఁటిపోయినప్పటికిని, అఘనున్= శ్రీరాముఁడు ఘనుఁడు నేనో అఘ+నుఁడను=పాపముచేఁ బరిక్లిష్టుఁడను, పంథ్యా సూక్ష్మపరిక్లిష్టశూన్యభే దేషు నఃప్రియ. నానా అట్టివానిని విడిచి యిట్టివానియొద్ద కెట్లువచ్చును, తనకు గోచరమగుచున్న శ్రీరాముఁడు తన మేరను దాఁటిపోయినను మరలిరాదు, దీనికిఁ గారణము గైకేయి ముఖము చూడవలసివచ్చునని సిగ్గుచేతనో లేక "నచపునర్వా వర్తతే" యన్నట్లు శ్రీరామునితోఁ గలిసినదానికిఁ బునరాగమనము లేదో చెప్పలేను.

దృష్టి శ్రీరాముని విడిచి మరలి రాలేదని నీకు నెట్లు తెలియును ననఁగాఁ జెప్పుచున్నాఁడు.

అటుగాన నినుఁ గనుఁగొన నేరనయ్యెదను. అటురాలేదు గనుకనే నిన్ను నేను జూడలేకయున్నాను, వచ్చియుండిన నీవేల నాకుఁ గానరావు, కావునఁ దిరిగి రాలేదు. (౨) నేను గానరాకున్ననన్నుద్దేశించి యెట్లు మాటలాడుచున్న వాఁడ వందువేమో నీ స్వరమునుబట్టి తెలిసికొనుచున్నాను గాని నీ రూపమును జూచి గాదు. శ్రీరాముని ముఖము కానరాకున్నను రాముని తల్లివైన నీ ముఖ మైనఁ జూతమనిన నదియు నాకుఁ గానరాకున్నది. (౩) శ్రీరామునియందు మునిఁగియున్న చూపు వేఱొకపదార్థమును జూచునా కావున నా చూపు నీయం దును బ్రసరింపకున్నది. కాంతరౌ=మనస్సున కింపైనదానా (1) నా దృష్టి పోయినను వాగింద్రియముమాత్రము నశింపలేదు. కావున నిన్నుఁజూచి

సంతోషింపలేకున్నను నీతో మాటలాడియైన సంతోషించెదను. నీకు కైక కదా కాంత, నేనెట్లయితినందువేమో "రాముని రాజుగఁజేసెద, వా మహితవిషంబుఁ గ్రోలి వసుధేశ యిదే, నీముందట నీవుగనన్, నేమరణము నొందుదాన, నని చెప్పిన కైక యెక్కడ? నీవును గానలకేగినఁ జావొక్కటితక్క నేది శరణము తనయా" అనిన నీవెక్కడ? మమప్రాణాహిపాండవా యన్నట్లు శ్రీరాముఁడే నాఁ బ్రాణము. అట్టి శ్రీరాముని వెడలఁగొట్టినది నాకుఁ గాంత యెట్లగును? ప్రాణ మిచ్చినదానవు నీవు, దానిని తీసిన దది, (౧) కౌసల్యా లోకభర్తారం సుషు వేయం తపస్వినీ" యన్నట్లు లోకభర్తను బుత్రునిఁగాఁ గంటివి, నీవు ధన్యురా లవే కాని నాకారణమున నీకతఁడు దుఃఖకారణమే యయ్యెను. దోషిని నేనే కాని నీవు కావు.

ఇట్లు రాజు పలవింపుటనుజూచి కౌసల్య శ్రీరాముఁడు తన్నువదలి యడవికిఁబోయినట్లు దశరథుఁడును బరలోకమునకుఁ బోవునని భీతిల్లి దగ్గఱకు వచ్చెను. అప్పు డామెతో దశరథుఁడు చెప్పుచున్నాఁడు.

దాపునఁజేరి నీకరంబున నంటులేస్పృశింతను నాదగ్గఱకువచ్చి నాశ్రమ మెల్లఁదీరునట్లు నీచేతితో నా దేహమంతయు బాగుగ నిమిరి నాకూఱట గలిగింపుము. నిన్నుఁజూడమిని నా కన్నులు పోయినవనుకొనుచున్నాను. నీ మాటలు వినుటవలన వీనుల కలవనుకొనుచున్నాను. నాకిప్పు డేవాసనయుఁ దెలియుట లేదు.కావున ఘ్రాణేంద్రియము నా పుత్రుని శిరము మూర్కొనుటకై పోయెనని తలఁచుచున్నాను. ఇఁకఁ ద్వగింద్రియముఁకూడ నున్నదా పోయినదాయని తెలిసికోవలసియున్నది. కాఁబట్టి నన్నుఁ దాఁకిచూడుము.

ఒక దొంగ యొక యింటఁ జొరఁబడి వస్తువులను దొంగిలించుకొనిపోఁగా నాయింటి యజమానుఁడు మేలుకొని పిదపఁ దెలిసికొని భార్య దీపము తెచ్చి లోపల వస్తువు లేవియున్నవో యేవి పోయినవోయని కనుఁగొనుటకుఁ దొంగ రపై దీపము నెదురుచూడక చీఁకటిలోనే వస్తువులను దడవుచుఁజూచి తనభార్య నడుగుచుండునో యట్లెసది యిప్పటి దశరథుని స్థితి (2) ఇతఁడు కైకేయితో నేదో సంకేతము చేసికొని నిష్కారణముగ నిరపరాధిని నాకుమారుని శ్రీరాముని వెడలఁగొట్టెను. ఇప్పుడు నాయొద్ద నక్కవినయములు చేయుచున్నాఁడు. ఇటువంటి ద్రోహిని పాపిని నేనెట్లు దాఁకుదునని తలఁపకుము. నేనీకార్య మజ్ఞానము చేతనే చేసితిని గాని బుద్ధిపూర్వకముగాఁగాదు. కావున నిర్దోషినని తలఁచి తాఁకుము. అదిగాక నాకీ మనఃకాలుష్యము ప్రకృతి సంబంధమువలనఁ గలిగినది. కావున నీవు వేఱుగాఁ దలఁపక నన్ను బాగుగఁ దాఁకుము. (౩) నీవు వివాహకాలమున నెట్లగ్నిసాక్షికముగా నత్యంతప్రీతితోఁ దాఁకితివో యట్లే యిపుడును దాఁకుము. (4) శ్రీరాముఁడు నాదేహముఁదాఁకిన నా ప్రాణములుండును ఆయన తాఁకకున్నఁ బోవును. ఇట్టి స్థితిలోనుండు నన్ను శ్రీరామునకు మాఱుగ

నాయనతల్లివైన నీవు దాఁకినఁ గొంచెము కాలమైన నిలుచును. భగవత్స్పర్శ సామర్థ్యముగలేకున్నను నతని సంబంధుల స్పర్శముండినను నదియే ప్రాణధారక మగును.

కౌసల్యా దశరథులకు శ్రీరాముని పరత్వజ్ఞానములేదు. వాల్మీకిఋషియే యీ శ్రీరాముని పరత్వము నా యీ పాత్రములముఖమునఁ దా ననుసంధించుకొనుచున్నాఁడు. ఆ వాల్మీకి ప్రయోగించిన మాటలసారస్యమునుబట్టి కవి హృదయమిందు సూచింపఁబడియెనని సంప్రదాయ సిద్ధసమాధానము, శీర్షీయము, రామచంద్రు........క్రమ్మఱిరావు="రమంతే యోగినోనంతే సత్యానందే చిదాత్మని" యన్నట్లిచ్చట రామశబ్దమునకుఁ బరమాత్మయని యర్థము అట్టివానిని జూడఁబోయినవి కావున నా చూపులు క్రమ్మఱిరావు. భగవంతుఁ బొందినవారు "నపునరావర్తతే" మరలి రారు అని కలదుగదా. అటుగాన నిన్ను నేఁ గనుఁగొన నేరనయ్యెదను. నా కన్నులు శ్రీరామునియందే ప్రేమపడి యందే నిలిచినట్లు తక్కిన యింద్రియములు నిలిచెనా లోకులందఱిలోను నేనే గొప్పవాఁడ ననుకొందును. అట్లయియున్నవో లేవో చూడవలయును. కాఁబట్టి మొదటఁ ద్వగింద్రియమున్నదో లేదో పరీక్షింపుము. చూచెద ననుచున్నాఁడు.

## ౪౩-వ సర్గము. కౌసల్య శ్రీరామునిఁ దలంచి దశరథునితోఁ జెప్పుకొని యేడ్చుట

తే॥ కడుపుదుఃఖంబునను దన•కాంతుఁ జూచి, పలుకుఁ గౌసల్య, శ్రీరాము•భద్రుమీఁదఁ
గ్రక్కి కౌటిల్యవిషమెల్లఁ•గైక కుబుస,
మెడలఁ బన్నగసతియున•నెలమిఁ గనియె. ౧౧౬౩

కడుపుశోకంబునన్=కడుపునఁబుట్టిన కుమారుని విషయమైన దుఃఖము చేత, కాంతున్=భర్తను, కౌటిల్యవిషమును=క్రూరస్వభావమనెడి విషమును, కుబుసము=పాముదేహముపై చర్మపుఁబొర, విడలన్=ఊడిపోఁగా, పన్నగసతి=ఆఁడు పాము, ఎలమిన్=సంతోషమును, కౌసల్య పుత్రశోకమున నీ క్రిందివిధముగఁ జెప్పుచున్నది, కాని భర్తపై ద్వేషబుద్ధిచేఁగాదు కావుననే తనకాంతున్ అని చెప్పుట.

తాత్పర్యము

కౌసల్య పుత్రశోకముచేఁ దనభర్తను జూచి యిట్లనియె. శ్రీరామచంద్రు మీఁదఁ దన కుటిలత్వమను విషమును గ్రక్కి కైక కుబుసము విడిచిన యాఁడు పామువలె సంతోషించెను.

కం॥ రాము నిలువెడల నడచుటఁ, గామిని కైకేయి లబ్ధ•కామయు నగుటన్
ధామమునందలి నాగుం, బా మన వెఱపెట్టినను నృ•పాలక మిగులన్.

ఇలువెడల నడచుటన్=ఇంటినుండి వెడలగొట్టుటచేతను కైకేయి తన కోరిక కొనసాగించుకొనుటచేతను, మంత్రగాఁ డిల్లు వెడలిపోయిన పిమ్మట నిర్భయముగఁ దిరుగు నాగుఁబామువలె నన్నుఁ గైక మిగుల భయపెట్టుచున్నది.

ఉ॥ అక్కట బిచ్చ మెత్తి తిని•యాసవతాలికి దాసుఁడై సుతుం
డొక్కట నింటిలోనఁ బడి•యుండఁగ నిచ్చిన లెస్స గాదె, నీ
వక్కలకంఠి కట్టివర•మాదట నీయఁగరాదె, రాజ్యమున్
దక్కకయున్న మానె గుణ•ధన్యుఁడు కానల కేల పోవఁగన్? ౧౧౬౫

కలకంఠి=స్త్రీ, కల=అవ్యక్తమధురము, ఆదటన్=ప్రీతితో, దక్కక=లభింపక, అట్టివరము=ఊరిలో బిచ్చమెత్తితిని యింటిలోఁ బడియుండువరము

తాత్పర్యము

అయ్యో! నాకొడు కూరిలో బిచ్చమెత్తితిని నా యా సవతికి దాసుఁడై యితరములగు జంజాటములులేక యింటిలోఁ బడియుండనిచ్చిన మేలు గదా నీకు దాని తియ్యనిమాటలయందంత ప్రేమయున్న నీ వా మధురవాణికి నట్టి వరమే యియ్యరాదా. న్యాయ్యముగా శ్రీరామునకు లభింపవలసిన రాజ్యము లభింపకుండినఁ బోనిమ్ము. వాఁడు నిష్కారణముగ నడవులపా లేలకావలె? దానివలన నీకు రాఁగల లాభమేమి?

ఉ॥ ఆకట! యాహితాగ్ని యగు•నాతఁడు దర్శలఁ బూర్ణమాసలన్
ప్రాకట మైననిర్జరుల•పాలిహవిస్సును రాక్షసావళుల్
గైకొన నిచ్చినట్లిపుడు•కైక కొనంగి యథేచ్ఛ మీవు ను
శ్రీకము రాజ్యమున్ సుతుని•జ్యేష్ఠు గుణిన్ వెడలంగఁ గొట్టితే. ౧౧౬౬

ఆహితాగ్ని=అగ్నిహోత్రము నుంచుకొనియుండువాఁడు, దర్శలన్=అమావాస్యలందు, పూర్ణమాసలన్=పున్నమలందును, నిర్జరులపాలి=దేవతల పాలి, హవిస్సును=హోమముచేయఁగా మిగిలిన యన్నము నెయ్యి, యథేచ్ఛము=ఇష్టానుసారము=అవ్యయీభావసమాసము గావున నపుంసకలింగము, సుశ్రీకము=మంచి సంపత్తుగలది, గుణిన్=గుణవంతుని, అకట=హాకష్టమ్, ప్ర.

తాత్పర్యము

అయ్యో! యాహితాగ్నియైనవాఁడు అమావాస్యలందుఁ బున్నమల యందుఁజేయు హోమములందలి హవిస్సును దేవతల కియ్యవలసినదానిని రాక్షసుల కిచ్చినట్లు కైక కోరినదని నీ యిష్టప్రకారము సంపత్తుతోఁగూడిన రాజ్యము దుష్టురాలగు దానికిచ్చి గుణవంతుఁడైన కొడుకును వెడలఁగొట్టి కొంటివికదా.

కం॥ కేల శరాసనముఁ దాలిచి, యాలును దమ్ముండుఁ దోడ•నరుదేర వనీ
పాళిని గజపతిగతి నీ, కాలలనాథసుఁడు చొచ్చు•దా నింతటికిన్. ౧౧౬౭

శరాసనము=శరములను జిమ్మునది, విల్లు, వనీపాళిని=అడవులవరుసల యందు.

తాత్పర్యము

చేత విల్లుధరించి భార్యయుఁ దమ్ముఁడు తోడరాఁగా నడవులయందుఁ గరిరాజువలె శ్రీరాముఁ డిప్పటికి నడవి ప్రవేశించుచుండును.

కం॥ వనవాస దుఃఖ మిట్టిది, యని యెఱుఁగనివారిఁ గైక•యనుమతి నీ వా
యనఘులఁ గానల నెట్టితి, కన నయ్యెడ వార లేమి•గతి పట్టెదరో. ౧౧౬౮
అనఘులన్=ఏపాప మెఱుఁగనివారిని, అనుమతి=ఇష్టప్రకారము.

తాత్పర్యము

అడవులలో వసించుటయందుఁగల కష్టమిట్టిది యని తెలియనివారిని కైక యిష్టప్రకార మడవులలోఁ ద్రోచితివి. అక్కడ వా రేమైపోదురో కదా.

కం॥ ఎలప్రాయపువారల సుఖ,ఫలకాలమునందు నెడలఁ•బాపితి వయ్యో
ఫలమూలాశనులై యే,చెలువున జీవించువారు•చెపుమ యనదలై. ౧౧౬౯
ఎలప్రాయపువారలన్=లేఁతవయస్సువారిని, సుఖఫలకాలమునందున్=సుఖఫలము ననుభవింపవలసిన సమయమున, ఫలమూలాశనులై=పండ్లు వేళ్లు ఆహారముగాఁగలవారై, ఏ చెలువునన్=ఏవిధముగా, అనదలు=అనాథులు, దిక్కులేనివారై, ఎల=వర్ణవ్యత్యయములచే లే+ఏ=లే యయ్యెను.

తాత్పర్యము.

లేఁతవయస్సువారిని సుఖఫల మనుభవింపఁదగిన సమయమునందు నింట నుండకుండఁ జేసితివి. పండ్లు వేరులు తిని వా రే విధముగఁ బ్రాణము ధరించి దిక్కులేనివారై యెట్లుండఁగలరో నీవే చెప్పుము.

కం॥ రారాదా రాముఁడు సహ,దారుండై యనుజుతోడఁ•దటుకున నిపుడే
రారాదా నాదుఃఖం, బారఁగ నశియింపఁ జేయ•నద నిది యభ మా.
సహదారుఁడు=భార్యతోఁగూడినవాఁడు, అనుజుతోడన్=తమ్మునితో ఆరఁగన్=పూర్ణముగా, అదను=సమయము.

తాత్పర్యము

భార్యతోడను దమ్మునితోడనుగూడి యిపుడే పదునాలుగు సంవత్సరములయినవని రారాదా. నా దుఃఖము పూర్ణముగా నశియింపఁజేయు సమయ మిదే కారాదా.

సీ॥ ఎప్పుడు వత్తురో•తెప్పున మేల్కాన్క,రమణ నయోధ్యాపు•రంబునకును
నెప్పు డెత్తుదు రొకో•యెల్లెడ హృష్టులై, తోరణధ్వజము లే•పౌరజనులు
ఎప్పుడు పొంగునో•యిప్పుర మెల్లను, బున్నమనాఁటియం•భోధివగిది
నెప్పుడు తే రెక్కి•యేతెంచు సీతతో, నావు వెన్కనుకొడె•యనఁగ సుతుఁడు
తే॥ ఎప్పుడొకొ రాచబాటల•నీపురంబుఁ, జొచ్చి వచ్చెడు నాముందు•సుతుల మీఁద
జనసహస్రంబు లాజలఁ•జల్లఁ గనుట,
చల్లగాఁగందు నాకుందు•సమయు చుండ. ౧౧౭౦
తెప్పునన్=తటాలున. అంభోధి=సముద్రము, లాజలన్=పేలలను, కుందు=వ్యసనము.

తాత్పర్యము

నిద్రపోవువారు తటాలున మేలుకొనునట్లు నాకొడుకులు కోడ లయోధ్యాపురమునకు నెప్పుడు వత్తురో వారి రాక విని యన్ని ప్రదేశములందు సంతోషించినవారై యూరిజనులు తమ సంతోషమును సూచించు తోరణధ్వజము లెప్పు డెత్తుదురో, ఈనగరమంతయు, వారు వచ్చినారనిన సంతోషముతోఁ బున్నమనాఁటి సముద్రమువలె నెప్పు డుప్పొంగునో కదా. ఆవు వెంటవచ్చు కోడెవలె సీత వెంట శ్రీరాముఁడు వచ్చుటఁక నెప్పుడో, రాజవీథుల వెంబడి వచ్చు నా ముద్దుకుమారులమీఁద నీ యూరిజనులు లాజలు చల్లఁగాఁ నా కన్నులు చల్లగా జూచి యెప్పుడు నా దుఃఖమునుండి పాయుదునో.

కం॥ సురుచిరకుండలయుతు లై, దరకరనిస్త్రింశచాప•ధరులై శిఖర
స్ఫురదవనీధరము లనం, బురిఁజొచ్చెడిసుతులఁ జూచు•పుణ్యం బెపుడో.

సురుచిరకుండలయుతులై=మనోహరమ్మయిన చెవుల పోగులుగలవారై= దరకర=భయముకలిగించు, నిస్త్రింశచాపధరులై=కత్తి విల్లు ధరించినవారై, శిఖరస్ఫురత్=శిఖరములచేఁ బ్రకాశించు, అవనీధరములు=పర్వతములు.

తాత్పర్యము

మనోహరమైన కుండలములుగలవారై, భయంకరములైన కత్తి, విల్లు ధరించినవారై శిఖరములతోడి పర్వతములో యనునట్లు నగరము ప్రవేశించు కొడుకులను జూచు పుణ్య మెపుడు కలుగునో.

చం॥ కనుఁగొను టెన్నఁడొక్కొ ద్విజ•కన్యలు పుష్పఫలాళిఁ జేతులం
గొని ముద మారఁగాఁ బురిఁ•గోర్కి చెలంగఁ బ్రదక్షిణించుటల్,
ఘనపరిపక్వబుద్ధి, శచి•కాంతుఁడు ప్రాయమునందు, నోరు మె
త్తనిముగుదుండు, వానిముఖ•తామరసంబెటు గాంచు టబ్బునో ౧౧॥

ద్విజకన్యలు=పెండ్లికాని బ్రాహ్మణజాతి కన్నెలు, పుష్పఫలాళిన్=పూలయుఁ బండ్లయు మొత్తములను, ఘనపరిపక్వబుద్ధి=బాగుగఁబండిన బుద్ధిగలవాఁడు, ప్రాయమునందు=వయస్సున, శచికాంతుఁడు=ఇంద్రాణి పెండ్లివాఁడగు నింద్రుఁడు, దేవత లెప్పుడు నిరువది యైదేండ్లవారే, ఈయుపమానము శ్రీరామున కిప్పటికి నిరువదియైదు సంవత్సరములని సీత చెప్పిన వాక్యమును బలపఱుచుచున్నది, ముఖతామరసము=ముఖకమలము, ముగ్ధుఁడు, తద్భవము ముగుదుఁడు.

తాత్పర్యము

బ్రాహ్మణజాతి కన్యకలు చేతఁ బూలు పండ్లు తీసికొని సంతోష మతిశయింపఁగా నగరప్రదక్షిణము చేయుట నే నెన్నఁడు చూతునో. గొప్పదై యారితేఱిన జ్ఞానముగలవాఁడు, వయసునం దింద్రుని ప్రాయమువాఁడు, కఠినముగఁ

బలుకలేని ముగ్ధుఁడునగు శ్రీరామచంద్రుని ముఖకమలము చూచుట యెప్పుడు కలుగునో?

కం॥ మూఁడేండ్లముద్దుబాలుని, బోఁడిమి నాప్రోల సుతుఁడు•పొడకట్టఁగ నే
నాఁడు కనులారఁ గందునొ, యేఁడీ రాముండు తనయుఁ•డేఁడీ నాకున్.

బోఁడిమి=చందము, పొడకట్టఁగన్=కనఁబడఁగా, ఏఁడీ=ఎక్కడనున్నాఁడు, అర్థవిశేషంబున, ఏఁడి, ఏది, ఏరి, ఏవి యనునవి ఈకారాంతములగు అర్థవిశేషము=ఎక్కడ? అనఁగా లేఁడే యని భావము.

తాత్పర్యము

ఆడుకొను మూఁడేండ్ల ముద్దుబాలునివలె నాయెదుట నాచిన్ని శ్రీరామ చంద్రుఁడు కనఁబడగా నెప్పుడు కన్నులారఁ జూతునో=అట్లు చేయుటకు శ్రీరాముఁ డెక్కడనున్నాఁడు, అయ్యో అంతటి పుణ్యాత్మురాలనా? నాకుఁ గొడుకుకూడ నున్నాఁడా నాకుఁగూడఁ గొడుకున్నాఁడా?

ఉ॥ సందియ మింత లేదు తొలి•జన్మమువేళను నేను దల్లులా
నందముతోడఁ జన్గుడుప•నందనులం గరముం గదర్యనై
కందులనోటిచన్నులను•గండలఁ గ్రొవ్వునఁ గోసినై చితిన్
దందడియాయఘం బిటులు•దారుణభంగిని నన్ను గ్రమ్మింగెడిన్. ౧౧॥

చన్గుడుపన్=చన్నులపాలు ద్రావింపఁగా, కదర్యనై=నీచురాలనై, అత్యంత లోభినై, కందుల=శిశువులను.

తాత్పర్యము

ఏల యిటువంటి పుత్రవియోగము నాకు లభించెనని యాలోచింపఁగా నేది పూర్వజన్మమునఁ జేసితినో యదియే యీ జన్మమున లభించును గావున నేను బూర్వజన్మమందుఁ దల్లులు సంతోషముతోఁ దమ కొడుకులకుఁ జనుపాలిచ్చు చుండఁగా మిక్కిలి నీచబుద్ధినై యాబిడ్డల నోటనుంచుకొని త్రాగుచున్న చన్నులను గండపొగరుచేఁ గోసినై చితిని. ఆపాపమే యిప్పు డీ విధముగ భయంకరముగ నన్ను గ్రమ్మింగుచున్నది. సందేహములేదు.

ఇంతటి ఘోరకార్యము చేయువారరుదు గాని యిప్పుడు మఱియొక విధముగఁ దల్లుల పాలు బిడ్డలకు లేకుండఁ జేయువారు పెక్కురున్నారు.

శ్లో॥ నవారయే ద్గాం ధయంతీం, నచాచక్షీత కస్యచిత్
నదివీంద్రాయుధం దృష్ట్వా, కస్యచిద్దర్శ యేద్బుధః॥ మను. ౪-౫౯

నీళ్లు త్రాగు గోవును, దల్లి పాలు త్రావు దూడను నివలి కీడ్వరాదు. ఇతరుల దూడలు పాలు ద్రావునపుడు వారికిఁ జెప్పరాదు. ఇంద్రధనుస్సునుజూచిన వాఁడు దాని నితరులకుఁ జూపరాదు. పాలు పిదుకునపుడు దూడను నివారింప

వచ్చునని కుల్లాకభట్టు వ్రాసెనుగాని దూడ కడుపునిండఁ బాలు త్రాగువఱకుఁ దీయరాదు. అందు వేఱు మేపు దినని దూడలవిషయమున ముఖ్యము. సంస్పృష్టాంచవత్సేనా నిమిత్తే, అపస్తంబులు, పాలు త్రావు దూడను నిష్కారణముగ నీవలి కిడువరాదు. స్వార్థము సరియైన కారణముకాదు. లేదూడలు పాలు విశేషించి త్రావిన జీర్ణించుకొనలేకపోవును. రోగము వచ్చును. అట్టి సమయమందుఁ దగినంత త్రావఁగానే యావలికి లాగవచ్చును. మన పొట్టలు నించుటకై (టీ, కాఫీలకుఁగాను) తల్లిపాలు బిడ్డలకు లేకుండఁ జేయుటకంటె ఘోరపాప మేది గలదు. ఆవుపాలు హోమ యజ్ఞాది దేవతాకార్యములకు, తల్లులులేని బిడ్డలకు, వయోవ్రతులకు, రోగులకు వినియోగించినయెడల నా యుపయోగించినవారికిని గోవులకును సుకృతముగలదు గాని కేవల స్వకుక్షిపూరులకుఁ బాపమే ఫలము ఈకాలమున బిడ్డలు విశేషించి చచ్చుటకు, బిడ్డలపాలు తల్లులిచ్చు భాగ్యము లేకుండుట కది ముఖ్యకారణమై యుండవచ్చును.

సీ॥ సింహంబుచేత హిం•సితవత్సగోవు, వి,వత్స యైనట్టులు•వత్సల యగు
నేను గైకేయిచే•నీగతి సుతహీన, నై తి నిం కే మని•యనుకొనంగ
నట్టిసద్గుణజుష్టు•నఖిలశాస్త్రాభిజ్ఞు, విడి యేకపుత్రుని•మిడుకు బట్టు
లే మని బ్రదుకుదు•నేగతి బ్రదుకుదు, నా నెఱసరి నిష్టు•గాన కున్న
తే॥ మండువేసంగి నెట్లు మా•ర్తాండుఁ డెల్ల,
యుర్వరను గరవాఁడి మ•యూఖములను
వ్రేఁచు నాగతి నాదుశ•రీర మెఱియఁ,
జేయు చున్నది సుతశోక•జాయుతాగ్ని. ౧౧౬౬

హింసితవత్సగోవు=చంపఁబడిన దూడగల యావు, వివత్స=దూడలేనిది, వత్సల=బిడ్డలయందుఁ బ్రేమగలది, సద్గుణజుష్టున్=మంచి గుణములచేఁ బూజింపఁబడినవానిని, అఖిలశాస్త్రాభిజ్ఞున్=సర్వశాస్త్రములందుఁ బండితుని, నెఱసరి=శూరుని, ఉర్వరను=భూమిని, కరవాఁడి మయూఖములను = మిక్కిలి తీక్ష్ణమైన కిరణములచే, షడ్వర్ణపర్యంతంబైన యాంధ్రశబ్దంబు తత్సమశబ్దంబుతోడ సమసించు, సు, వ్యా, సమాస ౪౧ సూ. కొందఱు ఆంధ్ర సంస్కృత శబ్దములు కలిసిన సమాసమంతయు నాఱువర్ణముల మించియుండరాదందురు. అది సూత్రాభిప్రాయముగాదు. ఆంధ్రం షడ్వర్ణపర్యంత మన్నప్పుడు ఆఱక్షరములుగల ఆంధ్రశబ్దమనియే యర్థము, 'కటికిచీఁకటి దిండికరముల గిలిగింత' యను పెద్దన్న ప్రయోగ మీ నియమము నతిక్రమించియున్నది.

కరము+వాఁడి, కరవాఁడి, సమాసంబునఁ బ్రత్యయలోపంబు, ద్వంద్వ కర్మధారయంబులఁ బూర్వపదాంత మువర్ణకము లోపించి యొక్కెడ సమసించు కరము+వాఁడి, కరవాఁడి, పుట్టము+గోఁచి=పుట్టగోఁచి, చుట్టము+పక్కము= చుట్టపక్కములు. సు. వ్యా. సూ. సమా ౧౯, వ్రేఁగు, వ్రేఁచు=

ప్రేయించు=తపించునట్లుచేయు, సుతశోకజ= పుత్రశోకమువలనఁ బుట్టిన, అ యతాగ్ని=విస్తారమైన యగ్ని. తాత్పర్యము

సింహముచేఁ జంపఁబడిన దూడగల యావు దూడలేనిదియగునట్లు పుత్రప్రేమగల నేను కైకేయిచేఁ బుత్రుఁడు లేనిదానవైతిని, ఇఁక నేమనుకొనిననేమి ప్రయోజనము. అటువంటి సద్గుణములు గలవానిని సమస్త శాస్త్రములందుఁ బండితుని నొంటికొడుకును శూరుని బిడ్డఁడైనవానిని విడిచి యెంతని దుఃఖింతును, ఏమని బ్రదుకుదును, ఎట్లు బ్రదుకుదును.మండుచున్న నెండకాలమందు సూర్యుఁడు భూమియంతయుఁ దన తీక్ష్ణకిరణములచేఁ గాల్చునట్లు పుత్రశోకము నన్ను వగ్ని నా శరీరమంతయుఁ గాలునట్లు చేయుచున్నది.

—• ౪౪-వ సర్గము. సుమిత్ర కౌసల్యకు శోకోపశమనంబు సేయుట. •—

కం॥ అని వగచెడి కౌసల్యా, వనితామణిఁ గాంచి ధర్మ•పథవర్తిని య
ట్లనియె సుమిత్ర సధర్మము,సనయంబుగ నీకునేల•సంతాపింపన్.౧॥౩౩

వగచెడి=దుఃఖించు, ధర్మపథవర్తిని=(1) ధర్మమార్గమందు నడచునది (2) ధర్మ=సిద్ధధర్మము, భగవంతుఁడు=రాముఁడు, ఆయన పథము=ఆయన కనుకూలమైన మార్గమునందు వర్తించునది, అనుకూల్య సంకల్పముగలది, (3) ధర్మము=పూర్వజన్మసుకృతము, సుమిత్రను ధర్మపథవర్తిని యనుటచేఁ గౌసల్య మార్గమంత శుద్ధ ధర్మయుక్తము కాదని కవి యభిప్రాయము. కౌసల్యది రాజసమార్గము. కైకేయిది తామసమార్గము. సుమిత్రది సాత్త్వికమార్గము. సత్యసంధుఁడగు భర్త తనకు మనస్తాపము కలిగించెనని యెగ్గులాడుట యుక్తమార్గము గాదు, సధర్మము=ధర్మముతోఁ గూడినట్లు, సనయముగన్=నీతితోఁ గూడినట్లు.

శ్రీరాముఁడు పరమాత్మ యనువిషయము సుమిత్ర వాక్యములచే వాల్మీకి వెల్లడి చేయుచున్నాఁడు, ఈసర్గమందుఁ దా రామసోదరులకుఁబోలె సుమిత్రకును జన్మాంతర కృతపుణ్యమువలన శ్రీరాముని వాస్తవస్థితి చక్కఁగఁ దెలియు నని పెద్దల సంప్రదాయము, ఇట్టి కవియభిప్రాయమునుబట్టి కొన్ని ధ్వన్యర్థములు కలవని చెప్పఁబడును.రామాయణమంతయు ధ్వనికావ్యమేగదా. ఆలంకారికులు నిట్టి ధ్వన్యర్థము నంగీకరించియున్నారు.

దశరథ శబ్దమునకు గరుడవాహనుఁడైన మహావిష్ణు వర్థమని ౧౦౯౮-వ పద్యవ్యాఖ్యానమునఁ వ్రాయఁబడెను. అట్టి మహావిష్ణువునకు శరీరభూతయగు ప్రకృతి భర్తవ్యయగుట భార్యయట్టిది. అట్టిప్రకృతి మూఁడుగుణములకలది. సత్త్వము, రజస్సు, తమస్సు. సత్త్వము సుమిత్ర, కౌసల్య రజస్సు కైక తమస్సు. "ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా" యన్నట్టి ఆత్మాపై పుత్రనామాసియున్నట్టుపరోక్షమహావిష్ణువే ప్రత్యక్ష శ్రీరాముఁడయ్యెను. కావునవే శ్రీరాముఁడు తండ్రిని బోలినవాఁడని కొన్నిచోటులఁ జెప్పఁబడెను.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము విలపించు కౌసల్యనుగని ధర్మమార్గమందు నడచు సుమిత్ర ధర్మము నీతితోఁగూడిన మాటల నిట్లనియె. మహాభాగా! నీవేల పరితాపపడెదవు

చం॥ అనుపమసద్గుణుండు నప॰రాజితుఁడుం బురుషో త్తముండు నీ
తనయుఁడు, వానికా కృపణ॰తన్ విలపించెద వార్య యిట్లు? దా
వనముల కేగు టెల్ల జన॰వర్యుని దండ్రిని సత్యవాదిఁ జే
యున కద? దానికై వగవ॰న్యాయ్యమె చెప్పుము ధర్మమానసా? ౧౧౬౮

అనుపమసద్గుణుఁడు=అసమానమైన కల్యాణగుణములు గలవాఁడు. అప రాజితుఁడు=(1) పరాజయమెట్టిదో తెలియనివాఁడు, (2) విష్ణువు. అపరాజితో హరిః అని నా.నా.ర. పురుషో త్తముండు = పురుషశ్రేష్ఠుఁడు, జీవాత్మలకంటె నుత్తముఁడు, ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః భ.గీ.శ్రీపతిః పురుషో త్తమ యని నిఘంటువు. కృపణతన్=దీనత్వముచే, ఆర్య=భాగ్యవంతు రాలా. నీవెంత పుణ్యవతివో కనుకనే నీకిట్టివాఁడు పుత్రుఁడయ్యెను.

తా త్ప ర్య ము

నీతనయుఁడు-అసమాన కల్యాణగుణములు కలవాఁడు. పరాజయము నొందనివాఁడు పురుషశ్రేష్ఠుఁడు ఇట్టివాని గుఱించియా భాగ్యవతీ! నీవు దీనత్వ మున విలపించెదవు? నీకొడుకు కడవులకుఁబోయిన కారణమేమి? నేరముచేసియా? కాదుగదా తండ్రిని సత్యవాదిఁగాఁ జేయుటకేకద, తండ్రిని సత్యవంతుని జేయఁబోయినవాని గుఱించియా ధర్మయుక్తమగు మనస్సుగలదానా! దుఃఖిం చెదవు. ధర్మవిచారము నేల యడుగునఁ ద్రోచితివి? ఎంత తీవ్ర దుఃఖమైనను ధర్మము మఱవవచ్చునా?

కం॥ పెద్దలు మోక్షముకొఱకై, తద్దనడచు చుందు నట్టి॰ధర్మపథమునన్
ముద్దులసుతుఁడును నడచెను, నెద్దీ దోసంబు దీన॰నేటికి వగవన్? ౧౧౬౯

తా త్ప ర్య ము

మోక్షము సంపాదింపఁగోరిన పెద్ద లేధర్మమార్గమున నడచిరో యాధర్మ మార్గమునందే నీకొడుకును నడచెను. దీనిలో నేమి దోసము? ఏమి పాపకార్యము శ్రీరాముఁడు చేసెనని యేడిచెదవు? నాకొడుకు శ్రీపతియంటివే యట్టివాని కీ కష్టమేలయందువా? శిష్టాచారము నిలుపుటకే, లోకులకు మార్గదర్శియగుటయే శిష్టధర్మముకదా. నిత్యవిభూతియందు నిత్యానందరూపుఁడైన భగవంతుఁడు లీలా విభూతియం దవతరింపనేల? ఆలోచింపవా?

ఆ॥ అప్రమాదబుద్ధి॰యఖిలభూతములకా,లములఁ గరుణ గలఁడు॰లక్ష్మణుండు
ను త్తమంపువృత్తి॰నున్నవాఁ డమ్మహా,
త్మునకు నదియె లాభ॰మనుఘటించు. ౧౧౭౦

అప్రమాదబుద్ధి=పొరపాటుపడని జ్ఞానముగలవాఁడు కైంకర్య విషయమునఁ బొరపాటుపడియుండిన శ్రీరాముని వెంటఁబోయియుండఁడు, జాలములన్ = సమూహములందు, కరుణగల్ఁడు=దయగలవాఁడు.

### తాత్పర్యము

లక్ష్మణుఁడు తనకు స్వరూప స్వభావసిద్ధమైన కైంకర్యమందుఁ బెద్దవారిని సేవించుటయందు హెచ్చరికగలవాఁడై సమస్తభూతములు భగవత్స్వరూపము లను జ్ఞానముతో దేనిని హింసించినను భగవంతుని నొప్పించుటయని యన్నింటి యందు దయగలవాఁడునగు లక్ష్మణుఁడు తన స్వధర్మమైన కైంకర్య వ్యాపార మందున్నవాఁడు. శ్రీరాముఁడు తన స్వధర్మమందున్నట్లు లక్ష్మణుఁడును దన స్వధర్మమందు హెచ్చరిక తప్పకయున్నవాఁడు. ఆ మహాత్మునకు నదియె=ఆ కైంకర్యమే మహాఫలమును గలుగఁజేయును. వారి వారిని రక్షించి యుత్తమ గతులను గలిగించునది వారి వారి స్వధర్మానుష్ఠానమే కదా. కావున లోకాను గ్రహార్థమై 'యద్యదాచరతి శ్రేష్ఠస్తత్త దేవేతరో జనాః॥ భ.గీ. కామవృత్త స్త్వయంలోకః, కృత్స్నస్సముపవర్తతే యద్వృత్తాసంతిరాజాన, స్తద్వృత్తా స్సంతిహి ప్రజా' యని రామాయణమునఁ గలదు కావున స్వధర్మమున వర్తించు శ్రీరామునకై యెట్లు విచారపడఁబనిలేదో యట్టులే తన స్వధర్మమందున్న లక్ష్మణునకై విచారపడఁ బనిలేదు- లాభకారియగు వృత్తియందుండువారికై వగచుట న్యాయ్యమా. దీనివలన జీవునికి భగవత్కైంకర్యమే స్వరూప స్వభా వములని సూచన. ఎట్టివారికిని స్వధర్మనిర్వహణమే పరమధర్మము.

కం॥ వనవాసంబున నడజడి, జనకజ సుఖశీల యెఱుఁగఁ•జాలకయా తాఁ
జనియె? నటు లెంచకుము నీ,
తనయుని ధర్మాత్ముఁ గొలుచు•తమిఁ దోన చనెన్. ౧౧౪౧

### తాత్పర్యము

వనవాసమునఁగల కష్టము తెలియక సీత శ్రీరాముని వెంటఁబోయెనని తలఁ చితివి కాఁబోలు-అది పొరపాటు-ఆమె సుఖశీల-సుఖమునిచ్చు నాచారముగలది- సుఖానుభవముచేఁ బ్రకాశించునది. ఈలోకసుఖము సుఖముగాదు. పరలోక సుఖమే సుఖము. ఆ సుఖము గలిగించు నాచారముగలది-అదెట్లనెదవా- ఆమె మహాజ్ఞానియు యోగియునగు జనకరాజు కూఁతురు జనకుఁడు వైదేహుఁడు. "వైదేహస్తువిదేహత"యని విదేహముక్తిని సదేహుఁడయియే యార్జించినవాఁడు. విదేహుఁడు ప్రత్యగాత్మయే కదా. అట్లు కేవల జ్ఞానానందస్వరూపమగు నాత్మ నుండి దీపమునుండి వచ్చిన దీపమువలెనుండు నయోనిజ సీత. అట్టియామె యజ్ఞానముచే రాముని వెంబడించెనని తలంపకుము. ఆమె సహధర్మచారిణి "స్త్రీణాం భర్తాహి దైవత"మ్మనుట యెఱిఁగినది కావున నామె స్వధర్మ మామె రక్షించుకొనుటకై కేవల ధర్మస్వరూపుఁడైన భర్తను సేవించు కోరికతో నాయన

వెంటఁబోయెను. ఇట్లా ముమ్వురు స్వధర్మాచరణమే యుత్తమోత్తమ ధర్మమార్గ మని స్వానుష్ఠానపూర్వకముగ లోకమున కుపదేశింపఁబూనియుండ వారికై యేడ్చెద వేలమ్మా.

కం॥ కీర్తిధ్వజ మెల్లెడలఁ బ్ర,వర్తింపఁగఁ జేయు జగతిఁ • బ్రభుఁ డగువిలస
న్మూర్తి వ్రతసత్యధర్మ, స్ఫూర్తిధనుం డతని కేల • పొనరుం గొదవల్.

విలసన్మూర్తి=విశేషముగఁ బ్రకాశించు నాకారముగలవాఁడు, వి + లసత్ + మూర్తి=పరమాత్మయొక్క యీ లోకమునఁ బ్రకాశించు నాకారముగలవాఁడు- విశ్వభుషిర్వ్యామ్నివాతే పరమాత్మని వక్షిణి॥ నానా. ల. పరమాత్మయే యీలోకమున నంతర్యామివలెఁగాక నీయాకారమున సర్వజనగోచరుఁడై ప్రకాశించు చున్నాఁడు- వ్రత సత్య ధర్మస్ఫూర్తిధనుఁడు- వ్రత=శరణాగతరక్షణమే నా వ్రతమని, ఏతద్వ్రతమ్మని శ్రీరాముఁడే చెప్పినట్టు శరణాగతరక్షావ్రతము, సత్య=రాముం డిరుమాటలాడఁ డెన్నండున్- అన్నట్లు సత్యము, ధర్మము- "రామో విగ్రహవాన్ ధర్మః" రాముఁ డాకారమును గొన్న ధర్మమన్నట్లు ధర్మము, వీనియొక్క ప్రకాశమే,ధనుఁడు=ధనముగాఁగలవాఁడు, కీర్తిధ్వజము =వ్రతసత్య ధర్మధనుఁడు రాముఁడను కీర్తిధ్వజమును. "తస్యనామ మహద్యశ" యను శ్రుత్యర్థమిందు వివరింపఁబడియె- ప్రభువు = (1) సమర్థుఁడు (2) ప్రభువు- ప్రభూ శక్తాధిపౌ॥ నానా॥ ర॥

## తాత్పర్యము

శ్రీరాముఁడు తన కీర్తిటెక్కెమును లోకమునందుఁ బ్రవర్తింపఁజేయును- ఆయనకీర్తి లోకమున శాశ్వతముగ నిలువఁగలదు. అటువంటి ప్రభువు అంతటి సమర్థుఁడు అటువంటి యుత్కృష్ట జన్మగలవాఁడు వ్రతము ధర్మము సత్యము వీని ప్రకాశమే ధనముగాఁ గలవాఁడు. ఇట్టివానికి నడవినుండినననిన్నియుఁ బూర్ణముగ లభింపవని యింటనుండిన లభించుననియా నీ యుద్దేశము ? ఆయన యెక్కడనున్నను బూర్ణుఁడే. ఆయనకే కొఱఁతయు లేదు. పూర్ణమదః పూర్ణమి దమ్మనుటకు శ్రీమధ్వాచార్యులవారీ యర్థమునే వ్రాసిరి.

సీ॥ ఆరాముశుచితామ • హత్త్వంబు లెంతయు,వ్యక్తంబు లగుటను • వనజహితుఁడు
దనకిరణంబులఁ • దాపంబుఁ గూర్పఁడు, వానికిఁ గానన • వాటులందు
యుక్తశీతోష్ణమై • యొప్పఁగఁ గమ్మని, మందవాయువు సుఖ • మంద వీచు
శయనించువనభుపై • జనకునట్టులు మిహి,కాంశుఁడు కరముల • నంటి మిగుల
తే॥ హర్ష మొనగూర్చు, నాశంబ • రామరారి
తనయు వధియింప మెచ్చి వి • ధాత యొవని
కిచ్చె దివ్యాస్త్రముల నాయు • హీనసత్త్వుఁ
డుండు నట లెస్స యింటియుం • దున్నయట్లు. ౧౧౮౩

అది యెట్లు? అడవులలోఁ బోవునపు డెండ గాలి తాపము గూర్పగుండునా? సుకవాసి శ్రీరాముఁ డివి యెట్లు సహింపఁగలఁడని కౌసల్య యడుగునని తలఁచి దానికి సుమిత్ర సమాధానము చెప్పుచున్నది. సమస్త దేవతలు నాతని యాజ్ఞా ప్రకారము నడచువారే కావున నతనికి ననుకూలురై యే యుందురని వివరించుచున్నది.

భయాదస్యాగ్ని స్తపతి। భయా త్తపతిసూర్యః।
భయాదింద్రశ్చవాయుశ్చ। మృత్యుర్ధావతిపంచమః॥
మృత్యుర్యస్యోపసేచనం। కఇత్థావేదయత్రసః॥

అను కఠోపనిషద్వాక్యంబులు స్మరణీయంబులు.

శుచితా=మనస్సు, వాక్కు, కాయము అను త్రికరణముల శుద్ధి (2) అవగుణములు లేకుండుట అపహత పాప్మాదిగుణములని కీర్తియము, మహత్త్వము=అందఱు తన యాజ్ఞప్రకారము నడచుకొనునట్లుచేయు గొప్పతనము, వ్యక్తము=అందఱకు స్పష్టముగఁ దెలిసినది, వనజహితుఁడు=సూర్యుఁడు, తాపంబు=వేఁడిని, కూర్పఁడు=శ్రీరామునకుఁ గలిగింపఁడు "భీషోదేతిసూర్య" యను శ్రుతిప్రకారము ఏ పరమాత్మకు సూర్యుఁడు భయపడుచుండునో యట్టి పరమాత్మని శ్రీరాముని సూర్యుఁడు తపింపఁ జేయఁగలఁడా, చేయునా, అంతవఱకు భీతోదేతి సూర్య యను శ్రుత్యర్థము వివరించి యిఁక భీషాస్మాద్వాతః పవతే ఈయనకు భయపడుచు గాలి వీచును అను శ్రుత్యర్థమును వివరించుచున్నది, కానన వాటులందున్=అడవిప్రదేశములందు ఇందుండివచ్చు గాలి పుష్పములపైనుండి వచ్చుటచే సువాసనగలదై యుండును. చెట్లయాటంకము వలన మందమైయుండును గాని హోరనియుండదు, ఇదియే వివరింపఁబడుచున్నది. కమ్మని=మంచివాసనగలదైన మందమారుతము, యుక్తశీతోష్ణమై=ఆయాసమయములకుఁ దగినట్టు లెండలవేళ చల్లగాను శీతాకాలమున వేఁడిగాను, సుఖము గలుగునట్లు విసరును. ఇఁక రాత్రులందు మిహికాంశుఁడు=మంచు కిరణములుగల చంద్రుఁడు, కరములన్ = కిరణములచే, అంటి = తాఁకి, జనకునట్టులు = తండ్రివలె, హర్షము = సంతోషము, ఒనగూర్చున్ = కలిగించును, ఈవిషయమున "ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్ర మసౌవిధృతౌ తిష్ఠంత" యను శ్రుత్యర్థము విశదీకరింపఁబడెను, ఈ చిల్లరదేవతలే కాదు దేవజ్యేష్ఠుఁడగు బ్రహ్మయు శ్రీరాముని గారవించును. ఎట్లన శంబరామరారితనయు=తిమిధ్వజుఁడను శంబరాసురుని కొడుకును వధియింపన్=చంపఁగా, విధాత=బ్రహ్మ, ఆహీన సత్త్వుఁడు=హీనముగాని బలముగలవాఁడు, (చూ. పద్యము ౭౫ ప్రథమ పాదము ౨౪౪,౨౨౫ పద్యములు) రాముఁడు పూర్వమొకప్పుడు దండకారణ్యమునకుఁబోయి యందుపై జయంతమను పట్టణమున వసించుశంబరాసురుని కొడుకును జంపెను. అప్పుడు బ్రహ్మ సంతోషించియనేక దివ్యాస్త్ర

ములు శ్రీరామున కిచ్చెను. పూర్వవృత్తమును సమయోచిత సందర్భము లందుఁ జెప్పుట వాల్మీకిశైలియందలి విశేషము. ఇది మున్నిదే చెప్పఁబడెను.

ఇందలి సినపాదవిషయమును బట్టి చూడ నాదినుండి త్రికరణశుద్ధిగలవారికి భౌతికతాపములు గలుగవనియు యెండగాని గాలిగాని బాధింపవనియు, వానివలన నేబాధలేనప్పుడు మృగాదుల బాధలును గలుగవనియు నేర్పడుచున్నది.

శ్రీరాముఁడు త్రికరణములందును పరిశుద్ధుఁడని లోకమునకంతయు స్పష్టముగాఁ దెలియుటచే సూర్యుని కిరణము లాయనకు వేఁడిగానుండవు. గాలియు సువాసనగలదై మెల్లగా సమయమునకుఁ దగినట్లు వేఁడిగను జల్లగను వీచును. శ్రీరాముఁడు పండుకొనినవేళ చంద్రుఁడు తన కిరణములచేఁ దండ్రివలెఁ దానికి సంతోషము గలిగించును. శంబరాసురుని కొడుకును జంపినప్పుడు బ్రహ్మ మెచ్చుకొని దివ్యాస్త్రము లనేకము లిచ్చెను. అటువంటి పరిపూర్ణసత్త్వుఁడు భవనమువలె వనమునందును సుఖముగానే యుండును.

తే॥ ఏనిశరములమార్గంబు•లోన గోచ,రించుమార్తురు ముట్టన•శించువార
లట్టివిక్రమశాలి నీ•పతి వాని,యాజ్ఞ వర్తింప కెటు లుండు•నఖిలధరణి.

మార్తురు=విరోధులు, ముట్టన=మొదలుముట్ట=సమూలము.

తాత్పర్యము

సాధువులు గుణములఁ జూచి మెత్తురుగాని యసాధువులు మెత్తురా? కీడు చేయకుందురా ? యనెదవేమో అభయములేదు. ఎవని బాణము పోవునంత ప్రదేశములోనుండు శత్రువులు నిశ్శేషముగా నశింతురు గాని సమీపమునకైన రాఁజాలరు. అటివారికిఁ గీడేమి చేయఁగలరు. దుష్టులను శౌర్యముచే జయించును గావున వాని యాజ్ఞప్రకారము సమస్తభూమియు వర్తించును. ఆయనను అతిక్రమించువారు లేరు కావున శ్రీరాముఁడు మరలి వచ్చినప్పుడు భరతుఁడాయనకు రాజ్యమీయుఁడను భయములేదు. ప్రేమముచే నీయకున్న దండముచే నిచ్చును.

తే॥ బలము శౌర్యంబు కౌశిక•సంపత్తియు నెపుడు
వెలుఁగ నెవ్వానియందు నా•వీరవరుఁడు
కానవాసమునను ముగి•ంచి క్రమ్మఱంగ
వచ్చి తూర్ణంబ పాలించు•వసుధ యెల్ల.

ఎపుడు=సర్వకాలపర్యవేక్షణములందును.

తాత్పర్యము

అమ్మా! లోకములకెల్ల దక్షిణ దిక్కునందుండు జనములందు బలమును శౌర్యమూ తేజము కొంతకాలమునకే కొంతకాలమునకు లేకయుండును. అతిప్రవేశమునుండి వేడుక

చోట లేకయుండును. శ్రీరామునంత దట్టుకాదు. అవి సర్వకాలముల సర్వదేశముల నాయనను విడిచియుండవు. అటువంటి యుత్తమవీరుఁడు అడవియందు వసియించి మరలి శీఘ్రముగ వచ్చి రాజ్యమంతయుఁ బాలించును. ఇది మంథర ౫౫౫, ౫౫౬ పద్యములందుఁ జెప్పిన విషయమును ఖండించుచున్నది. పదు నాలుగేండులు శ్రీరాముఁ డరణ్యవాసము చేయుటయందుఁ జచ్చినను జావ వచ్చును ఒకవేళ బ్రదికివచ్చినను నీలోపల ప్రజలు సేనలు నీ భరతున కను కూలురై యుందురు గావున ఏకాంగియైన శ్రీరామునకంటె ససైన్యుఁడయిన నీ కొడుకు బలవంతుఁడగును. కావున రాముఁడు జయింపలేఁడని మంథర యుపాయము చెప్పెను. సుమిత్ర యీయభిప్రాయమును ఖండించుచు లోకమంతయు శ్రీరాముని యాజ్ఞకే లోపడియుండును. అన్ని లోకము లేకమైనను శ్రీరాముని జయింపఁజాలవు. గావున శ్రీరామునకు రాజ్యము నయముననో భయముననో రాకతప్పదని చెప్పెను.

ఉ॥ భానునకుం బ్రభాకరుఁడు•పావకపావకుఁ, డల్ల శ్రీకినిం
దా నగు శ్రీ, ప్రభుండు ప్రభు•నామకకోటికిఁ, గీర్తి కీర్తికిన్
మానుగ వేల్పువేలుపు, క్ష•మాక్షమ, భూతతతిం బ్రభూత మౌ,
వానికి లోప ముండు నొకొ•పట్టనమందునయేని కాననేన్? ౧౧౭౬

తమేవభాంత మనుభాతి సర్వమ్మస్య శ్రుత్యర్థమిందు వివరింపఁబడు చున్నది. భగవంతుఁడు తాను బ్రకాశించుచుఁ దన ప్రకాశముచే సర్వము ప్రకాశింపఁజేయుచున్నాఁడని యర్థము.

భానునకున్ = సూర్యునకు- ప్రకాశించువాఁడని వ్యుత్పత్త్యర్థము- అట్టి వానికి, ప్రభాకరుఁడు=సూర్యుఁడు- కాంతిగలిగించువాఁడు, పావక=పావనము చేయువాఁడు- అగ్ని- అట్టిదానిని, పావకుఁడు=పావనము చేయువాఁడు, శ్రీల కున్=లక్ష్ములకు, శ్రీ=లక్ష్మి, కీర్తికి=కీర్తి, వేల్పు=దేవత, క్షమా=భూమికి, క్షమ= ఈయున యట్టి మహాత్ముఁడు, ప్రభునామకకోటికిన్=ప్రభువులని పేరుగలవారి సమూహమునకు, ప్రభువు=అధిపతి. బ్రహ్మరుద్రాదులు భగవంతుని యాజ్ఞాను వర్తులు గదా. "ఏవిభుని దివ్యకళాంశజు లజగర్భ గౌరీపతి ముఖ్యదేవ మునిబృందములు॥ భాగ॥ బ్రహ్మకు బ్రహ్మత్వము రుద్రునకు రుద్రత్వము ఇంద్రున కింద్రత్వము వారివారి నాయాయధికారములు మాహాత్మ్యము లీశ్వరసంకల్పాధీనములే కదా. కీర్తికిం గీర్తి, తస్యనామ మహద్యశ యన్నట్లు కీర్తి యితని నాశ్రయించియుండుటచేతనే యందఱవలెఁ గాక మాహాత్మ్యము చెందినది. కానఁ గీర్తికిఁ గీర్తి కలిగించువాఁడు భగవంతుఁడే. వేల్పు వేల్పు = దేవతలకు దేవత "తందైవతానాం పరమంచదైవత"మ్మన్న శ్రుత్యర్థ మిచ్చట వివరింపఁబడెను. క్షమాక్షమ=అన్నిటిని ధరించు భూమినిచూడ ధరించువాఁడు- "యస్మిన్ ద్యౌః పృథివీచాంతరిక్షంచ" యను శ్రుతి యందు వివరింపఁబడెను.భూతతతిం

ప్రభూతము=భూతసమూహములందెల్లఁ బెద్దభూతము- "ఏకో విష్ణుర్మహాభూతం పృథగ్భూతాన్యనేకశః" యను శ్రుత్యర్థ మిందు వివరింపఁబడెను. ఇట్లు శ్రుతిప్రతిపాదితుఁడైన భగవంతుఁడు శ్రీరాముఁడే యని యాయనయందుఁగల కల్యాణగుణములను వర్ణించి యాయనయందు హేయగుణ మొకటియైనలేదని చెప్పి యట్టివానికి లోపముండు నొకొయని చెప్పెను. పట్టనమందున యేని కాననేన్=పట్టనమందున్నను అడవియందున్నను లోపములేదు. అనఁగా నిత్యవిభూతియందుండిన గుణములన్నియు లీలావిభూతియందును గలవు కాని లీలావిభూతియం దేలోపము వికారములేదని భావము. నిత్యవిభూతితోఁ బోల్చినపుడు మనకు లీలావిభూతి యరణ్యమై కానవచ్చును. ఆయనకు రెండును సమానములే. అది వాసగృహమైన నిది క్రీడాశాల. కొండమీఁదనుండి చూచువానికి క్రింది మిట్టలు పల్లములు సమానములే. చక్రవర్తి పట్టనమందైనను జక్రవర్తియే, వనమందైనను జక్రవర్తియే. నేలనడచువానికిఁగదా మిట్టలు పల్లములు- పూర్ణమదః పూర్ణమిదం అను శ్రుత్యర్థ మిచట ననుసంధించునది, లోపము=దుర్గుణము- భగవంతుఁడు హేయప్రత్యనీక కల్యాణ గుణైకతానుఁడు గదా.

### తాత్పర్యము

శ్రీరాముఁడనిన నేమని తలఁచితివో- సూర్యునకు సూర్యుఁడు, అగ్నికి నగ్ని, శ్రీకి శ్రీ, ప్రభువులకుఁ బ్రభువు, కీర్తికిఁ గీర్తి, దేవతలకు దేవత, భూమికి భూమి, భూతములందెల్ల మహాభూతము- ఇట్టివాఁ డరణ్యమునను్నను మహానగరమందున్నను నేమి లోపముండును. ఆయనకు రెండు సమానములే- భేదదృష్టిగల మనకు భేదము తోఁచును.

ఉ॥ శీలవతీమణీః సుతుఁడు • చెచ్చెరవచ్చి ధరాధరాసుతా
శ్రీలను గూడి వేడ్క నభి • షేకము ముప్పిరితోడఁ గైకొనన్
జాలుగబాష్పపూరములు • జాఱ నవాగిగ లోచనంబులన్
హాళిని లోకులెల్లరుఁ గ • నం గలవార లపాస్తశోకులై. ౧౧లా॥

శీలవతీమణీ=పతివ్రతారత్నమా, చెచ్చెరన్=చెరచెర చెచ్చెర=శీఘ్రముగ, ధరా, ధరాసుతా, శ్రీలను=భూమిని సీతను సంపత్తును, జాలుగన్ = ప్రవాహముగ, అపాస్తశోకుఁడై =పోయిన వ్యసనముగలవాఁడై ధరాధరాసుతాశ్రీలు ముప్పిరితోడననుటచే=శ్రీ భూనీళలు స్ఫురించెడిని.

### తాత్పర్యము

పరమపదమందు శ్రీ భూనీళలతోఁగూడిన భగవంతునివలె శ్రీరాముఁడు త్వరగా నరణ్యమునుండి వచ్చి భూ-సీతా-లక్ష్ములతో నభిషేకము చేయించుకొనఁగా లోకులందఱు సంతోషములో నానందబాష్పములు వెల్లువలుపాఱ దుఃఖము వదలినవారై చూడఁగలరు.

క౦॥ భామహితుని నపరాజితు, స్వామిని గుశచీరధరుని బద్మాలయ నా
భూమిసుత యనుగమనించెను, రామునకునుదుర్లభంబు గ్రాలునె యెందున్.

భామహితునిన్ = కాంతిచేఁ గొప్పవానిని, అపరాజితున్ = పరాజయము లేనివానిని, స్వామిని=స్వమ్ముగలవాఁడు స్వామి-స్వమ్ము=సొమ్ము. లోకస్వామి భగవంతుఁడొకఁడే-భామహితునిన్-భామః హితునిన్ = ఓయమ్మా! తనకు హితుఁడైనవానినని యుఁ బదవిభాగము చేయవచ్చును. కుశచీరధరుని = దర్భలతోఁ జేయఁబడిన వస్త్రమును ధరించినవానిని,పద్మాలయునాన్=లక్ష్మీదేవివలె-కుశచీర యనఁగా దర్భలవలెఁ గఱకైన నారవస్త్రములని భావము. లేక దర్భలచే నల్లఁ బడినదనియైనఁ జెప్పవచ్చును. తాత్పర్యము

కాంతిచేఁ బ్రకాశించువానిని, దనకు హితుఁడైనవానిని బరాజయ మెఱుఁగనివానిని సర్వమునకు స్వామియైనవానిని గుశలతోఁ జేయఁబడిన వస్త్రమును ధరించినవానిని లక్ష్మీదేవివలె సీత వెంబడించెను. కావున శ్రీరామునకు దుర్లభం బెందైనఁ గలుగునా. లక్ష్మీదేవి వనవాసము పోయినట్లని సామెత- శ్రీమంతుల కాపద లెక్కడివి యన్నట్లు లక్ష్మితోడనుండువానికి నసాధ్యమేదిగలదు. అన్నియు నామెయే సంఘటింపఁజేయును. భగవత్కార్యములు చేయునది భగవచ్ఛక్తియేకదా.

ఆయన స్వశక్తి యఖండ "అప్రమేయంహి తత్తేజో యస్య సా జనకాత్మజా" యన్నట్లాయనతేజస్సామె సాంగత్యమువలన నప్రమేయముగ వెలుఁగును. కావున శ్రీరాముఁ డెందున్నను శ్రీమంతుఁడే కావున విచారపడకుము.

క౦॥ భీమధనుర్ధరసత్తముఁ డో సుహితా! ఖడ్గమార్గణోగ్రుఁడు నతుపవ
దో ముమ్ము నలక్ష్మణుఁడా, రామునకును దుర్లభంబు గ్రాలునె యెందున్.

రాక్షసులో దుష్టమృగములో తటాలున మీఁదఁబడిన వాఁడుపిల్లు సీత ధ్వంసము చేయఁగలఁడందువా అట్లు భయపడఁ గారణములేదు. ఏలందువా?

భీమ=భయంకరమైన, ధనుః=వింటిని, ధర=ధరించిన, సత్తముఁడు=ఉత్తముఁడు- భయంకరమైన విల్లు ధరించువారిలో శ్రేష్ఠుఁడు-విల్లు ధారమునందున్న శత్రువుల నడ్డగింప నుపక్రమించును. ఖడ్గమార్గణోగ్రుఁడు = కత్తి-బాణములచే భయంకరుఁడు- తటాలున సమీపమున వచ్చినవానిని ఖండింపఁ దీయుపక్రమింపును.

తాత్పర్యము.

భయంకరమైన విల్లు బాణములు కత్తి ధరించి లక్ష్మణుఁడు ముందుపోవు చుండఁ జూచిన రాక్షసులు క్రూరమృగములు భయపడి దూరముననే పరువెత్తఁ గలవు. ఇంక మీదికి నెట్లు రాఁగలవు- ఒకవేళ వచ్చినా లక్ష్మణుని దాటి కదా రాముని దగ్గఱకు రావలెను. ఇంతలో శ్రీరాముఁడు సావధానుఁడగును. కావున నా కొడుకు లక్ష్మణుఁ డాపెంటనుండువఱకు నీకొడుకు శ్రీరామునకు దుర్లభములేదు.

కం॥ ఒట్టగు శపథం బగు నీ,పట్టి యరణ్యంబునుండి • వచ్చిన మరలన్
దొట్టినముదమునఁ జూచెదు, కట్టాశోకంబు మోహ•గరిమయు విడుమీ.

ఒట్టవున్ = ఒట్టుపెట్టుకొని చెప్పెదను- శపథంబవున్ = ప్రమాణముచేసి చెప్పెదను- ఎక్కువ నమ్మకము గలుగుటకై రెండుమార్లు చెప్పుట, పట్టి = కొడుకు, తొట్టినన్=కలిగిన, గరిమ=అతిశయము- ధా. గరిమము-విశ్వకర్మాత్మ శబ్దంబులు ఇమనిజంతంబులు నకారాంత మనుష్యశబ్దంబులు బహుళంబుగ స్త్రీ సమంబులు- సు- వ్యా. తత్సమ ౮౮ సూ.

తాత్పర్యము

ఒకటి రెండు మార్లు ప్రమాణముచేసి చెప్పెదను వినుము- నామాట తప్పదు- నీకొడుకు కరణ్యమునుండి మరలి క్షేమముగా రాఁగా నీవు సంతోషముతోఁ జూడఁగలవు కావున శోకము మోహము వదలిపెట్టుము.

కం॥ ఈనీపదములఁ బడి యెూ, మానిని! నీతనయుఁడే న•మస్కృతిఁ జేయన్
జానుగ నుదితాబ్జునివలెఁ, గానం గల వేల నీకు•గాఁతియుపడఁగన్. ౧౧౫

ఉదితాబ్జునివలెన్=ఉదయించు చంద్రునివలె ననఁగా శుక్లపక్షమునఁ బాడ్యమినాఁటి చంద్రునివలెనని భావము- పూర్ణచంద్రుఁడని చెప్పిన నావల క్షీణదశ సూచించును, గాఁతియ=దుఃఖము, ఈ నీ పదమునన్=జన్మాంతరమునఁ గాదు. ఈ జన్మమందే నీవుకన్న కొడుకే మఱియెవ్వఁడోగాఁడు, ఈనీపదములందే మఱియెవ్వరి పాదములందోకాదు.

తాత్పర్యము

నీయొక్క యీ పాదములందే పడి నీ కొడుకు నమస్కరింపఁగా సంతోషముతోఁ గ్రొత్తగాఁ బుట్టు చంద్రునివలె నీవు చూడఁగలవు- ఏల వృథా బాధ పడెదవు, నీవు జీవించియుండఁగనే నీకొడుకు మరల రాఁగలఁడు.

కం॥ క్రమ్మఱి పురికి న్వచ్చి సు,ఖమ్ముగ నభిషిక్తుఁ డైన•గాధిలిపుత్రున్
నెమ్మది నానందాశ్రులు, గ్రమ్మఁగఁ గనులారఁ జూడ•గలవు సుశీలా. ౧౧౬

తాత్పర్యము

అడవినుండి మరలి యయోధ్యకు సుఖముగా వచ్చి పట్టాభిషేకము చేసి కొన్న ప్రియపుత్రుని నే విచారములేని మనస్సుతో సంతోషమువలనఁ గన్నుల యందు నీరు గ్రమ్ముచుండఁ గన్నుల పండువుగ నీవే చూడఁగలవు. ఎక్కడి పదునాలుగేండ్లు? ఎక్కడి నేను? అంతవఱకు నేను జీవింతునని యేమినమ్మకము. నేను జీవించియుండినను రాముఁడు జీవించి మరలి వచ్చునని యేమినమ్మకము? ఏధైర్యముతో నీవీమాట చెప్పెదవందువా నీవు సుశీలవు. నీకు దీర్ఘశోకము భగవంతుఁడు కల్పింపఁడు. ఇప్పటిశోకము మబ్బునీడవంటిది.

కం॥ శోకింపకు మమ్మా దుః,ఖాకుల విటు గాకు పుత్రు•నందవు కిదుల్
వే కాంచెదు సహలక్ష్మణు, ప్మైకన్యాసహితు రామ•చంద్రుని నిచటన్.

దుఃఖాకులవు=దుఃఖముచేఁ గలఁతనొందినదానవు. ౧౮౩

తా త్ప ర్య ము.

అమ్మా! యేడువకుము- దుఃఖముచేఁ గలఁతనొందకుము- నీ కొడుకున కేహానియు రాదు. లక్ష్మణుతోడను సీతతోడను గూడిన నీకొడుకును శ్రీరామచంద్రుని నీయూరనే, నీయింటనే, పరలోకమందుఁగాదు చూడఁగలవు.

కం॥ ఇందఱ నూరార్పఁగ నీ,కుం దగ వగుఁ గాక నీవ•కోమలి వగపుం
జెందఁగ ని న్నూరార్పఁగ, నిం దెవ్వరు గల రిదేమి•యేడ్చెద విట్టుల్.

తా త్ప ర్య ము ౧౮४

శ్రీ సీతారాములకై యిందఱు దుఃఖించుచున్నారు. అంతియకాక నీదశ చూచియు నీకై శోకముపడుచున్నారు. వీరినందఱును నీవు ధైర్యము వహించి యూరార్పవలయును, గాని నీవిట్లు దుఃఖపడుచుండిన నిందు నిన్నెవ రూరార్చువారుగలరు? సీతారాముల దుఃఖముగాక నీదుఃఖము మాకందఱకుఁ గలిగింప న్యాయ్యమా?

కం॥ రాము జనయిత్రి వై గుణ,ధామా! దుఃఖింప నీకుఁ•దగునే చెపుమా
రామునికంటెను వే ఱొకఁ, డీమహి సన్మార్గవ ర్తి•యేఁడి లేఁడే. ౧౮౫

గుణధామ=గుణములకు నిల్లైనదానా.

తా త్ప ర్య ము

శ్రీరామునివంటి ధీరునకుఁ దల్లివై నీవిట్లు శోకింప నీకుఁ దగునా? నీవే చెప్పుము-తల్లి గుణములుకదా కొడుకునకు వచ్చును. నీవెంతటిధీరవో కాక మఱి యెకదానవైన నీకడుపున శ్రీరామునివంటి ధీరుఁ డెట్లు పుట్టును. నీవు సద్గుణములకు స్థానమైనదానవు కదా శ్రీరామునికంటె సన్మార్గమందు నడచువాఁడు వేఱొకఁడుండిన జెప్పుము- ఏఁడీ- ఎక్కడనున్నాఁడు- లేఁడు కదా.

ఆ॥ వందమానుఁ డై న•నందను సహమిత్రుఁ, గాంచి కూర్మిపుత్రుఁ•గన్నులారఁ
గారునందు నీరు•గార్చు మబ్బన హర్ష,జలకణాళి విడుప•గలవు నీవు.

కారునందు=వానకాలమున, వందమానుఁడు=నమస్కరించుచున్నవాఁడు, నందనున్=కుమారుని, సహమిత్రున్=మిత్రులతోఁ గూడినవానిని, హర్షజలకణాళి =ఆనందబాష్పములు.

తా త్ప ర్య ము

స్నేహితులతోఁ గూడినవాఁడును నమస్కరించుచున్నవాఁడును నగు నీ ముద్దులకొడుకును గన్నులారఁజూచి వానకాలమందు మేఘము వర్షము గురియునట్లు లానందబాష్పములు కురియింపఁగలవు.

ఉ॥ వైశమ వచ్చి త్వచ్చరణ•వారిజముల్ దనమెత్తచేతులన్
హాళిని బట్టి నీతనయుఁ•డాతనిశీర్షముమీఁద నశ్రువుల్
శైలముమీఁదఁ గార్మొయిలు•లాగునఁ జాలుగొనంగఁ జేయఁగాఁ
జాలిద వీవ, యిప్పుగిది•జాలిఁబడం బని యేమి చెప్పుమా. ౧౧౬

వైశమ = శీఘ్రముగానే, త్వచ్చరణవారిజముల్ = నీ పాదకమలములు, జాలుకొనంగన్=వెల్లువపాఱఁజేయఁగా, జాలి=వ్యసనము.

తాత్పర్యము

శీఘ్రముగా వచ్చి నీ కుమారుఁడు శ్రీరాముఁడు నీ పాదకమలములను తన మెత్తని చేతులచే సంతోషముతోఁ బట్టుకొని నమస్కరింపఁగా నతని శిరము మీఁదఁ గారు మబ్బు జడివాన కురియించునట్టు లానందబాష్పములు నీవే వెల్లువ పాఱఁజేయఁగలవు. అట్టి నీవే వ్యసనపడఁ గారణమేమి?

కం॥ ఈసరణినుడులచే నా,శ్వాసింప సుమిత్ర పెక్కు•చందంబుల నా
కౌసల్య శోక మంతం, బాసెను శరదభ్రవారి•వారిద మనఁగన్. ౧౧౭

ఈసరణిమాటలన్=ఇట్టి మాటలచే, ఆశ్వాసింపన్=ఊరార్పఁగా, శరదభ్ర వారి వారిదము=శరత్కాలమందుఁ గొంచెము నీళ్ళుగల మేఘము.

తాత్పర్యము

ఇటువంటి మాటలచే సుమిత్ర పెక్కువిధముల కౌసల్య నూఱడింపఁగా నామెయుఁ గొంచెము నీరుగల శరత్కాలమేఘ మా;నీటిని విడిచినట్లు శోకమంతయుఁ బాసెను.

— • ౪౫-వ సర్గము. శ్రీరాముఁడు పౌరులను మరలిపోవఁ బ్రార్థించుట. • —

సీ॥ అక్కడఁ శ్రీరాముఁ•డడవిమార్గముఁ బట్టి, చనుచుండ ననురక్తి•జనము లెల్ల
రథము వెంబడిఁ బోవ•రాజును సచివులు, వల దని వారింప•వారు వినక
పోవుచు నుండిరి•పురమునవారికి, నతులయశస్వి రా•కాబ్జునట్టి
వాఁడు పౌరులు దన్ను•వలదయ్య, మరలుమంచును వేఁడ•మరలఁడయ్యెఁ
తే॥ దనదు జనకుని సత్యవా•దిని బొనర్ప, నిట్లు పోవుచుఁ దనవెంట•నేగుదెంచు
ప్రజలనెల్లరఁ దనకన్న•ప్రజలయట్లు,
స్నేహమునఁ జూచి యును రఘు•శేఖరుండు. ౧౧౮

శ్రీరామ నిర్గమనానంతరము పౌరులయు నంతఃపురమువారలయు నవస్థయు సుమిత్ర కౌసల్యకు దుఃఖోపశమనముఁ గావించుటయుఁ దెలిసి యిఁక శ్రీ సీతారామలక్ష్మణుల వృత్తము చెప్పఁబడుచున్నది- అక్కడన్ = పురము వెలుపల, అనురక్తిన్=ప్రేమముచే, సచివులు=మంత్రులు, పురమునవారికి = పురమునందలివారికి "చేటుపురంబున వారి కెమ్మెయిన్" భార. విరాటపర్వము. అతులయశస్వి=అసమానకీర్తిగలవాఁడు, రాకాబ్జునట్టి=రాకా=షోడశకలాపూర్ణుఁ

డైన చంద్రునిఁగల రాత్రియుందలి,అబ్జునట్టి=చంద్రునివంటి,తన కన్న ప్రజలు= తాను గన్నబిడ్డలు.

తాత్పర్యము

పురము వెలుపల శ్రీరాముఁ డడవికిఁ బోవఁబట్టి పోవుచుండ ననురాగము గలవారగుటచే జనులందఱు రథము వెంటఁ బోవుచుండ రాజును మంత్రులు పోవలదు పోవలదని నిలిపినను వారు నిలువక పోవుచునుండిరి.

బంధువుల ప్రేమకు లోకులభక్తికి నెంత భేదము కలదు!! పురమునందలి వారికి ననమానకీర్తిగల శ్రీరామచంద్రుఁడు పదునారు కళలతోఁ గూడిన చంద్రునివంటివాఁడు కావునఁ బున్నమనాఁటి నిండు చందురుని జూడఁబోవలదు. మూలయింటఁ గూర్చుండుఁడనిన నెవరువిందురు. రాజులుమంత్రులు శ్రీరాముని వెంట మీరుపోవలదని చెప్పినఁ బ్రజలు విననట్లు ప్రజలు పోవలదు పోవలదని చెప్పినను శ్రీరాముఁడు తండ్రిని సత్యవాదినిజేయఁ దలంపు గలవాఁడగుటచే వినఁడయ్యె. మనో నేత్రాహ్లాదముగోరి జనులు నిలువనపుడు పరలోక సౌఖ్యము తండ్రికిఁ గలిగింపఁగోరిన శ్రీరాముఁడా నిలుచును. ఇట్లు పోవుచుఁ దనవెంట వచ్చుచున్న పురజనులఁజూచి శ్రీరామచంద్రుఁ డిట్లనియె. దీనివలన రాజాజ్ఞ మీఱియైన భగవదనుగమనము చేయవలయునని యేర్పడుచున్నది.

కం॥ నాయందలిమీప్రీతియు, నాయందలిగౌరవంబు • నయగుణులారా
  చేయుఁడు భరతునియెడ మీ,
    రాయదియే నాకుఁ గడుఁ బ్రి • యంబగుఁ జుండీ. ౧-౨౦

నయగుణులారా=న్యాయ్యవర్తనమే గుణముగాఁగలవారలారా.

తాత్పర్యము

నాయందు మీకుఁగల ప్రీతిగౌరవములు, భరతునియందుంపుఁడు-అట్లు మీరు చేసితిరేని నన్ను మీరు గౌరవించుటవలన సంతోషపడుటకంటె హెచ్చుగ సంతోషపడెదను. భగవంతుఁడు తన్నర్చించువారికంటెఁ దన భక్తుల నర్చించు వారి విషయమున నెక్కువగ సంతోషించునుగదా.

తే॥ అతఁడు కైకసుతుఁడు క • ల్యాణచరితుఁ
  డారఁ బ్రియము హితం బగు • నవియ యెల్ల
  మీకు ఘటియించు నెప మెర • మెర విడుఁడు
  పదఁడు మీమీగృహములకుఁ • బౌరులార. ౧-౨౧

కల్యాణచరితుఁడు=లోకులకు మేలగు మంచి నడవడిగలవాఁడు, మెర మెర=దుఃఖము సందేహమువలనఁ గలుగు మనోవికారము, పదఁడు=పొండు.

తాత్పర్యము

భరతుఁడు కైక పుత్రుఁడు గదా యని మీరు సందేహింపవలసిన పనిలేదు. అతఁడు మంచి నడవడిగలవాఁడు- మీకు నింపైనవి మేలైనవియగు కార్యము

లన్నియుఁ జేయును. మీ కహితము చేయఁడు. ఏమోయని సందేహముగాని భయముగాని దుఃఖముగాని వలదు. పౌరులారా మీమీ యిండ్లకు మీరు పొండు.

కం॥ వినుఁడు వయస్సున బాలుం,
డును జ్ఞానమునందు వృద్ధుఁడును మృదుగుణుఁడున్
ఘనవీర్యవంతుఁ డాతం, డనురూపపుభర్త మీకు నగు భయ మేలా.

భరతుఁడు పిల్లవాఁడు. ఆయనకు లోకులవిచార మేమి కాఁబట్టినదని తలఁప వలదు. వయస్సునఁ జిన్నవాఁడైనను జ్ఞానమునందు వృద్ధుఁడు. మిఁదు మిక్కిలి పిల్లతనపుఁ జేష్టలు లేకుండుటే కాక మృదువైన గుణము గలవాఁడు. అటువంటి మెతక మన్మేమి రక్షించునందురేమో- వీర్యము గలవాఁడు నయమున లోపడనివారిని దండించు శక్తిగలవాఁడు. కావున మీకుఁదగినభర్తయే. నిష్కారణభయము మీకేల?

కం॥ రాజగుణలక్షితుఁడు యువ,రాజుగ నియమింపఁబడె భరతు డటుగానన్
రాజాజ్ఞ కార్యముగఁగా,యోజింపుఁడు నాకు మీకు నున్న జనులకున్.

ఉన్న=తక్కిన. తాత్పర్యము ౧౩

రాజగుణలక్షితుఁడు=గొప్ప రాజులయందు నుండవలసిన గుణములన్నియుఁ గలవాఁడు కావున భరతుఁడు మీకు యువరాజుగా రాజుగారిచే నియమింపఁ బడెను. అట్టి రాజాజ్ఞప్రకారము మీరు నేను తక్కిన జనములు నడువవలసిన వారమే కదా.

ఉ॥ నాకుఁ బ్రియంబు సేతయు మనంబున మీకు రుచించు నేని యో
లోకులు! నే నరణ్యములలోఁ జరియించెడివేళఁ దండ్రికిన్
స్తోకముఁ గుందు లేనిగతిఁ జూచికొనుం డని చెప్పఁ జెప్ప ధ
ర్మైకరతాత్ము భూపతిగ నందఱుఁ గోరిరి రాము నయ్యెడన్. ౧౪

లోకులు=లోకులారా, స్తోకము=అల్పము, కుందు = దుఃఖము, ధర్మైకరతాత్మున్=ధర్మము నొక్కదానియందే ప్రేమగల మనస్సుగలవానిని.

తాత్పర్యము

లోకులారా! నాకు సంతోషము గలిగింప మీకు నిష్టమేని నే నడవులలోఁ దిరుగు కాలమందు మా తండ్రికిఁ గొంచెమైన వ్యసనము మనస్సునకుఁ దగుల కుండునట్లు కనిపెట్టుఁడు అని యెంత చెప్పినను ధర్మము నొక్కదానియందే ప్రీతిగల శ్రీరాముఁడే రాజుగనుండ వారెల్లఁ గోరిరి. మొదట యువరాజుగా నిన్నే కదా రాజు నియమించెను. ఆ యాజ్ఞ నీవు మేము దాఁటరాదుగదా రారమ్ము పోదమనిరి.

కం॥ ఎంతెంత జనకతనయా, కాంతుఁడు ధర్మంబునుండి కదలఁడొ తిరుఁడై
యంతంత పౌరులును భూ,కాంతునిఁగా రామవిభునిఁ గాంక్షించిరదన్.

తిరుఁడై = స్థిరుఁడై. ౧౫

తాత్పర్యము

శ్రీరాముఁడు మనస్సు స్థిరము చేసికొని ధర్మమునుండి యెట్లు చలింప లేదో ప్రజలును నిటువంటి ధర్మాత్ముఁడు గదా మనకు రాజుగా నుండఁదగిన వాఁడు కావున నీయననే మనము మరలించుకొనిపోయి రాజుగాఁ జేసికొన వలయునని వారును బట్టుపట్టిరి.

కం॥ కన్నుల బాష్పము లురల, న్విన్ననిమోమునను వచ్చు•నిఖిలజనములన్
ప్రన్ననితనగుణముల నా,యన్న సలక్ష్మణుఁడు గట్టి•యాకర్షించెన్.

విన్నని=తెల్లఁబోయిన, మోమునను=ముఖములతో- మోమునను అను నేకవచనప్రయోగముచే నందఱ ముఖము లేక విధమునఁ దేజోహీనమైయుండె నని భావము. ప్రన్నని=మనోహరములగు, తన గుణములన్=తన గుణములను, త్రాళ్ళచే=శ్లిష్టరూపకము, సలక్ష్మణుఁడు = లక్ష్మణునితోడి శ్రీరాముఁడనుటచే ధర్మమునందు నిరువురు సమానులని భావము. అనఁగాఁ గౌసల్యయొద్ద మాట లాడినట్లు పౌరులపక్షమున మాటలాడక శ్రీరాముఁడు చెప్పినదాని కనురూపముగ లక్ష్మణుఁడు చెప్పెనని భావము, ఆకర్షించెన్=లాగెను.

తాత్పర్యము

కన్నుల నీళ్ళుకాఱఁగాఁ దెల్లవాఱిన ముఖములతో వచ్చు నెల్ల జనులను లక్ష్మణుతోడి శ్రీరాముఁడు తన మృదుగుణములను త్రాళ్ళచేఁగట్టి యీడ్చుకొని పోయెను. కన్నుల నీళ్ళునిండి త్రోవకానరాకయున్నవారిని దానే లాగుకొని పోయెనని భావము.

కం॥ జ్ఞానవయస్తేజముల న,నూనంబుగ వృద్ధులైన•యుర్వీజనముల్
మానక తల వడఁకెడివా, రీనెఱి వెను చిక్కి యనిరి•యెలుఁగెత్తి వ్యథన్.

జ్ఞానవయస్తేజముల్ = జ్ఞానమునందు వయస్సునందు తేజమునందు, అనూనంబుగన్=మిక్కిలి, ఈనెఱి=ఈవిధముగ,ఎలుఁగెత్తి=పెద్దధ్వనితో- రెండవ పాదంబున నఖ యతి.

తాత్పర్యము.

జ్ఞానమునందు, వయస్సునందు, తపస్సువలనఁగలిగిన తేజమునందు మిగుల వృద్ధులగువారు తల వడఁకుచుండ రథము వెంటఁ బరువెత్తఁజాలక వెనుకఁజిక్కి మిగుల దుఃఖము బాధపడుచు గొంతెత్తి పెద్దధ్వనితో నిట్లనిరి.

ఉ॥ ఓరఘురాము మోసికొని•యుద్గతిఁ బోయెడిజాతివాజులా
రా! రమణున్ విభాసిగ న•రణ్యముకైకొనిపోదు రేయిటు
ల్బౌరజవంబుమాని మర•లుం డిఁకఁ బోకుఁడు, దాఁటఁ జెప్ప సీ
తారమణుండు వృద్ధలపి•తంబులు మీ రిటు మీఱఁ బెల్లునే. ౧౧-౫౦౪

ఉద్గతిన్=మిగులవేగమున, జాతివాజులారా! ఆమంత్రణంబున విశిష్టాఽ విశిష్ట సంబోధ్యవాచకంబునకు ముందు విభాషగ ఓ యగుఁను. వ్యా. తత్సమ-

వ్యా. ౨౮. ఉత్తమజాత గుఱ్ఱములారా, ఉద్గతి=ఊర్ధ్వగమనము- శ్రీరాముని మోచికొనిపోయిన కారణమున నా సేవాఫలముగ గుఱ్ఱములకుఁగూడ నూర్ధ్వ లోకగతులుగలవని భావము- జాతియనఁగా నుత్తమజాతియనియే భావము. 'సానలఁదీరిన జాతిరత్నముల్' వసుచరిత్ర ౧ ఆశ్వా, వాజి=గుఱ్ఱము- వాజము గలది- పూర్వమున గుఱ్ఱములకు ఱెక్కలుండుటచే నీ పేరు వచ్చినది, రమణున్= ప్రియుఁడైనవానిని, క్రూరజవంబు=తీవ్రవేగము. అచేతనజవము క్రూరముగాదు- క్రూరుఁడైనవాఁడు పరులకు బాధ గలిగించునట్లు మీవేగము మాకు బాధకరముగ నున్నదని భావము- మిమ్ము వేగముగఁదోలువాఁడు నిర్దయుఁడు- అతఁడు శ్రీరామాజ్ఞ ప్రకారము వర్తించువాఁడు గనుక శ్రీరాముఁడు నిర్దయుఁడని భావము. శ్రీరాము ననలేకయు వానిని సంబోధించిన శ్రీరామునకు దయవచ్చు నను తాత్పర్యముతోను గుఱ్ఱముల సంబోధించుచున్నారు, వృద్ధలపితంబులు= పెద్దలమాటలు.

తాత్పర్యము

శ్రీరాముని మోచికొనిపోవు నుత్తమాశ్వములారా! మీరు పశువులు కావున మీరు సత్కార్యముచేయునది అసత్కార్యము చేయునది మీకుఁ దెలియలేదు. తెలిసియుండిన లోకరమణుఁడైన శ్రీరాముని నరణ్యములో విడిపింప నిటు లేమో మునిఁగిపోయినట్టు లింత వేగముగఁబోదురా. మీరు చేయు కార్యము లోకుల కెంత బాధగలిగించునదో పశువులైన మీకేమి తెలియును. ఇఁకఁ బోవ వలదు. వెనుకకు మరలుఁడు మీకై తోఁపకున్నఁ జెప్పినమీఁదనైన వినుఁడు. పెద్దవారి మాటలు శ్రీరాముఁ డతిక్రమింపఁడే. శ్రీరాముని గుఱ్ఱములై మీరతిక్ర మింపవచ్చునా? పోవలదన్నను బోవచ్చునా?

తే॥ కర్ణవంతము లయినవృ•గంబులందు,
గుఱ్ఱములె శ్రేష్ఠములు గదా•కోర్కెగలిగి
యెన్నఁడెవరిని వేఁడము•యిట్టిమేము,
మిమ్ముఁ బ్రార్థించెదము వేగ•క్రమ్మఱుండు. ౧-౨౦౯

కర్ణవంతములు = చెవులుగలవి- సూక్ష్మధ్వనినైన గుఱ్ఱములు గ్రహింపఁ గలవు. అట్టి మీకు మా మాటలు వినరాలేదా- ఇది పొగడ్తమాటయునగు- మిమ్ము=పశువులైన మిమ్ము- మనుష్యులమైన మేము.

తాత్పర్యము

చెవులుగలవానిలోనెల్ల సూక్ష్మధ్వనినైన గ్రహించుశక్తి మీయందు విశేష ముగఁగలదు. అట్టి మీకు మా మాటలు వినరాలేదా. అట్లు పోవుచున్నారేమి? ఇంతవఱకు మే మెవరిని దేనినేని యాచించినవారముగాము- ఇప్పుడు మిమ్ముఁ బ్రార్థించుచున్నాము. వెనుకకుఁ దిరుగుఁడు- ఇది మా ప్రార్థన- యాచకుల

యాశ వ్యర్థముచేయనివాఁడు=శ్రీరాముఁడు. అట్టి శ్రీరామునియొద్దఁజేరి మీ రిట్లుచేయుట తగదు. దీనివలన నాయనకు నపకీర్తివచ్చును.

కం॥ వీరుఁడు ధర్మైకసదా,చారుఁడు పూతుండు రామ•చంద్రుం డతనిన్
మీరలు వురకిని గొనిరా, కారణ్యతలాశి విడువ•నంగెద రేలా! ౧౨౧౦

ధర్మైకసదాచారుఁడు=ధర్మమే ప్రధానముగాఁగల మంచి యాచారము గలవాఁడు, పూతుఁడు=పరిశుద్ధుఁడు.

తాత్పర్యము

శ్రీరాముఁడు శూరుఁడును ధర్మమే ప్రధానముగాఁగల మంచి యాచారము గలవాఁడు త్రికరణములందుఁ బవిత్రుఁడైనవాఁడు. అట్టివానిని మీ రితర దేశములందున్నను మన యూరికిఁ బిలుచుకొనిరావలసియుండఁగా మన యూరనున్నవాని నడవులలో విడిపింపఁ దీసికొనిపోయెదరేల? ఎంత మీరు పశువులైనను నీమాత్రము జ్ఞానములేదా. (ఈ నిందాగర్భవాక్యములు పరంపరగా శ్రీరామునకే యన్వయింపవలయును.)

—• పౌరవృద్ధులు శ్రీరామునిఁ బురికి రాఁ బ్రార్థించుట. •—

చం॥ అని ప్రలపించుసద్ద్విజుల•యార్తనినాదము లాలకించి గ్ర
క్కన తనభార్య దమ్ముఁడు ది•గం దనతోడ రథంబుఁ గాల్నడన్
జనియెను సన్నికృష్టపద•చారములం దనవెన్క నున్నయా
జను లెయిదన్, రథస్థుఁ డయి•సాధ్యము గామి మరల్చ వారలన్. ౧౨౧౧

ప్రలపించు=ఏడ్చు, సద్ద్విజుల=బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క, ఆర్తనినాదము =ఏడుపుధ్వని, సన్నికృష్టపదచారములన్=దగ్గఱ దగ్గఱ నడుగులు పెట్టికొనుచు, వీరెదుగుదురు గాక యని తాత్పర్యము- మరలుట వ్రతభంగము- నిలుచుట ఆలస్యకారణము కావున మెల్లగ నడచిరి. పెద్దవారు నడచివచ్చినపుడు పిన్నలు వాహనము లెక్కరాదు- "తస్మాజ్జ్యాయాంకనీయాన్ ప్రత్యవరోహతి" శ్రుతి॥ పెద్దవారిని జూచి వాహనములం దున్నవారును దిగవలెను.

"దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనంబైన యానంబును మనంబలరంజనిచని యొక్కయెడ నారద జమదగ్ని కణ్వాదులగు మహామునులం గొందఱంగని రథంబుదిగ్గి నమస్కరించి కృష్ణుఁడు" భార. ఉద్యో. ౩. ౧౪౫, ఎయిదన్=ఎద్దిగి కలిసికొనఁగా.

తాత్పర్యము

ఈప్రకారము నేడుపుధ్వనితో బిగ్గఱగాఁ బలుకుచుండు నాబ్రాహ్మణశ్రేష్ఠుల మాటలు విని త్వరగా రథము పోనిచ్చిన వారు కలిసికొనలేక దశరథునివలె వెనుకకు మరలిపోవుదురని తలఁచి రథమును ద్వరగాఁ దోలించెను- గాని వారు మరలక వెంటనే వచ్చుచున్న కారణముచే నింకఁ ద్వరతోఁబోయిన వారికి నెక్కువ బాధ

గలిగించినవాఁడవగుదువని శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతోఁ దేరు దిగి వారు కలిసికొందురుగాక యని మెల్లగ నడుగులో నడుగు పెట్టుకొనుచుఁ బోయెను.

క॥ తేరున్ దిగ్గనఁ గాల్నడఁ, జారిత్రసువత్సలుండు•చనఁగఁ గృపాక్షున్
  జేరి యిటు లనిరి ద్విజులో, శ్రీరామ యిట్లు సేయఁ•జెల్లునె నీకున్.

చారిత్రసువత్సలుండు=సదాచారమందు మిగులఁ బ్రీతిగలవాఁడు-గనుకనే మరలలేదు-నిలువలేదు, కృపాక్షున్=దయారసముచే నిండిన కన్నులుగలవాఁడు-గనుకనే తన వ్రతము చెడకుండునట్లు వారికి బాధలేకుండునట్లు రథము దిగి నడచెను. శ్రీరామ యిట్లుచేయఁ జెల్లునె నీకున్=ఇట్లు చేసిన శ్రీరాముఁడను పేరు నీకుఁ దగునా? శ్రీరాముఁడనఁగా వేషముచేత-వాక్కుచేత- రచనాదులచేతఁ గాంతిచేత సంపదచేత లోకులను రమింపఁజేయువాఁడవు గదా. ఇటు మమ్ము దుఃఖపడఁజేసిన నీకెట్లు ఆపేరు సార్థకమగును.

తాత్పర్యము

తేరుదిగి మరలక నిలువక కాలినడఁ జేఁ బోవుచుండు సదాచార ప్రీతిగల శ్రీరాముని కరుణారసపూర్ణనేత్రుని గలిసికొని యా బ్రాహ్మణు లిట్లనిరి. శ్రీరామ శ్రీరాముఁడని పేరుగల నీవుకూడ నిట్లు చేయవచ్చునా. ఇట్లు చేసితివేని "నీకా పేరు నేతిబీరకాయవంటిదిగదా" యగును.

సీ॥ బ్రహ్మణ్యుఁడగు నిన్ను•బ్రాహ్మణ్య మిది యెల్ల,
  వెనుకొని వచ్చెడిఁ•గనఁగదయ్య
 యరణులయందు స•మారోపితంబులై, యగ్నులు వచ్చె ద్వి•జాంసములను
  వాజపేయాధ్వర•ప్రాప్తాతపత్రముల్, శరదభ్రగతి వచ్చె•జాడఁ గనుము
  ఛత్రహీనత నీవు•సంతాప మిటు లేల, పొంద నొంటికి దివ్య•సుందరాంగ

తే॥ యస్మదీయముల్ వాజపే•యార్జితంబు,
  లయిన గొడుగులు పట్టెద•మయ్య వాని
 చాయలను రమ్ము వేదాను•సారిణమతి సనుము నీతోడఁ దిరుగంగ•వాంఛపడియె.

బ్రాహ్మణు లిట్లు తమలో చెప్పుకొన్నను శ్రీరాముఁడు నంగీకరింపకుండుట చూచి యిట్లనిరి [illegible] నీవెంటఁ బిలుపుకొని [illegible] యనుసరించుచున్నారు. బ్రహ్మణ్యుఁడు=బ్రాహ్మణులను దేవతలవలె [illegible] బ్రాహ్మణులు తనకుఁ బ్రియులుగాఁ గలవాఁడు, బ్రాహ్మణ్యము=బ్రాహ్మణసమూహము, అరణులయందు=నిప్పు కలిగించెడి కొయ్యలయందు, సమారోపితంబులై=ఆరోపింపఁబడినవై, ద్విజాంసములను=బ్రాహ్మణుల మూఁపులమీఁద, వాజపేయాధ్వర=వాజపేయమను యాగమునందు, ప్రాప్త=లభించిన, ఆతపత్రముల్=గొడుగులు, శరదభ్రగతిన్=శరత్కాలమందలి తెల్లని మేఘమువలె, జాడ=విధము, ఛత్రహీనతన్=గొడుగులేక, అస్మదీయముల్=మావి, వాజపేయార్జితంబులు=వాజపేయమందు సంపాదించినవి. "బృహస్పతి

సవేనవా ప్రత్యవరోహిణీయేన యజేతశ్వేతచ్ఛత్రీ భవతీతివిజ్ఞాయతే"- యని వాజపేయయాగము చేసినవారు యావజ్జీవము తెల్లనిగొడుగు ధరింపవలెను, ఛాయల=నీడలందు, వేదానుసారిణీమతి=మేమింతవఱకు నిశ్చింతముగా వేదాధ్యయన జపతపములచేఁ గాలము గడపువారము- ఇప్పుడు నీ వరణ్యమునకు బయలుదేఱ వానినన్ని వదలి నీ వెంబడి రాఁదొడఁగితిమి- ఇఁకమీఁద నవి జరగకుండిన నాదోషము నీదేయని భారము శ్రీరాముని మీఁద వైచుచున్నారు, వేదానుసారిణీ=వేదాభ్యాసముచేతను మంత్ర జపముచేతను వేదములనే యనుసరించియున్న మనస్సు- వైదికకర్మములను వదలినవారు వ్రాత్యులగుదురుగదా యనిన నెవని నిమిత్తమెయనఁగా నెవనిఁ బ్రాపించుటకై యీవైదికకర్మముల నెల్ల మేము చేయుచున్నామో యట్టి కర్మఫలమగు నీవు మమ్ము వదలిపోయిన నిష్ఫలకర్మములఁజేసి యేమి లాభము- మాకుఁ బ్రాప్యము నీవుగాని యవి గావు- ఇంతవఱకుఁ గర్మముల నుపాయముగాఁగొని నిన్నుఁ బ్రాపింపఁ గోరియుంటిమి- ఇఁక వానితో మాకుఁ బనిలేదు- నీవే యుపాయమని నీ సేవయే కర్తవ్యమని నీవెంటనే వచ్చెదము-

చం॥ కటకట మోసపోయితిమి కాంతలపాటియు బుద్ధిలేదునేఁ
డిటహరిఁ గానఁబోనెఱుఁగ మేముదురాత్మల మేముకల్మషో
ద్భటులము విష్ణుదూరగుల బ్రాజ్ఞతలేల తపంబులేల వ
ర్యటనములేల శీలములు యాగములున్ మఱియేలకాల్పనే॥

అను భాగవతవాక్యము స్మరించునది-చేత వెన్ననుంచుకొని నేతికై పరులఁ బ్రార్థించువాఁడేమాత్రము బుద్ధిమంతుఁడు. భగవత్ప్రాప్తికై భగవంతుని యాశ్రయము వదలి కర్మనులఁజేయువాఁడేపాటి బుద్ధిమంతుఁడు.

## తాత్పర్యము

బ్రాహ్మణప్రియుఁడవైన నీవెంట బ్రాహ్మణసమూహము వచ్చుచున్నది. ఇందేమి దోషము మమ్మేల రావలదనెదవు- మీరు నిత్యాగ్నిహోత్రులు- మీరిటు వచ్చిన నగ్నులు చెడునుగదా యందువేమో- అగ్నుల నరణులయందారోపించితిమి- వానిని బ్రాహ్మణులు భుజములమీఁద నుంచికొని మోచి తెచ్చుచున్నారు. నిరతాగ్నిహోత్రులే కాదు- వాజపేయయాగము చేసినవారుకూడ వచ్చుచున్నారు. అదిగోఁ జూడుము- వారి తెల్లనిగొడుగులు- నీవేల యెండలో నిట్లు నడచిపోవవలయును. వాజపేయయాగమందు మేము సంపాదించి యావజ్జీవము ధరింపవలసిన గొడుగును నీకుఁ బట్టెదము- ఫలభోక్తవు నీవేకదా. నీవు వాని నీడలలో రమ్ము- వేదముల నేమి చేసెదరనుదువా- నీతోడనుండి, యుండినచోటనే, యధ్యయనము చేసెదము-వేదముల ననుసరించియే మా మనస్సులున్నవి- వేదములందుఁ బ్రాప్యుఁడవు నీవే యని చెప్పఁ దెలిసికొంటిమి- అట్టి ప్రాప్యముగు నీవు విడనాడిపోయిన మాయజ్ఞములేల? తపస్సులేల? వేదము

లేల? వానివలనఁ గలుగు ఫలమున కంటె నీతోడనుండుటే యెక్కువ ఫలము. కావున నీతోడ మేమును నడవులందుఁ దిరిగెదము. నీతోడనుండువఱకు మాకుఁ గర్మలోపభయములేదు. నీసేవకు విరుద్ధమగు కర్మము త్యాజ్యమనికదా శాస్త్రము చెప్పుచున్నది.

"నాయమాత్మా ప్రవచనేనలభ్యః, నమేధయా న బహునాశ్రుతేన యమే వైషవృణుతే తేనలభ్య" యను శ్రుతివాక్య మిచ్చట ననుసంధించునది- ఈ యాత్మ వేదాధ్యయనముచే లభింపదు-బుద్ధిబలముచేతను లభింపదు-పెక్కులు వినుటచేతను లభింపదు- తన్ను వరించువానికి లభించును అని యర్థము. ఈ వేదవాక్యము ననుసరించి మనస్సుగలవారమగుట మేము నీవెంటఁబడినారము. నీవే మమ్ము ననుగ్రహించి స్మరించి వరించి రక్షింపవలసియుండఁగా మేము నిన్ను వరించినను నిరాకరించెదవేల? శ్రుత్యర్థము వ్యర్థమా? ఈఫలము గలిగింపవేని యా వేదాధ్యయనము యజ్ఞములు లోనైనవి వ్యర్థములు.

కం॥ పాతివ్రత్యసురక్షిత, లౌతరుణులు నిలుచువారిఁ లాలయములలోఁ
 బూతాస్మత్పరమార్థము,లై తగు వేదములు నిల్చు నాత్మల మాకున్.

బ్రాహ్మణులారా! యగ్నిహోత్రముల నరణులయం దారోపించి తెచ్చుచున్నారు సంతోషమే. ఎవరివలన మీకా యగ్నిహోత్రములు లభించెనో యట్టి భార్యల నేమిచేసెదరు అనెదవా.

పాతివ్రత్య సురక్షితను=పాతివ్రత్యముచేఁ జక్కగఁ గాపాడఁబడినవారు- వారి పాతివ్రత్యమే వారిని గాపాడును- మేము కాపాడునది యేమున్నది. ఆలయములలోన్=ఇండ్లలో, పూత=పవిత్రములై, అస్మత్పరమార్థములై = మాకుత్తమ పురుషార్థములైన. తాత్పర్యము

మా భార్యలను మేము కాపాడవలసిన పనిలేదు- వారి పాతివ్రత్యమే వారిని రక్షించును- వారు పతివ్రతలు కాకుండిరా అప్పుడును వారి భరించు భారము మాయందు లేదు.

కం॥ చేలములు ప్రహరులాలయ జాలంబులునిట్టి రాజసత్కృతులుతెఱఁగ్
 చాలవు చెలువలఁగావఁగ స్త్రీలకుసంరక్షకంబు శీలంబెపుమీ. యుద్ధ.౧౬౪౫

అని నీవే చెప్పఁగలవు కదా. కావున వా రిండ్లయందేయుందురు. ఇఁక మాకుఁ బరమార్థములైన పవిత్రవేదములలో మా మనస్సులందేయుండును. కావలసినప్పుడంతయు నెందుండిన సందేవల్లింతుము.

ఉ॥ మానఁగదయ్య్య నీహృదయ మార్గము, మామతినిశ్చయంబు ని
 ట్లౌను గదయ్య్య, మామనవి యారయ కీవ యుపేక్ష సేయుచున్
 దీనికి మేలిధర్మమును దేని నానర్పఁగఁ జూచె? దీవ యి
 ట్లైనను విప్రవాక్యమును నారయువా రెవ రింక ధారిణిన్! ౧౨౧

తాత్పర్యము

అయ్యా! రామచంద్రా! నీవు హృదయమున దలంచిన వనవాసమార్గము వదలుము. మేము మనస్సులో నిశ్చయించుకొన్నది యిది. వచ్చితివా, మా వెంట నగరంబునకు రా. రానంటివా నీవెంట మేము వచ్చెదము. ఈ మా మాట విని విచారింపక నీవుపేక్షించితివేని యింతకంటె గొప్పధర్మము నీవేమి చేయగలవు. బ్రాహ్మణరక్షణముకంటె గొప్పకార్య మేదికలదు. బ్రాహ్మణప్రియుండవైన నీవే యిట్లు ప్రకారము బ్రాహ్మణులమాట అత్యము సేయనియెడల నింక నీ భూమియందుఁ జేయువారెవరు?

సం॥ తలపండఁగాడఁగ వెలిగు, వ్రేలఁబోలిన నరల నొవ్వఁబారము నిన్ గొలిచితి యిందుమున్నన నిశ్చలశీలా! వేఁడెదము మూర్ధమ్మునను శిరస్.

వెలిగవ్వలన్ పూచినయట్లున్న శిరస్సులను, నరలన్ నరసిన వెంట్రుకలను — "కలయు నరలు వచ్చి తల తెల్లనైన నరసి" — యని భావము. దాఁగిలఁబడి వేఁడెదము — అని నమస్కారరూప శరణాగతి. "నమస్కారస్య కాకుత్స్థ" ... కలదుకదా. అట్టి శరణాగతి వ్యర్థమవునా? యనిన శరణాగతి వ్యర్థము కాదు. బలిష్ఠమైనట్టి ముందుపడినంగా అవిలంబనముగును. అచ్చట పితృవాక్యపరిపాలన రూప ప్రారబ్ధము ముందుగానే యేర్పడుటచే దానికి విరుద్ధముగఁ జేయఁబడిన యీ శరణాగతి కాలాంతరమున ఫలించెను. భరతుని శరణాగతి వెంటనే ఫలింపకుండుట కిదియే కారణము. ముందు వచ్చినది ముందు వెనుక వచ్చినది వెనుక ననుభవింపవలయును. రెండును గలవైన పరస్పర విరుద్ధములైనవానికి నేకకాలప్రవృత్తి లేదు.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! తలపండఁగ హంసలవలె నెరసిన తెల్లని వెంట్రుకలు గలిగియున్న పండు ముసలివారము. ఇట్టి మేము నీకు ముమ్మునందుఁబడి సాష్టాంగ నమస్కారము చేసెదము. మలినములేని యాచారముగలవాఁడా! రథమును మరలుమంతఁ ద్రిప్ప నాజ్ఞాపింపుము.

క్షత్రవైశ్యాభివాదేన, ప్రాయశ్చిత్తం కథం భవేత్
బ్రాహ్మణానాం దశాహేనా అభివాద్యవిశుద్ధ్యతి
అభివాద్య ద్విజశ్శూద్రం, సచేలస్నాన మాచరేత్
బ్రాహ్మణానాం శతం ... గధి వాద్యవిశుద్ధ్యతి. స్మృతిదర్పణము.

ఇట్లుండుటచే బ్రాహ్మణులు క్షత్రియ వైశ్యులకు నమస్కరించుట శాస్త్రవిరుద్ధము. అందు జ్ఞానవృద్ధులు వయోవృద్ధులు పిల్లవారికి నమస్కరించుట మరింత నిషిద్ధము. ఇట్లుండగ పౌరులు వృద్ధులు బ్రాహ్మణులు శ్రీరామునకు నమస్కరించుటకు గారణము సాక్షాద్భగవంతుడను జ్ఞానమే కదా.

కం॥ ఇం దరుదెంచినసద్ద్విజు, లెందఱొ యజ్ఞముల కూని•రెల్లను సిద్ధం
బందునకు నవి సమాప్తిం, బొందించుట నీవశంబ•పుణ్యచరిత్రా. ౧౨౭

తాత్పర్యము

ఇచ్చటికి వచ్చిన సద్బ్రాహ్మణు లెందఱో యజ్ఞములు చేయఁ బ్రయత్నించి యున్నారు. వానికిఁ గావలసిన పదార్థములన్నియు సిద్ధముగానున్నవి. నీవు వచ్చి వానిని సమాప్తిపొందింపవలసినది. అది సాంతముచేయుట నీ స్వాధీనమం దున్నది. నీవు రాకున్న నవియెల్ల విఘ్నములగును. ఆదోషము నీదియే.

తే॥ జంగమాజంగమంబు లౌ•సకలభూత
తతులు నీయందు భక్తిమం•తములు నూవె
వేఁడుకొను చున్న భక్తుల•విషయమునను
గరుణ చూపుము మదిఁ దేఁటి•ఖలవిదారి. ౧౨౮

తాత్పర్యము

ఖలవిదారి=దుష్టులను ఖండించువాఁడా! నీవు దుష్టులనుగదా ఖండించువాఁడవు. సాధువులమగు బ్రాహ్మణులము మమ్మేల యిట్లు బాధించెదవు. నీయందు భక్తిగలవారము మేముమాత్రమే కాము. మానిమిత్తమైమాత్రమే నిన్ను వేఁడుచుండుటలేదు. జంగమములైన పశు పక్షి మనుష్యాదులును అజంగమంబులై సంచరింపని వృక్షగుల్మాదులునుగూడ నీయందు భక్తిగలవై యున్నవి. నోరులేనివి గావున పశుపక్షి వృక్షాదులు వేఁడుకొనలేక తమలోఁదామే దుఃఖించుచున్నవి. నోరుగలవారమగుట మేము ప్రార్థించుచున్నాము. కావున మాప్రార్థన యంగీకరింపుము "స్నేహపూర్వమనుధ్యానం భక్తి రిత్యభిధీయతే" స్నేహపూర్వకమైన ధ్యానమునకే భక్తియనిపేరు.

ఉ॥ వేరులు నేలఁ బాఁతికొని•వెల్వడి నీబడి రా నసమర్థతా
దూరములై కుజంబు లవె•తో యజలోచన! నిన్నుఁ జూచుచున్
బౌరులఁబోలె మమ్ము నెడఁ•బాసెదవే రఘురామ యంచుఁ దా
మూరక గాలివేగమున•హో రని యేడ్చుచు నున్న వక్కటా. ౧౨౯

నీబడి=నీవెంట, సమర్థతాదూరములై=సామర్థ్యము లేనివై, కుజంబులు=చెట్లు.

తాత్పర్యము

అజంగమంబులైన వృక్షాదులు మావలెఁ జెప్పుకొన నోరులేకున్న నంతస్సంజ్ఞములు గావున నీవియోగదుఃఖమునఁ దపించుచు నీవెంటవచ్చుటకు నేలఁ బాదుకొనిన వేళ్ళను బెకలించుకొను శక్తి లేక నిన్నుఁ జూచుచు రామా పౌరులను వదలినట్లె మమ్ముఁగూడ నెడఁబాసెదవా నీకు మనుష్యులుగదా యపరాధము చేసినవారు మేమేమియుఁ జేయలేదుకదా మమ్మేలవిడిచెదవని గాలివేగమున హోరని యేడ్చుచున్నవి చూడుము.

చెట్లకు సుఖదుఃఖములుండుట శాస్త్రసిద్ధము, ప్రత్యక్షసాధ్యము, కావున నిట్లు జరగుటయందు వింత యేమియు లేదు.

తే॥ సర్వభూతానుకంపి వై•జరగునిన్నుఁ, గదలమెదలక యాహార•కలన లేక
చెట్లకొమ్మలయంద ని•శ్చేష్టితాండ,
జాళి యాచించుచున్నవి•ల్లదిగోఁ గంటె. ౧౩౩

సర్వభూతానుకంపివి=సమస్తప్రాణులయందు దయగలవాఁడవు, ఆహారకలన లేక=ఆహారము గ్రహింపక, నిశ్చేష్టితాండజాళి=చేష్టలుడిగిన పక్షులగుంపు.

తాత్పర్యము

సమస్త ప్రాణికోటులయందు దయగల నిన్నుఁ గదలక మెదలక శవములవలెనై యాహారము గ్రహింపక యెగిరిపోక చెట్లకొమ్మలయందు నెందున్న వందేయుండి చేష్టలుమాని పక్షులగుంపులు నిన్నుఁ బోవలదని యాచించుచున్నవి. అదిగోఁ జూడుము.

—• ౪౬-వ సర్గము. శ్రీరాముఁడు తమసానదీతీరముఁ జేరుట. •—

తే॥ అనుచు రాము మరల్ప నా•యఖిలజనము,
యాచన యొనర్ప శ్రీరాముఁ•సడ్డగింప
వచ్చెనో యనఁ దమసయ•న్వాహిని యట,
సడ్డముగ వచ్చెవారల•యరుగుత్రోవ. ౧

తాత్పర్యము

ఈప్రకారము సమస్త జనులు మరలఁ బురంబునకు మరలింపఁ బ్రార్థించుచుండఁగ వారి మాట నాదరింపకపోవుచుండు శ్రీరామునిఁ బోకుండ సడ్డగింప వచ్చెనో యనునట్లు తమసయనునది వారు పోవు త్రోవ కడ్డముగవచ్చెను.

వారలయరుగుత్రోవ=వారలయొక్క యరుగునట్టి త్రోవ. సమానరంబునఁ బ్రథమకుషష్ఠి "హింసచేసినవారలయరుగుగతికి" భారతము.తమసానదినిప్పుడు **Toms** యందురు. ఇది గంగానది కుపనది. ఇచట నొక విశేషము గమనింపవలసియున్నది. "తమసః పరస్తాత్" "తమసః పరముచ్యతే" యన్నట్లు ప్రాకృతమండలమునకుఁ బొలిమేరవలెఁ దమస్సను సూక్ష్మప్రకృతియుండి "యవనికామాయా" యన్నట్లుపరదావలె భగవంతుని సడ్డగించుచున్నది. ఈ తమస్సును దాఁటియే భగవంతుఁడు ప్రాకృతమండలమందుఁ బ్రవేశింపవలెను. అట్లులే శ్రీరాముఁ డీతమసను దాఁటియే యరణ్యమును బ్రవేశించును, కృష్ణావతారమందును నల్లనినీళ్ళ యమునను దాఁటియే యందుండు నరణ్యమును బ్రవేశించెను.దుఃఖకరమైన యీప్రపంచము జ్ఞానికి భక్తునికి నరణ్యమే.

తమసానది యడ్డమురాఁగానే శ్రీరాముని ప్రయాణము నిలిచిపోయెనని జనులు సంతోషించిరి గాని తమస్సు ఇంద్రియసుఖాసక్తి వదలని తమకడ్డమని తలంపరైరి.

ద్వి॥ అందఱకును రాత్రియగు నేదిదాని
యందు మేల్కొనియుండు సర్వజ్ఞుఁడగు యోగి
అందఱు జాగ్రత్తనంది యెందుండు
రందు యోగివరుండు నందును నిద్ర. ద్విపద. భ.గీ.

ఇందుఁ బూర్వార్ధమందుఁ జెప్పఁబడినవారు సీతాలక్ష్మణ సుమంత్రులు, ఉత్తరార్ధమున జెప్పఁబడినవారు ప్రజలు.

తమస్సు (నిద్ర) తమస, ప్రజల నడ్డగించెఁగాని లక్ష్మణాదుల నడ్డగింపఁ జాలదయ్యెఁగదా.

ఉ॥ అంత సుమంత్రుఁ డప్పుడు హయంబుల దేరిని బాపి మార్గవి
శ్రాంతి దొలంగ నీరముల ద్రావియు మేపు నొసంగి మేని నా
ద్యంతముఁ దోమి కొంతవడి యట్టిటు ద్రిప్పుచు నుండ జానకీ
కాంతుఁడు సీతఁ జూచుచును గాదిలి తమ్మునితోడ నిట్లనున్. ౧౩-౧౪

తాత్పర్యము

ఇట్లు తమసానది యొద్దకు రాఁగా సాయంకాలమగుటచే సుమంత్రుఁడు రథమునిల్పి గుఱ్ఱములను దానుండి విప్పి దాహపడిన గాసిపోవ నీళ్ళుద్రావి మేపుపెట్టి దేహమంతయుఁ జక్కఁగా రుద్ది కొంచెముకాల మిటునటు త్రిప్పుచు నుండఁగా శ్రీరాముఁడు సీతను నామె యింగితార్థమై చూచుచుఁ బ్రియసోద రుతో నిట్లనియె.

కం॥ మనకాననయాత్రావ్రత, దినములలో నిదియ మొదటిదిన మఱిగెడి నో
య్యనఘా చేరితి మడవియు, వనవాసంబెట్లొ యనుచు వగవకు మన్నా.

తాత్పర్యము ౧౫-౧౬

కాననయాత్రావ్రతదినములు = అడవికిఁబోవుటకై పూనిన వ్రతదినములలో నసఁగా పదునాలుగు సంవత్సరములలో మొదటిదినము చెల్లుచున్నది. అడవి చేరితిమి, వనవాసమిఁక నెట్లు చేయుదుమా యని విచారపడకుము.

ఈ మాటలు సీతకు ముఖ్యముగా నన్వయించును.

కం॥ మనుష్యులన నెలవులకుఁ గను, వన్యమృగవిహంగమాది వర్గంబులచే
శూన్యాటవులే డెప్పుడి ప్రియ, మాన్యగుణా! తోఁచుచున్న మార్గము కంటే.
౧౬-౧౭

మనుష్యులన్=లోకములచే, నెలవులకున్=గ్రామము నివేశస్థలములకు, వన్యమృగ విహంగమాది వర్గంబులచేన్=అడవియందుండు మృగములు పక్షులు మొదలైన వానిచే, శూన్యాటవులు=మనుష్యులులేని యడవులు.

తాత్పర్యము.

సాయంకాలమగుటచే దమతమ గూండ్లకుఁ జను పక్షులు, గుహలకుఁ బోవు మృగములు చేయు ధ్వనుల నెపమున జనసంచారములేని యీ యడవులు శోకమున నేడ్చుచున్నట్లున్నవి. ఉత్ప్రేక్షాలంకారము.

ఉ॥ అక్కట మామకీనజన•కానుపమోజ్జ్వలరాజధానిలో
మక్కువ నెంచుచున్ మనల•మానవతీపురుషాళి మిక్కిలిం
బొక్కుచు నుండఁగా: సతత•మున్ భరతుం బినతమ్ము నిన్నునన్
న్నక్కటికంబుతోడ వసు•ధాధిపునిం బ్రజ ప్రేముడించెడిన్. ౧౨-౫౫

అడవిలోఁ బక్షుల యేడుపు పురములోని ప్రజలయేడుపు స్మరణమునకుఁ దేఁగా ననుచున్నాఁడు. మామకీన=నాయొక్క, జనకు=తండ్రియొక్క, అనుపమ=అసమానమై, ఉజ్జ్వల=ప్రకాశించు రాజధానిలో, మక్కువన్=ప్రేమచే, పినతమ్మున్=శత్రుఘ్నుని, అక్కటికంబు=దయ, ప్రేముడించు = ప్రేమించు, దశరథుఁడని పేరు చెప్పక, వసుధాధిపుఁడనుటచే శ్రీరామునకు దశరథునందుఁ గల భక్తిగౌరవములు ఆయన గర్వహీనత వెల్లడించుచున్నది. మానవతీపురుషాళి యని స్త్రీలను ముందు చెప్పుటచేఁ పురుషులకంటె స్త్రీలే యెక్కువగ నేడ్చుచున్నారని భావము.

తాత్పర్యము

అయ్యో! ఎంతకష్టము మనతండ్రియొక్క అసమానమై ప్రకాశించు రాజధానియందు మనలను ప్రేమతోఁ దలంచుచు స్త్రీలు పురుషులు మిక్కిలి దుఃఖించుచుందురు గదా. మన మడవులకుఁ బోయిన నూరివారికేల దుఃఖమనిన వారు భరతుని శత్రుఘ్నుని నిన్ను నన్ను దయతో రాజును ప్రేమించుటయే కారణము. మన మీఁద నెంతప్రేమయో యంత శోకముగాఁ బరిణమించెను.

భరతుని ముందుచెప్పి తన్నుఁ గడపటఁ జెప్పుటచేఁ దనయందుండు ప్రేమకంటె భరతునందే ప్రజలకు నెక్కువ ప్రేమగలదని భావము.

చం॥ జనకుఁ దలంప దుఃఖ మగు•సాధ్వి యశస్విని వృద్ధ యైననా
జననిఁ దలంప గుండియలు•ఝల్లు మనున్ జుమి యంతకంతకున్
గొనకొని యేడ్చి యేడ్చి కడు•గోరముగాఁ గనుదోయి వాఁచఁగా
జనకులు చీఁకు లౌదు రొకొ•నందియ మయ్యోఁ గదయ్య లక్ష్మణా. ౧౨-౫౬

సాధ్వి=పతివ్రత, యశస్విని=కీర్తిగలది, వృద్ధ = ముసలిది, గోరము=ఘోరము, చీఁకులు=అంధులు, జననీ+జనకుఁడు=జనకులు, ఏకశేషవృత్తి.

తాత్పర్యము

ఊరిలోవారు దుఃఖించుట యటుండ మనతండ్రినిదలంప దుఃఖమగుచున్నది. పతివ్రతయుఁ గీర్తిమతియు, వృద్ధురాలునగు నా తల్లిని దలంచిన నంతకంటె దుఃఖమున గుండెలు ఝల్లు మనుచున్నవి. మనలను దలఁచి తలఁచి

యంతకంతకు దుఃఖము వృద్ధికాఁగా మిగుల ఘోరముగా రెండుకన్నులు వాఁచునట్లేడ్చుటచే మన తల్లిదండ్రులు గ్రుడ్డులగుదురో యని లక్ష్మణా సందేహముగానున్నది.

చం॥ కలఁడు గదా సుధీరతుఁడు•కైకతనూజుఁడు తల్లిఁదండ్రిఁ దా
నలమట పొందకుండ నట•నాదర మారఁగ నూఱడింపఁగాఁ
దలఁచి మతిన్ మతిన్ భరతు•ధర్మరతత్వదయార్ద్రబుద్ధులన్
దలర నొకింతయేని తలి•దండ్రులవట్ల నెడంద లక్ష్మణా. ౧౬౩

తల్లిదండ్రులమీద నీకంతప్రేమయుండిన మరలఁ బోరాదా యని లక్ష్మణుఁడనునేమోయని దానికిఁ బరిహారము చెప్పుచున్నాఁడు.

సుధీరతుఁడు=మిగుల బుద్ధిమంతుఁడు, పండితులయందుఁ బ్రీతిగలవాఁడు, అలమట=బాధ, ధర్మరతత్వ=ధర్మమునందలిప్రీతియు. దయార్ద్రబుద్ధులన్=దయచేఁదడిసిన బుద్ధియు, తలరన్=చలింపను, ఎడఁదన్=హృదయమందు, మతిన్=మతియున్, యు లోపింపఁగా మిగిలినరూపము.

ఇది భరతునియందు లక్ష్మణునకుఁగల సందేహము నివర్తింపఁ జెప్పినమాట

తా త్ప ర్య ము

అయినను దల్లిదండ్రుల విషయమై నాకు విచారము లేదు. ఏలనఁగా, భరతుఁడు కైకకొడుకైనను మిగుల బుద్ధిమంతుఁడు. కావునఁ దల్లిదండ్రులు దుఃఖింపకుండునట్లు లాదరించి యూరడించుటకు భరతుఁడున్నాఁడుగదా, ఆయన ధర్మాసక్తి, దయతోఁ గూడినబుద్ధి వీనిని దలఁచి తలఁచి తల్లిదండ్రుల విషయమై నాకుఁ గొంచెమైనను విచారములేదు.

ఉ॥ మే లొనరించి తీవు బటు•మేకొని నాబడి వచ్చి యీ యర
ణ్యాళిని సీతఁ గావఁగ స•హాయుఁడ వౌటను, నేటిరేయి యిం
దీ లలి వన్యమూలము ల•నేకము లుండియు నీరుమాత్రమున్
గ్రోలి యుపాస ముండెదను•గోరిక యయ్యెడు నట్లు సేయఁగన్. ౧౬౪

వన్యమూలములు=అడవియందు బుట్టినవేళ్లు, మేకొని=అంగీకరించి.

తా త్ప ర్య ము

లక్ష్మణా: నీవు నా వెంటవచ్చుట కంగీకరించి యీ యడవులయందు సీతను రక్షింప సహాయుపడుటచే నాకెంతో యుపకారము చేసినవాఁడవైతివి, ఈ యరణ్యమందు నేను భుజింప ననేకములు దుంపలుగలవు, కాని నీళ్ళు మాత్రము త్రాగి యుపవాసముచేయఁ గోరుచున్నాను. (నిన్నరాత్రి యుపవాసము, ఈ దినమంతయు నుపవాసము.)

కం॥ అనుచు సుమంత్రుం గనుఁగొని, యనఘా
గుణములఁ జూడు•మవధానిత నాఁ
జని ప్రొద్దు గ్రుంక వాజుల,కును నీరును మేపు పెట్టి•కొద లే కుండన్.

అవధానిత=హెచ్చరికతో, నాన్=అనఁగా. ౧౬౫

తాత్పర్యము

అని లక్ష్మణునకుఁ జెప్పి సుమంత్రుని జూచి పాపరహితుఁడా హెచ్చరికగా గుఱ్ఱముల నాదరింపుము అని చెప్పఁగాఁ బోయి యతఁడు సూర్యుఁ డస్తమింపఁగాఁ గుఱ్ఱములకుఁ గొదువలేకయుండ నీరు మేపుపెట్టి.

ఉ॥ అరసి మ్రొక్కి సంధ్యకును•నాతఁడు లక్ష్మణుతోడ నానదీ
తీరమునందు నాకులను•దీర్పఁగ శయ్యను బ్రీతియుక్తుఁడై
చేరె రఘూద్వహుం డచటఁ•జేడియతోఁ బినతమ్మునితోడుతన్
గూరిమి, నన్నయున్ వదినె•కూరుకు చెందిన యంత వారలన్. ౧౩౦

తాత్పర్యము

వానిని విచారించి సూతులకును సంధ్యలందు సమంత్రకముగ సూర్యుని నమస్కరించుట కలదు. కావున సంధ్యాధిదేవతకు నమస్కరించి లక్ష్మణుతోడ నాయేటియొడ్డున నాకులతోఁ బడుక యేర్పాటు చేయఁగా సంతోషించినవాఁడై శ్రీరామచంద్రుఁడు దాశయ్యయొద్దకు లక్ష్మణుతో సీతతోఁబోయెను. అవల నన్నయు వదినెయు నిదురింపఁగా.

ఉ॥ చూపి సుమంత్రుతో ననియె•శూరకులాగ్రణి లక్ష్మణుండు కం
టే పడి యున్నవారు నవ•నీరజనేత్రులు సౌఖ్యపాత్రు లం
చీవగిదిన్ రఘూత్తము న•హీనగుణంబులు చెప్ప మూయ కె
న్నోపలుకాడు చుండఁగనె•యుగ్రకరుం డుదయింప నున్నెడన్. ౧౩౧

కంటే=కంటివా, చూచితివా, నవనీరజనేత్రులు=క్రొత్త కమలమువంటి కన్నులుగలవారు, ఇది సీతారాముల కిద్దఱ కన్వయము, నీరజనేత్రా+నీరజనేత్రుఁడు=నీరజనేత్రులు, ఏకశేషవృత్తి, సౌఖ్యపాత్రులు=సుఖార్హులు, ఇదియు నేకశేషమే, అహీనగుణంబులు=గొప్పగుణములు, ఉదయింపఁబోవుచుండఁగన్=శుక్రోదయముకాఁగా, చెప్పుచుండఁగనే=రాత్రి ముగిసెనుగాని శ్రీరాముని గుణవర్ణన ముగియలేదని భావము, "రాత్రి రేవవ్యరంసి" త్తనునట్లు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వారి నిరుపురఁజూపి సుమంత్రుతో నిట్లనియె, సుమంత్రా క్రొందామరలవంటి కన్నులు గలవాడును సుఖార్హులుమనగు శ్రీసీతారాములు నేలమీఁద వెళ్ళు పడియున్నారో చూచితివా అని యీ విధముగ శ్రీరాముని యెన్నో యుత్తమగుణములు కన్నుమూయక చెప్పుచుండఁగనే సూర్యుఁ డుదయించు చిహ్నము కనఁబడఁగా.

తే॥ గోకులాతులతీర మై•కొమరుమీఱు, నల్లతమసానదీతీర•మందుఁ బౌర
జనులతోడుత నారాత్రి•సంవసించె,
నాలుఁ దమ్ముండుఁ గొలువ గు•ణాకరుండు. ౧౩౨

గోకులాకులతీరమైన=గోవుల గిట్టలచేఁ గలఁతపడిన తీరముకలదై, కొమరు మీఱు=అందమైన, గుణాకరుఁడు=సద్గుణముల స్థానమైనవాఁడు.

తాత్పర్యము

నీళ్ళు త్రాగవచ్చు గోవులగిట్టలచేఁ గలఁతనొందిన యొడ్డుగలదై యంద మైన యా తమసానదీతీరమునందుఁ బురవాసులతోడ భార్యయుఁ దమ్ముఁడు సేవింప గుణరత్నముల గనియగు శ్రీరాముఁడారాత్రి సుఖముగా వసించెను.

—• శ్రీరాముఁడు పౌరుల మోసగించి పోవుట. •—

ఉ॥ అంతట మేలుకాంచి యట•నంతట నంతట నిదురం బథి
శ్రాంతిని గూరి యున్న జన•సంఘములం గని కంటె లక్ష్మణా
యెంతలు పుట్టె నాస విడి•యిండ్లపయిన్, మనమీఁది ప్రేమ్మని
గుంతల మిట్టం బడియుఁ•గూర్కెరి చెట్ల మొదళ్ళ నీజనుల్. ౧౩౩

అంతటన్=సూర్యోదయము కానున్న సమయమున, పథిశ్రాంతిన్=దోవ పయనించిన గాసిచే, కూరి=నిద్రపొంది.

తాత్పర్యము

శుక్రోదయసమయమున శ్రీరాముఁడు నిద్దురమేలుకొని యానదీతీర మందు నచ్చట నచ్చట గుంపులు గుంపులై దారినడచిన గాసిచే నిద్రపోవు జనులగుంపులఁ జూచి లక్ష్మణా చూచితివా యెంతటి విపరీతములు పుట్టెనో యీపౌరులు మన మీఁద ప్రేమచే నిండ్లమీఁద నిల్లాండ్రమీఁద నాసలువాని గుంత లనక మిట్టలనక పడి నిద్రపోవుచున్నారు.

చం॥ వలవదు మౌర్ఖ్య, మేఁ బురికి•వచ్చెడువాఁడను గాను, బొండనం
దొలఁగరు, వెంబడిం బడిరి•నొక్కి నచించిత నేని ప్రాణము
లొలఁ గెడివారు, నిక్కమిది•లోకులు నిద్దుర గూరి యుండఁగా
మెలసి రథంబు నెక్కి వన•మేదిని నిర్భయ మార్గసీమలన్. ౧౩౪

మౌర్ఖ్యము=మూర్ఖత్వము, హఠము, నొక్కి=ఒత్తిగట్టిగా, తొలఁగెడివారు= విడుచుటకు సిద్ధపడియున్నారు, నిక్కము=నిజము, మెలసి=జాగ్రత్త గలిగి, వనమేదిని=వనభూమిని, నిర్భయమార్గసీమలన్=భయములేని త్రోవప్రదేశము లందే.

తాత్పర్యము

ఓ జనులారా! యీ హఠమేల, వలదు. నే నూరికిరాను మీరు మరలి పొండని నేనెంత చెప్పినను వదలినవారు గారు, వెంటఁబడినారు, గట్టిగాఁ జెప్పితినా ప్రాణము విడుతురు, ఇది నిజము కావున వీరు నిదురించుచుండఁగనే మనము హెచ్చరికతో రథమెక్కి వనభూమియందు భయములేని మార్గములం బోదమా.

తే॥ చూడుమా వీరలెల్లరు నాదమఱచి, నిద్రఁగూరిరి యింక నిట్లు నిద్రఁగొనరు
ప్రజల స్వకృతంపు దుఃఖంబుఁ బాపవలయు, నృపుఁడు;
నాకయి వీరేల నెగులు గొనఁగ ౧-౩౫

ఆదమఱచి=ఆత్మశబ్దభవము ఆద, తమ దేహములు తమకుఁ తెలియక, కూరిరి=పొందిరి, స్వకృతంపు=దుఃఖంబు=వారై తెచ్చుకొన్న దుఃఖము, ఇది స్వేచ్ఛాప్రారబ్ధము, మనది పరేచ్ఛాప్రారబ్ధము, నెగులు=దుఃఖము.

తాత్పర్యము

వీరు దేహములు తెలియక నిద్రపొందిరి, ఈనాఁడు వీరు నిద్రపోయినట్లు లేక నెన్నఁడు నిద్రపోరు- అంత గొసివడియున్నారు, అయినను రాజనువాఁడు ప్రజలు తామై తెచ్చుకొన్న దుఃఖమును దొలఁగింపవలయును.

ఈనాఁడు నిద్రపోయినట్లు వీరింక నిద్రపోరు, ఒకసారి ప్రమాదపడి మహాధనము గోల్పోయినవాఁడు మరల హెచ్చరికగానే యుండునుగదా, అట్టులే మనమింద్రియసుఖలోలురమై నిద్రించుటచేఁ గదా శ్రీరామసాన్నిధ్యము గోలుపోయితిమని యింకమీఁద హెచ్చరికగలిగి ప్రవర్తింతురు.

ప్రజల దుఃఖంబు నృపుఁడు పాపవలయుననుటచే రాజు తాను గష్టపడినను దనమిత్తమై ప్రజలఁ గష్టపెట్టరాదు.

శ్లో॥ ఆపిష్టఇవ దుఃఖేన, తద్గతేన గరీయసా
సమన్వితః కరుణయా, పరయాదీన ముద్ధరేత్—రామానందకము.

ఈనిద్ర సహజనిద్రగాదు, సహజనిద్రయైనవారిలో నొకఁడైన మెలఁకువ గలవాఁ డుండఁడా? ఇది మాయాప్రయోగమే, కృష్ణావతారంబునఁ గృష్ణుఁడు కారాగృహము వెడలిపోయినపుడు కావలివారిని గ్రమ్మిన మాయయే యుదియును.

ఉ॥ మేలు త్వరంబ జనంగ నన మేకొన నావచనంబుఁ దమ్ముఁ, డా
వేళ సుమంత్రుఁ జూచి పృథివీతనయాపతి పల్కెఁ దేరి గు
ఱ్ఱాలను బూన్పు మేలుకొని యంబ వొనరింపకమున్న యీ ప్రజల్
లీలగ దాఁటి పోవుదము లెమ్మన నాతఁడు నట్లు చేయుచున్. ౧-౩౬

మేకొనన్=అంగీకరింపఁగా, బంపు=బచ్చు.

తాత్పర్యము

త్వరగాఁబోవుట మేలు అని శ్రీరాముఁడు చెప్పఁగా లక్ష్మణుఁడు దానినంగీకరించెను. అప్పుడు శ్రీరాముఁడు సుమంత్రునిజూచి రథమునకు గుఱ్ఱాలను గుట్టుము. వీరు మేలుకొనిరా బచ్చుచేయుదురు. కావున వారుమేలుకోకముందే మనమునులభముగా నీ నదిని దాఁటి పోవుదము. లెమ్ము. అన నాతఁడట్లుచేసెను.

ఉ॥ అయ్యత మయ్యెఁ దేరు మహి తాత్మక నీవు సలక్ష్మణుండవై
జాయను గూడి యెక్కు మనఁ జయ్యన నాతఁ డొనర్ప నట్ల య

త్యాయతవేగ మైనతమ•పావగ దాఁటఁగఁ దోలె సాది యం
దాయనఘుండు కాల్నడ మ•హాపథముం గని చొచ్చి యెయ్యెడన్. ౧౭-౩౭

అయితము=సిద్ధము, మహితాత్మక=గొప్పమనస్సుగలవాఁడా, జాయను=భార్యను, చయ్యనన్=శీఘ్రముగ, అత్యాయత వేగమైన=మిక్కిలి వేగముగల, తమసాపగ=తమసానది, సాది=సారథి, మహాపథమున్=పెద్దబాటను.

తాత్పర్యము

మహాత్మా! తేరు సిద్ధమయ్యెను, నీవు లక్ష్మణుతోడ భార్యతోడ రథము నెక్కుమనిన శీఘ్రమున శ్రీరాముఁడు నట్లుచేసెను. సారథియు మిక్కిలి వేగముగఁ బాఱు తమసానది దాఁటి రథము తోలెను. అవలిగట్టు సమీపమున నీళ్ళలోనే ముగ్గురు దిగి నడిచిపోయి యావలియొడ్డున పెద్దబాటను జూచిరి.

ఉ॥ పౌరుల మోసగింప నిటు పల్కె సుమంత్రునిఁ జూచి నీవొకం
డే రథ మెక్కి తూర్ణముగ•నేగుమ యుత్తరదిక్కుగాఁ, గడున్
దూరమునందునుండి పెడ•త్రోవను గ్రమ్ముఱ మెట్టులైన నీ
పౌరులు మమ్ముఁ గన్గొనని•భంగి నొనర్పు సుమంత్ర! నావుడున్. ౧౮-౩౮

తూర్ణముగన్=వేగముగ, పెడత్రోవను=తప్పుదారిని, దాఁగానిదారిని, గ్రమ్మఱుము=తిరిగిరమ్ము.

తాత్పర్యము

పురజనులను మోసగించుతలఁపున సుమంత్రునిఁజూచి శ్రీరాముఁ డిట్లనియె. సుమంత్రా! నీవొకఁడవే రథమెక్కి త్వరగా నుత్తరముఖమై యయోధ్యాపురమువైపుగ మిగులదూరముపొమ్ము అచ్చటనుండి రథముజాడపడనిత్రోవగఁ జూచి రథమును తప్పుత్రోవను తోలుకొనిరమ్ము. ఎట్టులయిననుసరియె. ఈ జనులు మిమ్ముఁజూడక యుండువిధము చేయుము అని చెప్పెను.

తనయందింత ప్రేమయుంచి తనకై ప్రాణములైన విడువసిద్ధపడి యిండ్లు,వాకిండ్లు వదలి వచ్చిన భక్తులను శ్రీరాముఁ డిట్లు మోసగింపవచ్చునా యని యాక్షేపము.

సమాధానము:- ఒకనికి నొకగొప్ప వ్రణములైన యది యంతకంతకు నతిశయించినచో నపాయకరమని తోఁచినపుడు చికిత్సకుఁడు దాని ఛేదించి కుదిరించును. ఛేదించునపుడు రోగికిఁ గష్టముగానే యుండును గాని పిమ్మట నది సుఖకరముగానుండును. అట్లారాముఁడు పౌరులతో ననేకదినములుండ వారియానందము మితిమీఱినది. ఇఁకఁ గొన్ని దినములుండిన నది భరింప వారికి శక్యముగాక చిత్తవిభ్రాంతికిఁ గారణ మగును.

ఏ దేహముచే నేది యెంత భరింపసాధ్యమో యంతయే భరింపవలయును. అంతకుమించి భరించినఁ గీడుకలదు. కావున నిపుడే యేదోయొక నెపము

పెట్టి యా యానందమును దగ్గించివారి యనుభవ సాధ్యమగు మాత్రమానంద మియ్యవలయునని శ్రీరాముని సంకల్పము కావున శ్రీరాముఁ డీమార్గము త్రొక్కవలసివచ్చెను. ఇది పిదప వారికి సౌఖ్యకరమే యగును. కావున వంచన కాదు. ఇది శ్రీరాముఁడు బుద్ధిపూర్వకముగ వారిమేలుకోరి చేసినమోసము. అట్లు శ్రీరాముఁడు సంకల్పించి మాయ ప్రయోగింపకుండినచో నందఱుజనులలో నొకఁడైన మేలుకొని యుండఁడా అందఱు బ్రాహ్మముహూర్తమునకు మేలు కొన నలవాటు పడినవారేకదా. ఈవిధముగ గోవిందరాజీయ వ్యాఖ్యానమున సమాధానము వ్రాయఁబడినది. గోపికలవిషయమున శ్రీకృష్ణప్రవర్తన మిట్టిదే.

ఒకబాలుఁడు రుచిగల పదార్థమును దనకడుపు పరిమాణమును దెలియక జిహ్వాచాపలముచే నెక్కువగఁ దినవలయు ననినను దల్లి పెట్టదు. ఒకవేళ బాలుఁడు దినినను వెంటనే వాంతికో విరేచనమునకో యిచ్చును.

అట్లులే యేజన్మమున నెవఁడెంత పుణ్యము సంపాదింపవలయునని భగవదిచ్ఛయో యంతయే లభింపఁజేయును గాన యంతకుమించి పోనీయఁడు. ఈకారణము చేతనే అగస్త్యుఁ డింద్రద్యుమ్ననకు శాపమ పెట్టుటచేఁ దపస్సు నష్టిపఱుచుకొనెను. గోపికల విషయమునఁ గృష్ణుఁ డిట్లుచేసినవాఁడే, ఎంతవఱకు వారికానందము గలిగింపవచ్చునో యంతయుఁ గలిగించి యింకమించిన వారు భరింపలేరని తోఁచినపుడు వియోగదుఃఖము కలిగించెను.

స్వలాభాపేక్షగాని పరులకు నష్టికలుగ వలయునని తలంపుగాని లేక ప్రేమతోఁ జేసినపుడు అసత్య మసత్యముగాదు హింసహింసగాదు వంచన వంచనకాదు.

ఇట్టి యుపాయము చేయకుండిన శ్రీరాముఁడు దోషియైయుండును. అంతటి ముసలిగువ్వలు అడవులలోఁ దిరిగి కందమూలాదులు దిని యెన్నాళ్ళు జీవింపఁగలరు. జీవించినను ఎంత బాధపడవలసియుండును అది యంతయు నిపుడు తప్పెఁగదా.

చం॥ పనివిని యట్లచేసి రఘు•వల్లభు నాతఁడు డాయ వారుఁ జ
యృన రథ మెక్కి సారథి ప్రయాణశుభై కనిమిత్త దర్శనం
బునకయి యుత్తరంబుగను•ముందుగఁ దేరిని ద్రిప్పి పిమ్మటన్
వనులకు నేగుమార్గమున•వాజులఁ దోలె జవంబు మీఱఁగన్. ౧౯

పనివిని=అజ్ఞప్రకారము వెడలిపోయి, ఈశబ్దము భృత్యాదుల విషయమున నుపయోగింపఁదగునుగాని స్వామ్యాదుల విషయమున నుపయోగింపరాదు. సీత మాట మేరకు శ్రీరాముఁడు పనివినియె ననరాదు. ఇచ్చట పని యనఁగా నాజ్ఞయని యర్థము. ప్రయాణశుభైక దర్శనంబునకయి = ప్రయాణమగు సమయమున శుభమే కలుగు శకునము చూచుటకై, వనులకున్=అడవులకు, జవము=వేగము, ప్రయాణముపోవువారు మొదట దక్షిణాభిముఖులై పోరాదు. ఉత్తరాభిముఖులై పోవలయును. "తస్మాదుత్తరతో౽భిప్రయా

యాజయతి" తైత్తిరీయ శ్రుతి. ఉత్తరాభిముఖుఁడై ప్రయాణముచేయువాఁడు జయించును. ఇట్టులే పాండవులు వనవాసము చేయఁబోవునపు డుత్తరాభిముఖులై పోయిరి.

తాత్పర్యము

ఆరామాజ్ఞ ప్రకారము సుమంత్రుడు వెడలిపోయి యాయన చెప్పినట్లు చేసి శ్రీరాముని జేరరాఁగా సీతారామలక్ష్మణులు రథమెక్కఁగా సారథిప్రయాణకాలమున నుత్తరదిక్కుగాఁ బ్రయాణమగుట శుభకరము గావున నుత్తర దిక్కుగా రథముఁద్రిప్పి పిమ్మట నడవులకుఁబోవు మార్గమునఁ ద్వరగ గుఱ్ఱములను దోలెను.

—♦ ౪౭-వ సర్గము. పౌరులు శ్రీరామునిఁ గానక దుఃఖించుట. ♦—

ఉ॥ అవలువాత లేచి జను♦లందఱు రాముని గాన కార్తిచే
దేవుఱు నొంది మూర్ఛలను♦ద్రెళ్ళుచుఁ గన్నుల నీరు గాఱఁగా
నీవల నావలన్ వెదకి♦యెందును వారలజాడ లేమి దుః
ఖావిలచిత్తులై రఘువ♦రా! యని యార్చుచు వెచ్చ నూర్చుచున్. ౧—౪౦

వఱువాతన్=ఉదయమున, దేవుఱునొంది=దైన్యమును వహించి, దుఃఖావిలచిత్తులై=దుఃఖముచేఁ జెదరిన మనస్సులు గలవారై.

తాత్పర్యము

ఆ యుదయమునలేచి జనులందఱు శ్రీరామునిఁ గానక దుఃఖముచే దీనులై మూర్ఛపోయి పడుచులేచుచుఁ గన్నీరుకాఱఁగా నీప్రక్క నాప్రక్క వెదకి యెందును వారుపోయిన జాడతెలిసికొనలేక దుఃఖముచేఁ గలఁతనొందిన మనస్సుగలవారై రామా యని యఱచుచు వేఁడినిట్టూర్పులు పుచ్చుచు నిట్లనిరి.

ఉ॥ నిద్దుర పాడుగాను, దల♦నెక్కొని యిట్టులు చేసె నయ్యయో,
బుద్ధి పరాకు చెందె, నెటు♦బోదుము. గానఁగ రాఁ డెటన్, మహా
పద్దశ సంభవించె, నిజ♦భక్తుల నెల్లర వీడి కానకున్
బుద్ధిగ నేగె, నెన్నఁడును♦వంచన సేరఁ డిదేమొ నేఁడిటన్. ౧—౪౧

నెక్కొని=నెలవుకొని

తాత్పర్యము

అయ్యో! నిద్దుర పాడైపోను, తలమీఁదనెక్కి యీప్రకారము సేసెఁగదా. బుద్ధి ప్రమాదపడియె. ఇఁక నెక్కడకుబోదుము. ఎక్కడనున్నాఁడని బోదుము ఎక్కడ గానరాఁడే. అయ్యో యెంత విపత్తు సంభవించెను. తనభక్తుల నందఱ వదలి శ్రీరాముఁడు వంతముపట్టినటుపోయెనే. శ్రీరాముఁ డింతవఱకు వంచన యెట్టిదో యెఱుఁగఁడే. నేఁడుమాత్రమే యేమియిట్లుచేసెను. "నాయమాత్మా బలహీనేనలభ్యః నచప్రమాదాత్ తపసో వాప్య లింగాత్" అని శ్రుతి నిట ననుసంధింపఁదగు. ప్రమాదబుద్ధులకు భగవత్ప్రాప్తి యెట్లు కలుగును.

కం॥ ఎట్టులు గూడఁగఁ గల్గునో, యట్టి పృథూరస్కునిన్ మ♦హాభుజు రామున్
గట్టుకొని కొట్టివనియేన్, బట్టుగ నెఱవేర్పుచుకట్టి♦పార్థివుపట్టిన్. ౧—౪౨

పృథూరస్కునిన్=గొప్ప వక్షస్స్థలముగలవానిని, వెట్టుకొని=పనిపూని

తాత్పర్యము

అట్టి విశాల వక్షస్స్థలము గలవానిని నిడివియగు భుజములు గలవానిని పనిపూని యెట్టిపనినైనను బట్టుబట్టి సాధించు రాజకుమారుని శ్రీరాముని మన మేవిధముగాఁ జూడఁగలమో.

కం॥ తనకన్నబిడ్డలను దయ, జనకుఁడు రక్షించురీతి•సంరక్షించున్
మనలనదా యిపు డేటికిఁ, జనియెనొ యందఱను వీడి•సాహసమతియై.

తాత్పర్యము ౧-౪౩

తాను గన్నబిడ్డలను దండ్రి రక్షించురీతి మనల నెల్లవేళ సంరక్షించువాఁ డిపుడేలా మనలనందఱ వదలి తెగించి వెడలిపోయెనో.

ఉ॥ రాముఁడు లేకయున్న మన•ప్రాణము లుండిన నేమి? పోయెఁ బో
నే మటు గానఁ బ్రాణముల•నియ్యెడఁ బాచుకొనంగ మేలు రా
దే మన కెల్ల? నొండె నిఁక•మృత్యుముఖాభిముఖంబుగా నుద
క్పమన పోవు టొప్పు, నెది•చేయుట యుత్తమమం గి చెప్పుఁడా. ౧-౪౪

మృత్యుముఖాభిముఖంబుగా = మృత్యుదేవత ముఖమున కెదురుగా, ఉదక్పమనము=ఉత్తరపుదిక్కుగా దీనికే మహాప్రస్థానమని పేరు.

తాత్పర్యము

మన ప్రాణములకుఁ బ్రాణమైన శ్రీరాముఁడు లేకయుండిన మనప్రాణము లుండిననేమి పోయిననేమి. మనప్రాణము లిచ్చుటనే వదలుట మేలుకదా. ఈ ప్రకారమిచ్చుటనే ప్రాయోపవేశము చేయుదమా. అటుగాక యుత్తరాభిముఖముగా మహాప్రస్థానము పోవుదమా. రెంటిలో నేదిమేలో చెప్పుఁడు.

కం॥ దండిగ నున్న విటంగడు,నెండినకట్టియలు వీని•నెల్లను జితగా
మండించి దానిలోఁ బడి, దండధరుం జూడఁ జనఁగ•దగు మనకున్.

తాత్పర్యము ౧-౪౫

ఇచట మిగుల నెండినకట్టెలు దండిగనున్నవి. వీనినన్నిటిని జితిగాఁ బేర్చి మండఁజేసి దానిలోఁబడి యమునిఁ జూడఁబోవుట తగినకార్యము. ఆ రెండు మార్గములందును మరణమునకుఁ గాలవిలంబము సహించి ప్రాణముపోవు వఱకు శ్రీరామవియోగతాపము నోర్చియుండవలసివచ్చును. ఈ మార్గమునం దట్టిబాధలేదు. అగ్నిబాధలేదా యందురేని శ్రీరామ వియోగాగ్నిచేఁ గాలుచున్న యీదేహములను బ్రాకృతాగ్ని యంతకుమించి యేమిచేయఁగలదు. కావున నగ్నిప్రవేశమే తగిన కార్యము.

కం॥ అనెయ్యం బాతియ్యం, బానీతియు నీసు లేమి•యామృదువాక్యం
బానిస్తులగుణసంపద,యెనదులం గందు మింక•నే మమకొనఁగన్. ౧-౪౬

తా త్ప ర్య ము

అస్నేహము, అమాధుర్యము, అనీతి, అసహనము యాతియ్యని పలుకులు అ ద్యుసమాన సుగుణసంప త్తి యింకనేవారియందు మనము చూడఁగలము.

ఉ॥ ఊరికిఁ బోవ వృద్ధులును • నోపనివారును స్త్రీలు బాలు ర
యా్యరె రఘూద్వహుం డెవట? నాదటఁ గ్రమ్మఱి వచ్చునే? యనన్
వారల కెల్ల రాము వన • వాటికి సాగఁగ నంపి వచ్చు చు
న్నార మటంచుఁ జెప్ప వగు • నా? మఱి యే మని చెప్ప శక్య మౌ. ౧౬౪౭

ఓపలేనివారు=రాలేనివారు, ఆదటన్ = ప్రీతితో, వనవాటికిన్ = అడవిప్రదేశమునకు.

తా త్ప ర్య ము

శ్రీరాముని విడిచి యయోధ్యకుఁ బోదమనుకొందు, మనము శ్రీరాముని దోడితెచ్చెదము. లేదా శ్రీరామునివెంట మేము పోయెదమనికదా చెప్పి వచ్చితిమి. కావున మనరాకచూచి మనవెంట రాఁజాలక నిలిచిన ముదుసళ్ళు, రోగాదిబాధలచే రాఁజాలనివారు, ఆఁడువారు, పిల్లవాండ్రు, ఔరా రాముఁ డేఁడీ రాముఁడేఁడీ, మనయందు దయతలఁచి మరలివచ్చెనాయని ప్రశ్నింప వారికందఱకు నేమని ప్రత్యుత్తర మీయఁగలము, శ్రీరాముని నడవికి సాగ నంపి వచ్చుచున్నామనవచ్చునా, అటు చెప్పకున్న మఱియేమని చెప్పసాధ్యమగును.

కం॥ రాముని తోడుత వచ్చియు, రామునిఁ దోడ్కొనక చనిన • ప్రజఁ గని వృద్ధ
స్త్రీమాణవకోపేతం, బౌ మనసగరంబు మిగుల • నడలదె యార్తిన్. ౧౬౪౮

మాణవ కోపేతము=బాలురతోఁ గూడినది.

తా త్ప ర్య ము

మనమందరము శ్రీరామునితోడ మేము శ్రీరామునివెంటఁ బోయెదమని దంభములుపల్కి మహాడంబరముతో బయలుదేఱివచ్చి శ్రీరాముని బిలుచుకొని పోక యుక్తచేతులతోఁబోయిన మునలివా రేమందురు, స్త్రీలేమందురు, బాలురే మందురు, వీరందఱు మనము శ్రీరామచంద్రుని బిలుచుకొని వచ్చెదమని నమ్మి ధైర్యముతోఁ బ్రాణములు బిగఁబట్టుకొని యున్నారు. వారివార్త విని మహా దుఃఖములో మునిఁగిపోరా? మనము పోక యుందే మరణించితిమేని మనమంగ వారు శ్రీరామునివెంటఁ బోయినారు, శ్రీరామునకు భయములేదు. క్షేమముగ నుండఁ గలఁడని ధైర్యముతో నుందురు.

కం॥ రామునితోడుత వచ్చియుఁ, బ్రేమంబున నింతవట్టు • వెండియు నగరం
బీమెయి నే మోములతో, నే మని చొర మనసు లోర్చు • నెట్లని చింతన్.
౧౬౪౯

తోడుతన్=ద్రుతాంతమైన యవ్వయము, రామునితోడుతన్=సుప్పెపెలి ప్రమాణము.

తాత్పర్యము

ప్రేమగలవారివలె మనమింతదూరము శ్రీరామునితో వచ్చితిమి, అప్పి డేముఖములతో మనము మరల నూరిముఖము చూతుము. ఏమని లోపలఁ బ్రవేశింతుము. ప్రవేశించుటకు మనస్సులెట్లొప్పును. అని విచారపడుచు.

కం॥ క్రేపులఁ బాసినగోవుల, రూపునఁ దమబాహు లెత్తి • రోదనసహితా
లాపములఁ బెక్కుతెఱఁగుల,
వాపోయిరి యెల్ల జనులు • వల నెఱఁగమిచేన్. ౧౮-౨౦

క్రేపులన్=లేఁతదూడలను, రూపున=విధముగ, రోదనసహితాలాపములన్=ఏడుపుతోఁగూడిన మాటలతో, వాపోయిరి=ఏడ్చిరి, వలను=ఉపాయము.

తాత్పర్యము

లేఁగలను బోఁగొట్టుకొనిన గోవులవలె దమచేతులెత్తి యేయుపాయముతోఁ చనిమిచే నేడుపుతోడి మాటలతో ననేకవిధముల రోదనము గావించిరి.

కం॥ తేరి తెరువునను గొండొక, దూరము చని దాని జాడ • తోఁచమి నవలన్
బౌరులు నిర్భాగ్యుల మం,చూరక తముఁ దిట్టుకొనుచు • నుత్తలపడుచున్.

కొండొక=కొంచెము, తోఁచమి=కానరాకుండుటచే, ఉత్తలపడుచున్=పరితాపమొందుచు.

తాత్పర్యము

రథముపోయిన జాడపట్టుకొని కొంచెము దూరముపోయి యచట వచ్చిక మీఁదఁ బొదలనందునఁ దీఁగెలమీఁద సుమంత్రుఁడు రథముతోఁ బుటచే నావల జాడ కానరాకుండుటచే నాపురజనులు అయ్యో మనమెంత యదృష్టహీనులము రామసాంగత్యము వదలిపోయెఁగదా యని తమ్ముఁ దిట్టుకొనుచుఁ బరితాప పడుచు.

కం॥ ఏమి యిది యేమి గతి యిం, కేమి యొనర్పంగ వచ్చు • నిందఱ దైవం
బే మోసము చేసెఁ గదే, యామాడ్కి నటంచు నేడ్చు • చేగిరి పురికిన్.

తాత్పర్యము ౨౧-౨౨

ఏమియిది మనమొకటి తలఁచిన మఱియొకవిధమయ్యెనే, ఇఁక నేమి గతి, ఏమిచేయఁవలయును? ఇందఱకు గాఢనిద్రవచ్చునట్లు దైవమే చేసెనా, ఇది దైవకృత్యము గాకున్న నెన్నఁడురాని నిద్ర యిందఱకిట్టి కాలమందు నిట్లు వచ్చునా, యని యేడ్చుచుఁ బురమునకుఁ బోయిరి.

— • ౪౮-వ సర్గము. పౌరు లయోధ్య మరలఁ జేయుట, • —

ఉ॥ పొడలేనట్టి దోవఁ దెమ • పట్టిన మంతయు రాముఁ డున్నయా
పీ డశబొస్పదం బగుచు • పిడ్డెడెఁ గంటిరె, పక్షిరాజు వేం

బాడి పఱచిన వెలార్చఁగ జ॥లాశయమో శశిలేనిమిన్నొ నీ
రూడినకంధియో యనఁగ॥నొప్పు దొఱంగ నటంచుఁ జింతచేన్. ౧-౨౩

పాడఱచినట్లు=పాడు పెట్టినట్లు, తోఁచన్=కనఁబడఁగా పక్షిరాజు=గరుత్మం తుఁడు, ఫణిన్=సర్పమును, వెలార్చఁగన్=వెడలింపఁగా. జలాశయమో= మడుఁగో, శశి=చంద్రుఁడు, మిన్నొ=ఆకాశమో, నీరూడిన=నీళ్లింకిపోయిన, కంధియో=సముద్రమో, ఒప్పు=అందము, వీడ్వడెన్=మాఱువడెను.

తాత్పర్యము

పట్టనమంతయుఁ బాడుపెట్టినట్లు కనఁబడఁగా శ్రీరాముఁడుండిన గృహ ముమంగళమై రూపమే మాఱిపోయెను చూచితిరా, గరుత్మంతుఁడు వెంటఁబడి తఱిమి పామును వెడలింపఁగా నుండు మడుఁగో చంద్రుఁడులేని యాకాశమో నీళ్ళింకిపోయిన సముద్రమో యయినట్లు అందమే మాఱిపోయెను. అని చింతచే

తే॥ కనులు వాఁచఁగ నేడ్చుచుఁ॥గదిసి తమ్ముఁ
దమ జనంబులుఁ బెఱవారుఁ॥దద్దగనఁగ
వారి గుర్తింప లేరై రి॥వనటకలిమి
బాష్పవిప్లుతనేత్రులై ॥ వ్రాలి పడుచు. ౧-౨౪

బాష్పవిప్లుతనేత్రులై=కన్నీటిచే బాగుగఁదడుపఁబడిన కన్నులుగలవారై.

తాత్పర్యము

కన్నులు వాఁచునట్లేడ్చుచుఁ దమయొద్దకువచ్చి తమబంధువులు లోనగు వారును, దక్కినవారును ముఖములో ముఖముపెట్టిచూచినను దుఃఖాతిశయము చేఁగన్నులనిండ నీళ్ళుండిన కారణమున వారిని గుర్తింపలేరైరి.

ఉ॥ రాముని వెంట నంటి యటు॥గ్రమ్మఱి వారలు పీనుఁగులట్లుల
ధామములందుఁ జొచ్చి నిజ॥దారసుతావృతులౌచు దీనతన్
మోములఁ జేతు లూనుచు ము॥మూర్షను హాయని బిగ్గ యేడ్చిరం
కేమి తెఱంగొ యేమిగతి॥యెక్కడ కేగుద మంచు నంతటన్. ౧-౨౫

పీనుఁగులట్లలై=పీనుగులవంటివారై, ధామములందున్ = ఇండ్లయందు, నిజదార సుతావృతులౌచున్=తమ భార్యలతోను కొడుకులతోను జుట్టఁబడిన వారై, ముమూర్షను=మరణమందవలెనను కోరికచే.

తాత్పర్యము

శ్రీరామునివెంటఁబోయి మరలివచ్చి శవములవలెనై వారివారి యిండ్ల యందుఁ బ్రవేశించి తమ్ముఁ దమభార్యలు బిడ్డలను చుట్టుకొని నాయనా మన రాముఁడేడీ నగరునకు వచ్చినాఁడా యని బిడ్డలును ఏమండీ మనరాముని బిలుచుకొనివచ్చినారుకదా యని భార్యలు ప్రశ్నింపఁగా సిగ్గుచేతను

శోకముచేతను ముఖములు వెలవెలఁబోవ ముఖములపైఁ జేతులుంచుకొని చావఁగోరినవారై గట్టిగా నింకేమిగతి యేవిధమున వర్తింపవలె నెక్కడకుఁ బోదమని యేడ్చిరి.

ఉ॥ క్రొత్తగ మిత్రు లబ్బుటకుఁ•గూర్పరు మోదముఁ, గ్రొత్తవస్తువుల్
హత్తియు హర్షమూన రట•నంగడు లుంపరు వైశ్యులెవ్వరున్
గ్రొత్తగ నత్తలింటులకుఁ•గోడలురా మురిపెంబు గాన రెం
దత్తఱిఁ బ్రాయ్యి రాఁజ నిడ•రాత్రిఁ బురిన్ గృహమేధు లెవ్వరున్. ౧౧౫౬

హత్తియు=లభించియు, మురిపెంబు=సంతోషము, గృహమేధులు=గృహస్థులు.

తాత్పర్యము

క్రొత్తస్నేహితులు లభించినను సంతోషింపరు, క్రొత్తపదార్థములు దొరకినను మోదముగొనరు, కోమటు లంగడు లుంపరు, క్రొత్తకోడండ్రింటికి వచ్చినను నత్తలు సంతోషింపరు. వ్యసనముచే గృహస్థులెవ్వరును వంటకై ప్రొయ్యిలు రాఁజవేయరు.

కం॥ పలుధనములు లభియించియు, నలరరు చిరనష్టవిత్త•మంది మురియరున్
దొలిచూలుఁగొడుకుఁగాంచియుఁ,
దలఁపునసేమ్మదముగనదు•తల్లియుఁబురిలోన్. ౧౧౫౭

చిరనష్టవిత్తము=చాలఁగాలముక్రిందఁబోయిన ధనము, మురియరు=సంతోషింపరు.

తాత్పర్యము

విశేషముగఁ గ్రొత్తగ ధనము లభించినను జాలఁగాలముక్రింద నష్టపడియిఁక రాదనుకొన్నధనము మరలవచ్చినను దల్లులు తొలిచూలు కొడుకుఁ గాంచియు మనస్సునందైన సంతోషింపరు.

—•పౌరు లయోధ్యకుఁ బోవ స్త్రీలు వారిని నిందించుట•—

కం॥ ఇంటింట నేడ్చువాల్కుం, గంటులు తమపతులు రాఁగ•గని యిందులకున్
గెంటసమ్ములాడి రార్తిని, గంటులు వడ
నంకుశమున•గరి నడుమక్రియన్. ౧౧౫౮

పురుషులదుఃఖమును వర్ణించి శ్రీరామ వియోగమువలనఁ గలిగిన స్త్రీల దుఃఖమును గవి వర్ణించుచున్నాఁడు.

వాలుంగంటులు=స్త్రీలు, నిడివికన్నులు గలవారు, గెంటసములు=కఠినపు మాటలు, గంటులు=గాయములు.

తాత్పర్యము

శ్రీరాముఁడడవికిఁబోయెనే యని యింటింట నేడ్చుచున్న స్త్రీలు మన మగవారాయన వెంటఁ బోయిరిగదా యెటులైనఁ బిలుచుకొని రాఁగలరనికాంచెము నిబ్బరించుకొని యుండిరిగాని శ్రీరాముని బిలుచుకొనిరాక వారుమాత్రము

వచ్చుటఁజూచి ఛీ వీరేమి మగవారు! శ్రీరాముని విడిచి మరల నిండ్లని భార్యలని బిడ్డలని కాముకులై వచ్చిరని దుఃఖము కోపము పెనఁగొనఁగా నేనుఁగును నంకుశముతోఁ గొట్టినట్లు నిష్ఠురములాడిరి.

ఉ॥ రాముని తోడఁ బోయియును • రాజశిఖామణిఁ దోడితేక యి
  ల్లేమని వచ్చినార లొకొ • యిండ్లకుఁ గ్రమ్మఱి, యిందు లేటికో?
  యేమిటి కాలుబిడ్డలు? న•హీనసుఖంబులు విత్త మేటికిన్?
  రామునిఁ గన్నులారఁగఁ గ•నన్ సుకృతాత్ములు గానివారికిన్. ౧౭౯

అహీన సౌఖ్యంబులు=తక్కువగాని సౌఖ్యములు, విత్తము=ధనము, సుకృతాత్ములు=పుణ్యాత్ములు.

తాత్పర్యము

ఓమగవారలారా! శ్రీరామునితోడఁ బోయినవారు రాజశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రమూర్తిని బిలిచికొనిరాక మీదేముఖము పెట్టుకొని యేయభిప్రాయములతో మరల నిండ్లకు వచ్చినారు శ్రీరాముని గన్నులారఁ జూచునంత పుణ్యము లేనివారికి నిండ్లేల పెండ్లాలేల బిడ్డలేల సుఖములేల ధనములేల శ్రీరాముని ముఖావలోకనము చేయుచుండుటకంటె నివన్నియు సుఖములని యానందకరములని తలంచి వచ్చితిరా.

ఇంతటి విషయవాంఛగల పాపాత్ములు మీరెక్కడ శ్రీరామచంద్రమూర్తి యెక్కడ- ఇంతటి చపలచిత్తులు కొంపలోఁ బడియుండక మీరేల శ్రీరాముని వెంటఁ బోయితిరి మమ్ముఁ బొమ్మనిన మేముపోయి పిలుచుకొని వచ్చియుండుమే చుట్టు చుట్టుకొని పాదములమీఁదఁబడి గట్టిగఁ బ్రాణాపాదముపడిన మమ్ముఁ ద్రోసికొని యెట్లు రామచంద్రుఁడు పోయియుండఁగలఁడు- మీకా మాత్రము తోఁచనేలేదో అవమానముగనే తోఁచెనో- పెండ్లాలమీఁద భ్రాంతిపడి పరువెత్తి వచ్చితిరో కదా మీకు మగపంతములు మగువలమీఁదనేకాని భగవద్విషయంబునఁ గాదుకదా.

ఉ॥ ఒక్కఁడ లక్ష్మణుండు సుజ•నోత్తముఁ డీజగమందు భక్తి మే
  మక్కువ రామచంద్రుని క్ష•మాతనయాన్వితుఁ గొల్వఁ గానకై
  చక్కఁగ నేగి, నాయడవిఁ • జారుధునీసరసీవరంబులం
  దక్కమలాక్షుఁ డాడ సహ • హా యుపి యేసుకృతంబుఁ జేసెనో. ౧౮౦

సుజనోత్తముఁడు=సజ్జనులందు శ్రేష్ఠుఁడు, క్షమాతనయాన్వితున్=సీతతోఁ గూడినవానిని, చారు=మనోహరములైన, ధునీ=నదులందును, సరసీవరంబులన్= శ్రేష్ఠములయిన కొలఁకులందును, ఆడన్ = స్నానముచేయుటకు, సుకృతంబు=పుణ్యము- క్షమాతనయాన్వితు శ్రీరామునమటచే. సీతాసహితుఁడైన శ్రీరామునే కొల్వవలయునుగాని యిరువురిలో నొకరిని మాత్రము పూజింపరాదు.

తాత్పర్యము

ఈ ప్రపంచమందు సజ్జనశ్రేష్ఠుఁ డెవ్వఁడనిన లక్ష్మణుఁ డొక్కఁడే- ఏలనః- సీతాసమేతుఁడైన శ్రీరాముని జక్కఁగఁ గొల్వఁగఁ బ్రేమతో నిల్లువాకిలి తల్లి భార్య సర్వసుఖములు వదలి నాయనవెంటఁ బోయెను. శ్రీరాముల సేవింప నటు వంటివా ర్హులుగాని మీవంటివారా యర్హులు. అయుతవియందుండు మనో హరములైన నదులలోఁ గొలఁకులలో శ్రీరాముఁడు స్నానముచేయుటకు నవి యెంతపుణ్యము చేసెనో మనము కన్నులఁజూచుటకైన భాగ్యములేక యేడ్చు చుండఁగా నవి యెంతపుణ్యము చేయుకున్న శ్రీరాముని గాత్రసంస్పర్శము లభించి పవిత్రములయిన వగునా- వానిజన్మము సార్థకము మనజన్మము వ్యర్థము.

కం॥ కాంతారకసంతానము, కాంతానూపములు నదులుఁ • గటకప్రస్థా
క్రాంతధరాధరములు న,త్యంతము శోభిల్లఁ జేయు • నాశ్రీరామున్.

కాంతారకసంతానము=అడవులసమూహము, కాంతానూపములు నదులు= మనోహరములైన బురదనేలలుగల నదులు, కటకప్రస్థాక్రాంత=పేఁటులచేతను- విశాలములైన పటువునేలలచేతను ఆక్రమింపఁబడిన, ధరాధరములు =పర్వత ములు, అత్యంతము=మిక్కిలి.

తాత్పర్యము

అడవుల సమూహములు శ్రీరామునకు ఫలములు పుష్పములు నీడలు నిచ్చియు, నదులు తమప్రాంతములనుండు నీటఁ దడిసిన నేలలచే శ్రీరాముని పాదములకుఁ బాసుపులు పఱచినట్లు మెత్తగా నుండఁజేసియుఁ, బర్వతములు విహార శయ్యాసనములకు ననుకూలపడియు, శ్రీరాముని సేవించుచు నాయనను సంతోషముచేఁ బ్రకాశింపఁజేయును. స్థావరములు నచేతనము లిట్లు శ్రీరామసేవ చేసి జన్మములను సార్థకపఱచుకొనుచుండ మనుష్యులమైన మనము వ్యర్థజీవి తులమైతిమి.

కం॥ కాననములేని శైలము, లేనిఁ బ్రియాతిథినిబోలి • యేతెంచినసీ
తానాథుని నర్చింపక,మానఁగ నెటు లోపు నవి సమర్చావిధులన్.౧౦

శైలములు=పర్వతములు, అర్చింపక = పూజింపక, సమర్చావిధులన్= అతిథులను బూజింపవలసిన నియమములచొప్పున.

తాత్పర్యము

అడవులు, పర్వతములు, జడములైన నగుఁగాక. అవియును బ్రియుఁడైన యతిథివలెఁ దమయొద్దకు వచ్చిన శ్రీరాముని దగిన యర్చానియమముల ప్రకా రము పూజింప కెట్లుండఁగలవు అవి స్థావరములు గావున శ్రీరాముఁ డున్న చోటికవి పోలేకపోయినను ఆయనయే తమయొద్దకు వచ్చినపుడైన నెట్లు పూజిం పకయుండగలవు. మీలో మనుష్యులై ఆయనయొద్దకు నడచిపోవఁ గలిగియుం డియు స్థావరములు చేసిన మాత్రము చేయలేకయున్నారుగదా- మీరు స్థావర ములకంటె నికృష్టులరైతిరి.

కం॥ నెరయుంగ మొకరితేఁటులు, వరకుసుమాపీడము లయి•పలుమంజరులన్
సరసం బయి వనవిటపులు,దరిసింపఁగ గలవు రాము•ధన్యము లగుచున్.

నెరయుంగన్=వ్యాపించునట్లు, మొకరితేఁటులు=ధ్వనించు తుమ్మెదలు, వరకుసుమాపీడములయి=శ్రేష్ఠములయిన పూవులను దలయందు ధరించినవై, వనవిటపులు=అడవి వృక్షములు.

తాత్పర్యము.

భగవద్దర్శనము చేయునపుడు మధురస్వరముల మంగళగానము సేయు స్త్రీలవలె ఝుంకారముచేయు తుమ్మెదలు శిరములందుఁ బూవులు ముడిచి చేతఁ బూలగుత్తులు గొనిపోవు స్త్రీలవలె నడవియందు వృక్షములు పూవులను గుత్తులను సుందరములై శ్రీరాముని దర్శించి తమజన్మములు సార్థకముచేసి కొనఁగలవు. మనుష్యస్త్రీలమైన మాకంతటిభాగ్యము సినిమిత్తమున లేదాయె.

కం॥ కాలంబు గాక యుండియు, బాళిని బూవులును బండ్లు•బరమాదృతిపై
శైలంబు లొసఁగు సీతా,బాలాహృదయేశ్వరుండు•వచ్చిన డాయన్.

తాత్పర్యము ౧౫౬౪

భగవంతుఁడు ప్రభువు- తన సమీపమునకు వచ్చినపుడు కానుక లీయక యూరకుండరాదు గనుక తమపార్శ్వముల విహరింప శ్రీరాముఁడు వచ్చినపుడు పూవులు పండ్లుగలకాలము గాకపోయినను ప్రేమచే బిడ్డలఁ జూచినపుడు వాత్సల్యాతిశయంబునఁ బాలులేని స్త్రీలకుఁ జనుబాలు వడినట్లు పర్వతములు మిగుల నాదరముతోఁ బూవులను బండ్లను సమర్పించును.

కం॥ సెలయేఱుల నిర్మలతర,జలపూరము చిత్రముగను • జాఱు గొన మహా
చలములు సలుపును దమతమ,
పొలిమేరలు చేరఁ బురుష•పుంగవుఁ డాస్థన్. ౧౫౬౫

నిర్మలతరజలపూరము = మిక్కిలి తేటయగు నీటిప్రవాహమును.

తాత్పర్యము

శ్రీరాముఁడు తమతమ పొలిమేరల చేరినపుడు గొప్ప పర్వతములు పాద్యమో యన్నట్లు కొండవంకలందు మిగులఁ దేటయగు నీటిని వెల్లువగఁ బాదములపైఁ బాఱఁజేయును.

కం॥ ఎండకు సొటసొట లాడుచు, దండను దమకాలినొవ్వఁ•దలఁగింపఁగ వా
యుండఁగఁ గొమ్మల వీచుచు,
దండిగ దమియుంపఁ జేయు•ధరణీరుహముల్. ౧౫౬౬

సొటసొట లాడుచున్=తపించుచు, దండను = సమీపమునను, ధరణీరుహముల్ = వృక్షములు.

తాత్పర్యము

ఎండవేఁడిమికిఁ దపించుచుఁ దమనీడల లోకి ధరణీసుత సీతయు ధరణీవిభుఁడు శ్రీరాముఁడు రాఁగా వారికాలినొప్పి యెండతాపము పోవునట్లు ధరణీరుహములు వింజామరలతో వీచు స్త్రీలవలెఁ గొమ్మలచేఁ జల్లగాలి తగులునట్లు విసరును. ఆచెట్లకొమ్మలు చేసినపుణ్యము మేము చేయమైతిమి-

—♦ పురస్త్రీలు శ్రీరాముఁ దలంచి దుఃఖించుట. ♦—

ఉ॥ ఎచ్చట రామచంద్రుఁడు మహిష్ఠగుణోత్కరసాంద్రుఁ డుండునో
యచ్చట భీతి లేదు చుఁడీ ♦ యచ్చట లేదు పరాభవంబు నా
నచ్చిరతుండు దూరముగ ♦ సత్వరుఁ డై చనకుండు మున్న వెం
వచ్చుపడంగ లెండు వదఁ ♦ డా చని యుంద వసింత మర్మిలిన్. ౧-౭౬౪

మహిష్ఠగుణోత్కరసాంద్రుఁడు=గొప్పగుణముల సమూహముచే నిండినవాఁడు, పరాభవము=(1) అవమానము- 2) మఱుజన్మము, భీతి=1) భయము- 2) సంసారభయము, సత్వరుఁడై=త్వరతోఁ గూడినవాఁడై, అర్మిలిన్=ప్రేమతో.

తాత్పర్యము

అయ్యా! పురుషులారా! యడవులలోఁ గ్రూర మృగము లుండునని భయపడవలదు. పామరులు వీ రడవులపాలై యాలుఁ మగఁడు పోయినారని యవమాన వాక్కు లాడుదురని చింతింపనువలదు. ఏలన శ్రీరాముఁడున్నచోట నే భయము లేదు. ఏయవమానములేదు. ఆవిషయమై మీరాలోచింపవలదు. ఆసాధుచరితుఁడు వేగముగ దూరము పోకముందే మనముపోయి కలిసికొందము లేలెండు- పదుఁడు- ప్రయాణముకండు- మేముసిద్ధముగా నున్నాము- ఇక్కడఁ జేయు కాఁపురము లక్కడనే చేయవచ్చును- అందేపోయి యుందము మీరు రాకున్న మీరందే యుండుఁడు మాకనుజ్ఞయిండు- మేము శ్రీరామచంద్రు సన్నిధికిఁ బోయెదము.

ఉ॥ అతఁడ జీవకోటికిఁ బరాయణ మాతఁడ ప్రాప్య మౌటచేఁ
బ్రీతిని నమ్మహాత్ము సదరీణగతిం బదసేవఁ గొల్వఁగాఁ
జేతము లుల్లసిల్లెడిని ♦ సీతను భక్తిని గొల్తు మేము, మీ
రాతరుణార్కతేజుఁ బ్రియ ♦ మార భజింపుఁడు లెండు పోవఁగన్. ౧-౭౬౫

పరాయణము=సర్వవిధముల నాధారమైనవాఁడు, ప్రాప్యము=ఎప్పటికైనను బోవలసిన స్థలము, సదరీణగతిన్ = మంచి వంకరలేనివిధముగా, చేతములు=మనస్సులు, ఉల్లసిల్లెడిని = సంతోషపడుచున్నవి, తరుణార్కతేజున్ = బాలసూర్యునివంటి కాంతిగలవాని.

తాత్పర్యము

ఇంత తొందరయేల యందురేమో సమస్త జీవకోటులకు ధారణ పోషణములకు నాధారమైనవాఁడు శ్రీరాముఁడే, ఎప్పటికైనను మనము పొందఁదగిన

వాఁడు శ్రీరాముఁడే; కావున నేనాఁడో మనసైవెదకుచుఁ బోవలసిన చోటికి నదే యిపుడు సమీపమున నుండఁగానే పోదము. మనము నోమరులమై యాలసించిన యాయన దూరము పోవును. దుర్లభుఁడగును. అక్కడికిఁబోయి యేమి చేయవలెనందురా. ఆ మహాత్ముని పాదసేవ యథావిధి చేయఁగా మామనస్సు లువ్విళ్ళూరుచున్నవి. మేము సీతను భక్తితో సేవింతుము. మీరు బాలసూర్య తేజుఁడైన శ్రీరాముని నిత్యకృత్యముగ సూర్యోపాస్తి చేయునట్లు ప్రీతితో సేవింపుఁడు ఇంకవేల యాలస్యము. శుభస్య శీఘ్రము. లెండు పోదము.

దీనివలనఁ బరమాత్మయుఁ బ్రాప్యుఁడును శ్రీరాముఁడే యనియు నాయనను బొంది ముక్తదశయందును జేయవలసిన కార్యము భక్తిపూర్వకసేవ యనియు భగవత్ప్రాప్తివిషయమై యాలస్యము చేయక యీజన్మమందే త్వరపడి సాధింపవలయుననియు వ్యంగ్యము.

కం॥ మీయోగక్షేమంబుల, నాయనఘుం డరయుచుండ నవనిజ గూర్చున్
మాయోగక్షేమంబుల, నేయడలును లేదు వారి నేకొలువంగన్. ౧౭

యోగక్షేమంబులన్=యోగము=లేనిది సమకూర్చుట, క్షేమము = ఉన్న దానిని రక్షించుట, అరయుచుండన్ = విచారించుచుండఁగా, అవనిజ = సీత, కూర్చున్=సంఘటించును, అడలు=భయము.

తాత్పర్యము

సీతసేవ మేము చేసెదమంటిరే. సీత ఆఁడుది చిన్నది యామె మీకేమి బదులు చేయఁగలదందురేమో శ్రీరాముఁడు మీ కేమి కావలయునని మీయోగక్షేమములు మిమ్ము విచారించును. అది యుక్తవాగ్వ్యాపారమే. కార్యము చేయవలసినది మాసీతమ్మయే. పతియాజ్ఞగొని యాశ్రితులకుఁ జేయవలసిన వన్నియు నామెయే చేయును. ఆఁడుబిడ్డలకుఁ గావలసినది తల్లియే యగును. కావున నామెను మేమడుగవలసిన పనియేలేదు. మాకుఁ గావలసినది యామెయే తెలిసికొని మా క్షేమమునకై యేమేమి చేయవలయునో యన్నియు నామెయే తనంతటఁ దానే మా ప్రార్థనలేకయే తల్లివలెఁ జేయును. కాఁబట్టి యితరులసేవలు మాని వారినే సేవించితిమా మనకే భయము లేదు. కావలసినది లేదాయెననికాని, యున్నది పోవుననికాని భయము లేదు. ఆపదలనెల్ల శ్రీరామచంద్రమూర్తి హరించును సంపదలనెల్ల శ్రీసీతాదేవి సంఘటించును కావున వారియొద్దనుండిన మనకేలోపము కలుగదు.

ఆపురస్త్రీలు. సుమిత్ర. తార. మందోదరి భగవద్విషయజ్ఞానము గలిగిన భక్తురాండ్రగుటయుఁ బురుషులు మొద్దుగాండ్రగుటయు విచిత్రము. స్త్రీజనపక్షపాతి వానుదాసుఁడు మాత్రమేకాఁడు. వాల్మీకియు నట్టివాఁడే. ఇరువురు సాధ్వీజన పక్షపాతులేకాని దుష్టస్త్రీ పక్షపాతులు కారు. ఇరువురు సాధుస్త్రీల స్వభావమెట్టిది యున్నదున్నట్లు వచించినవారే. సాధ్వీపక్షపాతి కాకుండిన వాల్మీకి

రామాయణము రచించియేయుండడు. ఈస్త్రీలు చెప్పినట్లు పురుషులకు మాఋ స్త్రీలు శ్రీరాముని వెంబడించి పోయియుండిన నాయనను మరలించి తెచ్చియుం డురో అవలఁ బోనీయక యుందురో. ఏలన గోపికలు 'కితవయోషితః కస్త్యజేన్నిశి' నీనిమిత్తమై పతిసుతాదుల విడిచి వచ్చిన మమ్ము నీ చీకటిలో విడిచిపోదు ధవాయని యేడ్చినప్పుడుకదా కృష్ణుఁడు గోపికలకు మరలఁ బ్రత్యక్షమాయెను. అట్టులే స్త్రీలేడ్చియుండిన శ్రీరాముఁడు మరలి యుండునేమో- పురుషులు కావున నెట్లైన వారివారి కొంపలు వారువారు చేరుదురని శ్రీరాముఁడు విడిచిపోఁ గలిగెను. స్త్రీలవిషయమున నంతక్రూరముగాఁ బ్రవర్తించియుండఁడు. అఁదు కులు-అలకులు విని సాధువులు సహించియుండరు.

సీ॥ అప్రశస్తంబు నై యమనోహరంబు నై, యవలక్షణంబు నై యాత్మనాశ
కం బయి మిగుల నుత్కంఠఁ గలిగించు నీ,కొంపపై నెవ్వఁడు కూర్మిసేయుఁ?
గైకేయి రాజ్యంబు గావింప ధర్మశూన్యము దిక్కులేని దానగర మింక
నెక్కడి బ్రతుకుపా యెక్కడిబిడ్డలు, నెక్కడిధనము లీ దేటిమాట?

తే॥ భాగ్యసంప్రాప్తికై తన పట్టి విడిచె, మగని నెడఁబాసె సతిమఱ్ఱార్గురాలు
వంశపాంసని యింక నెవ్వానినేమి,
చేయకుండెడి మన మేమి చేయఁగలము. ౧౯-౫౪౦

పురస్త్రీలు శ్రీరామపదసేవ వలనఁ గలుగు నిహపరసుఖములఁజెప్పి శ్రీరాముని విడిచి సంసారమున నుండినఁ గలుగు కష్టంబులఁ జెప్పుచున్నారు.

అప్రశస్తము=ప్రశంసింపరానిది, అమనోహరము = మనసునకు నింపుగానిది, అవలక్షణము=దుర్గుణములుకలది, ఆత్మనాశకంబు=(1) తన్ను నాశము చేయునది.(2) ఆత్మజ్ఞానము నశింపఁజేసి యాత్మ నధోగతులపాలు చేయునది, ఉత్కంఠ=ఎప్పటికేమో యెప్పటికేమో యని దుఃఖస్మరణమునఁ దహతహపాటు గలిగించునది, అటువంటి యీకొంపపై =(1) ఈయింటిమీఁద, (2) ఈసంసారముమీఁద- (3) ఈదేహముమీఁద- (4) ఈయూరిమీఁద, కూర్మిసేయున్ = ప్రేమచేయువాఁడగును, ధర్మశూన్యము=ధర్మములేనిది, భాగ్యసంప్రాప్తికై = సంపద లభింపవలయునని, పట్టి=కుమారుని.వంశపాంసని=కులము చెఱచునది.

## తాత్పర్యము

మీరు శ్రీరామునివెంటఁ బోయినఁ గొంపలగతి యేమి యుందురేమో ఈ కొంప జ్ఞానవృద్ధులు నిలువఁదగినది కాదు. మేలని ప్రశంసింపఁ దగినది కాదు. మనస్సు నాకర్షించునట్టి మంచిగుణము దీనియందు లేదు. కావలసినన్ని దుర్గుణములే కలవు. దీనియందు మనముుంటిమా యేవిధముగనైన మనము నాశమై పోవుట సిద్ధము. అదియునుగాక యేవేళకేమి కీడుకలుగునో యని భయము. ఇట్టి యూర నెవఁడు ప్రేమయుంచును. ఇన్ని యిప్పుడే యెట్లువచ్చెనందువా- ఇది స్త్రైణరాజ్యము. స్త్రీనాయకమైన రాజ్యమున సుఖమెందుండివచ్చును.

(ప్రకృతి స్త్రీ- ఈదేహము ప్రకృతిపరిణామము ఆత్మమీఁద నీదేహాధికారము చాల్లనేని యావల నాత్మ నాశముగాక యొట్లుతప్పును.) కైక రాజ్యమున ధర్మ మెక్కడిది- (౨) ప్రాకృత విషయంబుల మరగిన యింద్రియదాసునకు ధర్మా ధర్మ విచారముండునా- కావున రక్షకుఁడు లేనిదగును. శాసకుఁడైన యీశ్వ రుఁడు నుపేక్షించి యూరకుండును. ఇఁక నీకైక రాజ్యంబున సుఖజీవనమెక్క డిది- ఎక్కడి బిడ్డలు- ఎక్కడి ధనము- కైక యాజ్ఞయని యెదందుగలు రాజ భటులు గొందురా- అట్టిల కైకచేయునందురా- ఐశ్వర్యము నిమిత్తమైకదా తనకొడుకు విడిచెను- మగని నెడ బాసె- అటువంటి దుర్మార్గురాలు అటువంటి కులక్షయకారిణి యెవ్వనికేవేళ నేమిచేయునో యెవ్వరెఱుఁగఁదురు. అట్లావెఁచేసిన మన మేమిచేయఁగలము. వెనుక జింతించుట వెఱ్ఱితనము- కావున ముందుగనే హెచ్చరిక గలిగి యుందము.

తే॥ కైకేయి బ్రతికియుండఁగ, నాపెకడం గూలివాండ్రమై మగుచును బ్రదుకన్ మా కోర్వదు మది నిక్కం, బీకొడుకులమీఁద శపథమిదిపలికెదము.

స్త్రీల సాహసము పట్టుదల యీ పద్యమునఁ దెలియఁగలదు. [౧౮-౨౧

తాత్పర్యము.

కైకేయి జీవించి ప్రభుత్వమే చేయుట కలిగినా యామెయొద్ద మేము కూలివాండ్రమై జీవింప మా మనస్సు లొప్పవు. అట్టిదశ మేము సహింపలేము. ఇది యిప్పటి యుద్రేకముమీఁదఁ జెప్పెడిమాటగాదు. ఇదిగో మా యొడిలో నుండు బిడ్డలపై ప్రమాణముచేసి చెప్పుచున్నాము.

ఉ॥ రాజకుమారునిం గనికరం బనుమాట యొకింత లేక దు
ర్యోజన వన్యలన్ నవయఁద్రోసినదుర్మతి దుష్టశీల నే
యాశ్య జగజ్జంతఁ గొల్చి యెకండో సుఖ మందెడివాఁ, డనాయకం
బై జనహీన మై నగరమంతయుఁ బాడయిపోవు నీపయిన్. ౧౮-౨౧

ఇంత ఘోరప్రమాణము చేసెదరేల యందురా.

దుర్యోజనన్=దురాలోచనముచే, వన్యలన్=వనసమూహములందు, నవ యన్=కృశించునట్లు, దుర్మతి = చెడుమనస్సుగలది, దుష్టశీల = చెడునడవడి గలది, జగజ్జంత=మిగుల గయ్యాళి. అనాయకంబు=నాయకుఁడు లేనిది, జన హీనము=మనుష్యులు లేనిది. తాత్పర్యము

ఇంత ఘోరప్రమాణము చేయుటకుఁ గారణము చెప్పెదము వినుఁడు. దిక్కు లేని యనాథవాని బిడ్డనుగాదు. రాజుగారి కుమారునే. ఏరాజకుమారుఁడో కాదు. తనకు మగఁడైన రాజుగారి కుమారునే.దయ యనుమాట కొంచెమైనను లేక దురా లోచనచేసి యడవులందుఁ గృశించి చావుమని త్రోచినట్టి చెడుమనస్సు గలది. తన యాలోచన తనలోనుంచుకొనక యాప్రవాదము నడపుచున్నది. అటువంటి

గయ్యాళిని గొలిచి యెవఁడు సుఖమునందఁగలఁడు. కావున నెవరు నీ నగరమునం దుండరు. ప్రజలు లేకుండిన నాయకుఁడేల. కావునఁ బ్రభువు నుండఁడు. కావున నీ పట్టనమంతయు మనుష్యులులేనిదై పాడుపడి పోవును.

ఉ॥ రాముఁడు గానకుం జనుట • రాజుఁ జచ్చును, మీఁద నేడ్పు యీ
భూమిని, క్షీణపుణ్యు! లిది • బుద్ధిఁ దలంచి విషంబుఁ ద్రాగుటో
రాముని వెన్నడిం జనుటో • క్రవ్యజ నీనగరంబువార్త పే
రేమి వినంగ రాని మహి • కేనియుఁ బోవుటో నిశ్చయింపుఁడీ. ౧౨౩

తాత్పర్యము

శ్రీరాముఁ డడవులకుఁ బోయిన కారణమున రాజుఁ జచ్చును. రాజు చూడఁ జచ్చినా యరాజకమైన నీరాజ్యమం దెందును నేడ్పుధ్వనులే విన వచ్చును. కావున శ్రీరాముని వెంటబోయి మరలివచ్చిన నిర్భాగ్యులారా! యింత మాత్ర మాలోచించి విషము ద్రావుటమేలో శ్రీరాముని వెంబడి పోవుటమేలో- అది యిదిగాకున్న నీయూరివార్త చెవిని బడని దూరదేశమునకుఁ బోవుటో- ఈ మూఁటిలో నేదియో యొక్కటి నిశ్చయింపుఁడు. ఇక్కడ నుండుటమాత్రము తగదు.

చం॥ అలుకక మోసమై దశర • థావనినాథుఁడు రాముఁ దమ్మితో
జలజదళాక్షితో వనికి • సాగఁగ నంపి దయావిహీనుఁడై
మలఁగక మిమ్ము మమ్ము దెస • మాలినవారిని బోయవానిముం
గలఁ బశుజాల ముంచుగతిఁ • గైకయిపట్టికి నప్పగించెడిన్. ౧౨౪

రాజు చచ్చినతరువాత ముచ్చటగదా మీరుచెప్పునది. రాజుండువఱకు నిందే యుండవచ్చునుగదా యందురేమో యదియును సరిగాదు. ఏలయందురా.

అలుకక = జంకక, మోస + ఐ = మోసముచేత- మోస రూ. మోసము.

తాత్పర్యము

రాజుమాత్రము మంచివాఁడా, ఆయనయు దుష్టుఁడే. ఇదివఱకు నెవరేమను కొందురో యను బంకులేక మోసముచేసి పట్టాభిషేకముచేసెద రమ్మని సదు గిరిలోఁ జెప్పి యింటికిఁబోయి నీవడవులకుఁ బొమ్మని శ్రీరాముని సీతను లక్ష్మ ణుని నడవులకు దయాహీనుఁడై పంపినవాఁడు మనవిషయమున నయ్యో పాప మనునా. ఆయన చేయఁబోవునది తెలియునా? తన యభిప్రాయమునుండి మరలక దిక్కులేని మిమ్ము-మమ్ముఁగూడ బోయవానిముందు పశువులనుంచు విధమునఁ గైకేయికొడుకునకు నప్పగించును. కావున నీరాజు బ్రదికియుండినను మనకు మేలులేదు.

సీ॥ నిండుఁజందురుఁబోలు • నెమ్మోముగలవాఁడు, సహితపాళికిఁ గాలుఁ • డైనవాఁడు
గూఢజత్రులకల్మి • రూఢి కెక్కినవాఁడు, నుత్తమాజానుబా • హువులవాఁడు
కమలంబులనుబోలు • కందోయి గలవాఁడు, తానెమున్నుగఁ బల్క • నేర్చువాఁడు
కమ్మనిపల్కులు • నెమ్మి నాడెడివాఁడు, మాఱు లేనిపరాక్ర • మంబువాఁడు

తే॥ సౌమ్యుఁ డగువాఁడు, మఱి జగ ♦ జ్జాలమునకు
నమృతకరునట్లు చూడఁ బ్రి ♦ యంబు నైన
వాఁడు, పురుషోత్తముఁడు ఘోర ♦ వనచయంబు
శోభితముఁ జేయు చుండునే ♦ సుకృతరతుఁడు. ౧-౩౪

కైకేయీదశరథుల స్మరించిన పాపము పోవుటకై శ్రీరాముని గుణముల స్మరించిరైన దుఃఖమార్పఁదలంచి శ్రీరాముని గుణముల వర్ణించుచున్నారు.

అహితపాళికిన్=శత్రువుల సమూహమునకు, కాలుఁడు=యముఁడు, గూఢజత్రులకల్మిన్ = బలసిన మూఁపులు కలిగియుండుటచే, రూఢికిన్ = ప్రఖ్యాతికి, ఉత్తమ=శ్రేష్ఠములైన, అజానుబాహువుల వాఁడు=మోఁకాటివఱకుఁగల చేతులు గలవాఁడు, నెమ్మిన్=స్నేహభావమున, జగజ్జాలమునకున్=లోకసమూహములకు, అమృతకరునట్లు=చంద్రునివలె, ఘోరవనచయంబు=భయంకరమైన వనముల సమూహమును, శోభితమున్=ప్రకాశించునదిగ.

తాత్పర్యము

పూర్ణచంద్రునివంటి ముద్దుముఖము గలవాఁడును విరోధులకు మృత్యుస్వరూపమైనవాఁడును, బలసిన మూఁపులచేఁ బ్రసిద్ధుఁడును మోఁకాలినంటు నుత్తములైన చేతులుగలవాఁడును, కమలములవంటి కన్నులజంట గలవాఁడును, తానే ముందుగఁ బలుకరించువాఁడును, స్నేహభావముతోఁ దియ్యని పలుకులు పలికెడివాఁడును ఎదురులేని శౌర్యము గలవాఁడును, ప్రసన్నుఁడును, లోకుల కందఱకుఁ జంద్రునివలెఁ జూడఁ బ్రియమైనవాఁడును, పుణ్యకార్యములం దాసక్తి కలవాఁడునునగు శ్రీరామచంద్రమూర్తి యీపాటికి నరణ్యములను బ్రకాశింపఁ జేయుచుండునా?

కం॥ రాముండు సత్యభాషా,ధాముఁడు దానాభి రాజి ♦ తద్విపగమనుం
డామహనీయుఁడు నిజతను,
ధామంబున వెలుఁగఁ జేయుఁ ♦ దద్వన మెల్లన్. ౧-౩౬

సత్యభాషాధాముఁడు=సత్యవాక్కులకు స్థానమైనవాఁడు, దాన=మదజలముచే, అభిరాజిత=మిక్కిలి ప్రకాశించు, ద్విప=ఏనుఁగునడకవంటి, గమనుండు=నడకగలవాఁడు, నిజతనుధామంబునన్=తనదేహకాంతిచే.

తాత్పర్యము

సత్యవాక్కులకు స్థానమైనవాఁడును మదించిన యేనుఁగు నడకవంటి నడక గలవాఁడును నగువాఁడు మన శ్రీరామచంద్రమూర్తి అట్టి మహనీయుఁడు తనదేహకాంతిచే నావనమంతయుఁ బ్రకాశింపఁజేయు చుండును.

కం॥ ఈకరణిఁ బురమునం గల,యాకరిణీయాన లెల్ల ♦ నలమటపడ న
స్తోకంబుగ మృత్యుభయ,వ్యాకులల ట్లంతఁ బంక ♦ జాప్తుఁడు గ్రుంకెన్.

ఈకరణిన్=ఈవిధము, కరిణీయానలు=ఆడు యేనుఁగుల నడకగలవారు స్త్రీలు, అలమటపడన్=బాధపడుచుండఁగా, అస్తోకంబుగన్=మిక్కిలి, మృత్యుభయ వ్యాకులలు = మరణభయముచేఁ గలఁతచెందినవారు. ఇది పరమభక్తి లక్షణము.

## తాత్పర్యము

ఈవిధముగఁ బురస్త్రీలు దుఃఖముచే మిక్కిలి మృత్యుభయముచేఁ గలఁత నొందిన పాముల వలె రామవియోగతాపంబున బాధపడుచుండుట చూచి వారి దుఃఖము చూడలేనివానివలె సూర్యుఁడస్తమించెను. ఇది రెండవనాఁటి పగటి వృత్తాంతము. ఆదినము షష్ఠీతిథి.

ఉ॥ వేలుప రగ్నిహోత్రముల • విప్రులు, వేదపురాణసత్కథల్
బాలిఁ బఠింప రెవ్వరును • బాధతమంబు పురంబు నుండఁగా
జాలి మునింగి దిక్కు చెడి • సంతస మింతయు లేక శూన్యవ
ద్వ్యాళియు నై గ్రహోడురహి • తాభ్రమువంగి నయోధ్య చెన్నఱెన్. ౧౫౫

బాధతమంబు=గాఢాంధకారము, శూన్యవద్వ్యాళి=వస్తువులులేని యంగళ్ళ వరుసలుగలది, గ్రహోడురహితాభ్రమువంగిన్ = గ్రహములు నక్షత్రములు లేని యాకాశమువలె, చెన్నఱెన్=కాంతిహీనమయ్యెను.

## తాత్పర్యము

బ్రాహ్మణులెవ్వరు నగ్నిహోత్రములు హోమములు చేయరు. వీథుల యందు వేదపురాణములందలి మంచికథ లెవ్వరు పఠింపరు. గాఢాంధకారము పట్టనమంతయు ముంచుటచే వ్యసనాంధకారములో మునిఁగి దిక్కులేక సంతోషమనునది కొంచెమైనను లేక పొడుపెట్టఁబడినట్లుండు నంగళ్ళవరుసలతో నయోధ్యాపురము గ్రహములు నక్షత్రములు లేని యాకాశమువలె నుండెను.

చం॥ తమతమముద్దుబిడ్డలను • దమ్ముల నన్నలఁ బాసినట్లుగా
గమలదళాక్షు లాపురిని • గాదిలిరామున కంగలార్పఁగా
శమకరగీతనృత్యములు • చారుతరోత్సవముల్ దొలంగి సం
శమితజలార్ణవంబుగతి • జానఱి పట్టన మెంతొ నయ్యెడన్. ౧౫౬

గాదిలిరామునకు=ప్రేమాస్పదమైన శ్రీరామునకై, అంగలార్పఁగా=అంగలి + ఆర్పఁగాన్=గొంతెండునట్లేడ్వఁగా, శమకరగీతనృత్యములు = శాంతికలిగించు పాటలు నాటలు, చారుతరోత్సవముల్ = మనోహరములైన పండుగలు, దొలంగి=విడిచి, సంశమితజలార్ణవంబు=అలలు లేక్కులేని సముద్రము, జానఱి = అందముచెడి.

## తాత్పర్యము

తమతమ ముద్దుబిడ్డలను దమ్ముల నన్నలఁ బాసినట్లుగా నాపురమునందలి స్త్రీలు ముద్దులరామన్నా, మోహనరామన్నా, నాయనా, తండ్రీ యని యేడ్చుచుఁగా

శాంతికరములైన యాటలు మనోహరములైన యుత్సవములు లేక యెండి పోయిన సముద్రమువలె సొంపుచెడి యయోధ్యాపుర ముండెను.

—• ౪౯-వ సర్గము. శ్రీరాముఁడు కోసలదేశంబు దాఁటి పోవుట. •—

సీ॥ అక్కడ శ్రీరాముఁ•డాకొఱరేయిని, గడుదవ్వు చని రేవ • కడను వార్చి
యావిషయం బెల్ల • నతితరించుచు దూర,మండలియూరులు•సుందరంపుఁ
దోఁటలు, వి త్తెడు•దుక్కిమళ్ళను జూచు,చును సత్వరంబుగఁ•జనుచు నుండి
యును మెల్లగాఁ జను•నొవ్వు దోఁపఁగ నట, వఱలెడిగ్రామసం•వాసజనులు
తే॥ తత్కుమారులఁ గనుఁగొని•దశరథుండు ఛీఛీయాఁడుదానికిఁ•జెవ్వినిచ్చెఁ
గామవశుఁ డయి యయ్యయో•కైకయెంత,
పాప పాపానుబంధిని•భ్రష్టురాలు. ౧-౨

అంతవఱకుఁ బురజనుల వృత్తాంతముఁదెలిపి రెండవదినమందలి సీతా రామలక్ష్మణుల వృత్తాంతముచెప్పఁగవి యారంభించెను.

కొఱరేయిని=రాత్రి యింకను మిగిలియుండఁగా, రేవకడను=ఉదయమున, వార్చి=సంధ్యవార్చి, విషయంబు = ఉత్తరకోసలదేశము, అతితరించుచున్ = దాఁటుచు, పాపానుబంధిని=ఎప్పుడు పాపమువెంటఁ బాపము చేయుచుండునది.

తాత్పర్యము

అక్కడ శ్రీరాముఁడారాత్రి యింకను గొంతయుండఁగానే మిక్కిలి దూరముపోయి యుదయమునకుఁగా సంధ్యవార్చి యుత్తరకోసల దేశంబెల్ల దాఁటిపోయి దూరమందలియూళ్ళను నందమైనతోటలు విత్తుచున్న దుక్కిమళ్ళ జూచుచు మిగుల వేగముగఁ బోవుచుండియు ఎగుబ్బలనడక నొప్పిచేతను చుట్టునుండు వినోదములఁ జూచుచుఁ బోవుచుండుటచేతను మెల్లగఁ బోయి నట్లుండ నందందుఁగల పెద్దయూళ్ళలఁ జిన్నపల్లెల జనము లాకుమారులఁ జూచి ఛీఛీ దశరథుఁడు కామవశుఁ డయి యాఁడుదానికిఁ జెవినిచ్చెనుగదా. కైకయెంతపాపాత్మురాలు. ఒక్కటివెనుకనొకటి పాపకార్యములే చేయుచుం డును. భ్రష్టురాలు.

ఉ॥ ఎంతటిమానహీన, యది • యెంతటికూళ! యదెట్టిపాపదు
శ్చింతకురాలో, యనఘుఁ, • జిన్నిసుతుం గరుణాలవాలు సత్
ప్రాంతు జితేంద్రియున్ వనికి • పొగఁగ నంపె, మహానుభావయౌ
కాంత విదేహపుత్రి యటు • కాఱడవిం బడు నెట్టి దుఃఖముల్. ౩-౪

మానహీన=సిగ్గుమాలినది, కూళ=దయలేని దుష్టురాలు. పాప దుశ్చింత కురాలో=పాపపుఁ జెడ్డాలోచనకలది, అనఘున్ = ఏపాప మెఱుఁగనివానిని, చిన్ని సుతున్=ముద్దుకుమారుని, కరుణాలవాలు=దయకుఁ బాదైనవానిని, జితేంద్రి యున్=ఇంద్రియముల గెలిచినవానిని. విషమాలంకారము.

తాత్పర్యము

కైక యెంతసిగ్గుమాలినది- యెంత క్రూరురాలు- ఎంత పాపచింతకలదో కదా యిటువంటి ముద్దుకుమారుని, దయకుఁ బాత్రుఁడైనవాని, శాంతచిత్తుని, నింద్రియముల జయించినవాని,నడవులపాలుచేసెఁగదా- మహానుభావురాలీసీత విదేహరాజు కూఁతురుఁట యడవులలో దుఃఖముల పడునఁట ఏమియీవిపరీతము.

ఈ యల్పకాలములో నింతదూర మీవార్తవచ్చుటకుఁ బూర్వమే సదుపాయము లుండెనో-అంతియకాదు ఆసమయమున నాశ్రీవ శ్రీరాముఁడు వచ్చునని-చుట్టునున్న పల్లెలలోఁగూడఁ దెలిసినఁగదా వారువచ్చి చూచుట తటస్థించెను.

కం॥ అయ్యో దశరథుఁ డెంతటి,నెయ్యంబును లేనివాఁడొ • నిజపుత్రకుపై
నియ్యనఘు-లోకహితునిన్,డయ్యన్ ఘోరాటవులఁ బ•డం ద్యజియించెన్.

నెయ్యము=స్నేహము, త్యజియించెన్=వదలిపెట్టెను. ౧౨-౧౩

తాత్పర్యము

అయ్యో! చిన్నకుమారునిపై దశరథుఁడెంత పుత్రస్నేహము లేనివాఁడో కదా ఇటువంటి పుణ్యాత్ముని- ఇటువంటి లోకహితమెంచువానిని గాసిపడునట్టు లడవులలో వదలిపెట్టెను.

కం॥ ఈరీతి నాడ నయ్యా,యూరులవా రాలకించు • చొయ్యనఁ గడచెన్
వీరుఁడు కోసల దేశం, బారఘుకులుఁ డంతఁ జేరి•యాపగ నొందున్.

తాత్పర్యము

ఈవిధముగ నాయాయూళ్ళల జనములు పలుకుచుండ వానిని వినుచుఁ గ్రమక్రమమున శ్రీరాముఁ డుత్తరకోసల దేశంబంతయుఁ గడచెను. ఇట్లుగడచి యచట నొక నదిని గాంచెను.

కం॥ వేదశ్రుతి యనుదానిని, మోదంబున దక్షిణాభి•ముఖుఁడై చనుచున్
భూదయితుసుతుఁడు గోమతి, సాదరమతిఁ గాంచి దానిఁ•జయ్యన దాఁటెన్.

తాత్పర్యము ౧౭-౧౪

ఆవేదశ్రుతి యను నదిని సంతోషముతోదాఁటి దక్షిణదిక్కుగాఁ బోవుచు గోమతి యనుదానిఁజూచి దానిని దాఁటెను.

కం॥ శారికికీమత్తమ,యూరీకలహంసకలక • లోద్భటరుచిరో
దార యగుస్యందికానది,తీరంబును దాఁటి విభుఁడు•దేవికి ననియెన్.

శారి=ఆఁడు గోరువంకలయు, కికీ=ఆఁడుచిలుకలయు, మత్త=మదించిన, మయూరీ=ఆఁడునెమిళ్ళయు, కలహంస=ఒకజాతిహంసలయు, కలకల=కలకలము, ఉద్భట=అధికమైనదియు, రుచిర=మనోహరమైనదియు, ఉదార=దండిగ నీళ్ళుగలిగి గంభీరమైనదియు, స్యందికానది = స్యందికయనుపేరుగల నది యొక్క, దేవికి=సీతకు.

తాత్పర్యము

ఆఁడుగోరువంకలు- ఆఁడుచిలుకలు- ఆఁడునెమిళ్లు కలహంసలు వీనియొక్క కోలాహలమై యధికమై మనోహరమై గంభీరమైన స్యందికానది యొడ్డును దాఁటి శ్రీరామచంద్రుఁడు సీతాదేవి కిట్లనియెను. ఈ యాఁడుపక్షులవలె నీవు నడవిలో సంతోషింపవలెఁ జుమా యని సూచింప నాఁడుపక్షు లెక్కువగఁ జెప్పఁబడెను.

తే॥ కమలలోచన! యీనది•గరుసుగాఁగ, మను వొసంగెను నిక్ష్వాకు•మనుజపతికిఁ
దక్కినదియెల్లఁ గరదులై •ధరణినాథు,
లేలుచుందురు సంప్రీతి•యెనక మెనఁగ. ౧౨౮౬

గరుసు=ఎల్ల-పొలిమేర, కరదులై=కప్పముకట్టువారలై, ఎనకమెనఁగ=అతిశయింపఁగా-

గీ॥ ఏక భోగంబుగాఁగ నేలేఁబు గరుసు
కడలి సీమంబు గౌతమి గంగ యవధి. భీమ. ౫. ఆ.

తాత్పర్యము

కమలనేత్రా యీనది యెల్లగాఁగఁ గోసలదేశము నంతయు నీ వేలుకొమ్మని మొదటిరాజైన మనువు మావంశమునకు మొదటివాఁడైన యిక్ష్వాకుమహారాజున కిచ్చెను. ఇంతవఱకు నిక్ష్వాకువంశమువారు స్వయముగాఁ బాలింతురు. తక్కిన దేశము నితరరాజులు మాయధికారమునకు లోవడి మాకుఁ బన్నులుచెల్లించి సంతోషముగా వారువారేలుచుందురు. అవి మాప్రత్యక్షపాలనమునకు లోపడినవి కావు. కాని వానియందు మాకు స్వామిత్వము కలదు.

ఈకారణముచేతనే శ్రీరాముఁడు వాలితో 'ఇక్ష్వాకూణా మియంభూమి స్సశైల వనకాననా' యని చెప్పెను. హనుమంతుఁడును సురసతో నీవు శ్రీరాముని దేశమం దున్నదానవని చెప్పెను.

చం॥ అని తనసూతుఁజూచి యను•హంసకలస్వరలక్ష్మితోడ నో
యనఘ సుమంత్ర! యెన్నఁటికి • నబ్బునొ నే సరయూతటంబునన్
గొనబగుతోఁటలందు జన • కుండును దల్లియుఁ దోడరా ముదం
బున మృగయావిహారరతిఁ • బోఁడిమిగాఁ జరియించుపుణ్యముల్. ౧౨౮౭

సూతున్=సారథిని, హంస=హంసలయొక్క, కలస్వర=అవ్యక్తమధుర ధ్వనియొక్క (స్పష్టముగాక వినుటకు నింపైన ధ్వనితో), లక్ష్మితోన్=సంపదతో, గొనబగు=అందమైన,మృగయావిహారరతిన్=వేఁటకై తిరుగుటయందలి ప్రీతిచే, బోఁడిమిగాన్=వినోదముగా- రాఁగల జనకవియోగమును దలఁచి దుఃఖించుచు దగ్గుత్తికతో మాటలాడుచున్నాఁడని కల శబ్దము సూచించుచున్నది.

ఈప్రకారము సీతాదేవికిఁజెప్పి సారథినిజూచి రాఁగల తండ్రివియోగమును దలఁచి వ్యసనపడుచు హంసల యవ్యక్త మధురస్వరమువంటి స్వరముతో నిట్లనియె. సుమంత్రా! యింక నెప్పుడేని సరయూతీరమందు నందమైన తోఁటలయందుఁ దల్లిదండ్రులు దోడరాఁగా సంతోషముతో వేఁటలాడుచు వినోదముగాఁ జరించు భాగ్యము మరలరాఁగలదా.

తే॥ భువనములయందు రాజర్షి•పుంగవులును వేడుకకు నయి,
పితృకార్య•వేళలందు
సజ్జనులు, విలుకాఁడు ల•క్ష్యంబుపొంటె, వేఁట చనుదురు నాకంత•వేడ్కలేదు.

భువనములయందు=లోకములయందు, పితృకార్యవేళలందు=శ్రాద్ధాది పితృ కార్యములను జరుపు సమయమందు, విలుకాఁడు=విలుకాండ్రు, లక్ష్యంబు పొంటె=గుఱికొట్ట నేర్చుకొనుటకు.

తాత్పర్యము

లోకములో రాజులు వినోదార్థము, సజ్జనులు పితృకార్యములు చేయు సమయమందును, విలువిద్యనేర్చువారు చలించు వస్తువులను గుఱికొట్ట నేర్చు కొనుటకునై, వేఁటలాడుదురు. ఈమూఁటిలోను నాకుఁబనిలేదు. కావున నాకు వేఁటమీఁద విశేష ప్రీతిలేదు. గోబ్రాహ్మణ ప్రజారక్షణార్థమో మఱియేదైన నెప్పు డైన నావశ్యకము పడినఁ గ్రూరమృగములను జంపుటగలదు.

వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు ప్రల్లదంబును, దండపారు ష్యము వ్యర్థముగ ధనము వ్యయముచేయుటయును నవి సప్తవ్యసనములు.

వ్యసనము (వి + అసనము) ఒకదానియందు విశేషాసక్తిగలిగియుండుట. వీనివలన వ్యసనమే కలుగును గావున వీనికి వ్యసనములనిపేరు. ఇవి యీవ్యస నములుగ నిషిద్ధములుగాని యీకార్యములే మొదలుపుట్ట నిషిద్ధములుగావు. అదైన భార్యాసాంగత్యముకూడ మానవలసివచ్చును. రాజసూయయాగమందు "తస్యా సభాయామక్షైఒధిదేవన ముద్ధత్యావోక్ష్యక్షాంతన్నివపే" త్తని జూద మాడుట విధిచోదితమైయున్నది. దుష్టవిషయమై పరుషముగ మాటలాడవలసి వచ్చును గావున నెపుడో యొకప్పు డీకార్యములుచేయుట దోషముగాదు. నిరం తరము చేయుట దోషము, స్త్రీవ్యసనమున రావణుఁడు, జూదమువలన నలధర్మ రాజులు, పానముచే యాదవులు, వేఁటచేఁ బాండురాజు చెడిపోయిరికదా.

తే॥ కోసలేంద్రుఁడురాజుల•గుణములిటు,
మనసునకుఁదెచ్చికొనుచు సు•మంత్రుఁజూచి
హర్ష మొప్పార ముచ్చట•లాడుకొనుచు, వేగఁ గోసలదేశంబు•వెల్ల దాఁటి.

తాత్పర్యము

రామచంద్రుఁడు రాజులగుణము లీరీతి స్మరించుచు సంతోషముతో సుమంత్రుతోడ ముచ్చటలాడుచు దక్షిణకోసలదేశము మేరదాఁటిపోయెను. ఈ ముచ్చటల విషయము సుమంత్రుఁడు రాజుతోఁ జెప్పునపుడు విశదపడును.

౫౦-వ సర్గము

కం॥ మును పురజనసమ్మర్దము,నను బ్రొక్కఁగ వలను పడమి•నవసారసలో
చనుఁడు పురిదిక్కు మొగమై,
వినయోక్తుల బ్రొక్కియిట్లు•వేఁడెనయోధ్యన్. ౧౨౯౦

మును=పూర్వము, సమ్మర్దము=జనులత్రొక్కుడు,నవసారసలోచనుఁడు=క్రొత్తకమలములవంటి కన్నులుగలవాఁడు.

తాత్పర్యము

పురమువిడిచి రాఁగానే పురాధిదేవతకు నమస్కరించుట పూర్వాచార సిద్ధము. అది పురజనుల సందడివలన నప్పుడేచేయుటకు సాధ్యపడినదికాదు కావున శ్రీరాముఁ డుత్తరదిశగా నయోధ్యాపురము దిక్కు ముఖమై వినయముతో బ్రొక్కి యిట్లని ప్రార్థించెను.

అవిప్లవాయ ధర్మాణాం, పాలనాయ కులస్యచ
సంగ్రహాయచలోకానాం, మర్యాదా స్థాపనాయచ
ప్రియాయమమవిష్ణోశ్చ, దేవదేవస్యశార్ఙ్గిణః
మనీషివై దిశాచారం, మనసాపినలంఘయేత్॥

ధర్మము చెడకుండుటకును కులము పాలించుకొనుటకును, లోకమును నను వర్తింపఁజేయుటకును, శాస్త్రము కట్టుపాటు స్థాపించుటకును, నాయొక్కయు దేవదేవుఁడగు విష్ణువుయొక్కయు ప్రియము నిమిత్తముగను, బుద్ధిగలవాఁడు వైదిశాచారమును మనసుచేనైన నుల్లంఘింపరాదు.

లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్కర్తు మర్హసి. భ.గీ. ౩-౨౦

లోక క్షేమము గోరువాఁడవై వారిని బ్రవర్తింపఁజేయ నీ ధర్మమును నీవు చేయవలయును.

సక్తాః కర్మణ్యవిద్వాంసో, యథాకుర్వంతి భారత
కుర్యాద్విద్వాన్ స్తథాసక్త,శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్. భ.గీ. ౩-౨౫

అర్జునా! యజ్ఞాని కర్మముల నెట్లు లాసక్తితోఁ జేయునో యట్టులు జ్ఞానియు ఫలాసక్తిలేక కర్మములను లోకము ననువర్తింపఁజేయఁ గావింపవలయును. ఇచ్చట నీవాక్యములను సంధింపగు.

శ్రీరాముఁడు భగవంతుఁడుగదా యీప్రకారము క్షుద్రదేవతలకు నమస్కరింపవచ్చునా?యని పూర్వపక్షము.స్వానుష్ఠానముచే లోకమున శిష్టాచార స్వధర్మ

ములు స్థాపింపవచ్చిన యవతారమూర్తిగదా శ్రీరాముఁడు. కావున నిచ్చటఁగాని మఱియెచ్చటఁగాని సీతారాములు నదీ వృక్షాది దేవతాదులకు నమస్కరించుట లోకశిక్షార్థమేకాని తమకంటె వారు గొప్పవారను నభిప్రాయమునఁగాదు. 'లోక సంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి' యను భగవద్గీతావాక్యము ప్రకారము శిష్టాచారస్థాపనకై తనకుఁ బ్రయోజనములేని కర్మములను లోకశిక్షకై జ్ఞానియుఁ జేయవలయును.

ఉ॥ ఓరఘువంశ పాలితపు • రోత్తమమా! నిను గ్రామదేవతా
 వారము నీయెడన్ వెలసి • వర్తిలు వేల్పుల నెల్లఁ గ్రమ్మఱం
 దీరిచి తండ్రియప్పను వ • నీనలిఁ గ్రుమ్మరి తల్లిదండ్రులం
 గూరిమిఁ గూడి వెండిఁ గనుఁ•గొందును నన్ను ననుగ్రహింపుమా. ౧-౫-౧

రఘువంశపాలిత పురోత్తమమా = రఘువంశరాజులచేఁ బాలింపఁబడిన పట్టణశ్రేష్ఠమా, గ్రామదేవతావారము = గ్రామదేవతల సమూహము, నీయెడన్ = నీయందు.

రఘువంశమున జనించిన రాజులచే రక్షింపఁబడు నయోధ్యానగరమా! నిన్ను గ్రామదేవతా సమూహమును నీయందుండు దేవతలనెల్లఁ దండ్రియప్పు దీర్పు నడవులయందుఁ దిరిగి తల్లిదండ్రులను గలిసికొని యూపిమ్మట మిమ్ముఁ జూచెదను దయయుంచుఁడు.

మనమొకరికి నమస్కరించునపుడు వారి దేహములకుమాత్రము గాదు మనము నమస్కరించుట దేహములోనుండు నీశ్వరునకును. అట్టులే యన్నిటికి ననియెంచవలయును. "నేనుగృశుఁడ" నన్నప్పుడు నే ననునది కేవలమాత్మకే యన్వయింపరాదు. ఏలన నాత్మకు స్థూలత్వ, కృశత్వములులేవు. స్థూలత్వ కృశత్వములు దేహలక్షణములు. దేహమే యాత్మయను భ్రాంతిచేఁ జెప్పఁబడిన దియుఁ గాదు. కావున నేననఁగా దేహవిశిష్టుఁడైన యాత్మయని యెఱుఁగవలయును. భగవంతుఁ డాత్మకాత్మయయిన కారణమున నెవరికి నమస్కరించినను జీవప్రకృతి విశిష్టుఁడై యంతర్యామియగు నీశ్వరునకేయని యెఱుంగనగు.

కం॥ అని యిట్లు పలికి జేగుఱుఁ,గనుఁగవలన్ బొప్పవారి • కాఱఁగఁ గుఱిచే
 తిని నెత్తి యచట మూఁగిన,జనపదజనములను జూచి • సమ్మతిఁ బలికెన్.

జేఁగుఱుఁగనుఁగవలన్ = ఎఱ్ఱని రెండుకన్నులయందు, మూఁగిన = గుంపు చేరిన, జనపదములజనములను = ఊళ్ళయందలి మనుష్యులను.

తాత్పర్యము

ఈప్రకారము పలికి తన్నుఁ బొసినకారణమున నూరిలోని స్త్రీలు పురుషులు తల్లిదండ్రులెంత తపించుచున్నారోయని తోఁపఁగా కన్నులెఱ్ఱగాఁగా దూరమున

నున్నవారగుటచేఁ గుడిచేతి నెత్తి తన్నుఁజూడవచ్చిన యాప్రాంతపుటూరుల జనములఁ జూచి నిండుమనస్సుతో నిట్లనియె.

సీ॥ అనఘాత్ములార! మీ•రనుకంపయును నను,
క్రోశంబుఁ దగురీతిఁ•గూర్చుకతన
నాపయి, మీకిట్టు•పాపీయ మౌచిర,దుఃఖంబు ఘటియిల్లెఁ•ద్రోవ వసమె
పొందు మీమీకార్య•ముల నవరింపఁగ, స్వార్థసిద్ధికి నేను•నరుగువాఁడ
నని పల్కి,వారు మ•హాత్ముని రాముని,వలగొని యేడ్చు చా•వలనుగనుచు
ఆ॥ నిలిచి యచట నచట•జలజాక్షుఁ జూచుచుఁ,బోవు చుండఁ దృష్టి•పొందకెడల
వారికెల్ల మఱుఁగు•వడి చను చుండె ని, శాముఖంబునందు•సవితవోలె.

అనుకంప=దయ, అనుక్రోశము=ఆదరము, కతనన్=కారణముచే, పాపీయము=మిగుల నశుభమైనది, చిరదుఃఖము=దీర్ఘకాల మనుభవింపవలసిన దుఃఖము, ఘటియిల్లెను=సంభవించెను, వసమె=సాధ్యమా, ప్ర-వశము. స్వార్థసిద్ధికిన్=(1) పదునాలుగు సంవత్సరములు వనవాసముచేయుటకై (2) అవతారప్రయోజనమగు రావణాది వధార్థమై, వలగొని=ప్రదక్షిణించి, వలను=దిక్కు, నిశాముఖమున=సాయంకాలమునందు, సవిత సూర్యుఁడు. సాయంకాలమున సూర్యుఁడు లోకమునకు మఱుఁగుపడునేకాని దానివలన నాయనకు తేజోహీనతలేదు. ఉదయము, అస్తమాన మనుకొనుట మనస్థితినిబట్టియేకాని సూర్యునకు నారెండును లేవు. అట్టులే శ్రీరామునకును. ఆయనను జూడనేరని జనులు నిర్భాగ్యులు.

తాత్పర్యము

పుణ్యాత్ములారా! మీరు నాపయిచాలినంత దయయును నాదరమును గలవారగుటచే మీకిట్టు లశుభకరము చిరకాలదుఃఖము కలిగెను. ఇది తప్పింప సాధ్యముకాదు. కావున మీ మీ కార్యములు చక్కఁజేయుటకై మీరుపొండు, నాస్వప్రయోజనసిద్ధికిఁగాను నేను బోయెదను. అనిపల్కి వారు మహాత్ముఁడగు శ్రీరామునకుఁ బ్రదక్షిణ నమస్కారములుచేసి యేడ్చుచు నాయనపోవుదిక్కు నచట నచట నిలిచి నిలిచి చూచుచుఁ దృష్టిలేక పోవుచుండ శ్రీరాముఁడును సాయంకాలమున సూర్యునివలె వారికిఁగానరాక మఱుఁగుపడిపోయెను.

సీ॥ చనుచు నీరీతిఁ గో•సల్యాతనూజుండు, పురుభూతధనధాన్య•పూజిత మును
దానశీలప్రజా•మానిత మగుచును, లలిత సౌభాగ్యసం•కలిత మగుచు
నకుతో భయంబునై •యధికరమ్యంబునై,
చైత్యయూపోత్కర•సాంద్ర మగుచు
గున్నమామిడితోఁట•చెన్నుల మీఱుచు,సంపన్నవరజలా•శయము నగుచుఁ
తే॥ హృష్టతుష్టజనాకీర్ణ•పురములగుచు, నాలమందలపందలు•లీల నెగడ
బ్రహ్మఘోషంబు లొప్పారఁ•బార్థివేంద్ర,
లక్షణీయంబునగు కోస•లంబు శుభము... ౧౯౪

మహాభూతః=అధికమైన, ధనధాన్యపుంజితము=ధనముచేతను ధాన్యము చేతను నిండినదై, దానశీలప్రజామానితము = దానముచేయు స్వభావముగల ప్రజలచేత గౌరవింపఁబడినదై - దీనివలన ధనధాన్యములు కలుగుటకు ముఖ్య ప్రయోజనము దానమని యెఱ్ఱపడుచున్నది. తాననుభవించుట ముఖ్యప్రయోజనము గాదు. లలితసౌభాగ్య సంకలితము గాదున్ = మనోహరమైన సౌందర్యముతోఁ గూడినదగుచు, అకుతోభయంబు = దేనివలనను భయములేనిది, అధిక రమ్యంబు=మిక్కిలి సుందరము, చైత్యయూపోత్కరసాంద్రము = దేవాలయములచేతను సర్వతోముఖయాగాదులందుఁ జెప్పఁబడిన యూపాకారములైన స్తంభములచేతను దట్టమై, గుల్మ=గుజ్జు, సంపన్నవరజలాశయము=సంపూర్ణములు శ్రేష్ఠములునగు మడుఁగులు గలదై, పుష్టతుష్టజనాకీర్ణపురములు=దేహపుష్టియు మనస్తుష్టియుఁగల జనులచేనిండిన పురములు, ఆలమందలువందలు= నూర్లకొలఁది యావులమందలు, బ్రహ్మఘోషంబులు=బ్రాహ్మణులచేయు వేదాధ్యయనరవములు, పార్థివేంద్రలక్షణీయము=రాజులకును వింతగఁ జూడఁదగినది.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁ డీరీతిఁ బోవుచు ధనధాన్యములు పెనరాసులుగఁగలదియు దానస్వభావముగల ప్రజలచేత గౌరవింపఁబడినదియు, మిగుల సుందరమైనదియు, దేనివలనను భయములేనిదియు, మిగుల రమ్యమైనదియు, దట్టముగ దేవాలయములు యూపస్తంభములు గలదియు, గుజ్జుమామిడితోఁటలచే నందమై నీళ్ళచేనిండిన శ్రేష్ఠములైన మడుఁగులుగలిగి దేహపుష్టియు మనస్సునకు సంతోషముగల మనుష్యులచే నిండినవియునగు పురములుగలిగి నూర్లకొలఁది యావులమందలు వ్యాపించియుండ బ్రాహ్మణుల వేదరవము లొప్పుచుండుటచే రాజులకుఁగూడఁ జూడ వినోదకరములైన పల్లెలుగలది, శుభమైనది కోసలదేశము.

కం॥ కనుచును వినుచును నడుచును, గన నగునుద్యానవాటిఁ గడచుచు భూభృజ్జనభోజ్యము రాజ్యము విడి, చనియెను ధీరోత్తముండు వని యచ్చోటన్.

భూభృజ్జనభోజ్యము = రాజుల కనుభవింప యోగ్యమైనది, ధీరోత్తముండు = మనస్సుచలింపనీని ధైర్యముగలవారిలో శ్రేష్ఠుఁడు "త్యక్త్వాసుదుస్త్యజ సురేప్సిత రాజ్యలక్ష్మీ" మన్నట్లు లింతటి భోగభాగ్యసంపన్నమై విడువరానిదైన రాజ్యమును శ్రీరాముఁడు ధీరజనోత్తముఁడు కావునఁ దృణమువలెఁ దలంచి ధర్మమే శ్రేష్ఠమని దాని ననుసరించెను.

తాత్పర్యము

ఇటువంటిదేశమును జూచుచు నడుచుచు నడుమఁ గానవచ్చునుద్యానప్రదేశములఁ జూచుచు రాజభోజ్యమగు రాజ్యమును వదలి ధీరవరుండైన శ్రీరాముఁడు పోవుచు నాస్థలమునందు.

## — శ్రీరాముఁడు గంగానదిఁ గాంచుట. —

లయగ్రాహి.
అంగుగ దినేశకుల•పుంగవుఁడు మోద మల
రంగను గనుంగొనె న•భంగతరభంగో
త్సంగను శివాంబుచయ•రంగను మహాఋషిని
షంగను శుభాశ్రమచ•యాంగను సురీవ్యా
సంగనుతసుందరవి•హంగకుల రాజిత త
రంగకజలాశయవి•భంగను నరౌఘో
త్తుంగభవభీహనన•చంగను నభంగురశు
భాంగను దరంగముఖ•రంగ నలగంగన్. ౧౬౯

దినేశకులపుంగవుఁడు=సూర్యవంశపురాజులలో శ్రేష్ఠుఁడు, అభంగతర= మిక్కిలివృద్ధియగుచున్న, భంగ=అలలతో, ఉత్సంగను=పొడినదానిని, శివాంబు చయరంగను=స్వచ్ఛమైన జలసమూహముచేఁ బ్రకాశించుదానిని, మహాఋషి నిషంగను=గొప్పఋషుల సాంగత్యముకలదానిని, శుభాశ్రమచయాంగను= ధర్మముచే శుభకరములగు నాశ్రమ సమూహముల సమీపించియుండుదానిని, సురీవ్యాసంగ=క్రీడాకాలమందు దేవతాస్త్రీల సంబంధము కలదగుటచే, నుత= శ్లాఘింపఁబడిన, సుందర=అందమైన, విహంగకుల=పక్షిజాతులచే, రాజిత= ప్రకాశించు, తరంగక=అలలుగల, జలాశయ=మడుఁగులయొక్క, విభంగను= విభాగములుగలదానిని అట్టియు, నరౌఘ=జనసమూహముయొక్క, ఉత్తుంగ= అతిశయమైన, భవభీ=జననమరణ భయమును, హనన = పోఁగొట్టుటయందు, చంగను=సమర్థముగుదానిని, అభంగురశుభ=అధికమైన శుభమునిచ్చు, అంగను= అవయవములు గలదానిని, తరంగముఖరంగన్=అలలుగల ముఖభాగముగల దానిని, అట్టి-అల=ప్రసిద్ధమైన, గంగను=గంగానదిని, అంగుగన్=అందముగ, కనుంగొనెన్=చూచెను. లయగ్రాహి, భ జ స న భ జ స న భయలు గణ ములు. ౧౦వ యక్షరము ప్రాసయతి. అట్టివి పాదమునకు నాలుగుండవలెను.

### తాత్పర్యము

శ్రీరాముఁడు సంతోషముతోఁ బెద్దపెద్ద యలలుగలదియు స్వచ్ఛమైన జలములు గలదియు మహర్షుల సంబంధము గలదియుఁ బుణ్యకార్యములు చేయఁబడు నాశ్రమములను దరితీరములందుఁ గలదియు, స్నానమాడు దేవతా స్త్రీలుగలదై పొగడఁబడు సుందరములైన పక్షిజాతులచేఁ బ్రకాశించు నలలుగల మడుఁగులందందుఁ గలదియు మనుష్యసమూహముల యతిశయమైన జనన మరణభయమును బోఁగొట్టు సామర్థ్యముగలదియు అధికశుభము నిచ్చు నవ యవములు గలదియు అలలుగల ముఖభాగము గలదియు, నగు గంగ యను ప్రసిద్ధికెక్కినదానిని సంతోషముతోఁ జూచెను.

కం॥ ఖేలాలోలామరవర, బాలాతతి కేళిశైల•పాళీశతమున్
లీలావనమాలాచయ, హేలాభర మొప్ప నయన•హిత మగుదానిన్. ౧౬౫

ఖేలాలోల=క్రీడయందునాసక్తిగల, అమరవరబాలా=దేవతాశ్రేష్ఠకన్యకల యొక్క, తతి=సమూహములయొక్క, కేళిశైల = క్రీడాపర్వతములయొక్క, పాళీశతమున్=అనేకములగు కొండనెత్తములుగలదియు, లీలావనమాలా= లీలా=క్రీడార్థమైన వనమాలా=తోఁటలపంక్తులయొక్క, చయ=సమూహముల యొక్క, హేలాభరము=అందముయొక్క యతిశయము, నయనహితము= కన్నులకింపు, అగుదానిని గనుఁగొనెనని పూర్వపద్యమందలి క్రియతో నన్వయము.

తాత్పర్యము

క్రీడలయందాసక్తిగల దేవకన్యకలు క్రీడించు పర్వతముల నెత్తములు గలదియు, క్రీడార్థమైన తోఁటల పంక్తులచే నందమైనదియుఁ, గన్నులకు నింపుగా నుండునదియు.

సీ॥ అంబుచయాఘాత•కాట్టహాసోగ్రయై, భాసురఫేనసు•హాసిని యయి
యొక్కచో వాఁకయై•యొకచోట సుడిగల్గి,పెరచోట స్థిమితగం•భీరయగుచు
నుండుచో వడిగ ను•ద్దండతఁ బాఱు చొ,క్కొకచో గంభీరని•ర్ఘోష యగుచు
నొక్కొక్కచో భైర•వోగ్రనిస్వన యయి, దేవసంఘాప్లుత•దీర్ఘ యగుచు
ఆ॥ నమరకమల యగుచు•విమలకువల యయి•వఱపుటిసుకతిప్పల•లోఁ జెపుచూపఁ
దెల్లయిసుము గల్గి•దివ్యసారసహంస, చక్రవాకనాద•సంకుల యయి.

అంబు...హాసోగ్రయై=నీళ్ళసమూహముయొక్క, అఘాతక=అల లొక దాని తోనొకటి కొట్టుకొనుటచేత నలలు రాలకుఁ దగులుటచేతఁ గలిగిన శబ్ద మనెడి. అట్టహాస=పెద్దనవ్వుచే, ఉగ్రయై=భయంకరమైనదియై, భాసుర=ప్రకా శించు, ఫేన=నురుగనెడి, సుహాసిని=చిఱునవ్వుకలదియై, వాఁక=వంక, విశ్కృతి హ్రస్వంబులకు ననునాసికములు పరములగుచో రూపాంతరమున హ్రస్వంబు నకు దీర్ఘంబును అనునాసిక స్థానంబున నర్థబిందువునగు. సు.వ్యా. సంజ్ఞ-౩౦ -సూ. వంకరగాఁబోవునది వంకపెఱచోట=మఱియొకప్రదేశమున, స్థిమితగంభీర =నిశ్చలయు, గంభీరయునై, గంభీరనిర్ఘోష=ఘోరమైన గంభీరమైనధ్వనిగలది, దేవసంఘ=దేవతాసమూహములచే, అప్లుతస్నానము చేయఁబడినదియు, దీర్ఘ= దీర్ఘమైనదియు, స్నానముచేయఁబడిన దిగుడు రేవులు గలదియు, అమర కమల=దేవతలకు యోగ్యమైన కమలములు గలది, విమలకువలయు=స్వచ్ఛ ములైన కలువలుగలది, వఱపు=వెడల్పుగల, ఇసుకతిప్పలు = ఇసుకదిబ్బలు, ఒఱపు=అందము, ఇసుము=ఇసుక, సారస=బెగ్గురులు, హంస=హంసలు, చక్రవాక=జక్కవలు, వీనియొక్క. నాద=ధ్వనులచే; సంకులమై=కలఁతనొంది నదె ఈపద్యమునందు గంగానది స్త్రీగావర్ణింపఁబడినది-వాఁక నాగాఱు సుడివొద్దు

ఇసుకతిప్పలు పిఱుఁదులు- కమలములు, ముఖములు, కలువలు కన్నులు- స్త్రీల కన్నులనే కలువలతోఁ గవులుపమింతురు.

తాత్పర్యము

జాలపై నీళ్ళు దూఁకుటచేతను, అలలు ఒకదానితో నొకటి కొట్టుకొనుట చేతను, గలిగిన ధ్వనియనెడి పెద్దనవ్వును-నురుగనెడి చిఱునవ్వును గలదై యొక చోట వంకగాఁ బాఱుచు, నొకచో సుడిగలదై, మఱియొకచోట మెల్లఁగా లోఁతుగాఁ బాఱుచు, నొకచోట మహావేగముగఁ బాఱుచు, నొకచోట గంభీరధ్వని గలదై, యొకచోట భయంకరధ్వనికలదై, దేవతలు స్నానముచేయు రేవులు గలదై, దేవత లుపయోగించు కమలములు నిర్మలములైన కలువలుగలిగి, పెద్ద లుపుగల యిసుకదిబ్బలు, తెల్లయిసుక కలిగి బెగ్గురులు, హంసలు చక్రవాకములు, వీని ధ్వనులు కలదై-

శ్రీరాముఁడు చూచినచోటనే యున్నియున్నవని తలఁపరాదు. బదరీ నారాయణమునుండి గంగను జూచుచువచ్చిన నిందలి ప్రతివిశేషణము సత్యముగాఁ గానుపించును.

సీ॥ ఒకచోటఁ దీరజా•తోర్వీజపంక్తులు, లలితమౌహారవ•ల్లరులు గాఁగ
నొక్కచో నవవిక•చోత్పలచ్ఛన్నయై యొక్కచోఁ గుముదషం•డోజ్జ్వలయయి
యొక్కచో వివిధపు•ష్పౌఘరజోధ్వ•స్తయై సమదాకృతి• యమరు చుండ
నొకచో మయుల లేని•యిసుకపుటద్దముభాతి, నిగనిగ లాడుచు•నిర్మలయయి
తే॥ దిగజంబులు వనకరుల్•దేవతోప, వాహ్యములురొద సేసెడి•వనులు వెలయు
భూషణో త్తమసద్రత్న•భూషిత యగుచు,
ప్రమదయటు లొప్పు కన్నుల•పండువుగను. ౧౨౯

తీరజాత=ఒడ్డునందుఁబుట్టిన, ఉర్వీజపంక్తులు=చెట్లవరుసలు, లలితమౌ=అందమైన, హారవల్లరులు=తీఁగెలవంటి హారములుకాఁగా, నవవికచోత్పలచ్ఛన్నయై=క్రొత్తగా వికసించిన కలువలచేఁ గప్పఁబడినదై, ముందుచెప్పఁబడిన కలువలు అక్కడక్కడ విడిగానున్న కలువలు- ఇచ్చట దట్టముగాఁ గుంపులు గుంపులుగా నున్నవని చెప్పఁబడినవి, కుముదషండోజ్జ్వలయయి=తెల్లకలువల గుంపుచేఁ బ్రకాశించునదియై- 'సితేకుముదకైరవే' అమరుఁడు వివిధ పుష్పౌఘరజోధ్వస్తయై=నానావిధములయిన పుష్పముల సమూహముల పుప్పొడులచే రంగుమాఱినదై, సమదాకృతిన్=మదించిన స్త్రీయొక్క యాకారము పుప్పొడులచే నెఱ్ఱ రంగుకలదగుటచే యౌవనమదమున ముఖాదులందు నెఱ్ఱని కాంతిగల స్త్రీతోఁబోల్పఁబడియె, మయుల=మురికి, ఇసుకపుటద్దముభాతిన్=నిగనిగ మెఱయు నద్దమువలె, వనకరుల్=అడవి యేనుఁగులు, రొద=శబ్దము, భూషణో త్తమసద్రత్నభూషిత=శ్రేష్ఠమైన సొమ్ములచేతను, రత్నములచేతను, అలంకరింపఁబడినది, ప్రమద=మదముగలస్త్రీ.

తాత్పర్యము

గంగానదిని నింకను స్త్రీగానే కవి వర్ణించుచున్నాఁడు. తీరములందుఁ బుట్టిన చాలుచెట్లు మెడలోధరించిన తీఁగలవంటి హారములుగను- ఒకచోటఁ గ్రొత్తగా వికసించిన యుత్పలములచేఁ గప్పఁబడినదై (స్త్రీల పిఱుఁదులమీఁది గుంతలకు ఉత్పలములని పేరు) ఒకచోటఁ గుముదముల గుంపులచేఁ బ్రకాశించునదియై, ఒకచో నానావిధ పుష్పముల గుంపుల పుప్పొడిచేఁ దెల్లనిరూపు మాటి యెఱ్ఱనై, యౌవన మదంబునముండు స్త్రీనిఁబోలినదై, యొకచోట నిర్మలమైన యద్దమువలె నిగనిగ మెఱయుచు, దిగ్గజములు, అడవియేనుఁగులు దేవత లెక్కిఁతిరుగు నేనుఁగులు ధ్వనిచేయు వడువులు కలిగి మేలైనభూషణములచేతను మంచి రత్నములచేతను నలంకరింపఁబడిన మదించిన జవ్వనివలెనై కన్నుల కానందము కలిగించుచు-

సీ॥ లసమాన ఫలపుష్ప•కిసల యావృత మయి,
            పొదలఁ బక్షుల నొప్పు•పొవలదాని
    శింశుమారభుజంగ • సేవిత యగుదాని, హరిపాదసంచ్యుత•యైనదానిఁ
    బాపహీనాత్మను • బాపవినాశిని, భవజటాజూటవి • భ్రష్ట యగుచు
    నంభోధిఁ గలయుచు • గంభీర యగుదాని, నబ్ధివట్టపుదేవి • యగునదాని
తే॥ సారసక్రౌంచకారండ • వారభటులఁ, జారు వగుదాని గంగను•జక్షు లలరఁ
    జేరి కనుఁగొని యటశృంగి•బేరపురముఁ,
            జేరఁ జనెరామచంద్రుఁడు•శీఘ్రగతిని. ౧౩౦

లసమాన = ప్రకాశించు-ఈశబ్దప్రయోగము గొందఱు సందేహించెదరు గాని రామరాజభూషణాదుల ప్రయోగములు కలవు. ఫలపుష్పకిసలయ=పండ్ల చేతను- పూలచేతను-చిగుళ్ళచేతను, ఆవృతమయి=ఆవరింపఁబడినదై, పొదల దాని=పొదలుగలదానిని, శింశుమార=(1) మొసళ్ళచేత (2) నీటిక్రోఁతులచేత- శింశుమార స్త్వంబుకపిః అని వైజయంతి, భుజంగ=పాములచేత, సేవిత యగు దాని=సేవింపఁబడుదానిని,హరిపాదసంచ్యుత=విష్ణుపాదమువలన విడువఁబడిన దానిని "విష్ణువామపదాంగుష్ఠన ఖస్రోతోవినిస్సృతే తద్భక్తి విష్ణురూపాత్త్వం గంగేమాం మోచయైనసః" అన్నట్లు త్రివిక్రమావతారమున భగవంతుని యెడమ పాదాంగుష్ఠమునఁగల గోటినుండి గంగ వెలువడెను- ఆవల నది బ్రహ్మలోకముఁ జేరెను. ఆవల నాకాశమునుండి హిమాచలమున శివుని శిరస్సునుండి వెలువడి భూమిమీఁదఁ బ్రవహించెను. కావున బాలకాండమునఁ జెప్పినదానికి దీనికి విరోధములేదు. పాపహీనాత్మను=పాపములేని మనస్సుగలదానిని, పాపవినాశిని = అకారణముచేతనే యితరుల పాపము నాశముచేయుదానిని, భవజటాజూట విభ్రష్టయగుచు=శివుని జడలగుంపునుండి జాఱిపడినది, అంభోధిన్ = సముద్రమును, గంభీర=లోతుగలది, సారస=సరస్సున నుండఁదగిన, క్రౌంచకారండ

చారభటులన్=క్రౌంచములయు- కారండవ=నీటికోళ్లయొక్కయు- ఆరభటులన్=ధ్వనులచే, చారువు=అందము, చప్పలలరన్=కన్నులు సంతోషింపఁగ.

తాత్పర్యము

ప్రకాశించు పూలచేఁ బండ్లచేఁ జిగుళ్ళచేత నావరింపఁబడి పక్షులచే నొప్పు పొదలు గలదానిని, మొసళ్ళు, నీటిక్రోఁతులు పాములచే సేవింపఁబడినదియై విష్ణుపాదమునుండి విడువఁబడినదానిఁ బాపములేనిదానిని, బరులపాపములఁ బోఁగొట్టుదాని, శివుని జటాజూటమునుండి వేలఁబడినదాని, సరస్సులనుండ యోగ్యమైన క్రౌంచములయుఁ గారండవములయు ధ్వనులచే మనోహరమైన దాని, గంగను గన్నులపండువుగఁజూచి దానితీరమందున్న శృంగిబేర పురమును రామచంద్రుఁడు వేగముగఁ జేరఁబోయెను.

— శ్రీరాముఁడు గంగాతీరంబుఁ జేరుట. —

కం॥ రంగత్తరంగమాలా, సంగతి రంగారె గంగ • సరసత మాకున్
రంగగు మన కిప్పుడు ని,ల్వంగను నిట నిలుపు రథము • వల నగుచోటన్.

రంగత్తరంగమాలాసంగతిన్ = నాట్యమాడుచున్న యలలవరుసచే, రంగారెన్=అందగించెను.

తాత్పర్యము.

నాట్యమాడువానివలె మనోహరముగఁ గదలుచున్న యలల వరుసలతోడ శృంగారముతోఁగూడినదై గంగానది సొరశ్రీయుతమైయున్నది. మనకిప్పట నిప్పుడు నిలువ ననుకూలపడును. కావునఁ దగినస్థలమున జూచి తేరిని నిలుపుము.

కం॥ అల్లదిగో దాపునను యొక, ఫుల్లకుసుమవిసరవిటప • పూగంబులచే
మెల్లమగు నారచెట్టిఁక, మెల్లగఁ గొనిపొమ్ము తేరు • మెలఁగుద మచటన్.

దాపునను = సమీపమందే, ఫుల్ల = వికసించిన, కుసుమ = పూలయొక్క, విసర=సమూహముచేతను, విటప = చిగుళ్ళ, పూగంబులచే = ప్రోవులచేతను, మెల్లము=అందము, మెలఁగుదము=సంచరింతము.

తాత్పర్యము

అదిగో సమీపమందే వికసించిన పూలగుంపులచేతను జిగుళ్ళరాసులచేతను నందమైన నారచెట్టు కానవచ్చుచున్నది. ఇఁకఁ దేరు మెల్లగఁ బోనిమ్ము. మన మక్కడనే యుందము.

ఉ॥ అచ్చటి గంగ శిష్ట్వ గన • నా సురదానవమానవాళిచే
మచ్చిక నంచరించు మృగ • మంజులపక్షులచే రహింపఁగా
మెచ్చుగ నన్న లక్ష్మణుఁడు • మేలౌన సూతుఁడు దోలె వాజులన్
జచ్చెర నింగుదీతరువుఁ • జేరఁగ ముప్పుడు దిగ్గి రచ్చటన్. ౬౩౬

సురదానవ మానవాళిచేన్=దేవతలచేతను, దానవులచేతను, మనుష్యుల చేతను, మృగమంజులపక్షులచే = మృగములచేతను సుందరములైన పక్షుల చేతను, రహింపఁగాన్=ప్రకాశింపఁగా, మేకొనన్=అంగీకరింపఁగా, వాజులన్= గుఱ్ఱములను, చెచ్చెరన్=శీఘ్రముగ, ఇంగుదీతరువు = గారచెట్టు, ముమ్మరు= సీతారామ లక్ష్మణులు.

తాత్పర్యము

అచ్చట మనము నిలిచితిమేని దేవతలు దానవులు మనుష్యులు వీరిచేతను జనవుగఁ దిరుగు మృగములు సుందరములైన పక్షులు వీనిచేతను ప్రకాశించు గంగానదిని మనము బాగుగఁజూడ సాధ్యపడును. అనిన లక్ష్మణుఁ డంగీకరింపఁగా నాలస్యముచేయక యచ్చటికి సుమంత్రుఁడు గుఱ్ఱములఁ దోలఁగా సీతా రామ లక్ష్మణులు ముమ్మరు నచట దిగిరి.

కం॥ అవల సుమంత్రుఁడును దుర, గావళిఁ బో విడిచి మేపు • నమరిచి యుర్వీ
జావిరళచ్ఛాయాశ్రితుఁ, డౌ విభుకడ కరిగెఁ దాఁ గృ•తాంజలి యగుచున్.

తురగావళిన్=గుఱ్ఱములవరుసను, ఉర్వీజ=చెట్టుయొక్క, అవిరళ=దట్టమైన, ఛాయాశ్రితుఁడై = నీడయందున్నవాఁడు, విభుకడకున్ = శ్రీరామునియొద్దకు, కృతాంజలి=చేమోడ్పు.

తాత్పర్యము

ముగ్గురు తేరుదిగినతరువాత సుమంత్రుఁడు గుఱ్ఱములవిప్పి మేపుపెట్టి చెట్టునీడనుండెడి శ్రీరామునియొద్దకుఁ జేమోడ్పుతోఁ బోయెను.

ఉ॥ అప్పుడు రామసఖ్యుఁడు • ప్రాణసముండు నిషాదజాతుఁడున్
గొప్పబలంగ మొప్పెడియ • కుంఠితవీర్యుఁడు బోయనాయకుం
డిప్పగిదిన్ రఘూద్వహుఁడు • వృక్షమునీడను నుంట వింటఁ దాఁ
దెప్పున వచ్చె వృద్ధహిత • ధీసచివాదికబంధుయుక్తుఁడై. ౧౩౦॥

అప్పుడు=వారందఱు చెట్టునీడనుండు సమయంబున- ప్రాణసముండు- ప్రాణముతో సమానమైనవాఁడు, సఖ్యుఁడు = మంచిస్నేహితుఁడు అనుటచే శ్రీరామునకు గుహునకు నింతకుఁబూర్వమే మైత్రిగలదని సూచితము. దీనివలన శ్రీరాముఁడింతకుఁబూర్వ మీప్రాంతములనేకాక తమరాష్ట్రములోని యూరూరు పల్లెపల్లెతిరిగి యందఱ జనుల యోగక్షేమములు విచారించి పరిచయము చేసికొన్నట్లు స్ఫురించెడిని. కావుననే పల్లెటూళ్ళవారికిని శ్రీరామునందంత ప్రేమ కలుగఁ గారణమయ్యెను. దూరమునందలి కుగ్రామములందును శ్రీరాముని నెఱుఁగనివాఁడు లేఁడు. నిషాదజాతుఁడున్ = బోయకులమునఁ బుట్టినవాఁడును, బలంగము=సేన, అకుంఠితవీర్యుఁడు=మొక్కవోని శౌర్యముగలవాఁడు, తెప్పునన్ = శీఘ్రముగ, వృద్ధహిత ధీసచివాదికబంధుయుక్తుఁడై = పెద్దలు హితులు కార్యాలోచనమందు సహాయపడు మంత్రులు మొదలగు బంధువులతోఁగూడినవాఁడై వచ్చెను.

శ్రీరాముఁడు క్షత్రియుఁడు- గుహుఁడు హీనజాతివాఁడు- 'హీనప్రేష్యం, హీనసఖ్యం, హీనగేహనిషేవణ'మ్మని నీచసేవ నీచులతోడి స్నేహము నీచుల యింటనుండుట యనునివి యుపపాతకములలోఁ బరిగణింపఁబడుటచే శ్రీరాముఁ డెట్లు గుహునితో మైత్రిచేసెను. అని. పూర్వపక్షము దీనికి సమాధానము.

(1) 'నిషాద, స్థపతిం యాజయే' త్తని నిషాదునకు యజ్ఞము చేయు నధికారము గలదని శ్రుతియే చెప్పుచున్న కారణముచే నిషాదుఁడు స్నేహము చేయరానంతటి నీచజాతివాఁడు కాఁడు.

(2) ఈతనిజాతి హీనజాతియైనను అత్యంత రామభక్తుఁడగు గుహుని నీచునిగా గణించుట దోషము. ఏలన:- 'నశూద్రా విష్ణుభక్తాశ్చ, విప్రాః భాగవతాస్స్మృతాః సర్వవర్ణేషుతేశూద్రా, యేహ్యభక్తాజనార్దనే' విష్ణుభక్తిగలవాఁడు శూద్రుఁడుగాఁడు వాఁడు విప్రుఁడనియు భాగవతుఁడనియుఁ జెప్పఁబడును. అవఁగా వారివలెఁ బూజ్యుఁడు. ఏజాతియందైనను విష్ణుభక్తిలేనివారు-శూద్రులు అని యర్థము.

విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే, పాదయుగముతోడి పశువుగాక. ॥భాగ॥

యశ్శూద్రం భగవద్భక్తం నిషాదం శ్వపచం తథా
వీక్షతే జాతిసామాన్యాత్సయాతి నరకం నరః.

శూద్రునిగాని, నిషాదునిగాని, మాలవానినిగాని విష్ణుభక్తుఁడైనవానిని జాతి సామాన్యదృష్టి నెవరుచూతురో వారు నరకమునకుఁ బోదురు.

అని ప్రమాణములు కలవు. కావున నితనితోడి స్నేహము శ్రీరామునికి దోషముకాదు. "గుహేన సహితో రామః లక్ష్మణేనచసీతయా" యని సీతాలక్ష్మణులతో సమానునిగ నారదుఁడు గుహునిఁ జెప్పెను.

అంతటి భక్తిగలవాఁడు గనుకనే సేతువుఁదప్ప మఱియొవనికిలేని స్వాతంత్ర్యము- గొంగిలించుట యనునది- గుహుఁడు కలవాఁడయ్యెను ౧౩౦౬-వ పద్యము చూడుము. ౧౩౦౯-౧౩౧౦ పద్యములందుఁ దనకుఁగల సర్వస్వము శ్రీరామునకు సమర్పించెను.

ఇతఁడిట్టివాఁడు గనుకనే నిషాదుఁడనుట సరిగాదని నిషాదజాతుఁడని చెప్పఁబడియె. అనఁగా జాతిచే నిషాదుఁడేకాని భక్తిచేఁ గాఁడని యర్థము.అట్లే బోయనాయకుఁ డన్నప్పుడు బోయలకు నాయకుఁడనియె గ్రహింపవలెను గాని బోయయగు నాయకుఁడని యర్థము గ్రహింపరాదు. ఇచ్చట నాయకత్వ ప్రాధాన్యము వివక్షితము. ఇట్టులే విభీషణుఁడును జెప్పుకొనియెఁగదా.

తాత్పర్యము

ఆసమయంబున శ్రీరామునకుఁ మంచి స్నేహితుఁడును ప్రాణసముఁడును, బోయజాతియందుఁ బుట్టినవాఁడును, గొప్ప సేనగల మహావీరుఁడును, బోయలకు నాయకుఁడును, నగు గుహుఁడీవిధముగ శ్రీరాముఁడు చెట్టునీడ నిలువఁబని

యున్నాఁడని విని తత్క్షణమే యున్నవాఁ డున్నట్టులే చెప్పవలెనే దాఁడుగుక్కొనక ప్రభువు రావలసిన విధముగా రాజ కులము పెద్దలు హితులు- కార్యాలోచనము తెలుపు మంత్రులు మొదలుగాఁగల బంధువులతోఁ గూడినవాఁడై నడచి శ్రీరాముని యొద్దకు వచ్చెను. తానెంత గొప్పవాఁడైనను, భగవద్దర్శనమునకు పోవునపుడు పాదరక్షలు-పావుకోళ్ళు మొదలయినవి తొడిగికొనిగాని వాహనముల మీఁదఁ గాని పోరాదని సూచన.

—• గుహుఁడు శ్రీరాము దర్శించుట. •—

కం॥ చనుదెంచు గుహుని దవ్వునఁ, గని సహలక్ష్మణుఁడు సీత•కాంతుఁడు హర్షం
 బునఁ బొంగి యతనిఁ గలియఁగఁ,
 గని రాముని వేష మతఁడు•కడు దుఃఖితుఁడై. ౧౩౦౬

సహలక్ష్మణుఁడు=లక్ష్మణుతోఁ గూడినవాఁడు- అనుటచే లక్ష్మణునం దెంత ప్రేమయో గుహునం దంత ప్రేమగలదని భావము. సహలక్ష్మణుఁడు అనుటచే ఆయన భక్తికి నిరువురు గౌరవించినఁగాని చాలదని భావము. రాముని వేష మతఁడు కని యని యన్వయము, ఎదుర్కొనఁ బోవుటచేఁ దానెంత గొప్పవాఁడైనను మహాభక్తుఁడు తనయొద్దకు వచ్చుచున్నవార్త తెలియఁగనే యతని కెదురుగాఁబోయి గౌరవింపవలెను గాని నాయొద్దకువచ్చినపుడు లేచెదనులే యని కూర్చుండరాదు. ఆయన తనకు దూరమందుఁ గనఁబడఁగానే లేచి యెదుర్కొన వలెను.

తాత్పర్యము

వచ్చుచున్న గుహుని దూరమునందే చూచి సంతోషమున సుప్పొంగి శ్రీరాముఁడు లక్ష్మణుతోడ నాయున నెదుర్కొనఁబోయి కలిసికొనఁగానే శ్రీరాముని మునివేషము నతఁడు చూచి మిగుల దుఃఖించినవాఁడై.

ఉ॥ క్రుచ్చి కవుంగిటం బలుకుఁ • గూరిమితోడ నయోధ్య యెట్టులో
 యిచ్చుఁ దలంపు మియ్యదియు • నీకటు లంచును దేనిఁ జేయుదున్
 సచ్చరితా! వచింపుము, వ • శంబె లభింపఁగ నిట్టిసత్ప్రియుం
 డిచ్చకు వచ్చునయ్యతిథి • యేసుకృతంబు లొనర్చినాఁడనో. ౧౩౦౭

ఏసుకృతంబులు=అనుటచే నొకటిరెండు పుణ్యములు చేసినంతమాత్రమున భగవద్దర్శన ప్రాప్తికలుగదు అని సూచితము. నీకు నయోధ్యయెట్టిదో యిదియు నట్టిదే యనుటచే నీకు నిత్యవిభూతి వైకుంఠము వంటిదే యీలీలా విభూతి యను ప్రపంచమని భావము. నీ కయోధ్యయందుఁగల స్వాతంత్ర్యము- ప్రాభవమిందు గలదు.

నీవంటి యతిథి నీవేకాని "ఏకమే వాద్వితీయం బ్రహ్మ" యన్నట్లు రెండవ వాఁడు నీకుసమానుఁడు నీకంటె నధికుఁడు లేఁడని భావము. "ఏకమేవ + అద్వితీయం బ్రహ్మ"=బ్రహ్మ మొకఁడే. అట్టివాఁడు రెండవవాఁడు లేఁడని యర్థము. అతిథిమాత్ర మేకాక ప్రియుఁడును, అందు సత్ప్రియుఁడును, అందు నిట్టిసత్ప్రి

యుఁడునగు మహాపురుషుఁడు ఎవనికైన నెట్లు లభింపఁగలఁడు- భరద్వాజాది మహర్షులకు- శబరివంటి భక్తురాండ్రకు లభించును గాని భక్తిహీనులకు లభింపఁ డని భావము.

తాత్పర్యము

ఆయనను గట్టిగఁ గౌఁగిలించుకొని కూరిమితో నిట్లనియె. శ్రీరామచంద్రా నీకయోధ్య యెట్టిదో యిదియు నట్టిదే యని మనస్సునఁ దలంపుము. సుశీలా! నీకు నేనేమి చేయవలయునో చెప్పుము. నీవంటి మంచి ప్రియుఁడు- మనస్సునకు సమ్మతమైన యతిథి యెవరికైన నెట్లు లభింపఁగలఁడు. నాకు లభించుటకు నేనెన్ని పుణ్యములు చేసినాఁడనో.

కం॥ అని వివిధము లగునన్నము,లును రుచిమత్పానకంబు•లును నర్ఘ్యంబుల్
గొనివచ్చి సమర్పించియు,
వినయానతశిరస్కుఁ డగుచు•వెండియు ననియెన్. ౧౩౦౮

రుచిమత్=ప్రశస్తమైన రుచిగల; పానకంబులు, అర్ఘ్యంబులు = పూజా ద్రవ్యంబులు, వినయానత శిరస్కుఁడు=అణఁకువచే వంపఁబడిన శిరస్సుగల వాఁడు. రిక్తహస్తేననోపేయాత్, రాజానం దైవతం గురుమ్మని యుండుటచే- రాజునొద్దకు దేవునియొద్దకు గురువునొద్దకుఁ గానుక నేదైనఁ దీసికొనక పోరాదని యుండుటచే నన్నాదులు గొనివచ్చెనని భావము. అది భక్తిలక్షణము. శ్రీరాము నందు రాజచిహ్నములైన లేకుండుటచే రాజను గౌరవబుద్ధితో తేలేదు. దైవత మని తెచ్చెనని భావము.

తాత్పర్యము

అని పలికి నానావిధములయిన యన్నములు, మంచిరుచిగల పానక ములు. పూజాద్రవ్యంబులు గొనివచ్చి సమర్పించియు వినయముతో నమస్క రించినవాడై మరియు నిట్లనియె. ఇది నమస్కారరూపక శరణాగతి- వినయానత శిరస్కుఁడనుటచేఁ బ్రపత్తికంగమైన కార్పణ్యము చెప్పఁబడియె.

తే॥ స్వాగతము నీకు శ్రీరామ•చంద్ర దేవ,నిఖిలధారిణిపలయుంబు•నీద చుమ్ము
నీదుకింకరులము మేము•నిర్మలాత్మ,
మమ్ముఁ బనిగొమ్ము నెమ్మి రా•జ్యమ్ము నేల. ౧౩౦౯

శుష్కనమస్కారము శూన్యాలాపమువంటిదియు శరణాగతి లక్షణముగాదు. శాస్త్రోక్తమై యేకొంచెమో అన్నమో నీళ్ళో సమర్పించుటగాక తన సర్వస్వము శ్రీరామునకు సమర్పించుచున్నాఁడు. దీనికే యాత్మనిక్షేపమని పేరు.

శ్రీరామచంద్రదేవ=అనుటచే గుహునకు శ్రీరామునందు దేవుఁడను భక్తి గలదుగాని రాముఁడొక మనుష్యుఁడు తన స్నేహితుఁడనిమాత్ర మాయనఁ దలఁచినవాఁడు గాఁడని భావము. కావుననే సర్వస్వ సమర్పణము.

సు+ఆగతము=స్వాగతము-మంచిరాక. ఈరాక నీకు కీర్తికరమైనది సుఖకర మైన దగునుగాక, నిఖిలధారిణీపలయుంబు=నాసమస్తభూచక్రము, నీద=నీదే.

ట్లుచెప్పుటచే నింతకుఁ బూర్వమే తనరాజ్యమంతయు మానసికముగ శ్రీరాము నకు సమర్పించియుండి యిప్పుడు స్వరూపముతోనే సమర్పించెనని భావము. ఈ రాజ్యము నాది యను మమకారము గుహునందు లేదని సూచితము. దీనికంతయు నీవు సహజస్వామివి. కావున నీది నీవు పరిగ్రహింపుము. అనుచున్నాను గాని నాది నేనిచ్చెదను నీవుతీసికొమ్మని నేను జెప్పరాలేదు. ఏలన? నీదుకింకరులము=నీకై యెటువంటి యల్పపుఁ బనియైనఁ జేయువారము. నీదాసులము. దీనివలన గుహునందు నహంకారమునులేదని దాసోహంభావముకలదని తెలియ నయ్యెడిని. నిర్మలాత్మ=మలినము లేని మనస్సుగలవాఁడా యనుటచే- వీఁడు నీచజాతివాఁడు నాకు లోపడియుండువాఁడు లోనగు భావములు నీయందు లేవనియు వీఁడు మనవాఁడు అను ప్రేమమాత్రమే నీవు నాయందుఁగలవాఁడవని నేనెఱుఁగుదుననియు భావము. మమ్ముఁ బనిగొమ్ము=నీకుఁ గావలసిన పనియేదో యది మాచేఁ జేయించుకొమ్ము. నీకుఁ గైంకర్యము చేసినఁగదా నేను నీకింకరుఁ డనుటకు సార్థము. కావున నన్ను నీవు కింకరుఁగా గ్రహించుట వాస్తవమేని పని చెప్పి నాచేఁ జేయించుకొని నీకింకరకోటిలోఁ గలుపుకొనుము-పనిగొమ్ము. కైంకర్యము చేయింపుమనక చేయించుకొను మనుటచే కైంకర్యఫలభోక్తవు నీవేకాని నేనుగానని భావము. దీనిచే ఫల సమర్పణము చెప్పఁబడెను. నీవు శ్రీరామ కింకరుఁడవైనచో నీవు శ్రీరామునకేకైంకర్యము చేసితివి ? నీకైంకర్యము శ్రీరాముఁ డంగీకరించెనా యని తక్కిన నీకింకరు లడిగిన నేమిచేయుదు నేమని ప్రత్యుత్తరమిత్తును? నన్ను నీవు స్వీకరించితివని యెట్లు నమ్మెదును. నెమ్మి రాజ్యమ్ము నేలుము=నేనవాప్త సమస్త కాముఁడనే నాకుఁ గొంకలేలేవే నేనేదికోరి నీవు తెమ్మని నీకుఁ జెప్పెదను. నీకుఁగావలసినదేమైన నుండిన నీవే యడుగుము. ఇచ్చెదనందువా నీసుఖమునకై కాదు. మమ్ము గృతార్థులఁ జేయుటకై నీవు మాకు సాక్షాత్ప్రభుఁడవుగానుండి యీరాజ్యమేలి మమ్మునెల్లఁ బాలింపుము. నాశరణాగతికి నేనుగోరు ఫలమిదియే. ఇది గోప్తృత్వవరణమును దెలిపెడిని. నెమ్మిరాజ్యమ్ము నేలుమనుటచే=భరసమర్పణము గావింపఁబడియె.

తాత్పర్యము

దేవా! శ్రీరామచంద్ర- నీరాక మేలగుమగాక- ఈ భూచక్రమంతయు నీదే-నీవయోధ్యలో నున్నట్లు లిచ్చట నుండవచ్చును- మేమందఱము నీకింకరు లమే కావున నీవు సేవకులులేరని సందేహింపఁ బనిలేదు. నిర్మలాత్మా మమ్ము ధన్యులఁజేయ మాకేదైన పనిచెప్పి చేయించుకొమ్ము.

ఆ॥ భక్ష్యభోజ్యలేహ్య•పానీయములు నివె, పడుకొనంగ నివిగొ•పాన్పు లశ్వ
ములకు ఖాదనంబు•వలసిన వెల్ల నను గ్రహించి వేగఁ బ•రిగ్రహింపు. ౧౩౧౦

భక్ష్యము=కొఱికి తినఁదగిన వడలు మొదలయినవి, భోజ్య=నమిలితినఁదగిన యన్నము మొదలైనవి, లేహ్య=నాకి తినఁదగినవి తేనె మొదలైనవి, పానీయము

=త్రావఁదగినవి- పానకము మొదలైనవి-బహువచన ప్రయోగముచేఁ జోష్యము లును గ్రాహ్యము. చోష్యములనఁగా=వేయించిన వడియములు మొదలైనవి. ఇవి పంచభక్ష్యములు. ఖాదనము=మేపు. దీనివలన భగవత్ భాగవత పరిచార కులును సేవ్యులని భావము. అనుగ్రహించి పరిగ్రహింపు మనుటచే నీకక్కఱపడి గాదు నన్ను నీవు కృతార్థుని జేయుటకై. నీకక్కఱయుండినను లేకున్నను స్వీక రింపుము. ప్రపత్తి శాస్త్రప్రకారము గుహుని శరణాగతి సర్వాంగ సంశోభితమై యున్నది. ఈశరణాగతికి భరతుని శరణాగతి సమమగునేమో కాని విభీషణుని శరణాగతియు సమముకాదని తోఁచెడిని. ఆభాగము వ్రాయునంతవఱకు వీఁడు జీవించి యుండవలయునని భగవత్సంకల్పమేని యెంటి తారతమ్య మచ్చట యుద్ధకాండమున విశదీకరింపఁబడును.

తాత్పర్యము

నాయనా రామచంద్రా! తండ్రీ ఇవిగో భక్ష్యములు. ఇవిగో భోజ్యములు. ఇవిగో లేహ్యములు. ఇవిగోఁ పానీయములు. నీకుఁ బండుకొనఁ బానుపులివిగో. నీకుఁ బరిచర్యసేయు భాగ్యము గలిగిన గుఱ్ఱములకు మేపిదిగో. వీనిలో నీకుఁ గావలసినవన్ని నాయందు దయయుంచి నన్నుఁ గృతార్థుఁ జేయుటకై పరిగ్ర హింపుము.

ఉ॥ అచ్ఛపుభక్తినాతఁ డిటు•లాడిన రాముఁడు పల్కు మిత్రవరా!
వచ్చె భవత్కృతంబులు స•పర్యలు, తుష్టుఁడ నైతిఁ గాల్నడన్
వచ్చుట నెయ్యపున్నుడులు•వాకొనుటన్, పిను మింత యేల యో
యొచ్చెము లే దటంచు బిగి•యొత్తి కవుంగిటఁ బీనబాహులన్. ౧౩౧౧

అచ్ఛపు భక్తి=స్వచ్ఛమైన భక్తి. భక్తి-సేవాభక్తి రుపా స్తియని నిఘం టువు. "సాపరమప్రేమరూపా" "సాపరానురక్తిరీశ్వరే" అని నారదశాండిల్యులు. కావున భజసేవాయామ్మను ధాతువువలనఁ గలిగిన భక్తిశబ్దమునకుఁ బ్రతిఫలా పేక్షారహితమై ప్రేమతోఁ గూడిన భగవత్సేవ- యని యర్థము. భవత్కృతం బులు=నీచేఁ జేయఁబడిన, సపర్యలు = ఉపచారములు, వచ్చెన్ = అన్నియు గ్రహించినవాఁడనే, తుష్టుఁడనైతిన్ = సంతోషించిన వాఁడనైతిని; నెయ్యపు న్నుడులు=స్నేహవాక్యములు, వాకొనుటన్ =చెప్పుటచే, ఒచ్చెము = లోపము, బిగి=గట్టిగా, పీనబాహులన్=బలసిన చేతులచే- బలసినచేతులు సుఖకరములు- శుష్కించిన చేతులైనచో నెముక లొత్తుకొనుటచే సుఖములేదు.

అహా! యేమి గుహుని పూర్వజన్మ సంస్కారబలము!! అంత శ్రమించిన యాంజనేయునకు లభించిన రాముకౌఁగిలి యేశ్రమములేక గుహునికి లభిం చెను. (చూ. యుద్ధ. ౧౩-౫).

తాత్పర్యము:

నిర్మలమైన భక్తితో గుహుఁడు చెప్పిన మాటలువిని శ్రీరామచంద్రుఁ డాయనతో నిట్లనియె. మిత్రమా నీ సేవలన్నియు గ్రహించితిని. నీవు కాలి నడకతో వచ్చుట నీస్నేహవాక్యములు పలుకుట యీ రెంటిచేతనే సంతోషించి తిని. ఇన్ని మాటలేల. నీ సేవయందు లోపమేమియులేదు అని దానికి లక్ష్య ముగా నతనిని బలసిన తన రెండుచేతుల గట్టిగాఁ గౌగిలించెను.

తే॥ అనియె నాభాగ్యవశమున • గనుటగల్గె,
బంధుయుతు నిన్ను నారోగ్య • వంతునిపుడు
నెచ్చెలీ! చెప్పలా మన • నిఖిలహితులు,
ధనము రాష్ట్రము కుశలితఁ • దనరు నయ్యా. ౧౩౧-౨

నాభాగ్యవశమునన్ = నాయదృష్టమువలన — మన తదృష్టవశమున మహా భాగ్యము లభించిన నెట్లు సంతోషింతుమో యట్లే భగవంతుఁడును రక్ష్యుఁడైన భక్తుఁడు దొరికి యతఁడు సంతుష్టుఁడైనపుడు తాను సంతోషించును. భా. వ. ౬౬. అయోధ్య. బంధుయుతున్ = చుట్టములతోఁ గూడినవానిని, ఆరోగ్యవం తుని = రోగబాధలేక, యుండువానిని నెచ్చెలీ — నెఱ + చెలీ = నెచ్చెలి. ఏలోపము లేని చెలిమికలవాఁడా. మన = నీయనక మన యనుటచే నీవారందఱు నావారే యని భావము. "పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః। తేనైవతే ప్రయా స్యంతి, తద్విష్ణోః పరమంపద" మ్మన్నట్లు పశువుగాని మనుష్యుఁడుగాని పక్షి గాని విష్ణుభక్తుని నాశ్రయించినవాఁడు వానితో విష్ణువుయొక్క పరమపదమును బ్రాపించును.

తాత్పర్యము

మిత్రుఁడా! బంధువులతోఁ గూడి యారోగ్యవంతుఁడవైన నిన్ను నాభాగ్య వశమున నిపుడు చూడఁగలిగితిని. మనహితులందఱు బాగున్నారుకదా ధనము రాష్ట్రము కుశలముగా నున్నవా.

చం॥ నిఖిలము నానిమిత్తముగ • నెయ్యము మై సమకూర్చు టింతయున్
ప్రభుఁడ నటంచు బెగడుదున్, మిగుల • సంతస మయ్యెను, గాని నీమదిం
బ్రకరతగాఁ దలంప, కిది • భావ్యమ్ముగా దొకటైనియుం గొనన్
సుఖముల నెల్లఁ బాసి వని • జొచ్చెడి నా కివి యేల చెప్పుమా? ౧౩౩

నిఖిలము = కావలసిన పదార్థములన్నియు, నెయ్యము మై = స్నేహభావముచే (నేను రాజకుమారుఁడనని భయముచేఁ గాదనుట), ప్రకరత = మిక్కిలి కఠి నత్వము, భావ్యముగాదు = యుక్తము కాదు, వనిన్ = అడవియందు.

తాత్పర్యము

మిత్రుఁడా! నాకొఱకై నీవు సమస్తపదార్థములు కేవలస్నేహముచేతనే సమకూర్చుట యెఱుఁగుదును. నాయందుఁగల స్నేహభావమునకు మిక్కిలి సంతో

షించితిని. కాని నేనొకమాట చెప్పెదను. రాముఁడింత కఠినుఁడా యనిమాత్ర మాలోచింపకు. అది యేమంటివా నీవు తెచ్చిన పదార్థములం దొకటియైన నేను గ్రహించుట యుక్తముగాదు. సర్వ సుఖములు వర్జించి యడవులందుఁ గంద మూలములఁ దినఁబోవు వానికిఁ బజ్ఞులేల దిండులేల భక్ష్యభోజ్యములేల నీవే చెప్పుము. అటు చేయవచ్చునా?

కం॥ చీరముఁ గృష్ణాజినమును, వారక ధరియించి వనుల•ఫలమూలము లా
హారముగా మునినై సం,చారమ్ము చేయంగ నేను•జనియెద హితుఁడా.

తాత్పర్యము ౧౩౧౪

స్నేహితుఁడా నేనేల యిచ్చటికి వచ్చితిని. ఎచ్చటికిఁ బోవుచున్నాను నీవెఱుఁగవా? నారచీరలుగట్టి జింకచర్మము ధరించి యడవులందు ఫలమూల ములు దిని మునివలెఁ దిరుగఁ బోవుచున్నాను.

కం॥ మావులకు గడ్డియొక్కఁడ కావలయున్ నీవు దానిఁ•గల్పించుటచే
వేవిధములఁ బూజల నను, భావించినయట్ల తలఁతుఁ•బరమపవిత్రా.

మావులకున్=గుఱ్ఱములకు, వేవిధములన్=వెయ్యివిధముల. [౧౩౧౫

తాత్పర్యము

భక్తిపూతుఁడా నాకుఁగావలసినది గుఱ్ఱాలకు గడ్డి యొకటె. అది నీవు తెచ్చి యిచ్చితివి. దాని నిచ్చుటచే నన్ను వెయ్యివిధములఁ బూజించినట్లు తలఁచెదను.

తన్నుఁ బూజించువారి విషయమునఁ గలుగు సంతోషమునకంటెఁ దన యాశ్రితులఁ బూజించువారి విషయమున భగవంతుఁడు విశేషముగ సంతో షించుననని సూచన.

"స్వారాధనం విహాయాపి, స్వభక్తా నర్చయంతియే
తేభ్యః ప్రసన్నో భగవాన్, సిద్ధిమిష్టాం ప్రయచ్ఛతి"

తన యారాధనము వదలియైనఁ దన భక్తుల నర్చించువారి యెడ భగవం తుఁడు ప్రసన్నుఁడై వారి కోరికల నెఱవేర్చును.

అనాదృతసుతం గేహీ, పురుషం నాభినందతి
తథానర్చిత సద్భక్తం, భగవాన్నాభినందతి॥

తన కొడుకును నాదరింపనివాని విషయమున గృహస్థుఁ డానందింపఁడు. అట్టులే సద్భక్తు నర్చింపని వానివిషయమున భగవంతుఁడు కొంచెమేని సంతో షింపఁడు.

కం॥ ఈవారువములు దశరథ,భూవిభునకు మిక్కిలి ప్రియ•ములు గావున నీ
వీవాజులఁ దన్పుట న, న్సేవించినయట్ల ముదముఁ•జెందుదు సఖుఁడా.

వారువములు=గుఱ్ఱములు, వాజులను=గుఱ్ఱములను, తన్పుటచే=తృప్తిఁ బొందించిన కారణమున నన్ను నీవు సేవించినట్లే యెంతును.

తాత్పర్యము

స్నేహితుఁడా! నీగుఱ్ఱములు దశరథరాజువి. కావున నీవీ గుఱ్ఱములఁ దృప్తిఁ బొందించుటచే నన్ను సేవించిన యట్లే సంతోషింతును.

చం॥ అనఁ దగువారిఁ బంచె గుహుఁ • డశ్వవిమర్శకుఁ గాఁగ నీళ్లు మే
పును ఘటియింప రేయిఁ గడుఁ • బ్రోవ నరింపఁగ, సోత్తరీయుఁడై
సనయుత వార్చి లక్ష్మణుఁడు • జాహ్నవితీర్థముఁ దేర సీతతో
ననఘుఁడు గ్రోలి యిద్దఱును • హాయిగ నేలఁ బరుండ సంతటన్. ౧౩౧౪

సోత్తరీయుఁడై = ఉత్తరీయము గలవాడై- అనుటచే స్నానము చేయ లేదని భావము.

ఈప్రకారము శ్రీరాముఁడు చెప్పఁగా గుహుఁడు గుఱ్ఱములకు నీళ్ళు మేపు గావలసినవన్ని తెచ్చి యిచ్చి రాత్రివేళ మిక్కిలి రక్షింపవలసినదని తగినవారికి నాజ్ఞచేసెను. ఆవల లక్ష్మణుఁడు గంగానది తీర్థము తీసికొనిరాఁగా దానితో సంధ్యవార్చి సీతయుఁ దాను త్రాగి శ్రీరాముఁడు హాయిగ నేలమీఁదఁ బండుకొనెను.

ఉ॥ అన్నకుఁ బాదము ల్గడిగి • యార్చి తడిం జని వృక్షమూల మం
దున్నెడ లక్ష్మణుం, డలగు • హుండు సుమంత్రునిఁ గూడి తద్గుణా
భ్యున్నతి ముచ్చటించుచుఁ బ్రి • యోన్నతి సజ్యశరాసనుండు నై
కన్ను మొగుడ్ప కానిశను • గాచుచు నుండెను రామచంద్రునిన్. ౧౩౧౮

తద్గుణాభ్యున్నతిన్=ఆయన గుణముల గొప్పతనమును, ముచ్చటించుచున్=ప్రసంగించుచు, ప్రియోన్నతిన్=ప్రేమాధిక్యముచే, సజ్యశరాసనుండునై =ఎక్కుపెట్టిన విల్లుగలవాఁడునై, మొగుడ్పక=మూయక. 'అన్నకుఁ బాదముల్ కడిగి యార్చి తడిన్' ఇది దేశాచారమో- రాజోపచారమో- లక్ష్మణ కైంకర్య విశేషమో. లక్ష్మణుఁడు వింటబాణము సంధించియే సీతారాముల చుట్టు ప్రదక్షిణించుచు వారిని గాచుచుండెను. గుహుఁడును నట్లె విల్లెక్కుపెట్టి బాణము సంధించి లక్ష్మణు వెనుకప్రక్కగఁ దిరుగుచుండెను. ఏలన నొక సవతితల్లి కొడుకు వలన శ్రీరామునికింత విపత్తు సంభవించెను. ఈ సవతితల్లి కొడుకేమి చేయునో యని ఆయన యేమైన కొంచెము చెనకెనా వెంటనే యాయనపై బాణము ప్రయోగింప గుహుఁడు సిద్ధపడియుండెను. ఇది పౌరాణిక చమత్కార కల్పనము మాత్రము గుహుని భక్త్యతిశయము దెలుపునది. ఈనాఁడు గుహుఁడు కాచినఁ దక్కిన ౧౪ సంవత్సరము లెవరుగాచిరి?